# క్రైమ్ అమెరికన్ కథలు

(అనువాద కథలు)



## మల్లాది వెంకట కృష్ణమూర్తి

# అమెరికన్ క్రైమ్ కథలు Malladi Venkata Krishna Murthy

1980లలో అబిడ్స్లో ప్రతీ ఆదివారం పేవ్మెంట్ మీద పాత పుస్తకాలు అమ్మే దుకాణాలన్నీ తిరిగి ఆల్ఫ్రెడ్ హిచ్కాక్ ఎల్లరీ క్వీన్స్ మిస్టరీ మేగజైన్ పాత సంచికలని కొని చదివేవాడ్ని. వాటిలో వచ్చిన కొన్ని మిస్టరీ, డిటెక్టివ్, క్రైం కథలలోని ఇతివృత్తాలని చూస్తూంటే, వాటిలోని మలుపులని చదువుతూంటే, 'ఈ ఆలోచన నాకు రాలేదే? ఇంతటి ఊహాశక్తి నాకు లేదే?'' అని బాధ కూడా కలిగిన సందర్భాలు ఉన్నాయి. వాటిని తెలుగువారికి అందించాలనే నా కోరిక విపుల మాస పత్రిక వచ్చాక తీరింది. అంతకు మునుపు ఏ పత్రికలూ అనువాద కథలని, ముఖ్యంగా క్రైం అనువాద కథలని ప్రచురించేవి కావు. అని ఓ ఇంటర్వ్యూలో తను అనువదించిన కథల గురించి మల్లాది వెంకటకృష్ణమూర్తి చెప్పారు. ఈ సంపుటిలోని కథలు అలా అనువదించిన కథల్లోంచి మళ్ళీ ఎంపిక చేసినవి.

ప్రపంచంలోని అనేక బుద్ధ విగ్రహాలకన్నా అది పెద్దదని తెలిసి, నేపాల్నించి ఓ బౌద్ధుడు హైద్రాబాద్కి, హుస్సేన్సాగర్లోని బుద్ధ విగ్రహం చూడటానికి వచ్చాడు. దాన్ని టేంక్బండ్ మీంచి కొద్దిసేపు చూసాక, తనివి తీరక దాన్ని చాలాసేపు చూడటానికి టేంక్బండ్ రెయిలింగ్ మీదకి అటు వైపు తిరిగి కూర్చోవాలని అనుకుని ఎక్కసాగాడు. అక్కడే చాలా సేపటి నించి సందేహిస్తూ నిలబడ్డ, బాగా గడ్డం పెరిగిన ఒకతను ఆ బౌద్ధుడ్ని గమనించాడు. వెంటనే గబగబ అతను కూడా రైలింగ్ ఎక్కి అతని చేతిని పట్టుకుని చెప్పాడు.

"ఆగు మిత్రమా! ఇద్దరం కలిసి చద్దాం."

మరుక్షణం అతను నీళ్ళల్లోకి దూకేయడంతో ఈత రాని ఆ బౌద్ధుడు కూడా అతనితో పాటు చావక తప్పలేదు.

పై చిన్న కథలో డిటెక్టివ్ లేడు. పరిశోధన లేదు. ఫిర్యాదులు లేవు. వేలిముద్రలు లేవు. అడుగు జాడలు కాని, ఆయుధాలు కాని లేవు. ఉన్నదల్లా క్రైమే! కొసమెరుపే!!

ఇలాంటి క్రైమ్లతో, కొసమెరుపులతో సాగే అనేక కథలని మీరు ఈ అమెరికన్ క్రైమ్ కథల్లో చదువుతారు.

ఇందులోని కథల్లోని కొందరు నేరస్తులని న్యాయ వ్యవస్థ శిక్షిస్తే, కొందరు నేరస్థులకి ప్రకృతి న్యాయం ద్వారా శిక్ష పడటం పాఠకులు గమనిస్తారు. కొందరు అసలు చట్టానికి పట్టుబడరు. అలాంటి కథ చదివినప్పుడు 'అయ్యో అనిపించక మానదు. ఇందులోని ప్రతీ కథా పాఠకులని వినోద పరిచి, ఆశ్చర్యపరుస్తుంది.

అమెరికాలోని ఎస్టాబ్లిష్ట్ మాస్టర్ రైటర్స్ రాసిన ఈ కథలు అనేక మలుపులు తిరుగుతూ చివర్లో పాఠకులని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. విసుగ్గా ఉన్నప్పుడు బుక్ షెల్ఫ్లోంచి దీని తీసి ఐదారు నిముషాల్లో ఓ కథని చదివి ఆనందించవచ్చు.

---

## బల్ల ముందు మనిషి - సి.బి.గిల్ఫోర్డ్

బైరన్ ఆ ఆకుపచ్చ రంగు టేబిల్ ముందు ఒంటరిగా కూర్చున్నాడు. అతనికి కుడి వైపు ట్రేలో స్కాచ్ బాటిల్స్, సోడా సీసాలు, ఐస్ ముక్కలు ఉన్న బక్కెట్ ఉన్నాయి. ఎడం వైపు టెలిఫోన్ ఉంది.

ఒంటరిగా ఆ బల్ల ముందు కూర్చున్న బైరన్ తన చేతిలోని పేక ముక్కలని కలుపుతున్నాడు. పేక ముక్కలు కలిపే ఆ శబ్దం తప్ప ఆ గదిలో మరే శబ్దం లేదు. ఆ గదిలోనే కాదు. ఆ ఇంట్లోనే అసలే శబ్దం లేదు.

అకస్మాత్తుగా ఆ గది తలుపుకున్న పిడిని ఎవరో తెరుస్తున్న చప్పుడు వినిపించింది. ‘‘ఎవరది? లోపలకి రండి.'' పిలిచాడు బైరన్ సాదరంగా.

తనతో ఆట ఆడటానికి వస్తానన్న తన స్నేహితుడు సేమ్ కాదతను. మరొకతను. ఆరడుగులకి కొన్ని అంగుళాలు తక్కువగా, బాగా సన్నగా ఉన్న అతని ఒంటి మీద

మాసిపోయిన పేంట్, నలిగిపోయిన చొక్కా ఉన్నాయి. బాగా పెరిగి ఉన్న జుట్టు సంస్కారం లేక భుజాల దాకా వేలాడుతోంది. కళ్ళల్లో క్రోధం తొంగి చూస్తోంది. అతని కుడి చేతిలో ఓ కత్తి ఉంది.

బైరన్ వెంటనే కుర్చీలోంచి లేచి నిలబడే ప్రయత్నం చేయలేదు. పేక ముక్కలని కలపటం మాత్రం ఆపాడు.

“ఏం కావాలి?" అడిగాడు.

ఆ కొత్త వ్యక్తి సమాధానం చెప్పలేదు. అనుమానంగా ఆ గది వంక చూసి అడిగాడు.

"ఈ ఇంట్లో ఉన్నది మనిద్దరమేనా?"

బైరన్ బహుశ తెలివితక్కువగా, అవునన్నట్లుగా తల ఊపాడు.

“సరే! నాకేం ఇబ్బంది కలిగించకపోతే నిన్నేం చేయను." చెప్పాడా కొత్త వ్యక్తి.

“ఏం కావాలి?" బైరన్ మరోసారి అడిగాడు. ఈసారి అతని కంఠం మొదటి ప్రశ్న అడిగినప్పటికన్నా శాంతంగా ఉంది.

ఆ కొత్త వ్యక్తి సమాధానం ఇవ్వకుండా ఆ గదిలోని వస్తువుల వంక, వాటిల్లో ఏవి తనకి ఉపయోగిస్తాయా అన్నట్లుగా చూసాడు. అతని దృష్టి టేబిల్ మీద ఉన్న స్కాచ్ సీసాల మీద పడింది. దగ్గరకి నడిచి వచ్చి అడిగాడతను.

“స్కాచ్ విస్కీ"

“అవును. కూర్చో.”

తన ఎదురుగా ఉన్న బల్ల అవతల గల కుర్చీని చేత్తో చూపించాడు బైరన్. ఆ కొత్త వ్యక్తి జాగ్రత్తగా కుర్చీ దగ్గరకి నడిచి, దాన్ని బైరన్ కి ఎదురుగా జరిపి ఆ కుర్చీలో కూర్చున్నాడు. కుడి చేతిని బల్ల మీద ఉంచాడు. అతని చేతిలో కత్తి పిడి తయారుగా ఉంది.

"రెండు పెగ్స్ ఒంచు. ఐస్ కూడా." అధికార పూర్వకంగా చేతిలోని కత్తిని ఆడిస్తూ చెప్పాడు ఆ కొత్త వ్యక్తి.

నిశ్శబ్దంగా బైరన్ ఓ గాజు గ్లాసులోకి విస్కీని పోసి, ఐస్ ముక్కలు వేసి ఆ గ్లాసుని తన ఎదురుగా కూర్చున్న వ్యక్తి వైపు తోసాడు. అతను ఫ్రీగా ఉన్న తన ఎడం చేత్తో ఆ గ్లాసుని అందుకుని ఓ గుటక తాగి గ్లాసుని మళ్ళీ టేబిల్ మీద ఉంచాడు.

"నాక్కొద్దిగా డబ్బు కావాలి. నీ కారు తాళం చెవులు కూడా. నీ కారు ఎక్కడ పార్క్ చేసావో చెప్పాలి. నీ బట్టలు కూడా కావాలి."

బైరన్ అతనడిగిన వాటిలో ఏవీ ఇచ్చే ప్రయత్నం వెంటనే చేయలేదు.
‘‘నువ్వు మామూలు దొంగవి కావన్న మాట." అడిగాడు నవ్వుతూ.
‘‘అవును. మామూలు దొంగని కాను. నేనడిగినవి వినపడ్డాయిగా?"
మరో గుక్క విస్కీ తాగాడతను.
"ఇంతకీ నువ్వెవరు?" అడిగాడు బైరన్,
‘‘నీకనవసరం."
‘‘నీ పేరు రిక్ మేన్ డెన్" చెప్పాడు బైరన్,
ఆ కొత్త వ్యక్తి కొద్దిగా గర్వంగా నవ్వాడు.
‘‘నువ్వు రేడియో వార్తలు వింటూంటావన్నమాట."
‘‘అప్పుడప్పుడు." చెప్పాడు బైరన్.

"ఓ.కే. నా పేరు రిక్ మేన్ డెన్. క్రితం వారం బార్లో ఇద్దరిని పొడిచి చంపాను. నా గర్ల్ ఫ్రెండ్ ని, ఆమె కొత్త బాయ్ ఫ్రెండ్ ని. రెండు రోజుల తర్వాత నన్ను పట్టుకున్నారు.

మరో కొత్త కత్తి దొరకడంతో నిన్న ఉదయం తప్పించుకోగలిగాను. జైల్లోని ఓ తోటి ఖైదీ దీన్ని నాకు బహూకరించాడు."

‘‘నేను తాగితే నీకభ్యంతరమా?" అడిగాడు బైరన్.

అతని అనుమతి కోసం ఎదురు చూడలేదు బైరన్ అతని కుడి చెయ్యి స్కాచ్ బాటిల్ మీదకి వెళ్ళింది. మేన్ డెన్ గ్లాసు టేబిల్ మీద పెట్టి, ఎడం చేత్తో బల్ల మీద కోపంగా, బలంగా మోదాడు.

"నాకేం కావాలో చెప్పాను. ఇప్పుడే కావాలి. నీతో తాగడానికి రాలేదు."
బైరన్ విస్కీని తన గ్లాసులోకి వంచుకోవడం మానడం తప్ప మరే కదలిక చేయలేదు.
‘‘ముందీ విషయం మాట్లాడదాం మేన్ డెన్." చెప్పాడు బైరన్.

"నేనడిగినవి ఇస్తావా లేక నిన్నూ పొడిచి చంపనా?’’ అడిగాడు మేన్ డెన్ ఉగ్రంగా చేతిలోని కత్తిని ఝులిపిస్తూ,

బైరన్ అంగుళం కూడా కదలలేదు.
"కదలకుండా కూర్చో మేన్ డెన్! నువ్వు నన్ను చంపబోయేముందు నే చెప్పేది విను."

బైరన్ కంఠంలోని అధికారం, కోపం గుర్తించి క్షణకాలం నివ్వెరపోయాడు మేన్ డెన్. ప్రమాదాన్ని శంకించింది అతని మనసు.
"నీ పరిస్థితి నీకు అర్థం కావడం లేదు." చెప్పసాగాడు బైరన్.

‘‘మనం ఈ బల్లకి ఎదురెదురుగా ఆరడుగుల దూరంలో కూర్చుని ఉన్నాం. నీ చేతిలో కత్తి ఉంది. ప్రస్తుతం నా దగ్గర ఎలాంటి ఆయుధం లేదు. కుర్చీలోంచి నువ్వు లేచి నిలబడే ప్రయత్నం చేస్తే ఈ బల్లని నీ వైపుకి తోస్తాను. నీకన్నా రెట్టింపు పరిమాణంలో ఉన్నాను నేను.

బలంగా ఈ బల్లని నీ మీదకి తోయగలను. తక్షణం నువ్వు నేల మీద పడతావు. నీ మీద బల్ల అంచు నిలబడి ఉంటుంది. అర్థమవుతోందా నే చెప్పేది? ఇది నా మొదటి స్టెప్" చెప్పాడు బైరన్,

కోపం కలిగినా దాన్ని అణచుకుని మేన్ డెన్ ఆసక్తిగా తల ఊపి చెప్పాడు.

"అర్థమైంది."

“నా రెండో స్టెప్. బల్ల వెనక, నా కుర్చీకి ఎడం వైపు ఉన్న చిన్న బల్ల మీద కనిపిస్తోంది చూడు. కవర్లు చింపడానికి ఉపయోగిస్తాను దాన్ని నిజానికి అది టర్కీ నించి తెప్పించిన కత్తి. నీ మీదకి టేబిల్ని తోసిన మరుక్షణం నేను లేచి ఆ కత్తిని అందుకుంటాను. అప్పుడు మనిద్దరి దగ్గరా సమానమైన ఆయుధాలు ఉంటాయి. ఉండవా మిస్టర్ మేన్ డెన్?” నవ్వుతూ అడిగాడు బైరన్.

మేన్ డెన్ ఓసారి నాలికతో పెదవులని తడి చేసుకున్నాడు. కళ్ళు ఆర్పాడు. అంతే. ఇంకేం చేయలేదు. ఏం మాట్లాడలేదు.

"రెండో స్టెప్ తో మనిద్దరం యుద్ధానికి సన్నద్ధమైనట్లే. మూడో స్టెప్ మనిద్దరి మధ్యా యుద్ధం అన్నమాట. అందులో ఎవరు గెలుస్తారో అర్థమైందా? నీ మీదట నాకు ఓ సౌకర్యం ఉంది. నువ్వు నేల మీద పడి ఉంటావు. నీ మీద బల్ల ఉంటుంది. నువ్వు లేచే సరికే నేను కత్తితో నీ మీదకి ఉరకగలను."

మొదటిసారిగా మేన్ డెన్ కళ్ళలో భయం తొంగి చూసింది.

“నీ వయసెంత?" అడిగాడు బైరన్.

“పంతొమ్మిది."

“బరువు?”

"నలభై రెండు కిలోలు."

“గుడ్! నేను ముప్పై ఒకటి. నా బరువు ఎనభై కిలోలు. ఈ విషయంలో కూడా నేనే ఎక్కువ. పదేళ్ళ క్రితం ఫుట్ బాల్ కి స్టేట్లో ఫస్ట్ వచ్చింది మా టీమ్. రోజు ఈత కొడతాను. టెన్నిస్ ఆడతాను. అందుకే నేను ఇంత బలంగా ఉన్నాను. నువ్వు?" అడిగాడు బైరన్,

మేన్ డెన్ మొహం కొద్దిగా పాలిపోయింది. మరోసారి పెదవులని నాలికతో తడిచేసుకున్నాడు. మాట్లాడాలనుకున్నాడు. కాని వెంటనే మాటలు రాలేదు.

“నీ గురించి నన్ను చెప్పనీ...” ప్రారంభించాడు బైరన్.

“నువ్వు సరయిన ఆహారం తినే మనిషివి కాదు. ఉపవాసాలు ఉంటావని కాదు కాని, నాలాగా నువ్వు పౌష్టిక ఆహారం తినవు. అందుకే చాలా సన్నగా ఉన్నావు. పదో ఏటే సిగరెట్ తాగటం అలవాటయినట్లుంది నీకు. నీ చేతి వేళ్ళ మీద పొగాకు మరకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాకన్నా ఎక్కువ తాగుతావని తేలికగా చెప్పగలను. నన్ను చూడు. నిన్ను చూడు. మనిద్దరిలో ఎవరికి ఎక్కువ బలం ఉంది?"

బైరన్ వంక కనుబొమ్మలు ముడిపేసి కోపంగా చూడసాగాడు. చూస్తు మేన్ డెన్ ఆలోచించసాగాడు.

"అసలైన ముఖ్య విషయం చెప్పడం మరిచాను. ఈ గదిలోకి వచ్చినప్పుడు నీకు ఉన్నంత ధైర్యం ఇప్పుడు నీలో లేదు. నీ దగ్గర కత్తి ఉంది. నా దగ్గర లేదనుకున్నావు అప్పుడు. సంగతి తెలిసాక నీలో పిరికితనం ప్రవేశించింది. నన్ను పొడుస్తానన్నావు. నేనే నిన్ను పొడిచి చంపుతానని తెలిసాక ఎలా ఉంది నీ మొహం?"

‘‘ఇదో నటన. మోసం." చెప్పాడు మేన్ డెన్ కంఠం పెగుల్చుకుని.
‘‘నిజంగా? కుర్చీలోంచి లేవడానికి ఒక్కసారి ప్రయత్నించి చూడు. మోసం కాదో, అవునో నీకే తెలుస్తుందిగా." నవ్వాడు.

బైరన్ కండరాలు, నరాలు ఆ మాటలు అన్నాక యుద్ధానికి సంసిద్ధమైనట్లుగా యాంత్రికంగా బిగుసుకున్నాయి. అది గమనించాడు మేన్ డెన్.

నిశ్శబ్దం.

మేన్ డెన్ కుర్చీలోంచి లేచే ప్రయత్నం చేయలేదు. గద్ద శవాన్ని చూసినట్లుగా చూసాడు బైరన్ వంక.

‘‘ఆc ఇది ముఖ్యమైన అంశం. ఇది చెప్పడం అసలు మరవకూడదు నేను. నేను నిన్ను చంపినా నువ్వు జైల్లోంచి తప్పించుకున్న హంతకుడివి కాబట్టి, అది కేవలం ఆత్మరక్షణకే. కాబట్టి నాకు శిక్ష పడదు. నువ్వు ఇంత ప్రయత్నించి జైల్లోంచి బయట పడింది మరణించడానికి కాదుగా?

మరోసారి మేన్ డెన్ భృకుటి ముడిపడింది.

‘‘అఫ్ కోర్స్. ఒకవేళ ఏ కారణం చేతయినా నువ్వే నన్ను చంపగలిగితే నా డబ్బు, దుస్తులు, కారు తాళం చెవులు నువ్వు కోరుకున్నట్లుగా నీవి అవుతాయి." చెప్పాడు బైరన్.

‘‘నువ్వు మరణించే అవకాశం ఉందని ఒప్పుకున్నాక మరి నేనడిగినవి ఇవ్వకుండా నాతో పోట్లాట ఎందుకు?’’ అడిగాడు మేన్ డెన్ క్రూరంగా నవ్వుతూ.

అతనిలోని ఆశాభావాన్ని గుర్తించి వెంటనే చెప్పాడు బైరన్.

‘‘మంచి ప్రశ్న నువ్వడిగినవి అన్నీ ఇచ్చి పంపితే పోలీసులు నిన్ను పట్టుకోవడానికి ఓ వారం లేదా ఓ నెల ఆలస్యం అవచ్చు. అందువల్ల నాకేం బాధ లేదు. కాని నువ్వడిగినవి తీసుకుని, తాళ్ళతో నన్ను కట్టి వెళ్తావనుకోను. నువ్వు హంతకుడివి. ఇతరులని చంపడంలోనే నీకు ఆనందం ఉంది. హంతకుడివి అయిన నువ్వు నన్ను చంపటం వల్ల నీకు పడే శిక్ష పెరిగే అవకాశం లేదు. కనుక నన్ను తప్పక చంపుతావు. అలాంటప్పుడు నిన్ను ఎదుర్కోవడంలోనే నాకు ఆనందం ఉంది. అంతే కాదు. అదృష్టం బావుంటే నేనే నిన్ను చంపే అవకాశం కూడా ఉంది. హంతకులని చంపాలని అనుకోవడం ఉత్సాహంగా ఉంటుంది కూడా.’’

మేన్ డెన్ కుర్చీలో ఒదిగి కూర్చుని అడిగాడు.
"నాతో కత్తితో పోట్లాడాలని నీకు ఉందన్న మాట?"
‘‘నువ్వు ఆ కుర్చీలోంచి లేచే ప్రయత్నం చేస్తే తప్పకుండా." చెప్పాడు బైరన్.
మేన్ డెన్ తన ఎడం చేతిలోని గ్లాసులోని విస్కీని పూర్తి చేసాడు.
‘‘ఆల్ రైట్ మొదలుపెట్టు." చెప్పాడు.
"నేను మొదలు పెడతాననలేదు. నువ్వు ఆ కుర్చీలోంచి లేస్తే జరిగేది చెప్పానంతే."

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఎక్కువైంది. ఆ ఇద్దరు ఒకరి వంక మరొకరు తీక్షణంగా, జాగ్రత్తగా చూస్తూ కొద్ది నిముషాలు గడిపారు. మేన్ డెన్ చేతిలో కత్తి ఉంది. బైరన్ రెండు చేతులూ టేబిల్ మీద ఖాళీగా ఉన్నాయి. కాని మేన్ డెన్ చూపు బైరన్ అందుకునేంత దూరంలో ఉన్న టర్కీ కత్తి మీదకి వెళ్ళి వస్తోంది. అది తనని తేలిగ్గా చంపగలదు అని గ్రహించాడు.

‘‘ఎంతసేపిలా కూర్చోడం? నేను ఈ కుర్చీలోంచి లేస్తే బల్లని నా మీదకి తోస్తానన్నావు. ఆ కత్తిని అందుకుంటానన్నావు. నేను కుర్చీలోంచి కదలకపోతే ఏం చెయ్యనన్నావు. ఎంతసేపిలా?’’ కోపంగా అడిగాడు మేన్ డెన్.

బదులుగా నవ్వాడు బైరన్.
మేన్ డెన్ బుర్ర చురుగ్గా ఆలోచించింది ఆ విషయం మీద. ఎడం చేతి గుప్పెట బిగించాడు.

"అర్థమైంది నాకు. నీతో పేకాట ఆడటానికి ఎవరో వస్తున్నారు. వాళ్ళ కోసం ఎదురు చూస్తున్నావు. అవునా?" అడిగాడు.

"అవును."

"అలాంటప్పుడు నేనిక్కడ ఇలా వేచి ఉండటం నాకు మంచిది కాదు."

"నీకు ఇంకో అవకాశం ఉంది." చెప్పాడు బైరన్,

"ఏమిటది?"

"నువ్వు పారిపోవడానికి అవకాశం ఇస్తాను. కాని నన్ను నువ్వు ఏం చేయకుండా పారిపోవాలి. అప్పడే నీకా అవకాశం లభిస్తుంది." చెప్పాడు బైరన్,

"ఏమిటది?" కొద్దిగా ఉత్సాహంగా అడిగాడు మేన్ డెన్.

"నీ చేతిలో ఆ కత్తి ఉన్నంతసేపు నాకు ప్రమాదం కలగచ్చని భావిస్తాను. నువ్వు కుర్చీలోంచి లేచి నా మీదకి దూకుతావో, పారిపోవడానికి పరిగెత్తుతావో నాకెలా తెలుస్తుంది? ఆ కంగారులో నేను ఈ బల్లని నీ మీదకి తోయవచ్చు."

"నిజమే." కొద్ది క్షణాలు ఆలోచించి అంగీకరించాడు మేన్ డెన్

"ఈ సమస్యకి పరిష్కారం నీ చేతిలోని కత్తి. నువ్వు నా ఎదురుగా ఆ కుర్చీలో కూర్చోవడం నీ దురదృష్టం. నీ చేతిలో ఆ కత్తి లేని పక్షంలో నువ్వు పారిపోవడానికి సహాయం చేస్తాను."

"ఎలా?"

"నేను చెప్పినట్లు చేయి. అప్పుడు మన ఇద్దరిలో ఎవరికీ ప్రమాదం ఉండదు."

"కత్తి లేకపోతే నువ్వు నా మీదకి ఉరకచ్చుగా? నువ్వు నాకన్నా బలంగా..."

"మనిద్దరి మధ్యా బల్ల ఉంది. నేను లేచి చుట్టు తిరిగి నువ్వు కూర్చున్న చోటికి వచ్చేసరికే నువ్వు దాన్ని నా పాదాల మీదకి జరిపి ఈ గదిలోంచి బయటకి వెళ్ళి నేను నీ వెంటపడే అవకాశం లేకుండా బయట తలుపుకి గొళ్ళెం పెట్టొచ్చు."

‘‘పోలీసులకి ఫోన్ చేయచ్చుగా నువ్వు?'' అనుమానంగా అడిగాడు మేన్ డెన్.

బైరన్ సన్నగా నవ్వాడు.

"తెలివిగల వాడివి. ఓ బేరానికి వద్దాం. నా ఫోన్ కి నీ కత్తి."

‘‘అంటే?’’

‘‘ఫోన్ నా చేతికి అందుబాటులో ఉంది. నువ్వు ఒప్పుకుంటే రిసీవర్ అందుకుని దానికున్న వైర్ని పీకేస్తాను. తర్వాత నువ్వు నీ కత్తిని టేబిల్ పక్కన అటు వైపు పడేయాలి. ఏమంటావు?’’

మేన్ డెన్ కి తెలుసు ఎవరైనా రావచ్చని, అవి ఆలస్యం చేసే క్షణాలు కావని. అంగీకారంగా తలూపాడు. బైరన్ నెమ్మదిగా తన ఎడం చేత్తో రిసీవర్ అందుకుని దాన్ని బలంగా లాగాడు. దానికున్న వైర్ తెగి బయటకి వచ్చేసింది.

"ఇప్పుడు నీ కత్తి" చెప్పాడు.

మేన్ డెన్ తన ఎడం చేతిలోని కత్తిని టేబిల్ కి ఓ పక్కగా విసిరేసాడు. వెంటనే లేచి మెరుపులా బయటికి భయంగా పరిగెత్తాడు.

బైరన్ తన కుర్చీలోంచి అంగుళం కూడా కదలలేదు. రెండు చేతులని టేబిల్ మీది నించి తీయకుండా అరిచాడు.

"సేమ్! వాణ్ని పట్టుకో. నేరస్థుడు వాడు."

బయట మేన్ డెన్ అరుపులు, ఇద్దరు పోట్లాడుతున్న చప్పుడు, బలమయిన దెబ్బ తగిలిన శబ్దం వినిపించాయి. బైరన్ లేచి సేమ్ కి సహాయం చేసే ప్రయత్నం చేయలేదు. ఎలా కూర్చున్నాడో అలాగే కదలకుండా ఉన్నాడు.

"పట్టుకున్నాను." సేమ్ కంఠం వినపడ్డాక నుదుట పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

పోలీస్ కెప్టెన్ సేమ్ విలియమ్స్ రెండు గంటల తర్వాత బైరన్ దగ్గరికి వచ్చాడు. రిక్ మేన్ డెన్ ని జైల్లో పెట్టి రావడానికి అంతసేపు పట్టింది.

"బైరన్. ఈ బల్ల ముందు కూర్చుని నీతో పేకాట ఆడే ధైర్యం నాలో ఎంత మాత్రం లేదిక. మోసం చేయడంలో నీకు ఇంత నైపుణ్యం ఉందని నాకు తెలియదు." చెప్పాడు సేమ్ విలియమ్స్ తల అడ్డంగా ఊపుతూ.

‘‘ఊరికే నన్ను పొగుడుతున్నావు సేమ్! అదృష్టం నా వైపు ఉంది. అంతే! ఇవాళ నా సర్వెంట్ ని బయటకి వెళ్ళబోయే ముందు నా చక్రాల కుర్చీని ఇక్కడ నా పక్కన ఉంచమని కోరడం నిజంగా నా అదృష్టం. లేకపోతే వాడు ఇల్లంతా తిరిగి చూసినప్పుడు అది చూసేవాడు."

అవునన్నట్లుగా తలూపాడు సేమ్
"కొద్దిగా కిటికీ దగ్గరకి తీసుకెళ్ళు నన్ను చల్లటి గాలి కావాలి నాకు."
సేమ్ విలియమ్స్ బైరన్ ని కుర్చీలో కూర్చోపెట్టి కిటికీ వైపు తోసుకెళ్ళాడు.
ఆ కుర్చీలో కూర్చున్న బైరన్ కి రెండు మోకాళ్ళ కింది భాగం లేదు! ఓ ఏక్సిడెంట్లో అవి పోయి చాలా కాలం అయింది!!

---

## గడియ పెట్టిన గది - బెర్రి పెరోని

ఎన్నిక్స్ టర్ టేబుల్ మీద గ్లాసు అందుకుని, అందులో మిగిలి ఉన్న విస్కీని పూర్తిగా తాగి దాన్ని మళ్ళీ టేబుల్ మీద ఉంచాడు.

‘‘ఆ గది తలుపుకి లోపల గడియ వేసి ఉంది. అయినా అందులోని వ్యక్తి ఎలా హత్య చేయబడ్డాడు? నా నాటకం చివరి దాకా అది సస్పెన్స్ గా, ఉత్కంఠగా సాగుతుంది. చివరికి ఇప్పుడు నేను చెప్పిన ట్రిక్ ద్వారా, హంతకుడు ఆ గది లోపల గడియ పెట్టి ఉండగానే ఎలా

బయటికి వెళ్ళాడో నా నాటకంలోని డిటెక్టివ్ కనుకుంటాడు." ఎన్నిక్స్ టర్ బార్లో తన ఎదురుగా కూర్చుని బీర్ తాగుతున్న కొత్త వ్యక్తితో చెప్పాడు.

అతడేం మాట్లాడకుండా బీర్ మగ్ ఎత్తి తాగాడు. దీర్ఘ చతురస్రాకారపు నల్లటి రిమ్ లెస్ కళ్ళజోడు, నలుపు, తెలుపు కలనేతగా ఉన్న సూట్, మేధావి అని సూచించే గద్ద ముక్కు అతడి వయసు పాతిక, ముప్పై మధ్య ఉంటుంది.

"ఆ నాటకంలో మొత్తం మూడు అంకాలు ఉంటాయి. మూడో అంకంలోని ఆఖరి మూడు నిమిషాలలో ఇప్పుడు నేను చెప్పిన ట్రిక్ ప్రేక్షకులకి తెలుస్తుంది. ఇది చాలా తెలివైన ఉపాయం అని వాళ్ళు గ్రహించాక, తలుపులు మూసి ఉన్న గదిలో హత్య ఇతివృత్తంగా నాటకాలు రాసే రచయితగా నా ఇమేజ్ ఇంకాస్త పెరుగుతుంది. ఇంతకు ముందు ప్రదర్శించిన నా నాటకంలో ఇలాంటి ఉపాయాలే నా ప్రేక్షకులని ఆశ్చర్యపరిచాయి. ఇది వారిని ఇంకా ఆశ్చర్యపరుస్తుంది. ఏమంటావు?"

ఆ కళ్ళజోడు వ్యక్తి బదులివ్వలేదు. ఇరవై నిమిషాలుగా ఎన్నిక్స్ టర్ మాట్లాడుతున్నాడు తప్ప, అతడు మాత్రం నోరు విప్పకుండా మౌనంగా ఎన్నిక్స్ టర్ చెప్పేది వింటూ బీర్ తాగుతున్నాడు.

"మొన్నే బ్రాడ్వేలో ముగిసిన తలుపు వెనక హత్య అనే నా నాటకం రోజుకి ఐదు ప్రదర్శనలు చొప్పున రెండు వందల యాభై రోజులు ప్రదర్శించబడింది. రెండు వందల యాభై రోజులు! అయినా జేమ్స్ ఎన్నిక్స్ టర్ పేరు నువ్వు ఇంతదాకా వినలేదు. ఎంత దయనీయ స్థితి? నాటకాలు చూడని వారు కూడా ఉంటారని నాకు ఇప్పుడే తెలిసింది."

ఎన్నిక్స్ టర్ సైగని అందుకుని వెయిటర్ ఇంకో డబుల్ లార్జ్ పెగ్ జాక్ డేనియల్ విస్కీ తెచ్చి ఇచ్చాడు.

‘‘తలుపు వెనక హత్య నాటకంలో నేను రాసిన ఈ ఉపాయం తెలివైంది కదూ? హంతకుడు టవర్ బోల్ట్ కింద ఆరు అంగుళాల మంచుగడ్డని ఉంచి వెళ్తాడు. అది కరుగుతూ, క్రమంగా బోల్ట్ కిందకి దిగి లాక్లో కూర్చుంటుంది. లోపల బోల్ట్ పెట్టుకున్నాక వీపులో కత్తితో పొడవబడి ఎలా హత్యచేయబడ్డాడు? హంతకుడు లోపల నించి ఎలా పారిపోయాడు? డిటెక్టివ్ తో సహా అంతా తలలు పగల కొట్టుకుంటారు. ప్రేక్షకులు కూడా."

కొద్దిగా విస్కీ తాగి ఎన్నిక్స్ టర్ మళ్ళీ చెప్పడం కొనసాగించాడు.

‘‘ఆ నాటకంలో కనీసం తడిసిన నేల అనే భౌతికమైన క్లూ అయినా ఉంది. ఇప్పుడు నేను చెప్పిన ఉపాయంలో అసలు అలాంటి భౌతిక క్లూనే ఉండదు. "ఆ ఉపాయం ఎలా ఉండాలి? డిటెక్టివ్ దాన్ని ఎలా కనుక్కుంటాడు?’’ అని నేను నెల రోజులుగా ఆలోచిస్తున్నాను. కానీ నువ్వు వచ్చి నా ఎదురుగా కూర్చోడానికి పావుగంట ముందు దాకా అది నాకు తట్టలేదు. ఎలాగైతేనేం ఇక్కడే నీ రాక ముందే బ్రహ్మాండమైన ఉపాయం తట్టింది. నేను మేధావిని కదా?" గర్వంగా అడిగాడు.

అతడు మొదటిసారిగా మాట్లాడాడు.

"మీ కొత్త నాటకం స్క్రీన్ ప్లే మొత్తం నాకు చెప్పి నన్ను గౌరవించారు. ఇంక మీరు తాగడం ఆపి ఇంటికి వెళ్ళడం మంచిది."

అతడు వెయిటర్ కి తన బిల్లు తెమ్మని సైగ చేసాడు. వెయిటర్ తన బిల్లు తీసుకురాగానే ఎన్నిక్స్ టర్ ఆ వెయిటర్ తో నవ్వుతూ చెప్పాడు.

‘‘గురువుగారి సలహా ప్రకారం నేనూ ఇంటికి వెళ్ళాలి. నా బిల్ కూడా తీసుకురా."

తన బిల్లు వెనక సంతకం చేసి కొంత టిప్ వదిలి ఎన్నిక్స్ టర్ లేచాడు. అతడు నిత్యం తాగే ఆ బారులో నెలకోసారి చెల్లించే ఏర్పాటు ఉంది. నాటక రచయితగా బాగా సంపాదించే ఎన్నిక్స్ టర్ లాంటి కొద్ది మందికి బార్ యజమాని ఈ సౌకర్యాన్ని కల్పించాడు.

ఎన్నిక్స్ టర్ తూలుతూ వెయిటర్ భుజం మీద చేయి వేసి అతడి ఆసరాతో లేచి బయటకి నడిచాడు. బయటికి రాగానే టాక్సీ కోసం వెయిటర్ గట్టిగా ఈల వేసాడు. ఒక్క టాక్సీ కూడా లేదు. ఉన్న ఒక్క దాని డ్రైవర్ మ్యూజిక్ వింటూండటంతో అతనికి ఈల వినిపించలేదు. దాంతో ఎన్నిక్స్ టర్ రోడ్డు దాటి అవతలి పక్కన దూరంగా ఆగి ఉన్న ఆ టాక్సీ వైపు వెళ్తుండగా, ఆకస్మాత్తుగా దూసుకు వచ్చిన ఓ కారు అతణ్ణి డి కొట్టింది. ఎగిరి వెళ్ళి అతను పేవ్మెంట్ మీద పడ్డాడు. అది గమనించిన కస హవానా బార్ వెయిటర్ అరుస్తూ ఎన్నిక్స్ టర్ దగ్గరకి పరిగెత్తాడు.

* * *

కస హవానా బార్ ఆ రోజు రద్దీగా ఉంది. నుదుట ప్లాస్టర్తో, భుజం నించి వేలాడే పట్టీలోని ఎడమ చేతితో వచ్చిన ఎన్నిక్స్ టర్ చూసి వెయిటర్ ఆనందంగా నవ్వుతూ ఆహ్వానించాడు.

"వెల్కం. మీరింత తొందరగా వస్తారని అనుకోలేదు."
"కానీ రావాల్సిన పరిస్థితి ఏర్పడి వచ్చాను."
ఎన్నిక్స్ టర్ కూర్చున్నాక వెయిటర్ అడిగాడు.
"ఎప్పటిలా జాక్ డేనియలేనా?"
"ఊహు. ఇవాళ నేను తాగడానికి రాలేదు."
"మరి దేనికి వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు వెయిటర్.
"ఆ రోజు నా ఎదుట కూర్చున్న ఒకతను నీకు గుర్తున్నాడా?"

"గుర్తున్నాడు. మీకు ఏక్సిడెంట్ జరగ్గానే, గుడ్ గాడ్! మీ మిత్రుణ్ణి కారు గుద్దింది' అని నేను అతడికి చెబితే ఆ రచయిత నా మిత్రుడు కాదు" అన్నాడు. నాతో పాటు మిమ్మల్ని

రక్షించడానికి రావడానికి బదులు చిత్రంగా, మానవత్వం లేకుండా ఎటో వెళ్ళిపోయాడు. అంతసేపు తనతో కలిసి తాగిన వ్యక్తి కారు కింద పడితే అంత నిర్దయగా వెళ్ళిపోవడం దారుణం." చెప్పాడు వెయిటర్.

“అతనెవరు? ఇక్కడికి తరుచూ వస్తుంటాడా?"
"తెలీదు. ఆ రోజే మొదటిసారి రావడం." జవాబు చెప్పాడు వెయిటర్.
"ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడైనా వచ్చాడా? అతడి పేరు, వివరాలు ఏమైనా నీకు తెలుసా? నాకు అతణ్ణి కలవాల్సిన అవసరం ఉంది."

“ఊహు. మళ్ళీ ఇంతదాకా రాలేదు. అలాంటి వారికి దూరంగా ఉండటం మేలు." వెయిటర్ స్వరంలో కోపం ధ్వనించింది.

“అతను ఎలాంటి వాడైనా సరే, నేను అతన్ని ఓసారి కలవాల్సిన అవసరం ఉంది. బాగా గుర్తు తెచ్చుకో. అతను అంతకు మునుపు కానీ, ఆ తరువాత కానీ వచ్చాడా?"

“లేదు. మీకు అతనితో ఏమిటి పని?”

“నా కొత్త నాటకం మూడో అంకం చివరి దాకా రాసాను. ఆఖరున ముగింపు తాలూకు మలుపుని ఆ రోజు ఇక్కడే తాగుతూ ఆలోచిస్తే తట్టింది. అది అతడికి చెప్పాను. ఆ ఏక్సిడెంట్ వల్ల నా తలకి తగిలిన దెబ్బతో ఆ మలుపు ఏమిటన్నది మర్చిపోయాను. తలకి తగిలిన దెబ్బ వల్ల అలా ఏదైనా మర్చిపోవడాన్ని బ్లయిండ్ స్పాట్ అంటారని డాక్టర్ చెప్పాడు. ఎంత ఆలోచించినా నాకా ఉపాయం గుర్తు రావడం లేదు. నా నాటకం మొత్తం చెప్పాను కాబట్టి అతడు మళ్ళీ కనిపిస్తే క్లైమాక్స్ లో నేను ఏం అనుకున్నానో అడిగి తెలుసుకుందామని.”

"ఇవాళైతే రాలేదు. ఎప్పుడైనా అతడు ఇక్కడికి మళ్ళీ వస్తే వెంటనే మీకు ఫోన్ చేస్తాను.”

‘‘కొంచెం సేపు ఇక్కడే కూర్చుని ఆలోచిస్తాను. ఇక్కడే స్ఫురించింది కాబట్టి మళ్ళీ గుర్తొస్తుందేమో చూద్దాం."

ఎన్నిక్స్ టర్ తను ఎప్పుడూ కూర్చునే టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

‘‘ఓ పెగ్ తీసుకురానా?"

‘‘ఒద్దు. నేను వాడే మందులు ఆపేదాకా డాక్టర్ ఆల్కహాల్ తీసుకోవద్దన్నాడు. అది, ఇది కలిస్తే ప్రమాదమట."

ఎన్నిక్స్ టర్ రాత్రి పదిన్నరదాకా మూడు గంటల సేపు తను మర్చిపోయిన ఆ విషయాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. బార్ మూసే సమయం కావడంతో ఆనాటి తన శ్రోత ఆ రోజు రావచ్చన్న ఆశ కూడా చచ్చిపోయింది.

వెయిటర్ కు టిప్ ఇచ్చి అతడు వస్తే మాత్రం, పేరు, ఫోన్ నెంబర్ తెలుసుకుని తక్షణం తనకి ఫోన్ చేయమని కోరాడు.

మరో వారం రోజులు గడిచాయి. రోజూ ఎన్నిక్స్ టర్ కస హవానా బార్కి వచ్చి అతడి కోసం ఎదురు చూసి వెళ్తున్నాడు. అతను మాత్రం మళ్ళీ కనబడలేదు. ఎన్నిక్స్ టర్ కొద్ది రోజులకి ఇంకో ఆలోచన తట్టింది. దాంతో దినపత్రికలో పర్సనల్ కాలంలో ఓ ప్రకటన ఇచ్చాడు.

కస హవానాలో జనవరి 27న నేను చెప్పిన నా కొత్త నాటకాన్ని ఓపికగా విన్న ఓ అపరిచిత వ్యక్తీ! దయచేసి వెంటనే ఈ కింది ఫోన్ నంబర్ కి ఫోన్ చేస్తావా? తగిన బహుమతి కూడా ఉంటుంది.

తర్వాత నాలుగు రోజులు ఎన్నిక్స్ టర్ ఉత్కంఠగా గడిపాడు. ఎప్పుడు ఫోన్ మోగినా అది అతడి నించే అని ఆశ పడ్డాడు. కానీ నాలుగు రోజులు గడిచినా అతడి నించి ఫోన్ రాలేదు.

అతను ఎందుకు ఫోన్ చేయలేదు? ఊళ్ళో లేడా? తన ప్రకటన చూడలేదా? చూసీ అశ్రద్ధ చేసాడా? లేక.

ఛ! ఏ రచయితా ఎప్పుడు చేయకూడని పొరపాటు తను చేసాడు. అసలు తను ఏ ఉద్దేశంతో ఆ ప్రకటన ఇచ్చాడో అతను గ్రహించాడా? ఆ నాటకం ఇంకా స్టేజి ఎక్కలేదు కాబట్టి తను చెప్పిన నాటకాన్ని అతడే రాసేస్తున్నాడా? అతడు కూడా రాయగలడా? బ్రాడ్వేలో ఏదో ఓ రోజు తను ఆ నాటకం చూస్తాడా? కాని అతను రచయిత కాదు. నోరు మెదపకుండా తను చెప్పింది మొత్తం విని, ఏక్సిడెంటైన తనకి సహాయం చేయకుండా, ఎక్కడ ఉన్నాడో ఆచూకీ అయినా తెలియనీకుండా తనకు దూరంగా ఉన్న అతను రచయిత కాదు. ఓ అసాధారణ వ్యక్తి అనే నిర్ణయానికి వచ్చాడు ఎన్నిక్స్ టర్.

అతణ్ణి తలచుకునే కొద్ది ఎన్నిక్స్ టర్ కి అగ్రహం కలుగుతోంది. ఎందుకిలా తన నించి దాక్కుంటున్నాడు? అసలు ఏక్సిడెంటైన మర్నాడు బార్కి వచ్చి తన గురించి వెయిటర్ని విచారించవచ్చుగా? తను అతణ్ణి కలుసుకోవాలని అనుకుంటున్న సంగతి అతనికి ఖచ్చితంగా తెలిసే ఉంటుందని ఎన్నిక్స్ టర్ అభిప్రాయపడ్డాడు.

* * *

ఎన్నిక్స్ టర్ అనుకోకుండా పది రోజుల తర్వాత ఓ రోజు ఆ అపరిచిత శ్రోత అయిన కళ్ళజోడు వ్యక్తిని చూడటంతో అతని అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.

ఎన్నిక్స్ టర్ అతణ్ణి బార్లో చూసిన తర్వాత రెండోసారి చూసినప్పుడు సబ్ వే రైలు తలుపులు మూసుకుంటున్నాయి. ఓ చేతిలో బ్రీఫ్ కేసుతో, ఇంకో చేతిలో మడిచిన దినపత్రికతో అతను ప్లాట్ ఫారం మీద నడుస్తూ కనిపించాడు. అతడి నల్లటి కళ్ళజోడు ఫ్రేమ్ మీద దీపపు వెలుగు పడి మెరిసింది.

ఎన్నిక్స్ టర్ తక్షణం రైలు దిగాడు. అతని దగ్గరకి పరిగెత్తుకు వెళ్ళి చెప్పాడు.

"థాంక్ గాడ్! నేను మీ కోసమే వెదకుతున్నాను."

అతడు తల తిప్పి ఎన్నిక్స్ టర్ వంక చూసాడు. క్షణ కాలం అతని మొహం పాలిపోయింది. అతణ్ణి చూస్తే తన తమ్ముణ్ణి చూసిన భావన కలిగి ఎన్నిక్స్ టర్ ఎంతో రిలీఫ్ ఫీలయ్యాడు.

"మీతో కొంచెం సేపు మాట్లాడాలి. ఎటైనా వెళదాం పదండి." కోరాడు.

"మీరెవరు? నాతో ఏం మాట్లాడాలనుకుంటున్నారు?"

"నేను మీకు చెప్పిన నాటకం గురించి."

"నాటకమా? ఏం నాటకం?"

"చూడండి. ఆ రాత్రి నేను బాగా తాగి ఉన్నాను. మీరు నా అంతగా తాగలేదు. అవునా?"

"నేనిప్పటి దాకా నా జీవితంలో ఎన్నడూ తప్ప తాగలేదు."

"థాంక్ గాడ్ అయితే నేను రెండు వారాల క్రితం చెప్పిన ఆ నాటకం మీకు స్పష్టంగా గుర్తుండే ఉంటుంది."

"మీరే నాటకం గురించి మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు. మిమ్మల్ని నా జీవితంలో ఇప్పటిదాకా ఒక్కసారి కూడా చూడలేదు. ఐయాం సారీ, గుడ్ నైట్." అంటూ వెళ్ళబోతున్న అతని రెండు భుజాలని పట్టుకుని ఆపాడు ఎన్నిక్స్ టర్.

"ఒక్క క్షణం...నేను బాగా తాగి ఉండొచ్చు. కానీ, మిమ్మల్ని పోల్చుకోలేనంతగా తాగి లేనా రాత్రి." కోపంగా చెప్పాడు.

"ఓసారి చెప్పాను కదండీ, మిమ్మల్ని నేనెప్పుడూ చూడలేదని." విసుగ్గా చెప్పాడు అతను.

‘‘బార్ బయట నన్నో కారు గుద్దడం మీరు చూడలేదా? వెయిటర్తో మీరు 'అతను నా మిత్రుడు కాదు' అనలేదూ?"

అతను వెళ్ళబోయే ప్రయత్నం చేయడంతో ఇంకాస్త గట్టిగా పట్టుకుని చెప్పాడు.

‘‘ఆగు. నీ వ్యక్తిగత జీవితం గురించి నాకేం తెలీదు. కానీ నేను తెలీనట్లు ఎందుకిలా నటిస్తున్నావో నాకు అర్ధం కావడం లేదు. ఆ ఏక్సిడెంట్ కి సాక్షిగా రావాల్సి ఉంటుందని భయపడుతున్నావా? నిన్ను సాక్ష్యం చెప్పమని కోరడం లేదు. నువ్విలా నటించడానికి ఇంకేదో వ్యక్తిగత కారణం ఉండి ఉండొచ్చు. నాకది అనవసరం. కానీ నేను తెలీసే తెలీదని నువ్వు అనడం మాత్రం శుద్ధ నటన."

‘‘నన్ను వెళ్ళనీయండి." వదిలించుకుంటూ హీన స్వరంతో అతను చెప్పాడు.

‘‘నీ నించి నాక్కావలసిందల్లా ఆ నాటకం చివర్లో గది తలుపులు మూసి ఉండగా హంతకుడు ఆ గదిలోని వ్యక్తిని ఎలా చంపాడు? అన్న పాయింట్ మాత్రమే. నేను నీకా ఉపాయం గురించి ఆ రాత్రి చెప్పాను. నా తలకి ఏక్సిడెంట్లో తగిలిన ప్రమాదం వల్ల ఆ ఉపాయం మరచిపోయాను. ఎంత ప్రయత్నించినా నాకది గుర్తు రావడం లేదు. దయచేసి నేను నీకు చెప్పిన ఆ ఉపాయం మాత్రం చెప్పి సహాయం చేయి చాలు. లేకపోతే ఆ నాటకం పూర్తి చేయలేను." అర్ధించాడు ఎన్నిక్స్ టర్.

"మీరు నాకు ఏ కథా చెప్పలేదు. కాబట్టి మీరు కోరుతున్న ఉపాయం చెప్పడం నాకు అసాధ్యం."

మళ్ళీ వదిలించుకునే ప్రయత్నం చేసాడు అతను. ఎన్నిక్స్ టర్ అతన్ని వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు.

“చెప్పు. నీకేం కావాలి? డబ్బా? ఇస్తాను. ఎంత కావాలో చెప్పు. కానీ దయచేసి నన్నా నాటకం పూర్తి చేయనివ్వు" ఆక్రోశంగా చెప్పాడు ఎన్నిక్స్ టర్.

“నువ్వు తాగుబోతువైనా అయి ఉండాలి. లేదా పిచ్చి వాడివి ఐనా అయి ఉండాలి." కోపంగా, గట్టిగా చెప్తూ విదిలించుకున్నాడతను. వెంటనే ఇంకో రైలులోంచి దిగిన జనంలో కలిసిపోయాడు. ఎన్నిక్స్ టర్ అతని కోసం స్టేషన్ బయట వెదికాడు. కానీ లాభం లేకపోయింది.

తన నాటకాన్ని అతను కాపీ కొట్టదలచుకున్నాడా? అతను రచయిత కాకపోయినా తను చెప్పిన నాటకం విన్నాక నాటక రచయిత అవ్వాలన్న కోరిక కొత్తగా పుట్టిందా? ఇప్పటికే ఆ నాటకం రాయడం మొదలు పెట్టేసి ఉంటాడా? రేపు ఆ నాటకం చూసి జరిగిందేమిటో తను చెప్పినా ఎవరూ నమ్మరు. తాగి మత్తులో ఉన్న రచయిత చెప్పిన నాటకాన్ని కొత్త వ్యక్తి కాపీ కొట్టాడన్న సంగతి అత్యంత అసాధారణ సంఘటన అవుతుంది. తాగి తాగి తను ఇలా తయ్యారయ్యాడని అందరూ తననే తప్పు పడతారు. తన కెరిర్కే అది ప్రమాదం. దగ్గర్లో ఉన్న ఓ బార్లోకి వెళ్ళాడు.

ఆ దీర్ఘ చతురస్రపు కళ్ళజోడు వ్యక్తిని స్టేషన్లో కలిసిన నాలుగో గంటకి ఎన్నిక్స్ టర్ తొమ్మిదో పెగ్గు విస్కీని గ్లాస్లోకి ఒంచుకున్నాడు. అతను అప్పటికే ఎనిమిది పెగ్గులు తాగాడు.

స్టేషన్ నించి ఇంటికి వస్తూ ఏయే బార్లలో తను ఎన్నెన్ని పెగ్గులు తాగాడో కూడా ఎన్నిక్స్ టర్ గుర్తు లేదు.

ఛ! రచనాపరంగా వచ్చే ఏ ఒక్క ఆలోచనని, ఏ ఒక్క సంభాషణని ఇప్పటివరకు తను ఎన్నడూ మర్చిపోలేదు. తాగే అలవాటున్న చాలా మంది రచయితల్లా తను పేపర్ నేప్కిన్స్ మీద వాటిని రాసుకుని ఎరగడు. మర్నాడు ఉదయానికి అంతా యధాతథంగా గుర్తుంటుంది. కానీ ఇప్పుడు, ఆ కారు దెబ్బ వల్ల ఇలా అయింది. ఆ కొత్త నాటకం క్లయిమేక్స్ లో

హంతకుడు హత్య చేసాక, గది తలుపు లోపల బోల్ట్ ని బయట నించి ఎలా పెట్టగలిగాడు అన్న విషయం మీద తనకి ఆనాడు తట్టిన ఆలోచన గురించి ఆలోచించాడు. కానీ పిసరంత కూడా జ్ఞాపకం రాలేదు.

"మీరు మళ్ళీ మొదలెట్టారా?" కసా హవానా వెయిటర్ అడిగాడు.

"అవును. రెండు వారాల్లో కోర్స్ పూర్తయింది. మందులు ఆపేసాను.

"పదకొండో పెగ్ తర్వాత వెయిటర్ తెచ్చిన స్టీక్ తిని బిల్ వెనక సంతకం చేసి, అతడికి ఎప్పటిలా టిప్ వదిలి లేచాడు. టాక్సీలో క్వీన్స్ లోని తన అపార్ట్ మెంట్ కి చేరుకున్నాడు. లిఫ్ట్ లో పైకి వెళ్ళి తన ఫ్లాట్ ముందు నించుని తలుపు తీస్తూండగా పక్క ఫ్లాట్ తలుపు తెరుచుకుంది. ఆ ఇంటి కుటుంబ సభ్యులు బయటికి వెళ్తూ ఎన్నిక్స్ టర్ చూసి గ్రీట్ చేసారు.

ఎన్నిక్స్ టర్ బదులుగా తన చేతిని ఊపాడు.

"డిన్నర్ కా? హేవ్ ఏ గ్రేట్ డే." చెప్పాడు.

తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళి తలుపు మూసి లోపల గడియ పెట్టుకున్నాడు. అలవాటుగా డోర్ చెయిన్ని కూడా తగిలించాడు.

బూట్లు విప్పి స్టాండ్లో ఉంచి సాక్స్ తో హాల్లోంచి తన పడక గదిలోకి నడిచాడు. బల్ల ముందు కుర్చీలో కూర్చుని ఎదురుగా బల్ల మీద ఉన్న తన నాటకం ఫైల్ ని అందుకున్నాడు. ఫైల్ మూసి లేదు. తెరిచి ఉంది! అసలు ఈ ఫైల్ ఎవరు తెరిచారు? తను ఎన్నడూ అలా నిర్లక్ష్యంగా ఫైల్ ని తెరిచి ఉంచడే? కాగితం మీద తన చేతి రాతతో రాసి ఉంది చదివాడు.

కత్తి గాయాలతో మరణించిన సిల్వియా కిటికీ లేని, ఒకే ఒక్క తలుపు ఉన్న గదిలో, లోపల తలుపు గడియ పెట్టి ఉండగా మరణించిందని డిటెక్టివ్ జార్జ్ గ్రహించాడు. తనని బ్లాక్ మెయిల్

చేసే వ్యక్తి పేరుని తను పోలీసులకి చెప్పకుండా ఉండేందుకు అతడు తనని చంపవచ్చని ఆమెకి తెలీదులా ఉంది."

ఉదయం తను చదవని దిన పత్రికని అందుకుని దాన్ని తిరగేయసాగాడు. అందులో నాలుగో పేజీలోని ఓ వార్త హెడ్డింగ్ అతడిని ఆకర్షించింది.

**గడియ వేసిన గదిలో హత్య**

గబగబా దాన్ని చదివాడు.

మారియా కిటికీ లేని గదిలో కుర్చీలో కూర్చుని ఉండగా వెనక నించి హంతకుడు మూడు సార్లు ఆమెని పొడిచి చంపాడు. ఆ మూడింటిలో ఏ గాయం వల్ల అయినా ఆమె మరణించి ఉండొచ్చు. పోలీసులకు అంతుపట్టని విషయం ఏమిటంటే, తలుపు లోపల బోల్ట్ పెట్టుకున్న ఆమెని వెనక నించి పొడిచి హత్య చేసిన హంతకుడు, ఆ గదిలోంచి ఎలా మాయం అవగలిగాడు? మారియా హత్యకు గురై పధ్నాలుగు నించి పదిహేను రోజులు అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఆ వార్త మొత్తం చదివిన ఎన్నిక్స్ టర్ అతను తను అసలు తెలియనట్లుగా ఎందుకు నటించాడో తక్షణం అర్థమైంది. పదిహేను రోజుల క్రితం తను నాటకంలో రాయబోతున్న ఆ ఉపాయం గురించి చెప్పాక, ఆ దీర్ఘ చతురస్రాకారపు కళ్ళజోడు వ్యక్తి వెళ్ళి మారియాని హత్య చేసి, ఆ ఉపాయంతోనే తప్పించుకుని ఉంటాడు. తను కేవలం ఓ నాటకంలో ఓ పాత్ర చేత హత్య చేయించడానికి ఆలోచించిన ట్రిక్, నిజంగానే ఓ మనిషి ఇంకో మనిషిని హత్య చేయడానికి ఉపయోగపడిందన్నమాట!

ఆ ఆలోచనే ఎన్నిక్స్ టర్ ఒణుకు పుట్టించింది. ఆ ట్రిక్ చెప్పడానికి అతనికి డబ్బు ఇస్తానన్నా చెప్పకపోవడానికి కారణం తను పట్టుబడొచ్చన్న భయంతోనే ఉంటుంది. తన దగ్గరున్న

మొత్తం డబ్బు ఇస్తానన్నా ఒప్పుకోడు. మనిషికి ముందు తన ప్రాణం ముఖ్యం. తర్వాత స్వతంత్రం. జీవిత కాలం ఎవరూ జైల్లో గడపడానికి ఇష్టపడరు.

రైల్వే స్టేషన్లో అతని భుజం మీద తన చెయ్యి పడ్డాక వెనుతిరిగి చూసిన అతను తనని చూసి ఎంతో భయపడి ఉంటాడు. తను ఆ ఉపాయం మర్చిపోయానని తెలిసి ఎంతో సంతోషించి ఉంటాడు. హఠాత్తుగా ఎన్నిక్స్ టర్ ఆ రాత్రి అతడికి చెప్పిన ఆ ఉపాయం, ఓ మొగ్గ వేగంగా విచ్చుకున్నట్లుగా గుర్తుకు వచ్చింది. చిన్నగా ఈల వేసాడు.

ఇతర ఆలోచనలు కట్టి పెట్టి, ముందు తన నాటకాన్ని పూర్తి చేయదలుచుకున్నాడు. ఫైల్లోని ఖాళీగా ఉన్న పేపర్లో మొదటి మాట రాసాడు.

హంతకుడు కుర్చీలో కూర్చున్న సిల్వియాని వీపు మీద మూడు సార్లు పొడిచాక ఆ కత్తిని తనతో తెచ్చుకున్న ప్లాస్టిక్ పెట్టెలో పెట్టి దాన్ని జేబులో దాచుకున్నాడు. తలుపు వైపు వెళ్ళి బోల్ట్ తీసి...

నాటకం పూర్తి చేసాక అకస్మాత్తుగా ఎన్నిక్స్ టర్ ఓ ఆలోచన కలిగింది. ఈ నాటకంలోలా తను కిటికీ లేని, లోపల బోల్ట్ బిగించిన గదిలో ఒంటరిగా ఉన్నాడు. ఆ కళ్ళజోడు హంతకుడు మారియాని ఎలా హత్య చేసాడో తనకి మాత్రమే తెలుసు. ఆ రహస్యం తెలిసిన తనని వాడు హత్య చేయాలని అనుకోడా?

సరిగ్గా ఆ ఆలోచన రాగానే ఎన్నిక్స్ టర్ వెనక నించి చిన్న అలికిడి వినిపించింది. కాని అప్పటికే ఆలస్యం అయింది. ఎన్నిక్స్ టర్ కుర్చీలోంచి సగం లేచేసరికే అతడి వెనక, పక్కటెముకల మధ్య పదునైన కత్తి దిగబడిందని బాధని బట్టి గ్రహించాడు. తనని ఎవరు పొడిచారో చూడకుండానే అతడి తల టేబుల్ మీదకు వాలిపోయింది. కుడి చెంప, రాస్తున్న కాగితం మీద ఆనింది. అదే సమయంలో ఆ గది తలుపు మూసుకున్న శబ్దం వినిపించింది.

ఎన్నిక్స్ టర్ గొంతులోంచి వెలువడిన ఆఖరి శబ్దం నవ్వులా ధ్వనించింది. రేపు తన హత్యని పరిశోధించే డిటెక్టివ్ కి ఆ ఉపాయం తన నాటకం ఆఖరి పేజీ చదివాక తెలుస్తుందని ఆ నవ్వుకి అర్థం కావచ్చు.

---

# మృత్యువు నీడ - డోనాల్డ్ హోనిగ్

అతను కిందికి చూసాడు.

ఫుట్ పాత్ మీద నించుని ఉన్న మనుషులు తలలు పైకి ఎత్తి తన వంకే చూస్తున్నారు. క్రమంగా మనుషులు ఎక్కువ అవుతున్నారు. త్వరలోనే రోడ్డు అంతా జనంతో నిండిపోయింది. కార్లు వెళ్ళేందుకు చోటు లేకపోవడం వల్ల డ్రయివర్లు హారన్ కొడుతున్నారు.

ఇరవై ఆరు అంతస్థుల పై నించి చూస్తూంటే అతనికి అంతా వింతగా, గమ్మత్తుగా ఉంది. అతని చెవులకి శబ్దం స్పష్టంగా అందక పోయినా, కింద నించున్న మనుషుల్లోని సంచలనం మాత్రం కనబడుతోంది.

మధ్య మధ్యలో కిటికీ తలుపుల్లోంచి మొహాలు బయటికి పెట్టి చూస్తూ అనేక మంది అతన్ని వివిధ ప్రశ్నలని అడుగుతున్నారు. వాళ్ళ కంఠాలలో భయం, ఆశ్చర్యం తొంగి చూస్తున్నాయి.

ముందర లిఫ్ట్ బాయ్ అడిగాడు.
‘‘ఏం చేస్తున్నావు అక్కడ?''
‘‘ఇదంతా చూస్తూంటే నీకేమనిపిస్తోంది?'' అతను ఎదురు ప్రశ్న వేసాడు.
‘‘దూకుతావా?'' అడిగాడు లిఫ్ట్ బాయ్.
ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడానికే చిరాకు పడ్డాడు అతను. కిందికి రోడ్డు మీదకి చూసాడు.
"ఇంత ఎత్తు మీంచి కిందికి దూకి రోడ్డు మీద నడిచి వెళ్ళలేవు." వెటకారంగా చెప్పాడు లిఫ్ట్ బాయ్.

కొన్ని నిముషాల తర్వాత హోటల్ మేనేజర్ మొహం కిటికీ లోంచి తొంగి చూసింది. కిటికీకి దూరంగా ఉన్న సన్ షేడ్ మీద నిలబడి ఉన్న అతన్ని చూసి ఆ హోటల్ మేనేజర్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అక్కడేం చేస్తున్నావ్?"
‘‘దూకబోతున్నాను.’’
"ఎవరు నువ్వు నీ పేరేమిటి?"
"కార్ల్ ఆడమ్స్."
‘‘ఎందుకు దూకటం?’’
‘‘అది నీకు అనవసరం."
‘‘నువ్వు చేయ్యబోయేది ఏమిటో కొద్దిగా ఆలోచించు." కిటికిలోంచి ముందుకు ఒంగి ఒగరుస్తూ చెప్పాడు మేనేజర్.
‘‘చాలా ఆలోచించాను. నీ పని నువ్వు చూసుకో. దయచేసి వెళ్ళు."
‘‘నువ్వు చేద్దామనుకునేది చాలా తెలివి తక్కువ పని." చెప్పాడు.

కార్ల్ ఆడమ్స్ నించుని ఉన్న సన్ షేడ్ చాలా చిన్నది. రెండు కిటికీల మధ్య ఉన్న దాని వెడల్పు కేవలం పద్దెనిమిది అంగుళాలే. ఆ రెంటిలో ఏ కిటికీ లోంచి చెయ్యి చాపినా అతను అందడు. అతని వీపు గోడకి ఆనుకొని ఉంది. తెల్లటి షర్ట్ తొడుక్కుని ఉన్న అతని మీద ఎండ పడుతోంది.

క్రమంగా చాలా తలలు కిటికీలలోంచి అతన్ని చూడసాగాయి. హోటల్లోని గుమాస్తాలు, డాక్టర్, ఓ మతాధికారి అంతా అతనితో మట్లాడారు.

‘లోపలకి ఈ గదిలోకి వచ్చి మాట్లాడొచ్చు కదా! అసలు ఇదంతా ఎందుకు?" లాలనగా అడిగాడు మతాధికారి.
"మాట్లాడటానికి ఏం లేదు."

"నేను ఆ సన్ షేడ్ మీదకి వచ్చి నిన్ను జాగ్రత్తగా లోపలికి తీసుకురానా?"
"నువ్వు కాని, మరెవరయినా కాని దీని మీద కాలుపెడితే వెంటనే కిందకి దూకుతాను."
కోపంగా అరిచాడు ఆడమ్స్.
"అసలు నీ సమస్య ఏమిటో నాకు చెప్పచ్చుగా?"
"చెప్పను."
"నీకే విధంగా సహాయం చేయగలను?"
"ఎవరూ ఏం చెయ్యలేరు. వెళ్ళండి."

కొద్ది సేపు ఎవరూ కిటికి దగ్గరకి రాలేదు. తర్వాత ఓ పోలీస్ ఆఫీసర్ తల కిటికీలోంచి కొద్దిగా బయటకి వచ్చి అతన్ని నిశితంగా చూసింది.

ఆడమ్స్ ఆ ఆఫీసర్ మొహాన్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు.
"ఏం కావాలి?"
"ఇక్కడో మనిషి కిందికి దూకుతానని బెదిరిస్తున్నాడని నన్ను పిలిపించారు. అది నువ్వేనా?"
"అవును."
"నిజంగా దూకదలచుకున్నావా?" అడిగాడు అతను.
"అవును."
"ఎందుకు?'
"ఇలాంటి సాహసాలు చేయడం నా స్వభావం."
"ఓ! నీలో హాస్యధోరణి ఉందే?" టోపి తీసి పోలీస్ ఆఫీసర్ కిటికీ అంచు మీద కూర్చుని అడిగాడు.
"సిగరెట్ కావాలా?"
"ఒద్దు." చెప్పాడు ఆడమ్స్.
"పోలీస్ సిగరెట్ పేకెట్లోంచి ఓ సిగరెట్ తీసి అంటించాడు. సిగరెట్ పొగ గుండెల దాకా పీల్చి అతని వంక చూస్తూ చెప్పాడు.

‘‘ఈ రోజు చాలా అందంగా ఉంది. అవునా?"

‘‘అవును. చావడానికి చాలా అందమైన రోజు." ఒప్పుకున్నాడు ఆడమ్స్.

‘‘నువ్వు చాలా కరకువాడివిలా ఉన్నావు. నీకు భార్యాపిల్లలు ఉన్నారా?" అడిగాడు.

"నీకు?"

"నాకు భార్య ఉంది."

"నాకు ఎవరూ లేరు.’’

"అయ్యో!"

ఆడమ్స్ కి నిజానికి ఓ భార్య ఉండేది. లేకపోవడం అంటూ జరిగి ఎంతో కాలం కాలేదు. నిజానికి అంతకు ముందు రోజు దాకా ఉంది. క్రితం రోజు ఉదయం ఆఫీస్ కి బయటికి వెళ్ళాడు. గుమ్మం దాకా వచ్చి చెయ్యి ఊపింది అతని భార్య కరేన్.

అంతకు ముందు రాత్రే మళ్ళీ వాళ్ళిద్దరి మధ్యా ఆ ప్రసక్తి వచ్చింది. కరేన్ అంటే తనకి ప్రేమ చావదని, విడాకులు ఇచ్చే ప్రసక్తే లేదని ఆడమ్స్ ఆమెతో స్పష్టంగా చెప్పాడు. తనని వదిలేస్తానని కరేన్ చెప్పినా ఆడమ్స్ ఆ విషయంలో గట్టిగా ఉన్నాడు.

సాయంత్రం ఆరింటికి ఆఫీస్ నించి ఇంటికి తిరిగి వచ్చాడు. భార్య లేదు! అది ఉత్త బెదిరింపు అనుకున్నాడు. నిజం అయింది. నిశ్శబ్దంగా ఉన్న ఇంట్లో, మంచం మీద కరేన్ శవం ఉంది! పక్కనే ఖాళీ నిద్ర మాత్రల బాటిల్ కనిపించింది.

ఆడమ్స్ దిండు మీద ఉందో ఉత్తరం. చాలా ఆలోచించి, ప్రతీ విషయం బోధపరుస్తూ రాయబడిందా ఉత్తరం.

స్టీవ్ అనే ఆమె రహస్య ప్రియుడు ఆమెని లేవదీసుకుని వెళ్ళలేనని చెప్పాడు. మోసం చేసాడు. స్టీవ్ గురించి అంత స్పష్టంగా రాయగలగడానికి కారణం, వాళ్ళిద్దరి మధ్యా ఇదివరలో అతని ప్రసక్తి రావడం. అనేక నెలల నించి స్టీవ్ గురించి ఆడమ్స్ కి తెలుసు. ఒకసారి వాళ్ళిద్దరిని ఓ

నైట్ క్లబ్ లో చూసాడు కూడా. తమ వివాహం భగ్నమైందని గ్రహించిన కరేన్ అనేకసార్లు స్టీవ్ గురించి ఆడమ్స్ తో నిర్భయంగా మాట్లాడింది.

గత రాత్రి బయటికి వెళ్ళిన ఆడమ్స్ అర్ధరాత్రి దాకా రోడ్ల మీద ఆలోచిస్తూ గమ్యం లేకుండా నడిచాడు. తర్వాత ఇంటికి వచ్చి నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచేసరికే ఏం చేయాలో నిర్ణయించుకున్నాడు. అందుకే ఆడమ్స్ ఆ కిటికీ సన్ షేడ్ మీద నించుని ఉన్నాడు.

సేన్ డియాగో పట్టణంలోని ఆ హోటల్ కి నడిచి వచ్చి, పై అంతస్తులో గది కావాలని అడిగి తీసుకున్నాడు. ఆ తర్వాత జరిగేది తను అనుకున్నట్లుగానే, తను ఊహించినట్లుగానే జరిగి పోతుందని ఆడమ్స్ కి తెలుసు. అలాగే జరుగుతోంది కూడా.

కింద రోడ్డు జనంతో నిండి పోయింది. పోలీసులు గుంపులని దూరంగా జరిపి, ఆడమ్స్ దూకితే సరిగ్గా పడే చోట కింద చోటు చేసారు. ఓ పెద్ద కేన్వాస్ బట్టని అక్కడ పట్టుకున్నారు. దాని మధ్యలో ఎర్రటి రంగు వేసిన సర్కిల్ కనబడుతోంది ఆడమ్స్ కి. దూకితే నేల మీద పడకుండా అతను సరిగ్గా అంచులు లాగి పట్టుకున్న ఆ బట్ట మీద పడతాడు.

ఆడమ్స్ నవ్వుకున్నాడు. ఇరవై ఆరు అంతస్తుల పై నించి వేగంగా దూకితే తన బరువుని ఆపి ఆ కేన్వాస్ రక్షించలేదు. నిజానికి ఇప్పుడు తనని ఎవరూ రక్షించలేరు.

ఇది తెలివైన పని కాదు. ఉపయోగం అసలే లేదు.'' కిటికిలోంచి ఎవరో చెప్పారు.

"అది నీ ఆలోచన." కసురుతూ చెప్పాడు ఆడమ్స్.
''చూడు! నేను సైకియాట్రిస్ట్ ని. నీకు సహాయం చేయగలను." అతను మళ్ళీ చెప్పాడు.
''చాలా ఆలస్యమైంది. నాకు ఎవరూ సహాయం చేయలేరు.''
''నువ్వు దూకనంత సేపు నీకు చాలా సమయం ఉన్నట్లే."
''నీ అవసరం ఉన్న రోగుల దగ్గరకి వెళ్ళి ఆ సహాయం వాళ్ళకి అందించు. నీ అవసరం నాకు లేదు."

అతను వెళ్ళిపోయాడు.

ఆడమ్స్ మళ్ళీ కిందకి, మూగిన గుంపు వంక చూసాడు. అప్పటికే అతనిలో మృత్యువుకి దాదాపు దాదాపు దగ్గరయిన భావన కలిగి, మానసిక ఒంటరితనం ప్రవేశించింది. మనషులందరికీ తను ఎంతో దూరమయినట్లుగా అనిపిస్తోంది. కింద నిల్చుని పైకి చూస్తున్న వాళ్ళు ఓపికగా, జరిగేది తప్పక చూడాలి అనుకుని వేచి చూస్తున్నారు.

‘‘మీరు తప్పక చూస్తారు." మనసులో అనుకున్నాడు ఆడమ్.

పక్క గదిలోని మాటలు ఆడమ్స్ కి వినబడుతున్నాయి. ఏ విధంగా తనకి నచ్చ చెప్పి తనని చావు నించి రక్షించాలా అని కొందరు ఆలోచిస్తున్నారు. ఆత్మహత్యల నించి మాటలతో మనసు మార్చే సిద్ధహస్తులైన వాళ్ళకి ఫోన్లు చేస్తున్నారు.

మళ్ళీ ప్రీస్ట్ మొహం కిటికీలోంచి ఆడమ్స్ కి కనిపించింది.

"మేం నీ కోసం చేయగలిగేది ఏమయినా ఉంటే చెప్పు." అడిగాడు.
అతని మొహంలో కొద్దిపాటి బాధ తొంగి చూస్తోంది.
‘‘ఏం లేదు.’’
'లోపలికి వస్తావా?"
"రాను. నీ సమయం నాతో వృధా చేసుకుంటున్నావు ఫాదర్." దృఢంగా చెప్పాడు ఆడమ్స్.
‘‘లేదు. నేను అలా అనుకోను. ఆలోచించుకోటానికి నిన్ను ఒంటరిగా వదలమంటావా?’
"నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి."
ప్రీస్ట్ తల అదృశ్యమైంది. వెంటనే ఆడమ్స్ మళ్ళీ ఒంటరి అయాడు.

కింద మూగిన గుంపు వంక చూసాడు. ఇందాక అనిపించినట్లుగా, అంత ఎత్తులో నిలబడి ఉండటం ఇప్పుడు ఆడమ్స్ కి ఇబ్బందిగా లేదు. అలవాటైంది.

"తనని రక్షించడానికి అధికారులు ఏం చేస్తున్నారా?" అని ఆలోచించాడు.

తాళ్ళు, నిచ్చెనలు, గాల్లో వేలాడే కుర్చీల గురించి ఆలోచిస్తూండి ఉండచ్చు. తన మనస్థితి గురించి వాళ్ళకి తెలియదు.

పోలీసు ఆఫీసర్ తల మళ్ళీ కనిపించింది. ఆడమ్స్ కి తెలుసు ఆ సంగతి. మిగతా వాళ్ళ ప్రశ్నలకి జవాబు ఇవ్వకపోయినా, అతని ప్రశ్నలకి మాత్రమే జవాబులు ఇచ్చాడు తను. కాబట్టి ఇంకో సారి ఆ పోలీస్ ఆఫీసర్ ప్రయత్నిస్తాడని ఊహించాడు.

కిటికి అంచు మీద కూర్చుని అడిగాడు అతను.

"ఆడమ్స్! ఒక విధంగా నువ్వు నాకో ఉపకారం చేస్తున్నావు."
‘‘ఎలా?’’
‘‘సాధారణంగా కింద అక్కడ ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ ఉంటాను. నీ వల్ల ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాను."
‘‘నిజంగానా?’’
‘‘అవును. కింద మనుషులు నువ్వు దూకడం కోసం ఎదురు చూస్తున్నారని తెలుసా?"
‘‘ఎదురు చూస్తున్నారా?"
‘‘అవును. నువ్వుతప్పకుండా దూకుతావని నిర్ణయించేసుకున్నారు. ఆ దృశ్యం మనసారా చూడాలని వారు అనుకుంటున్నారు. వాళ్ళని నిరుత్సాహపరుస్తావా?"
ఆడమ్స్ కింద నిలబడి ఉన్న జనం వంక ఓ సారి చూసాడు.
"వాళ్ళ మాటలు నీకు వినబడవు కాని నిన్ను దూకమని వారు అరుస్తున్నారు."
"నిజంగా?" నివ్వెరపోయాడు ఆడమ్స్.
‘‘ఊ! గంట నించి నించుని చూస్తున్నందుకు వారి కాలాతీతానికి ప్రతిఫలంగా నువ్వు తప్పక దూకాలని వాళ్ళ ఉద్దేశ్యం."
"ఐతే ఆకలి గొన్న తోడేళ్ళ గుంపులాంటి వాళ్ళు ఈ జనం." ఆడమ్స్ కోపంగా చెప్పాడు.

''అవును. నిస్సారంగా ఉన్న వాళ్ళకి థ్రిల్ కలిగించడానికి నీ జీవితం అంతం చేసుకోవడం ఎందుకు?''

ఆడమ్స్ ఆ పోలీస్ ఆఫీసర్ వంక చూసాడు. ఆడమ్స్ మొహంలో దూకాలనే నిశ్చయం సడలటం తాలూకు ఛాయలు ఆ పోలీస్ ఆఫీసర్ చూసాడు.

''బహుశా నువ్వు చెప్పేది సబబయినదే.'' ఆడమ్స్ కిందకి చూసి చెప్పాడు.

''బహుశా కాదు. నిజంగా. లోపలికి రా. ఆ పిచ్చి జనాన్ని తృప్తి పరచడానికి దేనికి చావడం? వాళ్ళని డిజప్పాయింట్ చెయ్యి'' ఆప్యాయంగా పిలిచాడు.

''సరే. వాళ్ళని డిజప్పాయింట్ చేస్తాను.''
ఆడమ్స్ కొద్దిగా కదలగానే తొట్రుపడ్డాడు. వెంటనే కొద్ది క్షణాలు భయంగా కళ్ళు మూసుకున్నాడు.
''ఏమైంది?'' అడిగాడు పోలీసు ఆఫీసర్.
''కళ్ళు తిరుగుతున్నాయి. ఓ చెయ్యి ఇస్తే బావుంటుంది.''

పోలీసు రోడ్డు వైపు చూసాడు. అనేకమంది టివి కెమేరామెన్, పత్రికా ఫోటోగ్రాఫర్లు సిద్ధంగా పట్టుకున్న జూమ్ కెమెరాలతో కనిపించారు. న్యూస్ పేపర్లో తను అతన్ని రక్షించే ఫోటో మర్నాడు పడుతుంది. ఆ దృశ్యం టివిలో కనిపిస్తుంది.

''అలాగే! కదలక. నేను సాయానికి వస్తాను.''

కిటికీలోంచి జాగ్రత్తగా ఆ సన్ షేడ్ మీదకి దిగి, కదలకుండా నిలబడ్డ ఆడమ్స్ కి రెండడుగుల దూరంలో నిలబడ్డ పోలీసుని చూసి గుంపులోని జనం భయంగా, ఉత్సాహంగా అరిచారు. వారికి దృశ్యంలో కొంత మార్పు కనిపించడంతో సంతోషించారు.

పోలీసు ఆఫీసర్ జాగ్రత్తగా ఆ పద్దెనిమిది అంగుళాల సన్ షేడ్ మీద అతని వైపు కదిలి చేతిని అందించాడు. దాన్ని అందుకున్న ఆడమ్స్ ఒంకరగా నవ్వుతూ చెప్పాడు.

"నాకు తెలుసు చివరికి నువ్వు వస్తావని. అందుకనే ఈ చోటు ఎన్నుకున్నాను."
"ఏమిటి?" అడిగాడు అతను.
"నా పేరు ఆడమ్స్ కాదు. కరేన్ భర్తని. నువ్వే ఆమె రహస్య ప్రియుడవని నాకు తెలుసు. నిన్న రాత్రి ఆమె నీ కారణంగా మరణించింది. నిన్ను చంపితే కాని నా పగ చల్లారదు స్టీవ్."

స్టీవ్ మొహంలోకి తక్షణం భయం పాకింది. వెంటనే వెనక్కి జరుగుతూ అతనికి అందించిన తన చేతిని వెనక్కి లాక్కోబోయాడు. కాని అప్పటికే స్టీవ్ చెయ్యి చుటూ అతని చెయ్యి బిగుసుకుపోయింది. ఆకస్మాత్తుగా తను కిందికి దూకుతూ స్టీవ్ ని కూడా లాగాడు కరేన్ భర్త తన శరీరం మెలికలు తిరుగుతూ, అరుస్తూన్న గుంపు వైపు కిందికి జారడం స్టీవ్ గుర్తించాడు. భయంతో స్పృహ తప్పిపోతూండగా ఎంతో బిగుతుగా, వదిలించుకోడానికి వీలు లేకుండా తన చేతిని పట్టుకున్న కరెన్ భర్త రిచర్డ్ మాటలు విన్నాడు.

"మన ఇద్దరి బరువుని కింద వాళ్ళు పట్టుకున్న బట్ట ఆపలేదు స్టీవ్." అవే స్టీవ్ విన్న ఆఖరి మాటలు.

---

## మాయగాడు - చార్లెస్ ఐన్ స్టీన్

అప్పుడు సమయం పన్నెండున్నర. రఫెర్టీ ఉదయం పది గంటలనించే గోల్డెన్ గ్లోబ్ కేసినోలో పేకాట ఆడుతున్నాడు. లాస్ వేగాస్ లో కొత్తగా తెరిచిన జూదగృహం అది. కొత్తగా తెరిచిన వాండర్లస్ట్ హోటల్లో ఓ భాగంగా నడుస్తోంది కాబట్టి పేక ఆడడానికి వస్తున్న ఖాతాదారుల మొహాలు ఆ జూద గృహ మేనేజర్ కి ఇంకా పరిచయమైనవి కావు.

రఫెర్టీ ప్రతీసారీ ఆలోచించి పందెం కడుతున్నాడు. కాని ప్రతీసారి ఓడిపోతున్నాడు. ఓడిన కొద్దీ అతనిలో పట్టుదల ఎక్కువ అవుతోంది. ఎక్కడ పోతే తిరిగి అక్కడే సంపాదించాలి అనే పట్టుదలతో ఆడుతున్నాడు అని చుట్టుపక్కల వారు గ్రహించారు.

పేక ముక్కలు పంచాడు డీలర్. రఫెర్టీ నలభై డాలర్లు పందెం కాసాడు. డీలర్ రఫెర్టీ ముందున్న పేక ముక్కలని తిప్పాడు. వాటి మొత్తం విలువ ఇరవై. తర్వాత రఫెర్టీ తన దగ్గర ఉన్న కార్డు ముక్కలని తిప్పి లెక్క పెట్టాడు. వాటి మొత్తం పదిహేడు.

రఫెర్టీ మళ్ళీ ఓడిపోయాడు. ఆ నలభై డాలర్ల విలువ చేసే ప్లాస్టిక్ చిప్స్ ని డీలర్ తీసుకున్నాడు.

"ఈ సారి కొత్త పేక వాడండి." చెప్పాడు రఫెర్టీ,

“ఏమిటి?" అడిగాడు డీలర్.

“ఈ ఆటకి కొత్త పేక కావాలి."

“ఇది పది నిమిషాల క్రితమే తీసాం కదా?"

"కావచ్చు. కాని కొత్త పేక వాడండి.”

అదే టేబుల్ దగ్గర ఆడే ఇద్దరు వీళ్ళ వంక చూసారు. వాళ్ళు కూడా ఓడిపోతున్నారు. మనసులో వాళ్ళకి కూడా యాజమాన్యం మోసం చేస్తోందనే అనుమానం ఉండటంతో ఏం జరుగుతుందా అని ఆసక్తిగా చూడసాగారు.

"మీలో ఎవరైనా పేక విషయంలో ఫిర్యాదు చేస్తారా?" అడిగాడు డీలర్ వాళ్ళని.

వాళ్ళిద్దరూ మౌనంగా టేబుల్ వంక చూసారు తప్ప జవాబు చెప్పలేదు.

"దీంట్లోకి ఇతరులని లాగకండి. ఫిర్యాదు చేయడానికి ఒకరు చాలు. నేను ఫిర్యాదు చేస్తున్నాను. పేక మార్చండి." గట్టిగా చెప్పాడు రఫెర్టీ

ఆకస్మాత్తుగా ఆ జూదగృహం యాజమాని అక్కడికి వచ్చాడు.

"ఏమిటి?" అడిగాడు అతను.

"నాకీ పేక ముక్కల మీద అనుమానంగా ఉంది." చెప్పాడు రఫెర్టీ.

"ఈ పేక బయటికి తీసి పది నిమిషాలే అయింది." చెప్పాడు డీలర్ చిరాగ్గా

"వాటిని బల్ల మీద పరు." చెప్పాడు యాజమాని.

డీలర్ వాటిని పరిచాడు.

"చూడండి. వీటి వెనకాల ఎలాంటి గుర్తులైనా ఉంటే మాకు చూపించండి." యజమాని నవ్వుతూ చెప్పాడు.

"పేక ముక్కల వెనకాల వాటిని గుర్తించటానికి మీరు ఏర్పాటు చేసుకున్న గుర్తులు గురించి నాకు తెలిస్తే ఇందాకే పట్టుకునేవాడిని." రఫెర్టీ కూడా నవ్వాడు.

"సరే. అలాగయితే కొత్త పేక తీస్తాం." చెప్పాడు యాజమాని.

"మీదా? అవన్నీ ఒకే పెట్టెలోంచి వస్తాయి కదా?" చురుగ్గా చూస్తూ చెప్పాడు రాఫెర్టి.

"అయితే మేమేం చేయగలం?"

అది కొత్తగా పెట్టిన కేసినో, అక్కడ గొడవ జరగడం మంచిది కాదు అని యజమానికి తెలుసు.

“ఇతను కొత్త పేక అడిగాడు. మీరు సరేనంటే ఇప్పుడు కాదంటున్నాడు. డబ్బు పోయిన బాధ వల్ల అనుకుంటాను ఈ వివాదం." చెప్పాడు డీలర్ యాజమానితో.

“తప్పకుండా కొత్త పేక కావాలి. కాని మీదగ్గర ఉన్నది మాత్రం కాదు. మేడ మీద నా గదిలో కొత్త పేక ఉంది. దాంతో ఆడదాం." రఫెర్టీ సూచించాడు.

“మా దగ్గర పేకలు మేం తయారు చేసినవి కావు. డజన్ల కొద్దీ ఒకేసారి కొన్నవి."

"నా దగ్గర ఉన్నవి కూడా బజారులో కొన్నవే. అది కూడా ఇదే బ్రాండ్ పేక." చెప్పాడు రఫెర్టీ.

“మీరు కొనడం నేను చూడలేదు. పైన గదిలో వాటిని మీరేం చేసారో మాకు తెలియదు." చెప్పాడు డీలర్ గట్టిగా,

"నోరు మూసుకో.” యాజమాని డీలర్ని కోప్పడ్డాడు.

“మీరు కింద గదిలో మీ పేకలని ఏం చేసారో నాకూ తెలియదు. నాకు తెలిసిందల్లా మీ పేకలో ఐదు సంఖ్య ముక్కలు అధికంగా ఉన్నాయని మాత్రమే."

"మిమ్మల్ని ఆడమని ఎవరూ అర్థించలేదు. మీకు ఇష్టం లేకపోతే ఆడనవసరం లేదు." డీలర్ కోపంగా చెప్పాడు.

"నోరు మూసుకోమని చెప్పాను." అరిచాడు యజమాని డీలర్ మీద కోపంగా.

అప్పటికే ఇతర టేబుల్స్ దగ్గర ఆడటం ఆపి ఐదారుగురు వాళ్ళ సంభాషణని ఆసక్తిగా వింటున్నారు. పరిస్థితి గమనించిన యజమాని రాఫెర్టిని ఆడిగాడు.

“మీకు మా పేక మీద బాగా అనుమానంగా ఉంది కదా?"

అవున్ననట్లుగా తలవూపాడు రఫెర్టీ.

“వరసగా రెండు వేల దాకా పోగొట్టుకున్నాను. ఎప్పుడూ ఇలా జరగలేదు." చెప్పాడు.

“చూడండి. ఇక్కడ మేం నీతిగా ఆడతాం. మా ఖాతాదారులకి అనుమానం రాకపోతేనే మేం దీన్ని ఎక్కువ కాలం నడపగలిగేది. మేం మోసం చేయలేదని మా కస్టమర్స్ కి ఋజువు చేయడానికి మేం ఏమయినా చేస్తాం." అందరూ వినేలా చెప్పాడు దాని యజమాని.

“కాని నా పేకతో ఆడరు కదా?” అడిగాడు రఫెర్టీ.

తల అడ్డంగా ఊపి చెప్పాడు బాస్.

"సారీ మిస్టర్. మీరు ఎక్కడ కొన్నారో, ఎప్పుడు కొన్నారో, ఆ తర్వాత వాటి మీద ఏమయినా గుర్తులు పెట్టారో, లేదో మాకు తెలియవు."

“సరే అయితే." రఫెర్టీ చెప్పాడు.

“ఏమిటి?" అడిగాడు యజమాని.

“సరే అయితే అన్నాను. మీరు చెప్పింది ఒప్పుకుంటాను. కాని కొత్త పేక ఇంకెక్కడా దొరకదా?”

"ప్రతీ ఖాతాదారు తను తెచ్చే పేకతోనో, కొత్త పేకతోనో ఆడాలంటే ఎలా?"

"నేను ప్రతీ ఖాతాదారుణ్ణి కాను. నా పేకతో ఆడనన్నారు. అది న్యాయమే. కాని మీ పేకతో ఆడమనటం కూడా న్యాయం కాదు. మీరు పేక కొనే చోట కాక ఇంకెక్కడయినా ఇప్పటికిప్పుడు ఓ పేక కొని తెచ్చి దాంతో ఆడదాం. ఇది చిన్న పరీక్ష అనుకోండి."

"అంటే?"

రఫెర్టీ జేబులోంచి ఓ డాలర్ నాణెం తీసి డీలర్కి ఇచ్చి చెప్పాడు.

‘‘బయట నించి కొత్త పేకని తెప్పించండి. దాంతో ఆడి చూద్దాం."

మిగిలిన కస్టమర్స్ అంతా తమ వంకే ఆసక్తిగా చూస్తూండటంతో యజమాని తీసుకు రమ్మనట్లుగా డీలర్ కి సౌంజ్ఞ చేసాడు. వెంటనే డీలర్ ఆ హోటల్ పక్కనే ఉన్న షాపులో పేకని కొని తెచ్చాడు. ఓ గుటక వేసి యజమాని అడిగాడు.

"ఒకవేళ మీకు అదృష్టం కలిసి వచ్చి గెలిస్తే?"
"అలాంటప్పుడు అదృష్టం నా పక్షం ఉంది అనుకుంటాను."
‘‘అప్పుడు అందరితో ఈ సంగతి చెప్పి మేం మోసం చేస్తున్నామని చెప్తారా?
‘‘మీరు మోసం చేయనప్పుడు అసలు ఈ ప్రశ్నే ఎందుకు?"
‘‘ఒకవేళ మీరు ఓడిపోతే?’’
‘‘గెలిచినా, ఓడినా సరే, అయిదారు ఆటలు తక్కువ ఆడను. సగటున ఎన్నిసార్లు గెలుస్తానో చూడాలి."

‘మేం నిజంగా మోసం చేస్తున్నామని మీరు కూడా అనుమానపడుతున్నారా?" అడిగాడు యజమాని తమ చుట్టు చేరిన ఇతర ఖాతాదారులని.

‘‘మీరు తెలివయిన వాళ్ళయితే, మీ దగ్గరున్న పేకతో ఆడితే, అతను ఒక్కసారి కూడా ఓడిపోకుండా కావాలని అతన్ని గెలిపిస్తారు. ఇప్పడా అవకాశం లేదు. ఇందాక ఒక్క ఆటలో కూడా అతను గెలవలేదు. ఇప్పుడు చూద్దాం ఏమవుతుందో." ఒకరు చెప్పారు.

‘‘పంచు." చెప్పాడు యజమాని.
డీలర్ ముక్కలు పంచాడు.

రఫెర్టీ దాదాపు గంటలో ఇరవై ఐదు ఆటల దాకా ఆడాడు. చుట్టుపక్కల వాళ్ళు తాము ఆడటం ఆపి అతని ఆటని విభ్రాంతిగా చూస్తూండిపోయారు.

రఫెర్టీ తను గెలుచుకున్న పద్దెనిమిది వేల డాలర్లతో గంట తర్వాత లేచి నిలబడ్డాడు.

"ఇప్పుడు మీకు మేం అన్యాయం చేయలేదని స్పష్టంగా తెలిసింది కదా?" కోపంగా అడిగాడు యజమాని.

తల ఊపాడు రఫెర్టీ
"మీరు నాకో డాలర్ ఇవ్వాలి." చెప్పాడు.
‘‘డాలరా?’’ అడిగాడు యజమాని.
‘‘అవును. ఇందాక పేకకి నేనే ఇచ్చాను. నిబంధనల ప్రకారం పేక ఖర్చు మీరే భరించాలి.’’
కోపాన్ని దిగమింగుకుని జేబులోంచి ఓ వెండి డాలర్ నాణెం తీసి రఫెర్టీకి అందించాడు యజమాని.

"ఇంకెప్పుడూ ఇక్కడికి రాకండి. మేం మోసగాళ్ళం కాము అని ఋజువు చేయడానికి మాకు చాలా ఖర్చయింది. డబ్బు గురించి కాదు నేను మాట్లాడేది. మేం మోసగాళ్ళం కాము అని నమ్మే వ్యక్తులే ఇక్కడికి రావాలి కాని మీలాంటి వారు కారు." చెప్పాడు యజమాని.

"ఇంకెప్పడూ వస్తానని భయపడకండి. మరోసారి నాకు ఇలాంటి అదృష్టం తగలక పోవచ్చు. అంతే కాదు. ఈ డీలర్ చేతుల్లో ఏదో మాయ ఉందని నా అనుమానం. ఇందాక పేక కొనడానికి వెళ్ళినప్పుడు నేను కూడా ఇతని వెంట వెళ్ళి ఉండాల్సింది." నవ్వాడు రఫెర్టీ.

‘‘అంటే నేను పేక కొనలేదని మీ అనుమానమా?" కోపంగా అరిచాడు డీలర్.
"నాకా అనుమానం లేదు." నవ్వాడు రఫెర్టీ.
"కాని మీరు కొన్న పేక తీసుకువచ్చారో లేక మధ్యలో అది మార్చేసి మీ పేక తెచ్చారో..."
"గెటౌట్. మా మీద నమ్మకం లేని మీరు ఇంకెప్పుడూ ఇక్కడికి రావద్దు. గెటౌట్." అరిచాడు యజమాని ఉగ్రంగా,
‘‘అలాగే.’’

రఫెర్టీ లేచి మేడ మీది గదిలోకి వెళ్ళాడు. తను సంపాదించిన డబ్బు చూసుకుని నవ్వుకున్నాడు.

తన పెట్టెలోని ఓ పేక ముక్కని తీసి తన కళ్ళజోడులోంచి చూసాడు.

‘‘ఇస్పేట్ ఆరు.’’ అని ముక్కని వెనక్కి తిప్పి చూసాడు.

అది నిజంగా ఇస్పేట్ ఆరు!

"డైమండ్ రాణి." అని మళ్ళీ ముక్కని వెనక్కి తిప్పి చూసాడు.

అది నిజంగా డైమండ్ రాణి!

అయిదు నిమిషాల్లో సామాను సరుకుని గది ఖాళీ చేసి కిందకి వచ్చాడు.

ఆ హోటల్ పక్కనే ఉన్న షాపులోకి వెళ్ళాడు. ఆ షాపులోని సేల్స్ గర్ల్ రాఫెర్టిని చూసి పలకరింపుగా నవ్వింది.

"మీరు కోరినట్లుగా హోటల్లోని వాండర్ లస్ట్ నించి వచ్చిన డీలర్కి మీరిచ్చిన పేకనే అమ్మాను." చెయ్యి చాపి చెప్పింది.

వెంటనే రఫెర్టీ పర్స్ తెరచి ఆ సేల్స్ గర్ల్ కి వంద డాలర్ల నోటు ఇచ్చి చెప్పాడు.

‘‘నువ్వు చాలా మంచిదానివి."

రఫెర్టీ సూట్ కేస్ ఎవరయినా వెదికితే కేవలం ఆ కళ్ళజోడులోంచి మాత్రమే కనబడేలా రాసే మాయ ఇంకు గల ఓ బాటిల్, ఓ కొత్త పేక, సన్నటి ఓ ఆర్టిస్ట్ పెన్ కనబడేవి.

రఫెర్టీ నిదానంగా మరో జూదగృహానికి బయలుదేరాడు.

---

## పధ్నాలుగు నిమిషాలు - ఎల్లరీ క్వీన్

డోర్ బెల్ శబ్దం విని డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఎల్లరీ క్వీన్ తన అపార్ట్మెంట్ తలుపు తెరిచాడు. ఎదురుగా నిలబడి ఉన్న 38-23-36 కొలతలు గల ఎర్ర జుట్టు అమ్మాయి వంక ఆసక్తిగా చూసాడు.

"మిస్టర్ క్వీన్?" అడిగిందామె.

‘‘అవును. లోపలికి రండి.’’

ఆమె తన వెనకే లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాక అడిగాడు ఎల్లరీ క్వీన్.

"నేను మీకేం సహాయం చేయాలో చెప్పండి."

"నా పేరు ఎడ్డీ బరోస్. నాకో సమస్య వచ్చి పడింది." చెప్పిందామె.

‘‘సమస్యలు ఎవరికి లేవు? నా సమస్య బట్లర్. నిన్ననే నా బట్లర్ పని మానేసి వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇంకొకరి కోసం వెతకాలి." నవ్వుతూ చెప్పాడు క్వీన్.

"చిత్రంగా నా సమస్యా బట్లరే. నిజానికి ఇద్దరు బట్లర్లు. మీరెప్పుడైనా బట్లర్స్ క్లబ్ గురించి విన్నారా?" ప్రశ్నించింది ఎడ్డీ.

‘‘బట్లర్స్ క్లబ్? వినలేదు."

‘‘పంతొమ్మిది వందల ఇరవైలలో ధనవంతులంతా తమ ఇళ్ళల్లో బట్లర్లని నియమించు కోవడం ఫేషన్ గా ఉండేది. కాని ఈ నలభై ఏళ్ళల్లో ఆ ఫేషన్ సమసిపోయింది. అప్పట్లో బట్లర్లంతా వారం, పది రోజులకోసారి కలిసి తమ యజమానుల రహస్యాల గురించి గాసిప్ మాట్లాడుకునేవారు. ఓ రోజు పీటర్ బరోస్ అనే బట్లర్కి ఓ ఆలోచన వచ్చింది. ఆ ప్రకారం న్యూయార్క్ లోని ముప్పై మంది బట్లర్లు కలిసి ఓ క్లబ్ గా ఏర్పడ్డారు. ధనవంతులైన తమ యజమానులు ఏ షేర్లలో పెట్టుబడి పెడుతున్నారో రహస్యంగా తెలుసుకుని, అంతా తలో కాస్త

వేసుకుని అవే షేర్లలో పెట్టుబడి పెట్టి, మళ్ళీ వాళ్ళు అమ్మినప్పుడు అమ్మసాగారు. ఇలా నాలుగైదు ఏళ్ళు గడిచేసరికి బట్లర్స్ క్లబ్ కి బాగా లాభాలు వచ్చాయి. దాంతో వారు ఫిఫ్త్ అవెన్యూలో ఓ బ్రౌన్ స్టోన్ భవంతిని నిర్మించారు. 1939లో వచ్చిన గ్రేట్ అమెరికన్ డిప్రెషన్ వల్ల చాలామంది ధనవంతులు బీదవారైపోయారు. దాంతో బట్లర్ల ఉద్యోగాలు ఊడాయి. ముప్పై మంది బట్లర్స్ క్లబ్ కాస్తా కేవలం డజను బట్లర్ల సభ్యత్వానికి దిగజారింది."

ఆమె చెప్పేది క్వీన్ శ్రద్ధగా వింటూ, కాఫీ పెర్కొలేటర్లోంచి కాఫీని రెండు కప్పుల్లోకి ఒంచి ఒకటి ఎడ్డీ బరోస్ ముందు ఉంచాడు.

"చివరికి ఆ డజను బట్లర్లే ఆ ఇంటికి వారసులయ్యారు. ఆ బిల్డింగ్ విలువ పంతొమ్మిది వందల యాభైల కల్లా మూడు లక్షల డాలర్లకి చేరుకుంది. వారిలో ఎవరికి ఆ బిల్డింగ్ ని అమ్మాలని లేదు. రిటైరైన బట్లర్లంతా అందులోనే ఉండేవారు. చివరికి వారంతా ఓ అంగీకారానికి వచ్చారు. ఆ డజను మందిలో ఎవరు ఆఖరికి మిగులుతారో వారి వారసులకి ఆ భవంతి చెందాలన్నది ఆ అంగీకారం."

"టోన్ టైన్ అగ్రిమెంట్ అంటారు దాన్ని బట్లర్లు ఇంత తెలివి గలవారని నాకు తెలియదు." ఆశ్చర్యంగా చెప్పాడు క్వీన్.

"అవును. ఈ రోజుకి ఆ బట్లర్లలో కేవలం ఇద్దరే మిగిలారు. ఒకరు విలియం జార్వీస్. మరొకరు పీటర్ బరోస్. బట్లర్స్ క్లబ్ స్థాపించాలనే ఆలోచన చేసిన పీటర్ బరోస్ మా తాతయ్య."

"ఓ"

"బట్లర్స్ క్లబ్ బైలాస్ ప్రకారం బట్లర్లు ఆ భవంతిలోనే నివసించాలి. లేదంటే వారు సభ్యత్వం కోల్పోతారు. కాబట్టి వారిద్దరూ ఆ భవంతిలోనే నివసిస్తున్నారు. మిగిలిన వాళ్ళు కూడా ఆ భవంతిలో జీవిస్తూనే మరణించారు."

"మీ సమస్య ఏమిటో నాకు అర్థం కాలేదు." అడిగాడు క్వీన్.

కాఫీ ఓ గుక్క తాగి, దాన్ని బాగా చేసినందుకు క్వీన్ వంక మెచ్చుకోలుగా చూసింది ఎడ్డీ బరోస్.

''ఇంతదాకా మీకు చెప్పింది నేపథ్యం మాత్రమే. నేను నిన్న మా తాతయ్య పీటర్ బరోస్ని చూడటానికి వారు ఉండే బిల్డింగ్ కి రాత్రి ఏడు గంటలకు వెళ్ళాను. విలియం జార్వీస్, ఆయన మాటలు వీధిలోకే గట్టిగా వినిపిస్తున్నాయి."

''ఏమని మాట్లాడుకున్నారు?"

"వారిద్దరి వయసు ఎనభై పైనే. వారిద్దరూ ఒకరినొకరు నిందించుకుంటున్నారు. నన్ను చంపి నువ్వు జీవించి ఉండే ఆఖరి బట్లర్ అయి, ఈ బిల్డింగ్ని కొట్టేసి నీ మనవరాలికి ఇద్దామని అనుకుంటున్నావు' అని జార్వీస్ మా తాతయ్యని తిట్టాడు. నేను కాదు. ఆ ఆలోచన నువ్వే చేస్తున్నావు. నీ మనవడు బెంజిల్ జార్వీస్ అంటే నీకు ప్రేమ. నువ్వే నన్ను చంపి దీన్ని వాడికి ఇవ్వాలని అనుకుంటున్నావు." అని మా తాతయ్య బదులుగా అరిచారు. నేను లోపలకి వెళ్ళేటప్పటికి ఆ ఇద్దరూ ఒకరి మీదకి మరొకరు ఎగబడి పోట్లాడుకుంటూ కనిపించారు. నేను బెంజిల్ తో కలిసి వాళ్ళిద్దర్నీ విడదీసాను. ప్రతీ వారం నేను మా తాతయ్యను చూడటానికి వెళ్ళినప్పుడే, జార్వీస్ మనవడు బెంజిల్ కూడా నా వెంట వస్తూంటాడు."

''తరువాత?" ఆసక్తిగా ప్రశ్నించాడు క్వీన్.

"మేమిద్దరం వాళ్ళిద్దరిని వాళ్ళ గదుల్లోకి తీసికెళ్ళి శాంతిగా బతకమని హితవు చెప్పాం. వాళ్ళు మళ్ళీ గదుల్లోంచి బయటికి వచ్చి పోట్లాడుకోకుండా రేపు ఉదయం దాకా వాళ్ళ గదులకి తాళాలు వేయాలని అనుకున్నాను కాని బెంజిల్ వద్దన్నాడు."

‘‘అతని వయసు ఎంత?’’

"నాకన్నా రెండేళ్ళు పెద్ద" ఎడ్డీ బరోస్ చెప్పింది.

ఇన్ స్పెక్టర్ ఎల్లరి క్వీన్ కి ఆమెకు తనతో ఏం అవసరం వచ్చిందో ఇంకా బోధపడక పోవటంతో అడిగాడు.

‘‘నన్నేం చేయమంటారు?"

‘‘ఎంచేతో ఆ ముసలివాళ్ళు ఇద్దరూ ఎవరికి వారు రెండో వాళ్ళు తనని హత్య చేసి, ఆ బిల్డింగ్ కి సంపూర్ణ వారసులు అవాలని అనుకుంటున్నారనే భ్రమలో పడ్డారు. మేం ఇద్దరం ఎంత చెప్పినా వాళ్ళు తమ అభిప్రాయాలను మార్చుకోవడం లేదు. కాబట్టి మీరు మీ యూనిఫాంలో వాళ్ళ దగ్గరకి వచ్చి, వారిద్దరిలో ఎవరు హత్య చేయబడ్డా మరొకరిని తక్షణం అరెస్ట్ చేసి మరణశిక్ష పడేలా చేస్తానని బెదిరించాలి. దాంతో వారు ఒకరి మీద మరొకరు భౌతిక దాడులని చేయరు."

క్వీన్ అంగీకారంగా తల ఊపి చెప్పాడు.

‘‘అలాగే. ఎప్పుడు వెళదాం?’’

"మీకు తీరిక ఉంటే ఇప్పుడే వెళదాం మిస్టర్ క్వీన్."

‘‘అలాగే. ఓ నేరం జరగబోతోందని తెలిసినప్పుడు, అది జరగకుండా అడ్డుకోవడం నా కర్తవ్యం కూడా."

"మీ అనుమతితో బెంజిల్ ని కూడా అక్కడికి వెంటనే రమ్మని చెప్తాను."

‘‘ఆల్రైట్. ఇప్పుడు టైం సరిగ్గా ఏడు యాభై ఒకటి అయ్యింది. మనం అక్కడికి ఇంకో ఇరవై నిమిషాల్లో చేరుకుంటామని చెప్పు.’’

క్వీన్ అనుమతితో ఎడ్డీ బరోస్ అతని ఆఫీసునించి బెంజిల్ జార్వీస్ కి ఫోన్ చేసి ఆ విషయం చెప్పింది. క్వీన్ కారులో ఇద్దరూ ఫిఫ్త్ అవెన్యూకి బయలుదేరారు.

న్యూయార్క్ లోని ఖరీదైన ప్రాంతమైన ఫిఫ్త్ అవెన్యూలో బట్లర్స్ క్లబ్ భవంతి ముందు ఆగి ఉన్న కారుని, అందులోంచి దిగుతున్న యువకుడిని చూసి అడిగాడు క్వీన్.
"అతనేనా బెంజిల్?"
"అవును." ఎడ్డీ బరోస్ జవాబు చెప్పింది.

అతని కారు పక్కనే తన కారుని ఆపాడు క్వీన్. ఇద్దరూ కారులోంచి దిగారు. క్వీన్ గోధుమ రంగు రాతితో కట్టబడ్డ ఆ భవంతి వంక చూసి చిన్నగా ఈల వేసి చెప్పాడు.

మీ ఇద్దరిలో ఎవరు దీనికి వారసులవుతారో కాని, దీని ఖరీదు ఏభై లక్షల డాలర్లకి తక్కువ చేయదు."

ముగ్గురూ ఆ భవంతి గేటు వైపు నడిచారు. లోపలనించి మోగే గడియారం అలారం బెల్ బయటికి వినబడుతోంది.

"ఇద్దరికీ చెవుడా? ఎవరూ దాన్ని ఆఫ్ చెయ్యరే?" చేతి గడియారం వంక చూసుకుంటూ అడిగాడు క్వీన్.

"వాళ్ళిద్దరికి చెవుడు లేదు." చెప్పాడు జార్విస్.
తలుపుకి కట్టిన పాత ఫేషన్ గంటని కొట్టింది ఎడ్డీ. ఎవరూ తలుపు తీయలేదు.
"ఏమిటింత సేపు చేస్తున్నారు? ఇదివరకు వెంటనే తలుపు తీసేవారు." జార్విస్ అసహనంగా చెప్పాడు.

క్వీన్ తన జేబులోంచి వృత్తిరీత్యా ఉపయోగించే తాళంచెవుల గుత్తి తీసి క్షణాల్లో ఆ ఇంటి తాళం విజయవంతంగా తెరిచాడు. తలుపు తీసుకుని ముగ్గురూ లోపలికి వెళ్ళారు.

అలారం బెల్ పై నించి వినిపిస్తూండటంతో క్వీన్ చకచక మెట్లు ఎక్కి పైకి వెళ్ళి మెట్ల ఎదురుగా ఉన్న గది తలుపుని తోసాడు. వెంటనే అది తెరచుకుంది.

ఎదురుగా మంచం మీద ఓ ముసలాయన పడుకుని ఉన్నాడు. అతని చెంపల మీద ఎవరో గిచ్చినట్లుగా రక్తపు చారలు కన్పిస్తున్నాయి. ఎడ్డీ మంచం పక్కనే ఉన్న చెక్క బల్ల మీద ఉన్న ఓ పాత కాలపు గడియారం ఆఫ్ చేసి బాధగా చెప్పింది.

"ఈయన మా తాతగారు పీటర్ బరోస్. చూస్తూంటే ఈయన ప్రాణాలతో ఉన్నట్లుగా తోచడం లేదు."

క్వీన్ అతని నాడి చూసి పెదవి విరిచాడు.

"సారీ. పోయారు."

"అయ్యాయ్యో!" ఎడ్డీ బాధగా చెప్పింది.

"పోస్ట్ మార్టం లో ఈయన నిన్న రాత్రి పోయారని తేలుతుంది. కనీసం పది గంటలు దాటుతుంది ఈయన పోయి." శవాన్ని పరీక్షగా చూసి చెప్పాడు క్వీన్.

"మై కండోలెన్సెస్ టు యు." చెప్పాడు బెంజిల్ ఎడ్డీతో,

"థాంక్స్. విలియం జార్వీస్ మా తాతయ్యని చంపాడంటారా?" అడిగింది ఎడ్డీ

"కాకపోవచ్చు చెంపల మీద ఆ గాయాలు గోళ్ళతో గీకడం వల్ల మాత్రమే అయినవి. వెళ్ళి మా తాతగారినే ఏం జరిగిందో అడుగుదాం." చెప్పాడు బెంజిల్

అంతా మెట్లు దిగి కిందకి వచ్చారు. బెంజిల్ ఓ తలుపు దగ్గరకి వెళ్ళి దాన్ని తెరిచాడు. ఆ గదిలో విలియం జార్వీస్ నేల మీద పడి ఉన్నాడు. అతని మోచేతుల మీద కూడా గిచ్చగా కారిన రక్తపు మరకలు కనిపించాయి.

ఎడ్డీ వెంటనే చిన్నగా కేక పెట్టింది. బెంజిల్ ఓ అడుగు వెనక్కి వేసాడు. క్వీన్ మాత్రం విలియం శవం దగ్గరకి వెళ్ళి ఒంగి అతని నాడిని కూడా పరిశీలించి చెప్పాడు.

"ఇతను పోయి కూడా దాదాపు పది గంటలు దాటుతుంది. విలియం మరణించిన టైంని సరిగ్గా చెప్పగలను. నిన్న రాత్రి ఏడు నలభై ఆరుకి పోయాడు."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు?" ఎడ్డీ ఆశ్చర్యంగా అడిగింది.

క్వీన్ వెంటనే గోడకి ఉన్న ఎలక్ట్రిక్ గడియారాన్ని చూపించాడు. దానికున్న వైర్ తెగి కింద పడి ఉంది.

‘‘జరిగింది నేను కొంత ఊహించగలను. నిన్న రాత్రి మీరు ఇద్దరూ వెళ్ళాక పీటర్ పైనించి కిందికి ఈ గదిలోకి వచ్చాడు. మరోసారి ఇద్దరూ ఇక్కడ ఒకరితో మరొకరు కలియబడ్డారు. తర్వాత పీటర్ పైకి వెళ్ళి తన మంచం మీద పడుకున్నాడు. విలియం ఒంటి మీద దుస్తులను చూడండి. వాకింగ్ కోసమో, మరి దేనికోసమో అతను బయటికి వెళ్ళాలనుకుని దుస్తులు మార్చుకున్నాడు. బయటికి వస్తూ ఈ గోడ దాకా వచ్చాక గుండె ఆగి మరణించి ఉంటాడు. అతను ఎలక్ట్రిక్ క్లాక్ వైర్ మీద పడటంతో అది గడియారం నించి ఊడిపోయి ఆగిపోయింది. అందువల్ల ఆ గడియారం ఏడూ నలభై ఆరు దగ్గర ఆగిపోయింది. బయటికి వెళ్ళే ఉద్దేశం లేని పీటర్ నైట్ డ్రస్ లోనే ఉన్నాడు. అతను మంచం మీద పడుకున్నవాడు పడుకున్నట్లుగానే పోయాడు. ఇద్దరూ ఒకరితో ఒకరు కలియబడటం వల్ల ఏర్పడ్డ మానసిక, శారీరక ఒత్తిళ్ళ వల్ల గుండె ఆగి మరణించి ఉంటారు. పోస్ట్ మార్టం రిపోర్టులో నేను చెప్పిందే వస్తుందని పందెం."

"అది సరే. కాని వీరిద్దరిలో ముందుగా ఎవరు పోయారన్నది ఎలా తెలుసుకోవడం?" అడిగాడు బెంజిల్ సందిగ్ధంగా,

‘‘అవును ఇన్ స్పెక్టర్ క్వీన్. దాన్ని బట్టే ఈ భవంతి మా ఇద్దరిలో ఎవరికి చెందుతుంది అన్నది తెలుసుకోగలం." చెప్పింది ఎడ్డీ కూడా.

క్వీన్ చిన్న నవ్వి చెప్పాడు.

"ముందుగా విలియమే పోయాడని స్పష్టమైన సాక్ష్యం కనబడుతోందిగా?

" ఆ యువతీయువకులు ఇద్దరూ ఒకరి మొహాల్లోకి మరొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు. వాళ్ళకి తను చెప్పేది అర్థం కాలేదని క్వీన్ కి బోధపడింది.

"మా తాతగారు ముందుగా పోయారా? ఎలా కనుకున్నారు?" అడిగాడు బెంజిల్.

"ఆగి పోయిన గడియారాన్ని బట్టి."
"అది కరెక్టే. కాని పీటర్ బరోస్ అంతకు ముందుగానే పోయి ఉండొచ్చుగా?"

"మీకు, నాకు అక్కడే తేడా. చూసింది, విన్నది మేం అర్థం చేసుకున్నంత తేలికగా మీరు అర్థం చేసుకోలేరు. మనం ఈ బిల్డింగ్లోకి వస్తూండగా గడియారం అలారం మోగిన శబ్దం వినిపించింది కదా?"

"అవును?"

"అది ఎనిమిదికి మోగేలా పీటర్ నిన్న రాత్రి ఆలారం పెట్టుకుని ఉంటాడు. నిన్న రాత్రి ఎనిమిది తర్వాత అలారం పెడితేసే, ఇవ్వాళ ఉదయం ఎనిమిదికి అది మోగుతుంది.

ఒకవేళ ఎనిమిది లోపు దాని అలారం సెట్ చేస్తే, అది నిన్న రాత్రి ఎనిమిదికే మోగుతుంది తప్ప ఇవాళ ఉదయం మోగదు. ఈ బిల్డింగ్ లో వీరు ఇద్దరూ తప్ప ఇంకో వ్యక్తి లేరు కనుక నిన్న రాత్రి పీటర్ ఎనిమిది దాకా బతికే ఉన్నాడు. ఏడు నలభై ఆరుకి విలియం మరణించాడు. వారిద్దరి మరణానికి మధ్య కనీసం పధ్నాలుగు నిమిషాల వ్యవధి ఉండి ఉండాలి."

"కంగ్రాట్స్. నువ్వు కోటీశ్వరురాలివి ఐనందుకు." చెప్పాడు బెంజిల్ ఎడ్డీతో,
"థాంక్స్ బెంజిల్ వారం క్రితం కదా నువ్వు నన్ను వివాహం చేసుకోమని అడిగింది?"
ప్రశ్నించింది ఎడ్డీ.
"అవును. వారం ఆగి సమాధానం చెప్తానన్నావు."
"సరే. ఇప్పుడు చెప్తున్నాను విను. నేను అందుకు అంగీకరిస్తున్నాను."
"థాంక్స్."
ఎడ్డీని దగ్గరకి తీసుకుని బెంజిల్ ముద్దు పెట్టుకుంటూంటే క్వీన్ బయటికి నడిచాడు.

వాళ్ళు తనకి థాంక్స్ చెప్పలేదని అతను బాధపడలేదు. ఓ పెళ్ళి భోజనం, థాంక్స్ చెప్పడం కన్నా రుచికరంగా ఉంటుందని అనుకుంటూ తన కారుని స్టార్ట్ చేసాడు ఇన్ స్పెక్టర్ ఎల్లరీ క్వీన్.

---

## ఆకాశరామన్న - జాన్ లట్జ్

ఎర్నెస్ట్ స్ట్రీకర్ తన అపార్ట్మెంట్ మేడ మీదకి చెక్క మెట్ల మీదుగా ఎక్కాడు. అప్పటికే చీకట్లు కమ్ముతున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు తళుక్కుమంటున్నాయి.

ఎర్నెస్ట్ ఓ శక్తివంతమైన టెలిస్కోప్ ని మూడు కాళ్ళ త్రిపాడ్ మీద బిగించాడు. దాదాపు రెండు నెలల క్రితం ఆకాశంలోని నక్షత్రాల గురించి వివరించే ఆ పుస్తకాన్ని కొన్నాడు. ఇరవై అంతస్థుల ఎత్తుండే ఆ స్కై స్కేపర్ మీదికి ఎక్కి టెలిస్కోప్ లోనుంచి నక్షత్రాలని చూస్తూ స్ట్రీకర్ సాయంత్రాలు కాలం గడుపుతున్నాడు.

ఆ టెలిస్కోప్ కి ఉపయోగించే లెన్స్ ని హేన్స్ ఫింగర్స్ అనే అతని చేత ఎక్కువ దూరం కనబడటానికి అనువుగా చక్కగా పాలిష్ చేయించాడు. న్యూయార్క్ నగరంలోని ఆ ప్రాంతంలో టెలిస్కోప్ లు, వాటి లెన్స్ లు తయారు చేయడంలో హేన్స్ ఫింగర్స్ మంచి అనుభవజ్ఞుడు.

ఆ రోజు చాలా కాకతాళీయంగా ఎరెస్ట్ స్ట్రీకర్ తన టెలిస్కోప్ ని కొద్దిగా కిందికి తిప్పి చూసాడు.

కొద్ది దూరంలో ఉన్న ఓ ఇంటి కిటికీ అతనికి కనబడింది. స్పష్టంగా కనబడక పోవటంతో స్టీకర్ జేబులోంచి మృదువయిన ఓ బట్ట తీసి అందులో చుట్టబడి ఉన్న పద్దెనిమిది మిల్లీ మీటర్ల లెన్స్ ని తీసి టెలిస్కోప్ లో అమర్చాడు. అంతకు ముందు అందులో ఉన్న ఆరు మిల్లీ మీటర్ల లెన్స్ తీసి ఆ బట్టలో జాగ్రత్తగా చుట్టి దాన్ని జేబులో భద్రపరిచాడు.
అంతకు ముందు అస్పష్టంగా కనబడ్డ వస్తువు ఈసారి స్పష్టంగా కనబడింది.
ఆ వస్తువు ఆడది.

స్ట్రీకర్ ఆ గదిలోనే ఉండి ఆమెని ఆమె ముందు కూర్చుని చూస్తున్నంత దగ్గరగా చూడగలుగుతున్నాడు. కాని ఆ సంగతి ఆమెకు తెలియదు. ఎరెస్ట్ స్ట్రీకర్ కి తన శక్తికి ఎంతో గర్వం వేసింది. తను దాదాపుగా దేవుడు లాంటివాడు అనుకున్నాడు.

ఆమెని మరింత పరీక్షగా చూసాడు. పాతికేళ్ళు ఉంటాయి. గోధుమ రంగు జుట్టు. ఆమె కదలకుండా కుర్చీలో కూర్చుని ఒక వైపు చూస్తూ మధ్య మధ్యలో నవ్వుతోంది. టెలివిజన్ చూస్తోందని అనుకున్నాడు. నెమ్మదిగా టెలిసోప్ ని పక్కకి తిప్పాడు. అదే అంతస్తులో ఉన్న కిటికీలలో ఒకటి చీకటిగా ఉంది. ఇంకో దానికి తెర వేసి ఉంది. ఆ తర్వాతి కిటికీలో వాదించుకుంటున్న భార్యాభర్తలు కనబడ్డారు.

ఇద్దరూ మధ్య వయస్కులే. అతనికి అప్పుడే బట్టతల ప్రారంభమయింది. తలనొప్పి వచ్చినట్లుగా తలని రెండు చేతులతో పట్టుకుని ఉన్నాడు అతను. ఆమె అతన్ని తిడుతోంది. అతను మధ్య మధ్యలో తల అడ్డంగా తిప్పుతూ మౌనంగా కూర్చుని ఉన్నాడు. కదిలే ఆమె పెదవులు ఎర్నెస్ట్ కి స్పష్టంగా కనబడుతున్నాయి. వాటిని చదివే విద్య కూడా తనకి తెలిసి ఉంటే సన్నివేశం అర్థమయి ఉండేది అనుకున్నాడు ఎర్నెస్ట్. అతన్ని చూస్తే జాలి, ఆమె మీద కోపం ముంచుకు వచ్చాయి.

కొన్ని నిమిషాల్లో వాళ్ళ మీద ఉత్సాహం తగ్గిపోయింది. మిగతా కిటికీలు చూసాడు. ఓ కిటికీలో ఓ ముసలావిడ ఒక చిన్న పిల్లవాడిని నిద్ర పుచ్చుతోంది. ఒకతను టెలిఫోన్లో మాట్లాడుతున్నాడు. ఇంకో ఇంట్లో అతని చేతికున్న వజ్రపుటుంగరం తళుక్కుమంది. మరో ఇంట్లో నలుగురు కూర్చుని బ్రిడ్జి ఆట అడుకుంటున్నారు. మిగతా కిటికీలన్నీ చీకటిగా ఉండటమో, తెరలు వేసి ఉండటమో, లేదా ఖాళీగా ఉండటమో అవటం వల్ల మళ్ళీ మొదటి కిటికీ వైపుకి తిప్పాడు టెలిస్కోప్ ని.

ఇందాక ఆమె కూర్చున్న సోఫా ఇప్పుడు ఖాళీగా ఉంది. టెలిస్కోప్ ని పక్కకి తిప్పబోతూండగా ఆమె మళ్ళీ కనబడింది. సోఫాలో కూర్చుని మళ్ళీ టి.వి. చూడసాగింది.

కొన్ని క్షణాలు తర్వాత లేచి అవతలకి వెళ్ళి, ఓ మగవాడితో తిరిగి వచ్చింది. అతని కుడి చెయ్యి ఆమె నడుం చుట్టు ఉంది. ఇద్దరు నవ్వుతున్నారు. అతను ఆమెని దగ్గరకి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. 89 పద్ధతిని బట్టి అతను ఆమె భర్త అని గ్రహించాడు ఎర్నెస్ట్.

సోఫా మీద కూర్చున్నాడు అతను. ఆమె లోపలికి వెళ్ళి కాఫీ కప్పుతో తిరిగి వచ్చింది. ఓ ఐదు నిమిషాలు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అతను లేచి నిలబడితే ఆమె అతని కోటు విప్పింది. లైటు ఆర్పి ఇద్దరూ లోపలకి వెళ్ళిపోయారు. భోజనం చేయడానికి అనుకున్నాడు ఎర్నెస్ట్.

మరో గంట సేపు ఎర్నెస్ట్ కిటికీకి తెరలు వేసుకోని వాళ్ళని చూస్తూ గడిపాడు. వాళ్ళ ఇళ్ళలో తనూ వాళ్ళ మధ్య రహస్యంగా ఉన్నట్లుగా, వాళ్ళ జీవితాలలో ఓ రహస్య భాగంగా మారినట్లుగా ఫీలయ్యాడు ఎర్నెస్ట్ స్ట్రీకర్,

అంతసేపు టెలిస్కోప్ లోంచి చూసినందుకు కళ్ళు మండసాగాయి. అన్ని కిటికీల్లో లైట్లు ఆరిపోయాక సిగరెట్ అంటించి వెల్లకిల్లా పడుకుని నక్షత్రాల వంక చూస్తుండిపోయాడు.

ఇంకా ఇతర భవనాలున్నా ప్రతీ రాత్రి స్ట్రీకర్ మొదట తను చూసిన భవనంలో వ్యక్తులనే రహస్యంగా గమనించసాగాడు. తనకి పూర్తిగా కొత్తవాళ్ళయిన ఆ మనుష్యులని టెలిసోప్ ద్వారా కొన్ని వారాలపాటు చూస్తూండటంతో వాళ్ళ గురించిన అనేక విశేషాలు అతనికి తెలిసాయి. అది అతనికి ఎంతో సరదాగా ఉంది.

అందరి కన్నా గోధుమరంగు జుట్టు గల అమ్మాయిని అధికంగా చూడసాగాడు. కారణం ఆమె సోఫాలో కూర్చుని పుస్తకం చదువు కోవడమో, టి.వి. చూడటమో చేస్తూంటుంది. అధిక భాగం ఆ గదిలోనే గడుపుతుంది. ఆమె చదివేటప్పుడు పెదవులు కదుపుతూ చదవటాన్ని చూసి నవ్వుకునేవాడు.

ఓ రాత్రి ఆమెని చూస్తూండగా ఆమె చిన్నగా ఉలిక్కిపడి ఆ పుస్తకం పక్కన పడేసి లేచి బయటికి వెళ్ళడం చూసాడు. డోర్ బెల్ మోగింది అనుకున్నాడు ఎర్నెస్ట్. చాలా రోజుల నించి కనపడకపోవటం వల్ల వచ్చింది ఆఫీసు కేంప్ నించి తిరిగి వచ్చిన ఆమె భర్త అయి ఉంటాడనుకున్నాడు ఎర్నెస్ట్. కాని వచ్చింది ఆమె భర్త కాదు.

నల్లటి జుట్టు గల మరొకతను. అతని చేతి వేలికి ఉన్న వజ్రపుటుంగరం తళుక్కున మెరిసింది. అతను కింది అంతస్తులో ఉండే అతనుగా ఎర్నెస్ట్ పోల్చుకున్నాడు. అతని చేతులు ఆమె నడుం చుట్టు బిగుసుకుంటూంటే ఆమె అతన్ని గాఢంగా ముద్దు పెట్టుకుంది.

అంతే కాదు. అంతకు మునుపెన్నడు ఆమె తన భర్తని ముద్దు పెట్టుకోని విధంగా అతన్ని ముద్దు పెట్టుకుంది. ఇద్దరూ మరో గదిలోకి వెళ్ళారు. సోఫా గదిలో లైటు చాలా సేపు వెలుగుతూనే ఉంది కాని ఆ గదిలోకి మళ్ళీ వారిద్దరూ రాలేదు. ఎర్నెస్ట్ కి వాళ్ళంటే ఆసక్తి పెరిగింది. రోజూ ఆమెని జాగ్రత్తగా గమనించసాగాడు. అతను తరుచూ వస్తున్నాడు.

ఓ రోజు ఉదయం ఆ బిల్డింగ్ దగ్గరకి వెళ్ళి అపార్ట్మెంట్స్ లో ఉన్న వాళ్ళ పేర్లు, అపార్ట్ మెంట్స్ నంబర్లు, లిఫ్ట్ దగ్గర ఉన్న బోర్డులో చదివి తెలుసుకున్నాడు. ఆ బిల్డింగ్ పేరు గ్రాహం క్రెస్ట్ అపార్ట్మెంట్స్ అని కూడా తెలుసుకున్నాడు. గోధుమరంగు జుట్టు గల ఆమె పేరు వెరా రోలేండ్ వజ్రపుటుంగరం పెట్టుకున్న ఆ నల్ల జుట్టు గల, ఆమె రహస్య ప్రేమికుడైన ఆ వ్యక్తి పేరు సేమ్ రికో,

మధ్య వయస్కులైన, ఎప్పుడూ వాదించుకునే ఆ దంపతుల పేర్లు క్లైవ్ హోగాన్, ఇర్నా హోగాన్.

* * *

ఎర్నెస్ట్ ఆ రాత్రి మొదట సేమ్ రికో కిటికీ వంక చూసాడు. దీపం వెలగటం లేదు. బహుశా వెరా రొలేండ్ ఇంట్లో ఉండి ఉంటాడు. టెలిస్కోప్ ని రొలేండ్ అపార్ట్మెంట్ కిటికి వైపు తిప్పాడు.

నిజమే.

ఆమె కిటికీ వైపు వీపు ఉంచి నిలుచుని ఉంది. ఆమె నడుం చుట్టూ చేతులు ఉన్నాయి. అవి మొగవాళ్ళ చేతులు. ఒకరి కౌగిలిలో ఇంకొకరు తన్మయత్వంగా ఉన్నట్లుగా ఎర్నెస్ట్ కి అనిపించింది. కాని అదేమిటో ఆ మగవాడిని చూసే దాకా అంతుపట్టలేదు.

కౌగిలిలోంచి ఇద్దరూ బయటపడ్డారు.

సేమ్ రికో కాదు అతను!

అతని చేతికి మెరిసే వజ్రపుటుంగరం లేదు.

అతను క్లైడ్ హోగాన్ ఎప్పుడు పోట్లాడుకునే దంపతులలో ఒకరు!

ఛ! ఆమె 'అలాంటి' స్త్రీ అన్నమాట! మరో అరగంట దాకా వాళ్ళిద్దరినీ చూస్తూండిపోయాడు ఎరెస్ట్ ఆ రాత్రంతా, మర్నాడు ఉదయం ఎర్నెస్ట్ ఆలోచిస్తూండిపోయాడు.

వజ్రపుటుంగరం వ్యక్తి వస్తే తను అర్థం చేసుకో గలిగాడు. ఆమె భర్త ఆమెని వంటరిగా వదిలి వెళ్లే తన కోరికలు తీర్చుకోడానికి అతన్ని ఉపయోగించుకుంటోంది అనుకున్నాడు. అది అంత తప్పుగా తోచలేదు.

కాని క్లైడ్ హోగాన్!

బట్టతలతో ఉన్న అతను దాదాపుగా ఆమె తండ్రి వయసు కలవాడు. వెరా రోలేండ్ భర్త లాయడ్ రోలేండ్ మీద ఎర్నెస్ట్ కి జాలి, సానుభూతి కలిగాయి. తన భార్యని పోషించడానికి పొట్ట చేత పట్టుకుని అతను ఊళ్ళు తిరుగుతూ ఉద్యోగం చేస్తూంటే ఆమె వ్యభిచారిణిగా మారుతోంది.

ఆ ముగ్గురు మగవాళ్ళు ఒకరికొకరు పరిచయస్తులు! బహుశా స్నేహితులు కూడా అయి ఉండచ్చు. కాని తమని ఆమె మోసగిస్తోందని ఆ ముగ్గురికీ తెలీకపోవచ్చు.

ఆ రాత్రి మళ్ళీ కిటికీలోంచి చూస్తే వాళ్ళిద్దరు కనబడ్డారు. సోఫా మీద క్లైడ్ హోగాన్, వెరా రోలేండ్ పడుకుని ఉన్నారు. ఆ అన్యాయాన్ని అయిదు నిమిషాలు తిలకించాక ఎర్నెస్ట్ వేగంగా కోపంగా కిందికి వెళ్ళాడు. తన అపార్ట్మెంట్ తలుపు తెరిచి లోపలకి వెళ్ళాక టెలిఫోన్ డైరెక్టరీ తీసి చూసి ఓ నంబరుకి ఫోన్ చేసి మళ్ళీ యధాస్థానానికి వచ్చాడు. వెరా రోలేండ్ కౌగిలిలో ఉన్న క్లైడ్ హోగాన్ అపార్ట్మెంట్ కిటికీ వంక చూసాడు. అతని భార్య ఇర్మా హోగాన్ బయటకి వెళ్ళడానికి బట్టలు తొడుక్కుంటోంది. అవిడ మొహం పాలిపోయి ఉంది.

ఈ సారి వెరా రోలేండ్ కిటికి వైపు తిప్పాడు టెలిస్కోప్ ని. కొన్ని నిమిషాల తర్వాత సోఫా మీద పడుకుని శృంగారం జరుపుతున్న ఇద్దరూ ఉలిక్కిపడ్డట్లుగా లేచారు. ఆ ఇంటి డోర్ బెల్ మోగింది అనుకున్నాడు ఎర్నెస్ట్. వెరా రోలేండ్ త్వరత్వరగా బట్టలు తొడుక్కుని తలుపు దగ్గరకి వెళ్ళింది. బయట నించి వచ్చిన వాళ్ళకి దాక్కున్న క్లైడ్ హోగాన్ కనబడడు.

జరిగే తమాషా చూస్తూ చిరునవ్వు నవ్వాడు ఎర్నెస్ట్.

ఆకస్మాత్తుగా క్లైడ్ సోఫా మీద నించి స్ప్రింగ్ లా లేచాడు. తొయ్యబడ్డట్లుగా వెరా రోలేండ్ టెలిస్కోప్ పరిధిలోకి వచ్చింది. క్లైడ్ భార్య ఇర్మా హోగాన్ గుప్పిట బిగించిన చేతులతో ఆమెని బాదుతూ వెరా రోలేండ్ మీద గట్టిగా అరుస్తోంది. క్లైడ్ గబగబా దుస్తులు తొడుక్కుని స్టేజ్ మీదికి పొరపాటున ముందుగా వచ్చిన నటుడు వెళ్ళేంత వేగంగా వెళ్ళి పోయాడు. ఇర్మా హోగాన్ తిట్టే తిట్లు వినలేక రెండు చేతులతో చెవులు మూసుకుని, వెరా రోలేండ్ ఏడుస్తూ సోఫా మీదకి జారిపోయింది.

ఇర్మా మరోసారి కాలితో వెరా రోలేండ్ ని బలంగా తన్ని బయటికి వెళ్ళిపోయింది. వెరా రోలేండ్ లేచి బాత్రూంలోకి వెళ్ళింది.

వెరా రోలేండ్ అన్యాయానికి ప్రాయశ్చిత్తం పూర్తిగా జరగలేదని అనుకున్నాడు ఎర్నెస్ట్ స్ట్రీకర్, మిగతాది అతను పూర్తి చేసాడు.

నలభై ఐదు నిమిషాల తర్వాత గ్రాహం క్రెస్ట్ అపార్ట్మెంట్స్ లో వెరా రోలేండ్ డోర్ బెల్ ని ఎర్నెస్ట్ స్ట్రీకర్ నొక్కాడు. ఆమె తలుపు తెరిచింది. లోపలికి వెళ్ళి ఐదు నిమిషాల తర్వాత బయటికి వచ్చాడు.

తిరిగి తన అపార్ట్మెంట్ తలుపు తెరచి మరోసారి ఫోన్ చేసాడు. తర్వాత పైన ఉన్న మేడ మీదకి చేరుకోడానికి అతనికి అట్టే సేపు పట్టలేదు. పావుగంట తర్వాత వెరా రోలేండ్ అపార్ట్మెంట్ లోకి, అక్కడ హత్య జరిగిందన్న ఆకాశరామన్న ఫోన్ కాల్ ని అందుకున్న పోలీసులు వచ్చారు.

వెరా రోలేండ్ కిటికీలోంచి కనబడే తతంగాన్ని టెలిస్కోప్ లోంచి వినోదంగా చూడసాగాడు ఎర్నెస్ట్.

హంతుకుడికి సంబంధించిన "క్లూల" కోసం యూనిఫాంలో ఉన్న పోలీసులు ఆమె అపార్ట్మెంట్ ని వెతుకుతున్నారు. ఫోటోగ్రాఫర్లు సోఫా మీద పడి ఉన్న వెరా రోలేండ్ మృత దేహన్ని వివిధ కోణాలలో ఫోటోలు తీస్తున్నారు.

అంత ఎత్తయిన బిల్డింగ్ మీద నించి రహస్యంగా అదంతా చూస్తున్న ఎర్నెస్ట్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఓ పోలీస్ కానిస్టేబుల్ కి ఏదో క్లూ దొరికింది. దాన్ని డిటెక్టివ్ కి చూపిస్తున్నాడు. స్ట్రీకర్ తన టెలిస్కోప్ అద్దాన్ని ఓ సారి చేతి రుమాలుతో తుడిచి డిటెక్టివ్ అందుకుని పరిశీలిస్తున్న ఆ వస్తువును పరీక్షగా చూసాడు.

దాన్ని గుర్తు పట్టగానే అతని గుండె ఝుల్లుమన్ది.

తన టెలిస్కోప్ లెన్స్ తొమ్మిది మిల్లీ మీటర్ల టెలిస్కోప్ లెన్స్ అది! కుడి చేతిని జేబులోకి పోనించి తడుముకున్నాడు. లోపల మడతలున్న బట్ట ఉంది కాని దాని మధ్య ఉండాల్సిన లెన్స్ లేదు!

తన మీద వెరా రోలేండ్ తిరగబడ్డప్పుడు అది జేబులోంచి జారి కింద పడిపోయి ఉంటుంది. తను ఆ హడావిడిలో చూసుకోలేదు.

మరికొందరు డిటెక్టివ్ లు ఆ లెన్స్ ని చూసారు. తర్వాత కిటికీలోంచి బయటికి అర్థోక్తిగా చూడసాగారు. టెలిస్కోప్ లోంచి చూస్తున్న ఎర్నెస్ట్ కి వాళ్ళు సూటిగా తన వంకే చూస్తున్నట్లుగా అనిపించింది.

తను దేవుడు అనుకుని వెరా రోలేండ్ ని శిక్షించాడు. కాని ఎవరూ నేరం చేసి తప్పించుకోలేరు. తనని పోలీసులు పట్టుకోవడం చాలా తేలిక. ఆ లెన్స్ తయారు చేసిన హేన్స్ ఫింగర్స్ దగ్గరకు వారు వెళతారు. అలాంటివి ఎవరెవరికి అమ్మారో ఆరా తీస్తారు. హత్యా ప్రదేశానికి దగ్గరలో ఉన్న బిల్డింగ్ లోని తన చిరునామా చూడగానే తన దగ్గరకి వస్తారు. రోజు రాత్రుళ్ళు టెలీస్కోప్ తో తను పైకి వస్తాడని తను ఉండే బిల్డింగ్ లో అందరికి తెలుసు. తనకు శిక్ష- బహుశా మరణశిక్ష- తప్పదు.

ఆ లెన్స్ ఆమె ఇంట్లోకి ఎలా వెళ్ళిందన్న ప్రశ్నకి తన దగ్గర సరైన జవాబు లేదు. నెమ్మదిగా లేచాడు. పిట్టగోడ దగ్గరకి వెళ్ళి కిందకు చూసాడు. కార్లు, మనుషులు.

ఓసారి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

తర్వాత రెండు చేతులూ పైకి ఎత్తి ఈత కొలనులోకి దూకినంత మామూలుగా ఇరవై అంతస్థుల ఎత్తు నించి కిందకి వీధిలోకి ఎర్నెస్ట్ దూకేసాడు.

ఎర్నెస్ట్ స్ట్రీకర్ పెట్టిన చావు కేకని రోడ్డు మీద వెళుతున్న అనేకమంది ఆగి ఆశ్చర్యంగా విన్నారు. దబ్బున పడి తల చితికి రక్తపు మడుగులో వీధిలో పడి ఉన్న మృత కళేబరం వంక భయంగా చూసారు.

911 నించి ఫోన్ వచ్చిన ఆ డిటెక్టివ్ కి కబురు తెలిసి అక్కడికి చేరుకున్నాడు. అది హత్యో ఆత్మహత్యో లేదా పొరపాటున పడ్డాడో ఆ డిటెక్టివ్ వెంటనే ఓ అంచనా వేయలేక పోయాడు. మొదట వెరా రోలేండ్ హంతకుడిని పట్టుకోవాలని ఆలోచించే ఆ డిటెక్టివ్ ఇంకా తన జేబులోనే ఉన్న ఆ తొమ్మిది మిల్లీ మీటర్ల లెన్స్ గురించే ఆలోచిస్తున్నాడు.

---

## శిక్ష – నేరము - లియో ఆర్ ఎల్లిన్

టెలిఫోన్ బెల్ విని రిసీవర్ అందుకున్నాడు,
"డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఫ్రేంక్ గుల్లర్డ్ ని మాట్లాడుతున్నాను." చెప్పాడు.
"నేను సూ మేనిక్స్ ని." ఓ ఆడ కంఠం వినిపించింది.
గుల్లర్డ్ మెదడులో మెరుపు మెరిసినట్లయింది.
"జైలునించా?" అడిగాడు.
‘‘కాదు. ఇంటినించి. జైల్లో నా మంచి ప్రవర్తన వల్ల రెండు సంవత్సరాల ముందే విడుదల చేసారు. మా ఇంటికి ఈ సాయంత్రం రావాలి." చిరునామా చెప్పింది సూ.
"దేనికీ?"
"మీతో చాలా ముఖ్యమైన పనుంది. తప్పక వస్తారుగా?"
"వస్తాను." ఆలోచించి చెప్పాడు.

ఫోన్ పెట్టేసాక తను రాస్తున్న ప్రసంగం వంక చూసాడు. వచ్చే బుధవారం రిటైరవుతున్నాడు తను. ముప్పై ఏళ్ళు పోలీసు శాఖలో పని చేసి వెళ్ళిపోతున్న సందర్భంగా తన తోటివాళ్ళు యిచ్చే విందులో మాట్లాడటానికి ఆ ప్రసంగాన్ని తయారు చేస్తున్నాడు.

ఇన్ స్పెక్టర్ గుల్లర్డ్ కి సూ మేనిక్స్ బాగా గుర్తు. తన సర్వీస్ లో అనేకమంది హంతకురాళ్ళని పట్టుకున్నాడు. వాళ్ళలో ఆమె ఒకతి. అప్పటికి గుల్లర్డ్ ఇంకా అట్టే అనుభవం లేని ఇన్ స్పెక్టర్. ఓ ఇల్లు తగలబడి పోయిందని కబురు తెలిసి వెళ్ళాడు. ఇల్లు అప్పటికే పూర్తిగా కాలిపోయింది.

అగ్ని మాపక దళం వాళ్ళు నిప్పుని ఆర్పుతున్నారు. అగ్నిమాపక దళం అధికారి గుల్లర్డ్ తో చెప్పాడు.

''లోపల పడక గదిలో ఎవరో కాలిపోయారు. ఈ ఇంటి యజమాని రోనీ మేనిక్స్ అయివుండచ్చు. అతని శవం పక్క మీద ఉంది."

''ఒంటి మీద గుర్తులేమయినా ఉన్నాయా?''

''చూడలేదు. పరుపు మీద పడుకుని సిగరెట్ కాలుస్తూంటే ఇల్లు అంటుకుని ఉండాలి. ఇటు రండి.''

గుల్లర్డ్ ని అతను ఇంటి వెనకకి తీసుకు వెళ్ళాడు. దుప్పటి కప్పుకున్న ఓ యువతి అక్కడ కూర్చుని ఉంది. అందరి వంక అయోమయంగా చూసి లేచి నిలబడింది.

''ఈమెను ఇందాక మేం చూసేసరికి స్పృహలో లేదు.''

ఆమె పక్కనే పడి ఉన్న ఓ వస్తువు గుల్లర్డ్ ని ఆకర్షించింది. ఒంగి దాన్ని అందుకున్నాడు. అది చిన్న స్టీల్ సుత్తి.

సుత్తి చివర రక్తం జిగురుగా ఉంది.

గుల్లర్డ్ వెంటనే వైర్లెస్ ఫోన్లో వేలి ముద్రల నిపుణులని, డాక్టర్ని పిలిచాడు

నీ పేరు?" తర్వాత ఆ యువతి దగ్గరకి వచ్చి అడిగాడు.

''సూ మేనిక్స్." నీరసంగా ఉంది ఆమె కంఠం.

''బయటకి ఎలా వచ్చావ్?" ఆమె తొడుక్కున్న నైట్ గౌన్ని పరకాయించి చూసి అడిగాడు.

"నాకు తెలీదు. మెలకువ వచ్చి చూస్తే ఇక్కడ ఉన్నాను."

"ఎక్కడ పడుకున్నావు?"

“ముందు గదిలో."

“నీ భర్త?"

"రోనీ పడక గదిలో పడుకుంటాడు. రోనీ ఏడీ?" చుట్టు ఆదుర్దాగా చూస్తూ అడిగింది.

“పోయాడు." చెప్పాడు అగ్నిమాపక దళాధికారి.

నూ మేనిక్స్ వెంటనే తన కాళ్ళు తనని మోయలేనట్లుగా నేల మీదకి జారిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది.

అగ్ని ఏ విధంగా మొదలయిందో తెలుసుకునే బృందం వచ్చింది.

ఇనప ఊచలతో కాలిపోయిన ఇంటిలోని సామానుని కదుపుతూ గంట దాకా పరీక్షించారు వాళ్ళు.

“ఈ ఇంటిని ఎవరో కిరసనాయిలు పోసి అంటించారు. సహజంగా జరిగిన ప్రమాదం కాదు." చెప్పారు వాళ్ళు గుల్లర్డ్ తో,

ఇంటి వెనక అయిదు గేలన్ల ఖాళీ కిరోసిన్ డబ్బా దొరికింది. దాని మీదా, నెత్తురు అంటుకొన్న సుత్తి మీదా కూడా సూ మేనిక్స్ వేలిముద్రలు ఉన్నాయి. మరణించిన వ్యక్తి రక్తం గ్రూపు, ఆ సుత్తి మీద ఉన్న రక్తం గ్రూపు ఒకటే. కాలి మరణించిన వ్యక్తి తల పగిలి ఉంది. ఆ దెబ్బ ఆ సుత్తితోనే కొట్టబడి ఉంటుందని ఊహించాడు డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ గుల్లర్డ్.

పూర్తిగా చల్లారాక మర్నాడు సాయంత్రం గుల్లర్డ్ ఆ వ్యక్తి మరణించిన పడకగదిలోకి వెళ్ళాడు. పరుపులోని దూది కాలి మసయి పోయిది. ఆ బూడిదని జాగ్రత్తగా ఓ ఇనప ఊచతో కదిపి చూసాడు.

ఏదో మెరుస్తూ అతని కంటపడింది. దాన్ని అందుకుని శుభ్రంగా తుడిచి చూసాడు. అది మెడలో గొలుసుకి వేసుకునే రెక్కలు విప్పుకున్న పావురం బొమ్మ లాకెట్. దాన్ని జేబులో వేసుకున్నాడు.

అప్పటికే సూ మేనిక్స్ ని తన భర్తని హత్య చేసిందనే అనుమానం మీద అరెస్ట్ చేసాడు. సరాసరి సూ దగ్గరికి వెళ్ళాడు.

“నీ భర్తని ఎందుకు చంపావు?" అడిగాడు సూటిగా.
"నేను ఎవరినీ చంపలేదు." బదులు చెప్పింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.
గుల్లర్డ్ కి ఆమె మాటల్లో స్థిరత్వం, సిన్సియారిటీ కనబడ్డాయి. ఆ క్షణంలో నమ్మకం కలిగింది.
కాని హంతకులు, ముఖ్యంగా ఆడవాళ్ళు చక్కగా అబద్ధాలు ఆడగలరు.
"మీరిద్దరూ ఆ అగ్ని ప్రమాదం జరిగిన రాత్రి పోట్లాడుకున్నారా?"
“లేదు. ఒకే పడక గదిలో పడుకోలేదనేగా ఆ ప్రశ్న? వారం రోజులుగా రోనీ నాతో పడుకోవటం లేదు."
"అబద్ధం."
“నిజం.”

“నిజమే! నీ భర్త నిద్రపోతూండగా అతని తల పగలగొట్టి చంపి, నేరం రుజువు కాకూడదని కిరసనాయిలు పోసి ఇల్లంతా తగలబెట్టావు. బయటకి వచ్చి స్పృహ లేని దానిలా నటించావు.'

"అబద్ధం." అరిచింది సూ.
చేతులు మొహానికి అడ్డు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న సూని చూసి అడిగాడు.
"మీ వివాహమై ఎన్నేళ్ళయింది?"
"అయిదేళ్ళు."
“నీ భర్త ఏం చేస్తూంటాడు?"

“నాకు. నాకు తెలియదు.”

“నీ భర్త ఎం చేస్తుంటాడో నీకు తెలియదా?" అడిగాడు గుల్లర్డ్ ఆశ్చర్యంగా.

“ఊహు. సేల్స్ మేన్ గా పని చేసేవాడు. చాలా ఉద్యోగాలు మారాడు. పది రోజులుగా ఇల్లు కదలటం లేదు. ఉద్యోగం పోయి ఉండచ్చు."

రాని మేనిక్స్ ఆఖరిసారి ఉద్యోగం చేసిన కంపెనీకి గుల్లర్డ్ వెళ్ళి వాకబు చేసాడు.

రోనీ రేసులు బాగా ఆడతాడనీ, ఉద్యోగం సరిగ్గా చేయకపోతే తీసేసామనీ చెప్పాడు ఆ కంపెనీ యజమాని.

కాలి చనిపోయిన వ్యక్తిని గుర్తుపట్టడం కష్టం. తల పగిలి మరణించాడని డాక్టర్ రిపోర్ట్ వచ్చింది. ఆ సుత్తితోనే తల పగలకొట్టబడిందని ఫోరెన్సిక్ రిపోర్టులో రాసారు. ఆ సుత్తి మీద ఉన్న వేలి ముద్రలు సూ మేనిక్స్ వె అని వేలి ముద్రల నిపుణులు తేల్చారు.

సూ మేనిక్స్ దగ్గరకి వెళ్ళి చెప్పాడు.
“సాక్ష్యాలన్నీ నీకు విరుద్ధంగా ఉన్నాయి."
"నేను ఆ హత్య చేయలేదు."
“ఆ సంగతి జడ్జి చెప్పాలి."
తన పరిశోధన వివరాలు, సాక్ష్యాలు డిస్ట్రిక్ట్ అటార్నీ ఆఫీస్ కి పంపించాడు డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఫ్రేంక్ గుల్లర్డ్,

ఆఖరిసారి సూ మేనిక్స్ ఇంటి పక్క వాళ్ళింటికి వెళ్ళాడు గుల్లర్డ్.
“సూ మేనిక్స్ మీద మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు పక్కింటావిడని.
"తన భర్తని హత్య చేసేంత నీచురాలు కాదనే నా అభిప్రాయం." చెప్పిందావిడ.
"భార్యా భర్తలు ఎలా ఉండేవాళ్ళు?"
"వాళ్ళని అంత పరిశీలనగా చూడలేదు. అలాంటి కుతూహలం నాకు లేదు."

"ఈ లాకెట్ ఎవరు వేసుకునేవారో మీకు తెలుసా?" అడిగాడు కాలిపోయిన పక్క మీద దొరికిన రెక్కలు విప్పిన పావురం లాకెట్ని చూపించి.
“తెలియదు.”
గుల్లర్డ్ వెనక్కి తిరిగాక చెప్పింది.
"గుర్తొచ్చింది. ఆ మధ్య ఓ హిప్పీ ఈ సందులోకి వచ్చాడు. అతని మెడలో చూసాను."
"హిప్పీ?"

“పొడుగాటి జుట్టు, మీసాలూ, మాసిపోయిన బట్టలూ...హిప్పీలంటారు కదా వాళ్ళని. ఓసారి మా ఇంటికి వచ్చి టెలిఫోన్ చేయాలన్నాడు. నేను అంగీకరించలేదు. మేనిక్స్ ఇంటికి వెళ్ళాడేమో నాకు తెలియదు. ఇక్కడికి ఇరపై మైళ్ళ దూరంలో హిప్పీలు సముద్రపు ఒడ్డున గుడిసెల్లో ఉంటారు. కావాలంటే అక్కడికి వెళ్ళి వాకబు చేయండి."

డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఫ్రేంక్ గుల్లర్డ్ హిప్పీల కేంప్ కి వెళ్ళలేదు. పోలీస్ స్టేషన్ కి వెళ్ళి దాన్ని తన డ్రాయరులో పడేసాడు. రిపోర్టులో దాని సంగతి రాయలేదు. ఆ సంగతే మర్చిపోయాడు.

సూ మేనిక్స్ కి ఏడేళ్ళ జైలు శిక్ష పడింది.
ఇప్పుడు మళ్ళీ సూ మేనిక్స్ నించి ఇంటికి ఆహ్వానం.
చిరునామా తేలికగా కనుక్కున్నాడు గుల్లర్డ్,
సూ మేనిక్స్ లో చాలా మార్పు వచ్చింది. ఇదివరకటి అందం లేదు. బాగా చిక్కి పోయింది.
కళ్ళు గుంటలు పడ్డాయి. జుట్టు బాగా నెరిసిపోయింది.
"కాఫీ తీసుకుంటారా లేక..."

"నేను డ్యూటీ మీద ఉన్నాను. ఏం తీసుకోను. మీ ఇంటికి ఎప్పుడైనా సరదాగా వస్తే అప్పుడు తీసుకుంటాను కాఫీ.”

నవ్వింది సూ.

‘‘ఈ మధ్య నా మేనత్త మరణించటం వల్ల ఆస్తి కలిసివచ్చింది.'' చెప్పింది సూ గుల్లర్డ్ తన ఖరీదైన ఇంటిని పరిశీలనగా గమనించడం చూసి.

''నాకు మేనత్తలు లేరు. ఉన్నా పోరు.'' నవ్వాడు గుల్లర్డ్,
‘‘నన్ను అనవసరంగా జైలుకి పంపావు నువ్వు''
''నేను కాదు. అవసరం అనుకొని కోర్టే పంపింది.’’
‘‘అవును. నువ్వు సంపాదించిన సాక్ష్యాన్ని ఆధారంగా చేసుకుని. నేను నిర్దోషినని నీకు తెలుసో తెలియదో కానీ, నన్ను హంతకురాలిని చేసి కేసు పరిష్కరించుకున్నావు.''
''చెప్పదలచుకుంది ఇంకేదయినా ఉందా?'' కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు కోపంగా.
''ఇన్ స్పెక్టర్ ఆ రాత్రి ఇంట్లో కాలిపోయిన శవం నా భర్తది కాదు.''
బయటికి వెళుతున్న గుల్లర్డ్ ఠక్కున ఆగిపోయాడు. సూ మేనిక్స్ మాటలు విని వెనక్కి తిరిగాడు.

‘‘ఆశ్చర్యంగా ఉందా? నీకు నిజం తెలుసో, తెలియదో నాకు తెలియదు. ఓ దురదృష్టవంతుడు ఆ రాత్రి ఫోన్ చేసుకోవాలని మా ఇంట్లోకి వచ్చాడు. అతన్ని హత్య చేసి రోనీ ఆ ఇంటిని తగులబెట్టాడు.''

''అబద్ధం. అదే నిజమయితే ఆ సంగతి నువ్వు కోర్టులో చెప్పి ఉండేదానివి.''

''కానీ నాకు అది అప్పుడు తెలియదు. నువ్వు ఆ శవం నా భర్తదే అని భావించావు. ఊహించావు. ఆ ఊహ మీద, ఆ భావన మీద నీ కేసుని నడిపించి నన్ను అన్యాయంగా జైలుకి పంపించావు.''

‘‘నీకు పిచ్చే సందేహం లేదు.''
‘‘నే చెప్పేది విని నువ్వే నిర్ణయించు.'' అని నవ్వి చెప్పసాగింది సూ.

"నా భర్త రేసుల్లో చాలా డబ్బు పోగొట్టుకున్నాడు. ఉద్యోగం పోయింది. అప్పుల వాళ్ళు వెంటబడసాగారు. ఆ కొత్త వ్యక్తిని చంపి, అంతా తనే మరణించాడని అనుకోవాలని పథకం వేసి పారిపోయాడు. ఆ హత్య నేను చేసాననే భ్రమ కలిగించి మరీ పారిపోయాడు. ఫలితంగా నా చక్కటి జీవితం జైలు పాలయింది. ఆ రాత్రి నాకు ఇచ్చిన పాలల్లో రోనీ మత్తు మందు కలిపాడు. స్పృహలో లేని నా చేతికి రక్తాన్ని పూసి ఆ సుత్తి మీద నా వేలి ముద్రలు పడేలా చేసాడు. ఫైర్ సర్వీస్ కి ఫోన్ చేసి పారిపోయాడు." సూ కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

"ఈ కథ చెప్పడం ద్వారా నీకేం ఒరుగుతుందో నాకు అర్థం కావటం లేదు." తలుపు వైపు నడిచాడు గుల్లర్డ్.

"నా కథ పూర్తి కాలేదు. నా మేనత్త ఆస్థిని నేను అనుభవిస్తున్నానని తెలిసి రోనీ ఈ ఉదయం నా దగ్గరకి వచ్చాడు. అతను వచ్చేదాకా బతికే ఉన్నాడని నాకు తెలియదు. జరిగిందంతా అతనే చెప్పాడు."

"నీ కథలో ఎంత నిజం ఉందో కనుక్కుంటాను. రోనీని పట్టుకుంటాను."
"ఇదుగో రోనీ."

వెనక గది తలుపు తెరచింది సూ మేనిక్స్. ఎదురుగా మంచం మీద పడుకొని ఉన్నాడు రోనీ మేనిక్స్, చొక్కా నిండా రక్తం అంటుకొని ఉంది. పక్కనే ఓ పిస్తోలు పడి ఉంది.

నిర్ఘాంతపోతో చూస్తున్న గుల్లర్డ్ తో నవ్వుతూ చెప్పింది.
"డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ బాగా చూడండి. అడుగో నా భర్త రోనీ."
"అతన్ని హత్య చేసావా?" నమ్మలేనట్లుగా అడిగాడు గుల్లర్డ్

"అవును. నా మేనత్త ఆస్తి ఇవ్వనన్నాను. నన్ను చంపబోతే ఆత్మరక్షణ కోసం కాల్చి చంపాను. ఆ పిస్తోలు మీద నా వేలి ముద్రలు ఉన్నాయి."

“నిన్ను ఆరెస్ట్ చేస్తున్నాను మిసెస్ మేనిక్స్." చెప్పాడు గుల్లర్డ్ ఆశ్చర్యంలోంచి తేరుకొని.
రెండడుగులు ముందుకు వేసాడు.
పగలబడి నవ్వింది సూ.
“ఏ నేరం మీద?”
“నీ భర్తని హత్య చేసినందుకు."

‘అదే నేరం మీద నువ్వే నన్ను జైలుకు పంపావు. ఒక నేరం రుజువై శిక్ష అనుభవించాక ఆ నేరస్థురాలిని మళ్ళీ అదే నేరం మీద కోర్టులో విచారించ కూడదని మన చట్టం చెప్తోంది అని తెలియదా? నా మీద మళ్ళీ ఎలా కేసు పెడతావు?"

ఏం చెప్పాలో తెలియలేదు గుల్లర్డ్ కి.
"కాని నువ్వు హంతకురాలివి." తేరుకుని చెప్పాడు.
మరోసారి పగలబడి నవ్వి చెప్పింది సూ మేనిక్స్.

“వచ్చే బుధవారం నీకు రిటైరయ్యే సందర్భంలో వీడ్కోలు పార్టీ యిస్తున్నారని పేపర్లో చదివాను. ఆ రోజు నీ తోటివాళ్ళు, రిపోర్టర్లు మా వారి హత్య గురించి అడిగే ప్రశ్నలకి నువ్వు ఏం జవాబు చెప్తావో చూడాలని ఉంది నాకు."

సూ వంక గుల్లర్డ్ బాధగా చూసాడు.
“అవును. నిర్దోషిని జైలుకి పంపించిన నీ ఘనతని పేపర్లు రేపీపాటికి ప్రజలకి చాటుతాయి. అందరూ నిన్ను అసహ్యించుకుంటారు."
గుల్లర్డ్ తన సర్వీస్ రివాల్వర్ని బయటకి తీసాడు. సూ మేనిక్స్ కే గురి పెట్టాడు.

“నిన్ను చంపేస్తాను. నేను ఆలోచించి చెప్పకొంటాను తర్వాత ఏం చెప్పకోవాలో.. నా మీద పగతో చంపబోతే ఆత్మరక్షణకి నే...”

సూ పెద్దగా ఈల వేసింది. వెంటనే తలుపు తెరచిన శబ్దం వినిపించింది. నలుగురైదుగురు మనుషులు లోపలికి వచ్చారు. ఓ కెమేరా క్లిక్ మంది.

సూ పగలబడి నవ్వుతూ చెప్పింది.
"వీళ్ళంతా రిపోర్టర్లు. వీళ్ళకీ ఫోన్ చేశాను. జరిగే డ్రామాని చూడమని చెప్పాను."

డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఫ్రేంక్ గుల్లర్డ్ రివాల్వర్ జేబులో ఉంచుకుని అవమానంతో ఎర్రబడ్డ మొహంతో వేగంగా బయటకి నడిచాడు.

---

## ఆఖరి ఖర్చు - ఆవ్రాం డేవిడ్సన్

రైలు రావడానికి అయిదు నిమిషాల ముందే టాక్సీ డ్రైవర్ క్లెమ్ ఏష్బి రైల్వే స్టేషన్ కి చేరుకున్నాడు. మిసెస్ మెర్రిమేన్ వస్తే తనకి తిరిగి గ్రామానికి వెళ్ళడానికి సవారి దొరుకుతుంది. లేదా లేదు. ఇతర ప్రయాణీకులెవరూ అక్కడ దిగకపోతే తను గ్రామానికి ఖాళీగా తిరిగి వెళ్ళాలి అనుకున్నాడు క్లెమ్.

రైలు వచ్చి ఆగింది. కాని అందులోంచి మిసెస్ మెర్రిమేన్ దిగలేదు. సేమ్ వెల్స్ దిగడం చూసాడు క్లెమ్. అయితే అతను సేమ్ వెల్స్ దృష్టిలో పడకుండా తప్పించుకున్నాడు. అతను మీటర్ ప్రకారం సరిగ్గా డెబ్బై అయిదు సెంట్లే ఇస్తాడు. ఇతరుల్లా పాతిక సెంట్లు అదనంగా టిప్ గా ఇవ్వకపోగా, డాలర్ నోటిచ్చి పాతిక సెంట్లు ఇవ్వమని పేచీ పెడతాడు.

ఖాళీగా వెళ్ళాలా లేక సేమ్ వెల్స్ ని ఎక్కించుకుని వెళ్ళాలా అని క్లెమ్ మధనపడుతూంటే రైల్లోంచి సన్నగా పొడుగ్గా ఉన్న ఒకామె దిగడం గమనించాడు. ఆమె వెంటే ఓ చిన్న పిల్లవాడు దిగాడు. వాళ్ళిద్దరూ తల్లీకొడుకులని పోలికలని బట్టి తెలిసిపోతోంది. వాళ్ళ వెంట ఆఖరుగా రైలు దిగాడు కెంట్ కేస్ట్ వెల్.

అతన్ని క్లెమ్ గుర్తుపట్టాడు. వేసవి సెలవుల్లో తమ గ్రామంలో అనేకసార్లు అతన్ని చూసాడు. నిజానికి గ్రామంలో అనే కంటే బార్లో అనడం కరెక్ట్. అతను తరచు బార్లో తాగి ఇతరులతో గొడవ పడేవాడని క్లెమ్ కి గుర్తిచ్చింది. అయితే ఆ పిల్లవాడిని, తల్లిని ఇప్పుడే చూస్తున్నాడు.

"టేక్సీ కావాలా?" అడిగాడు క్లెమ్ వాళ్ళని సమీపించి.

క్లెంట్ కేస్ట్ వెల్ అతనికి జవాబియ్యకుండా రైల్లోంచి తన సామాను దింపుకోవడంలో నిమగ్నమయ్యాడు. ఆ పిల్లవాడు బదులు చెప్పాడు.

‘‘కావాలి. నిముషం ఆగు.’’

"ఎక్కడికి?" అడిగాడు క్లెమ్.

‘‘పీబాడీ ఇంటికి. అదెక్కడుందో తెలుసా?" అడిగాడు కెంట్ కేస్ట్ వెల్.

‘‘తెలుసు. కాని ఇప్పుడు ఆ ఇంట్లో ఎవరూ ఉండటం లేదు." చెప్పాడు క్లెమ్.

కెంట్ కేస్ట్ వెల్ కుడి చేత్తో టేక్సీ తలుపు తెరిచి లోపల కూర్చుని చెప్పాడు క్లెమ్ తో,

‘‘డిక్కీలో సామాను ఉంచు...మీరూ ఎక్కండి."

తల్లి కొడుకు ఎక్కి అతని పక్కన కూర్చున్నారు.

"పీబాడి ఇల్లు దూరం. అక్కడికి తీసుకెళ్ళడానికి మూడు డాలర్లు అవుతుంది." చెప్పాడు

‘‘ముందు పద.’’ అరిచాడు కెంట్.

క్లెమ్ డిక్కీలో సామాను సర్దుతూ అనుకున్నాడు.

నాకు సహాయం చేయడే? అమర్యాద మనిషిలా ఉన్నాడు.

టేక్సీ కదిలిన కొంత సేపటికి కెంట్ నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ చెప్పాడు.

‘‘నీకు ఇచ్చేది రెండు డాలర్లే. నిజానికి మీటర్ ప్రకారం డాలరే ఇవ్వాలి."

‘‘మీకు ముందే చెప్పాను మూడు డాలర్లని." తల సగం వెనక్కి తిప్పి చూస్తూ చెప్పాడు క్లెమ్.

"ఇప్పుడు నీకు చెప్తున్నాను రెండు డాలర్లే అని.

" పీబాడీ ఇల్లు గ్రామానికి ఎంతో దూరమని వాదించాడు క్లెమ్. పెరిగిన పెట్రోల్ ధర, చెత్త రోడ్డు, టైర్ల అరుగుదల గురించి చెప్పాడు. కెంట్ బదులుగా పెద్దగా ఆవులించాడు తప్ప బదులు మాట్లాడలేదు.

కెంట్ దారిలో పీబాడీ ఇంటితాళం చెవులు తీసుకోవడానికి నికర్సన్స్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ దగ్గర టేక్సీని ఆపించాడు.

"మిస్టర్ కెంట్. మీరు చిన్న పిల్లవాడితో వస్తున్నారని నాకు ముందు చెప్పలేదు. పీబాడీ ఇల్లు గ్రామానికి చాలా దూరంగా ఉంది. దాని చుట్టుపక్కల ఇంక ఇళ్ళు లేవు. మీ అబ్బాయి ఆడుకోడానికి అక్కడ పిల్లలు ఉండరు."

"ఇంట్లో ఎందుకుంటాడు? రోజూ స్కూల్ కి వెళ్తాడు." ఖంగున చెప్పాడు కెంట్

‘‘స్కూల్? స్కూల్ బస్ మీ పిల్లవాడిని పికప్ చేయడానికి మూడు మైళ్ళ దూరం ఎక్కువ ప్రయాణించాల్సి ఉంటుంది. దానర్థం ఆ రోడ్డుని బస్సు నడిపించేందుకు వీలుగా రిపేర్ చేయించాల్సి ఉంటుంది. ఇంతదాకా ఎవరూ ఆ ఇంట్లో ఉండకపోవడంతో రోడ్డుని రిపేర్ చేయించలేదు. నేను ఈ గ్రామ వ్యవహారాలు చూసే గ్రామాధికారిని కూడా."

"అయితే వెంటనే రిపేర్ చేయించండి."

“రిపేర్ కి చాలా ఖర్చవుతుంది. మా గ్రామంలో వసూలయ్యే టాక్స్ లు తక్కువ. అది కాక బస్ డ్రైవర్ కాంట్రాక్ట్ మీద బస్ ని నడుపుతున్నాడు. ఎక్కువ దూరం డ్రైవ్ చేయడానికి అతనికి ఇంకా ఎక్కువ ఇవ్వాల్సి ఉంటుంది."

“ఇవ్వండి.”

"మీ అబ్బాయి చదువు కోసం వేల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దానికి బదులు స్కూల్ పక్కనే అద్దెకి సిద్దంగా ఉన్న ఇంకో ఇల్లు చూడండి. అది మీకు నచ్చితే..."

“పీబాడీ ఇంటి తాళం చెవులిస్తే మేం వెళ్తాం." చెప్పాడు కెంట్ కటువుగా.

"మీకు నేను చెప్పేది అర్ధం కానట్లుంది. మీ అబ్బాయి చదువుకి గ్రామం పెట్టే ఖర్చు పీబాడీ ఇంటికి మాకు వసూలయ్యే టాక్స్ కన్నా ఎన్నో వందల రెట్లు అధికం. నేను చెప్పే ఇంటి అద్దె పీబాడీ ఇంటి అద్దెకన్నా ఎక్కువ కాదు."

“ఏమిటి? నేను ఎన్నిక చేసుకున్న ఇంట్లో కాక, నువ్వు చూపించే ఇంట్లో ఉండాలా? అమెరికన్ పౌరుడికి ఆ మాత్రం స్వతంత్రం లేదా? నో థాంక్స్ తాళం చెవులు ఇవ్వు" కోపంగా చేతిని చాపాడు కెంట్.

నికర్సన్ ఇక తప్పదనుకుని అయిష్టంగా పీబాడీ ఇంటి తాళం చెవులు ఇచ్చాడు. ఆ తర్వాత అతను అనేక సందర్భాల్లో అన్నాడు, తను చేసిన ఘనోరమైన తప్పు ఆ తాళం చెవులు ఇవ్వడం అని, వాటిని చెరువులో పడేస్తే పీడా పోయేదని.

కెంట్ కేస్ట్ వెల్ ఏ పనీ చేయడు. అతని భార్యకి నెలకోసారి దూరప్రాంతం నించి మని ఆర్డర్ వస్తుంది. అది ట్రస్ట్ కంపెనీ నించి రావడంతో, ఆమె నించి విడాకులు తీసుకున్న మొదటి భర్త పంపే భరణమో, లేదా ఆమెకి ఉన్న ఆస్తిపాస్తుల వల్ల లభించే ఆదాయమో అయివుండచ్చని గ్రామస్థులు అనుకున్నారు. 'శ్రీమతి లూయి కౌన్ అని సంతకం చేసి తీసుకుంటుందామె.

వెంటనే ఆ డబ్బుని భర్త చేతుల్లో పోస్తుంది. 'లూయి కేస్ట్ వెల్ అని సంతకం చేయక 'లూయి కౌన్ అని ఆమె సంతకం చేయడం, పైగా అదే పేరున యం.ఒ.లు రావడంతో గ్రామస్తులకి అనుమానం వచ్చింది.

లూయిని కెంట్ బాగా బాధించడం కూడా అందరికీ తెలిసింది. తను చూసే టివి ఛానల్ మారిస్తే తిడతాడు. భోజనం రుచికరంగా లేకపోతే కొడతాడు. బీరు ఫ్రిజ్లో ఉంచడం మర్చిపోతే బెల్ట్తో కొడతాడు. రోజూ సోఫాలో పడుకుని టి.వి. చూస్తూ బీరు లాగిస్తూంటాడు కెంట్.

అమెరికా దేశ నియమాల ప్రకారం ఏ ఒక్క పౌరుడు కూడా ప్రభుత్వం అందించాల్సిన సౌకర్యాలు అందకుండా బాధపడకూడదు. దాంతో విధి లేక నికర్సన్ పీబాడీ ఇంటికి తారు రోడ్డు వేయించి, స్కూల్ బస్సుని అక్కడి దాకా పంపే ఏర్పాటు చేసాడు. ఆ పిల్లవాడు స్కూల్ కి రాడని కెంట్ ముందే చెప్పడు. "ఇవాళ రాడు" అని స్కూల్ బస్సు వచ్చాక డ్రైవర్తో చెప్తాడు కెంట్. రేపు?" అని అడిగితే, రేపు వస్తే చెప్తాను" అని బదులిస్తాడు. ఒక్క కెంట్ కొడుకు కోసం మిగిలిన పిల్లల్లో కొందరు మునపటికన్నా ముప్పావుగంట ముందే బస్సులో బయలుదేరాల్సి వస్తోంది.

ఆ రోడ్డు అతనికి ఇష్టారాజ్యం అయింది. రోడ్డు మధ్యన కుర్చీ వేసుకుని కూర్చుని బీరు తాగుతాడు. ఎవరిదైనా కారు వస్తే ఆ కారు డ్రైవర్ దిగి వచ్చి పక్కకి జరగమని చెప్పేదాకా లేవడు. అదీ కోపంగా కాదు. మర్యాదగా రిక్వెస్ట్ చేస్తేనే కుర్చీని పక్కకి వాళ్ళనే తీయమంటాడు. తిరిగి దాన్ని తీసిన చోట వేయకపోతే బండ బూతులు తిడతాడు. అతని ప్రవర్తన గురించి నికర్సన్ కి అనేకమంది గ్రామస్టులు ఫిర్యాదు చేసారు. ఆ నేరానికి అతన్ని జైల్లో పెట్టచ్చు. కాని నికర్సన్ ఆ పని చేయలేదు.

కెంట్ ఆ గ్రామానికి వచ్చిన ఎనిమిదో రోజు ఆ గ్రామంలో బార్లో మొదటిసారిగా గొడవపడ్డాడు. తనకి అడ్డు వచ్చిన వాళ్ళని పిడికిళ్ళతో కొట్టాడు. నికర్సన్ అతన్ని అరెస్ట్ చేసి స్వంత బెయిల్ మీద వదిలాడు. మర్నాడు కోర్టుకి హాజరవమని చెప్పాడు.

కెంట్ కోర్టుకి హాజరవకపోవడంతో తనే తన కారులో వెళ్ళి కెంట్ని తీసుకువచ్చాడు. జడ్జిని నియమించేంత ఫండ్స్ ఆ గ్రామంలో టాక్స్ ల రూపంలో వసూలవడం లేదు. అందుకని నికర్సనే జడ్జిగా వ్యవహరిస్తున్నాడు.

'శాంతికి విఘాతం కలిగించినందుకు, బూతులు మాట్లాడినందుకు, అరెస్ట్ ని వ్యతిరేకించినందుకు పది డాలర్ల ఫైన్ చెల్లించు. లేదా పది రోజుల జైలు శిక్ష అనుభవించు. కోర్టు క్లర్క్ కి ఫైన్ చెల్లించు." జడ్జిగా వ్యవహరించిన నికర్సన్ ఆజ్ఞాపించాడు.

"ఊహు. పది రోజులు జైలు శిక్ష కోరుకుంటాను నేను." చెప్పాడు కెంట్.

"మిస్టర్ కెంట్, అది కేవలం చట్టపరమైన భాష మాత్రమే. ఈ గ్రామంలో జైలుని ఏనాడో మూసేసాం. గత నాలుగేళ్ళుగా ఎవరూ జైలుశిక్ష పడేంత నేరాలు కూడా చేయలేదు."

"అయితే నా కోసం తెరవండి." చెప్పాడు కెంట్.

"నీకు అర్థం కానట్లుంది. నీకు జైలు శిక్ష విధించాలంటే మూడు షిఫ్ట్ లలో గార్డ్స్ ని నియమించాలి. ఇది నవంబర్ నెల. ఫిబ్రవరి దాకా చలి పోవడానికి జైల్లో వేడికి కట్టెలు కాల్చాలి. నీకు భోజనం, ఇతర ఏర్పాట్లు చేయాలి. నీ ఒక్కడి కోసం ఈ గ్రామ ప్రజల టాక్స్ లు అలా ఖర్చు చేయడం నాకు ఇష్టం లేదు. పది డాలర్లు ఫైన్ చెల్లించి వెళ్ళు."

"కాని నాకు జైలు శిక్ష కావాలి."

"నీ కోరిక ప్రకారం నిన్ను జైల్లో పెట్టాలంటే మాకు ఎంత ఇబ్బందో చెప్పాగా. ఈ గ్రామాధికారిగా అది నాకు సాధ్యం కాని పని."

"అది మీ సమస్య కాని నా సమస్య కాదు." మొండిగా చెప్పాడు కెంట్.

నికర్సన్ అతని వంక నిప్పులు కురిసేలా చూసాడు.

‘‘ఇది ముద్దాయి మొదటి నేరం కాబట్టి అతని శిక్షని రద్దు చేయమని సూచిస్తున్నాను." చెప్పాడు డిస్ట్రిక్ట్ అటార్నీ (పబ్లిక్ ప్రాసిక్యూటర్) గా వ్యవహరించిన గ్రామస్తుడు వెంటనే.

"సరే."

కెంట్ ఈల వేస్తూ బయటికి నడిచాడు. అయితే మర్నాడు మళ్ళీ అదే తరహా నేరం మీద కెంట్ కోర్ట్ కి తీసుకు రాబడ్డాడు. అలా ఒకసారి కాదు. అరడజను సార్లు. కెంట్ చెల్లించాల్సిన ఫైన్ అరవై డాలర్లు లేదా అరవై రోజుల జైలు శిక్షకి పెరిగింది. ప్రతీసారి అతను జైలు శిక్షే కోరుకోసాగాడు. ఏడో సారి నికర్సన్ చెప్పాడు.

‘‘నీ కోరిక మీద జైలు శిక్షే ఖాయం చేస్తాను. కాని అక్కడి భోజనం నీకు బావుండదు."

‘‘అమెరికా చట్టం నిర్దేశించిన ప్రకారం నాకు జైల్లో భోజనం పెట్టకపోతే స్టేట్ బోర్డ్ ఆఫ్ ప్రిజన్స్ ఇన్ స్పెక్టర్ కి ఫిర్యాదు చేస్తాను." బెదిరించాడు.

క్రితం సారి ప్రిజన్ ఇన్ స్పెక్టర్ వచ్చి ఆ గ్రామ జైలుని పరిశీలించినప్పుడు నాలుగు వేల డాలర్లు దాని రిపేర్ల కోసం ఖర్చు చేయాల్సి వచ్చింది.

అతని జైలు శిక్షని వేసవిలో అనుభవించేలా ఆజ్ఞాపించాడు నికర్సన్. అందువల్ల హీటింగ్ ఖర్చయినా తగ్గుతుంది.

ఆ గ్రామంలోని ఒక్క కెంట్ శిక్ష కోసం అనేక అధిక ఖర్చులు చేయాల్సి రావడం నికర్సన్ కి పెద్ద సమస్యగా తయారైంది. ఒక్కడి కోసం వేల డాలర్లు ఖర్చు చేయడం దారుణం. అలా అని అతను కృతజ్ఞతగా ఉంటున్నాడా అంటే అదీ లేదు. అందరితోనూ వదరుబోతు తనంతో కూడిన వాగ్యుద్ధాలకి దిగుతూంటాడు. ఆ గ్రామంలోని యువకులంతా ఇతర ఊర్లకి పెద్ద ఉద్యోగాలు సంపాదించుకొని వెళ్తున్నారు. కాని కెంట్ కేస్ట్ వెల్ కి అక్కడ బావున్నట్లుంది. ఆ గ్రామం వదిలేలా లేడు.

కెంట్ గురించిన వ్యాకులత నికర్సన్ కె కాక ఆ గ్రామంలోని అందరికీ ఉంది. కాని ఎవరూ ఏమి చేయలేరు. ఏదైనా చేయాలనుకున్నా అది చట్ట పరిధిలో లేనిదే కాబట్టి అంతా సహించి భరిస్తున్నారు.

* * *

రైలు స్టేషన్కి చేరుకున్న క్లెమ్ రైల్లోంచి దిగుతున్న కొత్త ప్రయాణీకుడ్ని చూసి ఆ రోజు ట్రిప్ వృథా కాలేదనుకుని సంతోషించాడు.

సన్నగా రివటలా ఉన్న అతని కళ్ళజోడు అద్దాలు దళసరివి. పెరిగిన గడ్డం, మీసాలు. మొహంలో చురుకుతనంతో పాటు మేధావితనం కూడా కనిపిస్తోంది.

"టాక్సీ సార్?" అడిగాడు క్లెమ్.

"ఏష్బీ గ్రామానికి వెళ్ళాలి." మృదువుగా చెప్పాడతను.

"రండి సార్. అక్కడ ఎవరింటికి వెళ్ళాలి?" అడిగాడు.

"పీబాడీ ఇంటికి."

"ఓ! కెంట్ మీకు ఏమౌతారు?"

"ఏం కాదు. అతని ఇంట్లో ఓ గది అద్దెకి ఇస్తున్నాడు."

"మీరీ గ్రామం ఎందుకు వచ్చినట్లు?"

"ఈ గ్రామం చుట్టుపక్కల అడవులు, చెరువులు, కొండలు...నేను ప్రకృతిని చిత్రించే చిత్రకారుడ్ని ఇక్కడ బాగా ప్రశాంతంగా ఉంటుందని తెలిసి వచ్చాను."

"మీ ఇద్దరికి ఎలా పరిచయం?" దారిలో ఆస్తకిగా అడిగాడు క్లెమ్

"పేపర్లో చిత్రకారులు వచ్చి గడపాల్సిన గ్రామం అని ప్రకటన ఇచ్చాడు కెంట్. దానికి నేను జవాబు రాసాను. భోజనంతో కలిపి నెలకి నూట ఏభై డాలర్లు. చవకే. అన్నట్లు నా పేరు బాట్

" సిటీ వాళ్ళు. కాబట్టి మీకు చవకే. మాకు కాదు. అనుకున్నాడు క్లెమ్ మనసులో,

“అతను ఆ ఇంటికి నెలకి ఇచ్చే అద్దె నూట ఏభై డాలర్లు మీ నించి ఇలా రాబడుతున్నాడన్న మాట."

"కావచ్చు. కాని నాలుగు గోడలు, పైన రూఫ్, తిండికి కాదు నేను వెల చెల్లించేది. చుట్టుపక్కల ప్రకృతికి."

పీబాడి ఇంటి దగ్గర దింపి మూడు డాలర్లు తీసుకున్నాడు క్లెమ్. అతను టిప్ గా పాతిక సెంట్లు కూడా ఇచ్చేసరికి క్లెమ్ కి ఆ చిత్రకారుడి మీద గౌరవం పెరిగింది. నికర్సన్ ని కలిసి జరిగింది చెప్పాడు.

"కెంట్ తో అతనేం నెగ్గుకు రాగలడు? చూస్తూండు. నెల అడ్వాన్స్ చెల్లించినా వారంలో ఆ ఇల్లు వదలి వెళ్ళిపోతాడు." చెప్పాడు నికర్సన్.

కెంట్ ఏష్బీ గ్రామానికి రావడం ఎక్కువైంది. తాగుడు కూడా. కెంట్ తాగి, వాగిన వాగుడు వల్లే గ్రామస్తులకి తెలిసింది అతను ఆ చిత్రకారుడి నించి డబ్బు ఎలా గుంజుతున్నాడో,

కిటికీ బాగు చేయించాలని, కొత్త కార్పెట్ వేయిస్తానని, వేడి నీళ్ళు సదా వచ్చేలా ఏర్పాటు చేస్తానని మాయ మాటలు చెప్పి కెంట్ అతన్నించి ఆరు నెలల అద్దె అడ్వాన్స్ గా వసూలు చేసాడు. అవి అతను నెరవేర్చని ఒప్పందాలని నికర్సన్ తో సహా గ్రామస్తులందరికీ తెలుసు. అయితే ఆ చిత్రకారుడు మాత్రం ఎన్నడూ ఆ గ్రామంలోకి వచ్చేవాడు కాడు. నాలుగైదు రోజులకి పోస్ట్ మెన్ బాట్ కి వచ్చిన ఉత్తరాలు ఇవ్వడానికి వెళ్ళేవాడు. అన్నిసార్లు అతనికి ఆ

చిత్రకారుడు శ్రద్ధగా బొమ్మలు గీస్తూనే కనిపించాడు. ఆ గ్రామం చుట్టు పక్కల కనిపించే అనేక ప్రకృతి దృశాలు అతని గది గోడల మీద రంగురంగుల బొమ్మల్లో అందంగా కనిపించేవి.

"సిటీకి వెళ్ళాక బాబ్ ఒకో బొమ్మని అయిదారు వందల డాలర్ల దాకా అమ్ముతాడని అనుకుంటాను." నికర్సన్ కి చెప్పాడు పోస్ట్ మేన్.

"అవును. అంతంత ఖరీదు పెట్టి చిత్రాలు కొనేవారు సియాటెల్ నగరంలో వేలకి వేల మంది." ఒప్పుకున్నాడు నికర్సన్ కూడా.

ఓ సారి ఆ చిత్రకారుడు అనుకోకుండా గ్రామానికి పైపులోకి పోగాకు కొనడానికి వచ్చాడు. వెళ్ళేటప్పుడు క్లెమ్ టాక్సీ ఎక్కాడు. దారిలో తన బాధలు క్లెమ్ కి విన్నవించుకున్నాడు.

"అంతా బానేవుంది ఇక్కడ. ఒక కెంట్ తప్ప."

"ఏం? ఏమయింది?" అడిగాడు క్లెమ్ ఉత్సాహంగా.

"కెంట్ కి మంచి మర్యాద తెలియదు. నాలుగు రోజుల క్రితం అతను తన భార్యని, పిల్లవాడిని వాళ్ళ ఊరు పంపాడు. పెద్ద పెద్దగా అరుస్తాడు. నేను ఏకాగ్రతతో చిత్రాలు గీసుకుంటూంటే టి.వి. సౌండు పెద్దగా పెడతాడు. ఒద్దంటే వినడు. నాకు వడ్డించే భోజనంలో ఉప్పు తక్కువ. నాకు ఇచ్చే కాఫీలో చక్కెర ఉండదు. రాత్రుళ్ళు నిద్ర పోనీకుండా పెద్దగా బూతు పాటలు పాడుతాడు. లేదా రేడియో పెడతాడు. అతని నోరు తెరిస్తే బూతు మాటలు తప్ప ఇంకేం రావు. ఇతరులంటే అతనికి ఖాతరు లేదు. ఆఖరికి అతని కొడుకు, భార్య అన్నా కూడా. పాపం వాళ్ళూ బాగా ఇబ్బంది పడుతున్నారు. భరించక తప్పడం లేదు."

"నేను అనుకోవడం మీరిచ్చిన అడ్వాన్స్ తీరే దాకా మీరా ఇంట్లో ఉండకుండా జాగ్రత్త పడుతున్నాడు."

"ఏం?"

"మీరు వెళ్ళిపోతే ఆ స్థానంలో ఇంకో చిత్రకారుడు వస్తాడు. అతన్నించి కూడా డబ్బు వసూలు చేయచ్చు. కాబట్టి మిమ్మల్ని బయటికి పంపే ప్రయత్నంలోనే ఇదంతా జరుగుతూండచ్చు." చెప్పాడు క్లెమ్.

‘‘కావచ్చు. ఆ ప్రకటనకి నాతో పాటు ఇంకా ఎంతమంది జవాబు ఇచ్చారో?" చెప్పాడు బాబ్ చిన్నగా నిటూరుస్తూ,

క్లెమ్ అతన్ని ఇంటి దగ్గర దించాక ఎప్పటిలా పాతిక సెంట్లు టిప్ ఇచ్చాడు బాబ్

మర్నాడు చీకటి పడ్డాక నికర్సన్ ఇంటి డోర్ బెల్ మోగింది. మిసెస్ నికర్సన్ తలుపు తెరిచింది. అనేక రంగుల మరకలున్న టీషర్ట్ తొడుకున్న ఒకతను అడిగాడు.

"నికర్సన్ ఉన్నారా?"

‘‘ఉన్నారు. మీరు పీబాడి ఇంట్లో ఉంటున్న పెయింటరై ఉండాలి?" అడిగిందామె నవ్వుతూ.

‘‘అవును. ఆయనతో అర్జంటుగా మాట్లాడాలి." ఆదుర్దాగా చెప్పాడు అతను.

'లోపలకి రండి.’’

నికర్సన్ వచ్చి చేయి చాపి అతనితో కరచాలనం చేస్తూ అడిగాడు.

"మీరు బాబ్ కదా? ఏమిటంత ఆదుర్దగా ఉన్నారు?"

"నేనో నేరం చేసాను. ఈ గ్రామంలో మీరే జడ్జి కదా?"

‘‘అవును?’’

"మీకు లొంగిపోవాలని వచ్చాను."

"కూర్చోండి. ఏం నేరం చేసారు?" అడిగాడు నికర్సన్ అతన్ని

"పీటాడి ఇంట్లో ఓ గదిని మిస్టర్ కెంట్ నాకు అద్దెకిచ్చాడు అని మీకు తెలిసే ఉండాలి. అక్కడ రెండు వారాలుగా ఉంటున్నాను. నిజానికి పదమూడు రోజులుగా. మొదటి వారం అతను బానే ఉన్నాడు. గత ఐదారు రోజులుగా అతను నన్ను ఎన్నో రకాలుగా హింసిస్తున్నాడు."

"విన్నాను. టాక్సీ డ్రైవర్ నాకంతా చెప్పాడు."

"చిత్రాలు గీయాలని నేను అతను చేసేవన్నీ సహనంగా భరిస్తూ వస్తున్నాను. కాని ఇందాక కెంట్ నేను భరించలేని పని చేసాడు. నా పెయింటింగ్స్ ని పరమ చెత్త అని కామెంట్ చేసాడు. ననేమైనా అను కాని వాటినేం అనద్దన్నాను. అయినా వినిపించుకోలేదు. నేనిక్కడ గీసిన ఆరు పెయింటింగ్స్ మీద రంగు వలకబోసాడు. దాంతో నేను కోపం పట్టలేక అతన్ని చలిమంట కోసం వాడే కట్టెతో తల మీద మోదాను. దాంతో అతను...అతను చచ్చిపోయాడు. నేను హంతకుడ్ని మీకు లొంగిపోవడానికి వచ్చాను." ఒణికే స్వరంతో చెప్పాడు బాబ్,

నికర్సన్ అతను చెప్పేది శ్రద్ధగా విన్నాడు. తర్వాత అతని వంక దయగా చూస్తూ అడిగాడు.

"ఈ విషయం మీరు ఇతరులకి ఎవరికైనా చెప్పారా?"

"లేదు. సరాసరి మీ ఇంటికే వచ్చి మీకే చెప్తున్నాను."

"వెరీ గుడ్, మీరు కెంట్ ని కట్టెతో కొట్టానన్నారు. దానికి రక్తం అంటిందా?"

"కొద్దిగా."

"మీరో పని చేయండి. వెంటనే వెళ్ళి ముందు దాన్ని చలిమంటలో వేసి కాల్చేయండి.

ఎదురు చూడని ఆ సలహాకి బాబ్ అయోమయంగా చూసాడు.

నికర్సన్ ఓ కాగితం అందుకుని గబగబ దాంట్లో ఏదో రాసి బాబ్ కి ఇచ్చి చెప్పాడు.

“ఇది మీరు నాకు ఇచ్చిన సమాచారం. చదివి సంతకం చేయండి."

అందులో, తాగి తూలుతూ నడుస్తున్న కెంట్ కాలు జారి నేల మీద పడి తలకైన గాయంతో మరణించడం తను చూసానని బాబ్ నికర్సన్ కి చెప్పినట్లుగా స్టేట్మెంట్ ఉంది. బాబ్ నమ్మలేనట్లుగా చూసాడు నికర్సన్ వంక.

"ఎందుకిలా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మిమ్మల్ని జైల్లో పెట్టాలి. తర్వాత కేసుని విచారించాలి. ఆ ట్రయల్ కి మా గ్రామానికి వేల కొద్దీ డాలర్ల ఖర్చవుతుంది. వేల కొద్దీ! కెంట్ కేస్ట్ వెల్ కోసం అంత ఖర్చు చేయడం శుద్ధ దండుగ. చచ్చినవాడు ఎటూ చచ్చాడు. మీకెందుకు మచ్చ? అసలు మీరు నా దగ్గరికి రాకుండా సరాసరి రైల్వేస్టేషన్ కి మీ సామానుతో వెళ్ళాల్సింది. ఇంకో గంటలో సియాటిల్ కి రైలు ఉంది. పదండి. నేను మిమ్మల్ని రైల్వే స్టేషన్లో దించుతాను.

" క్లెమ్ టాక్సీలో ఆ ఇద్దరు రైల్వే స్టేషన్కి చేరుకున్నారు. దారిలో ఎవరూ మాట్లాడలేదు. బాబ్ ని అతని సామానుతో రైలెక్కించాక తిరిగి వస్తూ చెప్పాడు నికర్సన్ క్లెమ్ తో.

“ఏప్టీ బార్ దగ్గర కొద్ది సేపు ఆపు. సెలబ్రేట్ చేసుకుందాం."

“ఏం సెలబ్రేట్ చేసుకుందాం?" అడిగాడు క్లెమ్ ఆసక్తిగా.

"ఇంక మనం మన గ్రామసులకి పన్ను పెంచనవసరం లేదు. చాలా ఖర్చులు తగ్గాయి. అన్నట్లు మనం కెంట్ కేస్ట్ వెల్ శవానికి మన గ్రామ ఫండ్స్ తోనే అంత్యక్రియలు జరిపించాలి. అది మనం అతని కోసం పెట్టే ఆఖరి ఖర్చు" నవ్వుతూ చెప్పాడు నికర్సన్.

---

## స్వతంత్రం - లారెన్స్ పేజ్

అతనికా ఆలోచన అకస్మాత్తుగా తట్టింది. ఆ వింత ఆలోచనకి అతను ఉలిక్కిపడలేదు. భయపడలేదు. ఆకర్షింపబడ్డాడు.

రోజులా నిద్ర లేచి తన భార్య ఎల్సీకి బ్రేక్ ఫాస్ట్ ఒండుతూండగా రూథర్ఫర్డ్ పార్నెల్ కి ఆ ఆలోచన కలిగింది. ఎల్సీ వంటగదిలోకి ఎన్నడూ రాదు. అసలు తన పడక గదిని వదిలి ఎక్కడికీ వెళ్ళదామె. చక్రాల కుర్చీలో నిశ్శబ్దంగా కూర్చునే ఎల్సీ నోరు విప్పిందంటే అది తన భర్త రూథర్ఫర్డ్ మీద ఆరవడానికే తప్ప సాధరణంగా మరొకందుకు కాదు. ఎప్పుడైనా ఆమె అతని వంక ఎక్కువ సేపు చూసిందంటే, ఆ చూపులో అప్యాయత ఉండదు. ద్వేషం కురుస్తుంది. గత పదేళ్ళుగా వారి సంసార జీవితం అదే పద్ధతిలో సాగిపోతోంది.

"రూథర్ఫర్డ్" అకస్మాత్తుగా లోపలినించి ఎల్సీ పిలుపు అతనికి వినిపించింది.

‘‘వస్తున్నా.’’

‘‘ఈ క్షణమే నా గదిలోకి రా." ఎల్సీ కంచు కంఠం గట్టిగా మోగింది.

ఆమెకి ఉదయపు టీ ఇప్పుడే ఇచ్చి వచ్చాడు. ఇంతలో ఏమైంది? అతను విసుగుని అణచుకుంటూ, చేతిలోని దినపత్రికని పక్కన పెట్టి లేచి తన భార్య గదిలోకి వెళ్ళాడు.

"నీలాగే ఈ టీ కూడా ఎంతో వీక్ గా ఉంది. నాకు స్టాంగ్ టీ కావాలని తెలీదూ? నువ్వు చేసేవన్నీ నిరుపయోగమైన పనులే, వంటతో సహా. వండటానికి ఎవరైనా వంటమనిషిని చూడరాదూ? డబ్బుకి కొదవలేదుగా?"

‘‘వంటకి మిసెస్ కేసీ ఉందిగా?"

"దాన్ని మార్చేయ్."

గత పదేళ్ళల్లో అప్పుడే ఆమె ఎనిమిదో వంటగత్తె. ఏడాది, ఏడాదిన్నర మించి ఎల్సీ ఎవర్నీ భరించలేదు. ప్రతీ వాళ్ళల్లో ఏదో ఓ తప్పు కనిపెట్టి, దాన్ని భూతద్దంలోంచి చూస్తుంది.

‘‘ఉడికిన ఉల్లిపాయలున్న ఏదీ నేను తిననని మిసెస్ కేసీకి ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు. దాన్ని తీసెయ్."

‘‘అలాగే.’’

భార్య ఖాళీ చేసిన టీ కప్పుతో బయటికి నడిచాడు రూథర్ఫర్డ్

మధ్యాహ్నం వంట చేయడానికి వచ్చిన మిసెస్ కేసీ అతన్ని అడిగింది.

"మిస్టర్ పార్నెల్, మీతో ఓ నిమిషం మాట్లాడచ్చా?"

‘‘తప్పకుండా."

"మిస్టర్ పార్నెల్. నేను ఈ ఉద్యోగం మానే ముందు మీకు ఓ వారం ముందుగా చెప్పాలన్నది మన అంగీకారం. ఇవాళ శనివారం. పై శుక్రవారం దాకా నేను పనికి వస్తాను. ఆ తర్వాత రాను. ఎక్కువ జీతం గల ఇంకో ఉద్యోగం దొరికింది నాకు." చెప్పిందామె.

‘‘అలాగే. కాని నిజం చెప్పు. ఎక్కువ జీతం కోసం వేరే ఉదోగ్యం చూసుకున్నావా? లేక..." ఆపేసాడు.

అవునన్నట్లుగా ఆమె తలూపింది. ఎల్సీ తుటాల్లాంటి మాటలు ఎవరూ భరించలేరు.

రూథర్ఫర్డ్ కోటు, టోపీ అందుకుని వాటిని ధరించి ఇంట్లోంచి బయటికి వచ్చాడు. అది సూర్యరశ్మి ప్రసరిస్తున్న అందమైన రోజు. బస్ స్టాప్ దాకా నడిచాడు. డౌన్ టౌన్ కి వెళ్ళే పదహారో నంబర్ బస్సు కోసం నిలబడ్డాడు.

అతను తన కారుని ఏక్సిడెంట్ తర్వాత అమ్మేసాడు. ఎల్సీ నడిపిన ఆ కారుకి చిన్న రిపేర్లు చేయిస్తే మళ్ళీ దాన్ని నడపచ్చు. కాని తన భార్య కాళ్ళని తీసేసుకున్న ఆ కారులో తిరగడానికి మనసు ఒప్పక రూథర్ఫర్డ్ దాన్ని చవాగ్గానే అమ్మేసాడు. అప్పటినించి ఇంకో కారు కొనకుండా బస్సులోనే ఆఫీస్ కి వెళ్ళివస్తున్నాడు. తన భార్య చక్రాల కుర్చీకే పరిమితమైనప్పుడు తను కారులో తిరగటం భావ్యం కాదు అని అతని అభిప్రాయం.

కొత్తలో ఎల్సీ బానే ఉండేది. కాని నెలలు గడిచే కొద్దీ, జీవితంలో తను ఇంక బయటి ప్రపంచం చూడలేనన్న అసంతృప్తి, అసహనం ఆమెని అలుముకున్నాయి. దాని వల్ల కలిగిన ఫ్రస్టేషన్, సంఘర్షణ ఆమె మాటల్లో వ్యక్తం అవుతూంటాయి.

బస్సు స్టాప్ లో నిలబడ్డ రూథర్ఫర్డ్ ఆ ఉదయం తనకి కలిగిన ఆలోచనని మళ్ళీ ఓసారి నెమరు వేసుకున్నాడు. తన భార్య వల్ల తనకి కలిగే సమస్యకి అది సరైన పరిష్కారంగా అతనికి తోచింది.

వెంటనే బస్ స్టాప్ కి వందడుగుల దూరంలో ఉన్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ వైపు నడిచాడు. తన ఆఫీస్ కి ఫోన్ చేసాడు.

‘‘హలో మేరీ? నేను రూథర్ఫర్డ్ ని.

" హలోరూథర్ఫర్డ్. ఒంట్లో బాగా లేదా?"

‘‘లేదు. అందుకే ఫోన్ చేసాను. ఇవాళ ఆఫీసుకి రాలేను."

"మిస్టర్ స్పీక్స్ కి ఈ విషయం చెపుతాను. రేపటికి మీ ఆరోగ్యం కుదుటపడుతుందని ఆశిస్తాను."

"థాంక్స్ మేరీ

’’రూథర్ఫర్డ్ తన ఆఫీస్ వైపుకి కాక, దాని వ్యతిరేక దిశలో వెళ్ళే బస్సు ఎక్కాడు. ముందు తన ఇన్సూరెన్స్ కంపెనీకి, తర్వాత బేంక్ కి వెళ్ళి అక్కడి పని చూసుకున్నాక ఓ బిల్డింగ్ లోకి నడిచాడు. దాని బయట క్రష్ మెన్ అండ్ సన్స్, ఫ్యూనరల్ హోమ్ అన్న బోర్డ్ ఉంది. సన్నగా ఉన్న క్రష్ మెన్ తన కళ్ళజోడులోంచి చూస్తూ రూథర్ఫర్డ్ ని అడిగాడు.

‘‘మీకేం సహాయం చేయగలను?"

రూథర్ఫర్డ్ తన మొహంలోకి విచారాన్ని బలవంతంగా తెచ్చుకుని చెప్పాడు.

"మీరు అన్ని వ్యవహారాలు నా తరపున పూర్తి చేస్తే మీకు కృతజ్ఞుడిగా ఉంటాను.’’

‘‘తప్పకుండా. అర్థమైంది. మీకిది బాధాకరమైన రోజని నాకు తెలుసు. మరణించిన వ్యక్తి పేరు దయచేసి చెప్తారా?" ఓ పెన్సిల్ అందుకుని అడిగాడు క్రష్ మెన్.

వెంటనే రూథర్ఫర్డ్ ఓ కాగితాన్ని జేబులోంచి తీసిచ్చి చెప్పాడు.

"ఇందులో పేరు, చిరునామా రాసి ఉంచాను. ఈ సాయంత్రం మా ఇంటికి వచ్చి శవాన్ని తీసుకెళ్ళగలిగితే..."

‘‘తప్పకుండా. కాని అందుకు నాకు అనుమతి కావాలి. అది ఎవరిస్తారు? మరణించినవారు మీకేం అవుతారు?" అడిగాడు అతను

‘‘మీరు పాటించాల్సిన నియమాలన్నీ నాకు తెలుసు. సాయంత్రానికల్లా అనుమతి పత్రం మీకు అక్కడ సిద్ధంగా ఉంటుంది. ఎనిమిదికి వస్తే చాలు."

‘‘ఎనిమిదికా? సరే. ఏ రకం ఫ్యూనరల్ కావాలి మీకు?"

"ఆ శవం...మరణించిన వ్యక్తికి బంధుమిత్రులు ఎవరూ లేరు. కాబట్టి శవం వెంట ఎవరూ రారు. చవక రకం శవపేటిక చాలు."

నాలుగైదు నిమిషాలలో అవన్నీ సెటిల్ చేసి డబ్బు చెల్లించాడు రూథర్ఫర్డ్. దారిలో ఓ చైనీస్ హెర్బల్ షాప్ లోకి వెళ్ళి ఓ మందు కొన్నాడు. అది విషం.

రోజు కన్నా ముందే ఇంటికి తిరిగి వచ్చిన రూథర్ఫర్డ్ ని చూసి ఆశ్చర్యపడిన మిసెస్ కేసీ అడిగింది.

‘‘ఇవాళ మీరు ఆఫీస్ కి వెళ్ళలేదా?"

‘‘లేదు మిసెస్ కేసీ. నువ్వింక ఇంటికి వెళ్ళొచ్చు. ఈ పూట భోజనం అవసరం లేదు.’’

జేబులోంచి పర్సు తీసి మిసెస్ కేసీకి డబ్బు చెల్లించి చెప్పాడతను.

‘‘ఇంక రేపటినించి నువ్వు రానవసరం లేదు, గత పధ్నాలుగు నెలలుగా ఇక్కడ పని చేసినందుకుగాను ఇదో చిన్న బోనస్."

మరికొంత మొత్తం కూడా ఆమెకి చెల్లించాడు రూథర్ఫర్డ్, ఆమె మొహం వికసించింది.

"థాంక్స్ మిస్టర్ పార్నెల్, ఇంకొకరు కుదిరారా?"

‘‘కుదరలేదు. కాని...’’

వెంటనే మిసెస్ కేసీ మొహంలోని సంతోషం మాయమై బాధ ప్రవేశించింది.

"మీ భార్యని నేను సహించి, భరించలేక వెళ్ళిపోతున్నానని మీకు కోపం వచ్చినట్లు ఉంది? అయాం సారీ. కానీ...’’

"నాక్కూడా నీలాగే ఆమె అంటే ద్వేషం. నీ అంత తేలికగా నేను కూడా నడిచి వెళ్ళిపోగలిగితేనా? కాని నాకా స్వతంత్రం లేదు. ఆమె మరణిస్తే నేను స్వతంత్రుడ్ని అవుతాను."

అంత ఫ్రాంక్ గా అతను చెప్పిన మాటలకి బదులుగా మిసెస్ కేసీకి ఏ మాట్లాడాలో తోచలేదు.

"గుడ్ బై" చెప్పి వెళ్ళిపోయింది.

"రూథర్ఫర్డ్? ఎవరది? రుథర్ఫర్డేన?'' ఆకస్మాత్తుగా ఖంగున భార్య కంఠం లోపలనించి వినిపించింది.

‘‘అవును డియర్. వస్తున్నాను."

అతను ఓసారి తన ప్రయత్నం లేకుండా కోపంగా బిగుసుకున్న తన చేతి గుప్పెట వంక చూసి వేళ్ళని విడదీసాడు. తర్వాత గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలి భార్య పడక గదిలోకి నడిచాడు. సరాసరి కిటికీ దగ్గరకి వెళ్ళి కిటికీ తెరలు తెరిచాడు. ఆ గదిలోకి సూర్యరశ్మి ప్రవేశించింది.

"రూథర్ఫర్డ్ నీకేమైనా పిచ్చెక్కిందా? నాకు కిటికీ తెరలు మూసి ఉంచటం ఇష్టం అని నీకు ఎన్నిసార్లు చెప్పాలి?"

జవాబు చెప్పకుండా అతను చైనీస్ మందుల షాపులో కొన్న విషం ప్యాకెట్ని బయటికి తీసాడు.

‘‘నీ కోసం ఓ బహుమతి కొని తెచ్చాను డార్లింగ్. చిన్న బహుమతి. దీని సహాయంతో నీ వంటరితనం, విచారం మటుమాయమౌతాయి."

"నువ్వేం చెప్తున్నావో నాకు అర్థం కావడం లేదు. కిటికీ తెరలు ముందు దించు. నేను ఆ వెలుతురుని భరించలేను. అప్పుడే వచ్చేసావు? నీ తెలివిమాలినతనం వల్ల కొంపతీసి నీ ఉద్యోగం కాని ఊడిందా?"

‘‘నువ్వు అందంగా ఉంటావని నేనెన్నడైనా నీతో అన్నానా? పొరపాటున ఆ మాట అని ఉంటే నేను అబద్ధాలకోరునని తెలుసుకో.’’ చెప్పాడు అతను.

"ఇవాళ నీకు ఏదో అయింది." కీచుగా ఆరిచింది ఎల్సీ

రూథర్ఫర్డ్ గిరుక్కున వెనక్కి తిరిగి వంటగదిలోకి వెళ్ళాడు. ఫ్రిజ్లోని పాల కార్టన్ని తీసి అందులోని పాలని ఓ గ్లాస్లోకి వంచాడు. పాలల్లో ఆ విషం కలిపి చెంచాతో బాగా కలియపెట్టాడు. ఆ గ్లాస్ తో భార్య గదిలోకి నడిచాడు.

"నాకు పాలంటే అసహ్యం. నీకా సంగతి తెలుసు. బలవంతం చెయ్యకు." ఆ గ్లాసు చూసి అరిచింది ఎల్సీ.

"కాని కాఫీలో కలుపుకుని తాగుతావుగా?"

"ఉట్టి పాలు నాకు సహించవు."

‘‘కంగారు పడకు. నీ చేత బలవంతంగా దీన్ని తాగించను. అసలు గత పదేళ్ళుగా నీ చేత నేను ఏ పనైనా బలవంతంగా చేయించానా డార్లింగ్?"

‘‘నీ మాటలు ఇవాళ కొత్తగా ఉన్నాయి. అసలు మా అమ్మ నిన్ను చేసుకోవద్దని గట్టిగా చెప్పినప్పుడు నేను ఆమె మాటలు విని ఉండాల్సింది."

‘‘అవును. మీ అమ్మ అసలు నిన్ను పెళ్ళి చేసుకోవద్దని, నీవల్ల ఎవరూ సుఖపడరని చెప్పిన మాటలు నువ్వు నిజంగా విని ఉంటే మన ఇద్దరికీ ఈ కష్టం ఉండేది కాదు."

‘‘నీకివాళ నిజంగా ఏదో అయింది."

"నేను నీకోసం తెచ్చిన బహుమతి ఏమిటో అడగవేం ఎల్సీ? స్వతంత్రం. మనిద్దరికి ఒకరినించి ఇంకొకరికి స్వతంత్రం. మనకి ఆ అవకాశాన్నిచ్చేదే ఈ బహుమతి. నీకు తెలుసా? ఈ బహుమతి ఖరీదు మూడు వేల డాలర్లు."

"మూడు వేలా? నీకు పిచ్చెక్కింది. నీకంత డబ్బు ఎక్కడిది?"

"ఇందాక నా ఇన్సూరెన్స్ మీద వచ్చే అప్పు మొత్తం తీసుకున్నాను. అంతే కాదు. నా టర్మ్ ఇన్సూరెన్స్ ని కూడా రద్దు చేసేసుకున్నాను."

"నాకు తెలుసు. ఇవాళ నీకు నిజంగా పిచ్చెక్కింది."

“ఎల్సీ. నా మాట విని నువ్వు వికలాంగుల శరణాలయానికి వెళ్తావా?"

"వెళ్ళనని లక్ష సార్లు చెప్పాను."

"ఇప్పటికీ నీ సమాధానం అదేనా?"

"ముమ్మాటికీ అదే. ఎప్పటికి అదే."

“సరే." చిన్నగా నవ్వాడు రూథర్ఫర్డ్

చేతిలోని పాల గ్లాసు వంక చూసాడు.

“కొద్ది గంటల్లో నువ్వు అక్కడికి వెళ్ళక తప్పదు డార్లింగ్." చెప్పాడు.

‘‘పందెం.’’

ఆ గ్లాస్ ఎత్తి మూడే మూడు గుక్కల్లో రూథర్ఫర్డ్ ఆ పాలన్ని తాగేసాడు. మూతి తుడుచుకుని ఆనందంగా నవ్వుతూ చెప్పాడు.

"ఇప్పుడు కొన్ని నిమిషాల్లోనే మనిద్దరికి ఒకరినించి మరొకరికి స్వతంత్రం లభించబోతుంది."

తన వంక అర్ధం కాకుండా చూస్తున్న భార్య మంచం ముందున్న కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

ఆ తర్వాత ఎల్సీ పెట్టే పొలికేకలు స్వతంత్రం సాధించిన అతనికి వినబడలేదు.

---

## నిన్ను చంపుతాను - అల్ డ్రేస్నం

పోలీస్ స్టేషన్లో సార్జెంట్ బెవెలో ముందు కుర్చీలో కూర్చుని ఉన్నావిడ తన చేతిలోని హేండ్ బేగ్ ని వేళ్ళతో తిప్పసాగింది. ఆవిడ మొహం నిండా భయం నిండి ఉంది. సార్జెంట్ తను చదువుతున్న ఫైల్ లోంచి తలెత్తి ఆవిడ వంక ప్రశ్నార్ధకంగా చూసాడు.

"నా పేరు మిసెస్ ఫ్రాన్సెస్ టర్చిన్. ఈస్ట్ హోవార్డ్ వీధిలో 6310 నంబర్ ఇంట్లో ఉంటున్నాను. నా భర్త నన్ను చంపుతున్నాడు." ఆవిడ చెప్పింది.

"నా భార్య కూడా నన్ను చంపుతోంది." చిరునవ్వుతో చెప్పాడు సార్జంట్. తర్వాత అడిగాడు. "మీరు ఫిర్యాదు చేస్తున్నారా మిసెస్...?"

"టర్చిన్. మిసెస్ ఫ్రాన్సెస్ టర్చిన్. నా భర్త పేరు బెర్నార్డ్. ఈస్ట్ హోవార్డ్ వీధి, నంబరు 6310 ఇల్లు. నేను చెప్పేది మీరేం రాసుకోవటం లేదే?"

"మీరు ఫిర్యాదు పూర్తిగా చెప్పేదాకా ఏం రాసుకోను. కాగితం దండగ. మీ భర్త మిమ్మల్ని చంపడానికి ప్రయత్నించారా?" అడిగాడు సార్జెంట్.

“కాదు. ఆయన నన్ను చంపుతున్నాడని చెప్పాను. ఈ క్షణంలో మీతో ఇక్కడ మాట్లాడుతూండగా కూడా బెర్నార్డ్ నన్ను చంపుతున్నాడు. అర్థం కాలేదా?”

"ఊహు. మీ భర్త మిమ్మల్ని చంపే ప్రయత్నం చేసారా?"
"కాదు. కాదు. కాదు. అలాంటి ప్రయత్నం ఏమీ చేయలేదు."
"మరి?"

“నిన్ను చంపుతాను. నిన్ను చంపుతాను. నిన్ను చంపుతాను. ఈ విధంగా రోజుకి కనీసం ఓ వంద సార్లయినా నాతో అంటున్నాడు. గత మూడు వారాలుగా. ఎదురు బొదురుగా కూర్చుని ఉన్నప్పుడు, పక్క గదిలోంచి, కారులో, టెలిఫోన్లో ఏ కాస్త అవకాశం దొరికినా ఆ మాటలని నాతో అంటున్నాడు. నిన్ను చంపుతాను. క్రితం శుక్రవారం సినిమాకి వెళ్ళాము. చక్కటి

సన్నివేశంలో నా చెవిలో నిన్ను చంపుతాను ఫ్రాన్సెస్" అని కఠినంగా చెప్పాడు. దాంతో నాకు ఆ సినిమా మీదే ఆస్తకి చచ్చిపోయింది. ఇంకోసారి..."

"ఇతరుల ముందు ఎప్పుడైనా మిమ్మల్ని అలా బెదిరించారా?" అడిగాడు సార్జెంట్.

"అనేకసార్లు. ఏ మాత్రం అవకాశం దొరికినా ఆ మాట అంటాడు. చుట్టుపక్కల ఎవరైన ఉన్నారా లేదా అన్నది ఆయనకి అనవసరం. రెండు వారాల క్రితం మా అక్కయ్య మా ఇంటికి భోజనానికి వచ్చింది. మాటల్లో ఆవిడ వాళ్ళ పక్కింటావిడ కేన్సర్ గురించి మాట్లాడుతూంటే ఈయన మా అక్కయ్యతో క్షమించండి అడ్డు వస్తున్నందుకు' అని నా వైపు తిరిగి నిన్ను చంపుతాను ఫ్రాన్సెస్ అన్నాడు. ఆ తర్వాత గట్టిగా నవ్వి మా అక్కయ్యతో ఆవిడ చెప్పేది చెప్పమన్నాడు." మిసెస్ ఫ్రాన్సెస్ కంఠంలోని భయం గమనించాడు సార్జెంట్.

ఆవిడ కొద్ది క్షణాలు సార్జెంట్ వంక చూసి తిరిగి చెప్పసాగింది.

"మీరు నన్ను నమ్మటం లేదు. మీరీ క్షణంలో ఆయనకి ఫోన్ చేసి కనుక్కోవచ్చు. ఆయన అంతట ఆయనే మీకు చెప్తారు. ఫోన్ నెంబర్ 719 583 2704. అలా చెప్పటం ఆయనకి ఎంతో గర్వంగా ఉంది. ఎవరినైనా చంపటానికి ఇది ఎంతో తేలిక పద్ధతిట. ఆయనకి ఫోన్ చేయండి. మీకు చెప్పి గట్టిగా నవ్వుతాడు. అబ్బ! ఆ నవ్వు!! ఇంకోసారి ఆ నవ్వు వింటే నాకు పిచ్చెక్కుతుంది."

"మీ ఆయన సరదాగా మీతో హాస్యం ఆడుతున్నారేమో?"

"కాదు. సీరియస్గానే అంటున్నాడు. మీరే ఫోన్ చేసి కనుక్కోండి."

‘‘ఏ విధంగా మిమ్మల్ని చంపదల్చుకున్నారో చెప్పారా?"

‘‘చెప్పాడు. నేను కారు కింద పడి చావచ్చుట. లేకపోతే మేడ మెట్ల మీద నించి కాలు జారి కింద పడి తల పగిలి చావచ్చుట. మేం ఉండేది మూడో అంతసతులో లేకపోతే అధికంగా నిద్ర

మాత్రలు తీసుకుని మరణించవచ్చుట. ఈయన ఈ విధంగా బెదిరించటం మొదలు పెట్టినప్పటి నించి ఎన్ని నిద్ర మాత్రలు తీసుకున్నానో నాకే తెలియదు. అయినా నిద్ర రాదు. ఒకోసారి నిద్రలోకి జారుతుండగా ఆయన నన్ను లేపి చెప్తాడు, నిన్ను చంపుతాను ఫ్రాన్సెస్. తర్వాత ఆయన హాయిగా నిద్రపోతాడు. ఇంక ఆ రాత్రంతా నాకు నిద్ర ఉండదు. ఆ విధంగా నన్ను చంపుతున్నాడు."

"మిమ్మల్ని వేధించి, బాధ పెట్టి చంపుతున్నారనా మీ ఫిర్యాదు?"

‘‘సరిగ్గా అదే! నన్ను వేధించి, వేధించి చంపుతున్నాడు. ఈ వేదన, చిరాకు, బాధ భరించలేక ఏదో ఓ రోజు కారు కింద పడటమో, కాలు జారి మెట్ల మీద నించి పడటమో లేదా నిద్ర మాత్రల సీసా ఖాళీ చేయడమో నాకు తెలీకుండానే జరుగుతుంది. మొన్నో రోజు రాత్రి చెప్పాడు, ఇంక సరిగ్గా వారం రోజుల్లోనే నేను మరణిస్తానని. వారం గడిచేలోగా నేను చచ్చిపోతాను. ఇంకో సంగతి మీకు తెలుసా?"

‘‘ఏమిటి?’’

‘‘ఆయన చెప్పే దాంట్లో నిజం ఉంది. పూర్తి నిజం ఉంది." భయంగా ఆవిడ చేతి వేళ్ళు హేండ్ బేగ్ ని బిగించి పట్టుకున్నాయి.

సార్జెంట్ జాగ్రత్తగా వింటున్నాడు.

"ఇవాళ కూడా ఇక్కడికి వచ్చే దారిలో నా బాధలో నేను ఎక్కాల్సిన బస్సు వచ్చినా గమనించలేదు. రెండో బస్సు కింద పడబోయాను. కాని ఎవరో వెనక్కి లాగి రక్షించారు."

గట్టిగా గాలి పీల్చుకుని మళ్ళీ చెప్పసాగింది.

"నాకు గుండె జబ్బు ఉండి ఉంటే ఈ వత్తిడికి ఎప్పుడో పోయేదాన్ని ఇప్పుడు చిన్న శబ్దం అకస్మాత్తుగా విన్నా ఉలిక్కిపడతాను. సరిగ్గా వారం రోజులని చెప్పాడు. ఈ విషయంలో మీరు నాకు ఏం సహాయం చేయదల్చుకున్నారు?"

"మేమేం చేయగలమో నాకయితే తెలియదు. మీరు మీ భర్త మీద ఫిర్యాదు రాసిస్తే..."

"ఎలాంటి ఫిర్యాదు? ఆయన నన్ను చంపుతున్నాడని చెప్పాను. ఆ ఫిర్యాదు చాలదా? నేను ఫిర్యాదు రాసిచ్చి, దాన్ని మీరు పట్టించుకునే సరికే నా చావు సంభవిస్తుంది. ఆ ఫిర్యాదు కాదు. మీరు ఆయన్ని కలిసి మాట్లాడండి. నన్ను చంపుతానని చెప్పడం మానమనండి." ఆవిడ ఏడుపుని బలవంతంగా ఆపుకుంది.

"మీరు కోరిన విధంగా చేస్తాను. కాని ముందుగా మీ భర్త మిమ్మల్ని ఎందుకు చంపాలని అనుకుంటున్నారో చెప్పగలరా?"

"కారణం ఆయనకి నేను విడాకులు ఇవ్వదలచుకోలేదు. అంతే! నేను విడాకులు ఇవ్వనంత మాత్రాన నన్ను చంపొచ్చా?"

''అది సరయిన కారణంగా భావించి చంపినవాళ్ళు నాకు చాలామంది తెలుసు." సార్జెంట్ చెప్పాడు.

"కాని ఆయన నాకు విడాకులు ఇవ్వరు. ఆయనంతట ఆయన విడాకులు ఇస్తే బంధువులు, స్నేహితులు ఆయన్ని చులకన చేస్తారని ఆయన భయం. నా అంతట నేనే విడాకులు ఇవ్వకపోతే నన్ను చంపేస్తాడు. ఈ వయసులో విడాకులిస్తే నాకు మళ్ళీ ఇంకో భర్త ఎక్కడ నించి వస్తాడు?"

''అదీ నిజమే.''

"కాబట్టి ఆయనకి ఫోన్ చేసి, లేదా వ్యక్తిగతంగా కలిసి...''

"మీ భర్త మిమ్మల్ని విడాకులిమ్మని కోరారన్నారు. అందుకు కారణాలు ఏమిటి?"
“నన్నాయన విడాకులు అడగడానికి వెయ్యిన్నొక్క కారణాలు ఉన్నాయి. అవన్నీ పిచ్చి కారణాలు. వాటిలో కొన్ని కారణాలు చెప్పమంటారా?"
“మీరేం అనుకోకపోతే."

"నేనేం అనుకోను. పిచ్చి కారణం ఒకటి. నా వంట ఆయనకి నచ్చదు. మేం ఇరవై మూడేళ్ళుగా భార్యాభర్తలుగా జీవిస్తున్నాం. ఆకస్మాత్తుగా నా వంట నచ్చదు కాబట్టి నేను విడాకులు ఇవ్వాలి. లేదా నన్ను చంపుతాడు. మీకు వివాహం అయిందా?
“అయింది."
"మీ భార్య ఫోటోనా ఇది?"
సార్జెంట్ టేబిల్ మీద ఉన్న ఫ్రేమ్లోని ఫోటోని చూసి అడిగింది మిసెస్ ఫ్రాన్సెస్.
అవునన్నట్లుగా తల ఊపాడు అతను.
“చాలా అందంగా ఊంది. మీ ఆవిడ వంట బావుంటుందా?" మాదిరిగా ఉంటుంది.”

“చూసారా? ఎవరూ వంట విషయంలో గొప్పవాళ్ళు కారు. పిచ్చి కారణం రెండు. నన్ను వివాహం చేసుకున్నప్పుడు ఉన్నంత అందంగా ఇప్పుడు నేను లేను. అది పిచ్చి కారణం అవునా, కాదా? మీకు వివాహం అయి ఎంత కాలం అయింది?"

“పధ్నాలుగేళ్ళు."
"మీ భార్య మీ పెళ్ళి అప్పుడు ఉన్నంత అందంగా ఇప్పుడుందా?".
"లేదు."

“కాబట్టి ఆవిడ్ని మీరు చంపుతారా? మూడో కారణం. నాతో మాట్లాడటానికి విశేషాలేం లేవట. గత ఇరవై మూడేళ్ళుగా మాట్లాడాల్సినవన్నీ మాట్లాడేసాడుట. ఒకోసారి మీ భార్యతో మీరు గంటల తరబడి నిశ్శబ్దంగా ఉండరా?"

“ఉంటాను.”

"అది విడాకులకి లేదా చంపటానికి సరైన కారణమా? పిచ్చి కారణం నాలుగు. నేను స్నానాల గదిలో తడి బట్టలు అడ్డదిడ్డంగా పడేస్తానట. మీ భార్య పడేయదా? అసలీ లోకంలో ఎవరి భార్య అలా చేయదు? ఐదో కారణం..."

"క్షమించండి. మీ పరిస్థితి నాకు అర్థమైంది. మీ భర్తతో నేను మాట్లాడతాను."

"ఇప్పుడు నిజంగా నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆయనకి నచ్చ చెప్పండి. 719 588 2704 పేరు బెర్నార్డ్ ఇప్పుడే ఫోన్ చేస్తారా?"

"ఇప్పుడు కాదు. తర్వాత ఫోన్ చేసి వీలు చూసుకుని ఇక్కడికి రమ్మని చెప్తాను."

"థాంక్స్ సార్జెంట్. ఇక్కడి రాకపోతే ఏమయ్యేదాన్నో నాకే తెలియదు. ఇందాక ఇక్కడికి రాబోయే ముందు బస్ కింద పడబోయాను. మీకు ఇందాక చెప్పాను కదా?"

“అవును.”

“చూసారా చూసారా నన్ను ఏ విధంగా చంపదల్చుకున్నాడో? ఓ వారంలో మరణిస్తానని చెప్పాడు. ఒక్క వారం. అంటే ఏడు రోజులు. నేను ఇక్కడ నించి ఇంటికి క్షేమంగా చేరగలిగితే అదృష్టవంతురాలినే."

"మిమ్మల్ని పోలీసు కారులో ఇంటికి చేర్చమంటారా?"

“వద్దు. ఆ అవసరం లేదు. ఇంతసేపు మీతో మాట్లాడాక నా బాధ కాస్తంత తగ్గినట్లు అయ్యింది. ఆయన ఆ మాటలు నిన్ను చంపుతాను. నిన్ను చంపుతాను. నిన్ను చంపుతాను' అనడం మానేస్తే చాలు. థాంక్స్ టెలిఫోన్ నెంబర్ గుర్తుందా?"

“719 583 2704.” చెప్పాడు సార్జెంట్.

ఆవిడ బయటికి వెళ్ళేదాకా సార్జెంట్ ఆవిడ వంకే చూస్తూండిపోయాడు. ఆవిడ నడక చూస్తే క్షేమంగా ఇంటికి చేరుతుందన్న నమ్మకం కలగలేదు అతనికి. తనతో మాట్లాడాక కూడా పూర్తి తెరిపి కలిగినట్లు లేదు. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళింది. ఇప్పుడు కాకపోయినా ఓ వారంలో ఐనా ఆవిడ మరణించడం తప్పదనిపించింది సార్జంట్ కి.

ఆవిడ మీద జాలి కలగలేదు. ఆవిడ భర్త మీద కోపం అంతకన్నా కలగలేదు. ఓ విధమైన అసక్తి, ఉత్సాహం అతనిలో చోటు చేసుకున్నాయి.
టెలిఫోన్ రిసీవర్ అందుకుని ఆలోచనగా అతను ఓ నెంబర్ తిప్పాడు.
"మిస్టర్ బెర్నార్డ్ టర్చిన్ తో మాట్లాడాలి." ఎవరో టెలిఫోన్ ఎత్తాక చెప్పాడు.
"మాట్లాడుతున్నాను." వినిపించిందో కంఠం.
గొంతు సర్దుకొని చెప్పాడు.
"డెస్క్ సార్జెంట్ స్టేన్లీ బెవెలో మాట్లాడుతున్నాను. మీరు ఓ సారి ఇక్కడి రాగలరా?"
“దేనికీ అఫీషియలా?” సార్జంట్ టేబిల్ మీద ఉన్న ఫ్రేంలోని తన భార్య ఫోటో వంక చూసాడు. ఆ చూపులో అగ్ని ఉంది. అసహ్యం ఉంది. ఆవేదన ఉంది.

"కాదు. పూర్తిగా వ్యక్తిగతం. నిజానికి నా డ్యూటీ అయిపోయాక మీరు నన్ను కలిస్తే మంచిది...సాయంత్రం ఆరు? మంచిది. మీ కోసం ఎదురు చూస్తూంటాను."

రిసీవర్ క్రేడిల్ మీద ఉంచి తన భార్య ఫోటో వంక చూసి చిన్నగా నవ్వాడు. తర్వాత చెప్పాడు.

“నిన్ను చంపుతాను.”

---

## వజ్రాల దొంగ - ఎడ్వర్డ్ డి.హోచ్

చేతిలో వెండి పొన్ను కర్ర గల ఆ మధ్య వయస్కుడు దుకాణాలు కట్టేసి, ఇళ్ళకి వెళ్ళే పనివాళ్ళ మధ్యకి గబ గబ నడుస్తూ వచ్చాడు. అతను వేసుకున్న కోటు ఏప్రిల్ నెల చలిని ఆపేలాగానే

ఉంది. అతను దుకాణాలకి ఉన్న గ్లాస్ కిటికీల్లోంచి యథాలాపంగా చూస్తూ యూనియన్ అండ్ మేడిసన్ మూలకి వచ్చే దాకా నడకని ఆపలేదు. మిడ్ టౌన్ డైమండ్ ఎక్స్చేంజ్ దుకాణం ముందు కొద్ది క్షణాలు ఆయన సందేహిస్తూ ఆగాడు. ఎవరూ లేరని నిర్ధారణ చేసుకునేందుకా అన్నట్లుగా ఆయన అటు ఇటు చూసాడు. తర్వాత తన చేతిలోని వెండి పొన్ను కర్రతో దాని అద్దాల కిటికీని బద్దలు కొట్టాడు.

గ్లాసు పగిలిన శబ్దం షాపులోని అలారం మోగే శబ్దంతో కలిసిపోయింది. ఆయన ఆ కిటికీ దగ్గరకి చేరుకున్నాడు. దారిన పోయే పాదచారులు అతని చర్యకి ముందు కొద్దిగా విస్తుపోయారు. అతను పారిపోతూండగా యూనిఫారంలో ఉన్న ఓ పోలీస్ తన చేతిలోని తుపాకీని చూపిస్తూ గట్టిగా అరిచాడు.

''ఆగక్కడ.''

దగ్గరనించి వినబడ్డ ఈ హెచ్చరికకి అతను కొద్దిగా ఉలిక్కిపడి తన చేతిలోని కర్రని తిప్పాడు. ఆ ప్రమాదాన్ని ఊహించిన వాడిలాగా పోలీసు పక్కకి తప్పుకున్నాడు. అయితే రెండో ప్రయత్నంలో ఆ కర్ర కొసకి ఉన్న పొన్ను వెళ్ళి ఆ పోలీసు తలని తాకడంతో అతను అరిచి, తత్తరపడుతూ వెనకడుగు వేసాడు.

పారిపోతున్న అతణ్ణి చూసి డైమండ్ ఎక్స్చేంజ్ తలుపు దగ్గర ఉన్న ఒకతను గట్టిగా అరిచాడు.

''అతణ్ణి పట్టుకోండి. దొంగ.''

తలనించి కారే రక్తంతో నేల మీద చతికిలపడ్డ ఆ పోలీసు లేచి నిలబడాలని ప్రయత్నించి, చేతకాక మళ్ళీ నేల మీద కూర్చున్నాడు. జనాల్లోంచి ఒకడు పారిపోయే ఆ దొంగని పట్టుకోడానికి వేగంగా పరిగెత్తి ఆ దొంగని వెనక నించి పట్టుకున్నాడు. ఆ మధ్య వయస్కుడు వాడి పట్టు నించి తప్పించుకుని చేతి కర్ర లేకుండానే లేచి మళ్ళీ పరిగెత్తసాగాడు. దగ్గర్లో ఉన్న పోలీస్ పెట్రోల్ కారు ఈ గొడవను చూసి అక్కడికి వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఇద్దరు

పోలీస్ ఆఫీసర్లు రివాల్వర్లు తీసారు. ఓ చీకటి సందులోకి పరిగెత్తుతున్న ఆ దొంగని చూసి, ఆగు. లేదా కాల్చేస్తాను" అంటూ అరిచాడో అధికారి. హెచ్చరికగా రివాల్వర్ని గాల్లోకి ఓసారి పేల్చాడు కూడా. ఆ శబ్దానికి సందు మొదట్లోకి చేరుకున్న ఆ దొంగ ఠక్కున ఆగాడు. చేతులు రెండూ ఎత్తి వెనక్కి తిరిగి పోలీసులతో చెప్పాడు.

"కాల్చకండి.''

రెండో పోలీస్ ఆ దొంగ చేతులకి బేడీలు వేసే దాకా మొదటి పోలీసు తన రివ్వాలర్ని అతనికి గురి పెట్టే ఉంచి, తర్వాత దాన్ని తిరిగి హోల్ స్టర్ లో దోపుకున్నాడు.

* * *

లెఫ్టినెంట్ ఫ్లెచర్ పేపర్ కప్పులో తెచ్చిన లేత గోధమరంగు కాఫీని చూసి హోమిసైడ్ అండ్ వయొలెంట్ క్రైమ్స్ స్క్వాడ్ కెప్టెన్ లియోఫోర్డ్ కోపంగా అడిగాడు.

''మెషీన్లోని కాఫీయేనా ఇది?"

''అవును సార్. ఆ యంత్రం పాడైంది. దాన్ని రిపేర్ చేసే వ్యక్తి కోసం కబురు చేసాను.''

లియోఫోర్డ్ గొణగుతూ ఆ కాఫీని ఓ గుక్క తాగి, దాన్ని డస్ట్ బిన్లో పడేసి చెప్పాడు.

"నాకో కోలా తెచ్చిపెట్టు ఫ్లెచర్,"

ఫ్లెచర్ కోలా తెచ్చిచ్చాక లియోఫోర్డ్ అడిగాడు

''ఫిల్ బెగ్లర్ ఇంకా హాస్పిటల్లోనే ఉన్నాడా?"

అవునన్నట్లు తల ఊపాడు ఫ్లెచర్,

"పూర్తి రిపోర్ట్ మీ టేబుల్ మీద ఉంది. మిడ్ టౌన్ డైమండ్ ఎక్స్ఛేంజ్ నించి కొన్ని వజ్రాలని దొంగిలించిన వ్యక్తిని ఫిల్ పట్టుకునేందుకు ప్రయత్నించిగా, ఆ దొంగ చేతిలోని కర్రతో ఫిల్ని తల మీద కొట్టి పరిగెత్తాడు. ఆ దొంగ పట్టుబడ్డాడు. ఫిల్ ఇంకా హాస్పిటల్లోనే ఉన్నాడు."

"నేనోసారి వెళ్ళి చూడాలి. ఫిల్ చాలా మంచి వ్యక్తి" చెప్పాడు కెప్టెన్ లియో. ఆ వజ్రాల దొంగని న్యూయార్క్ కి చెందిన రూడీ హాఫ్మన్ గా గుర్తించారు. కిటికీలు పగలకొట్టి ఇలాంటి దొంగతనాలు ఎన్నో చేసిన అనుభవం గల దొంగ రూడీ.

"ఫిల్ ని అతను గాయపరచడం కూడా ఓ విధంగా మంచిదే. దాని వల్ల మనం వాడిని చాలా కాలం కటకటాల వెనక పెట్టొచ్చు."

"కాని, ఈ కేసు విషయంలో ఓ సమస్య వచ్చి పడింది." చెప్పాడు ఫ్లెచర్,

"ఏమిటది?"

"దొంగతనం చేసిన దుకాణం నించి హాఫ్మన్ ని నూట ఏభై అడుగుల దూరంలోనే పట్టుకున్నారు. మన పెట్రోల్ కారు వచ్చే లోగా ఓ యువకుడు ఆ దొంగతో పోట్లాడి అతన్ని ఆపే ప్రయత్నం చేసాడు. హాఫ్ మేన్ ఏభై ఎనిమిది వేల డాలర్ల విలువ చేసే వజ్రాలని దొంగిలించాడు. ఆ తర్వాత పోలీసులు అతణ్ణి అరెస్ట్ చేసే దాకా ఆ దొంగ ప్రతీ క్షణం కనీసం ఓ సాక్షి కనుసన్నల్లోనే ఉన్నాడు. కాని ఆ వజ్రాలు అతడి దగ్గర లభ్యం కాలేదు. అవి ఏమయ్యాయో తెలీటం లేదు."

"వాడు వాటిని వీధిలో పడేసి ఉండచ్చు."

"వీధంతా వెతికారు. అతణ్ణి అరెస్ట్ చేసి జైలుకి తీసుకెళ్ళిన పెట్రోల్ కారుని కూడా పూర్తిగా వెతికారు. వజ్రాలు లేవు."

"వాటి గురించి అతణ్ణి ప్రశ్నించలేదా?"

"వాడు పెదవి విప్పడం లేదు."

‘‘సరే, వాణ్ణి ఇక్కడికి తీసుకురండి. వాడి చేత ఎలా మాట్లాడించాలో మీకు చూపిస్తాను." కోపంగా చెప్పాడు లియోఫోర్డ్

తెల్ల జుట్టు గల రూఢీ హాఫ్మేన్ వయసు నలభై, నలభై ఐదు మధ్య ఉంటుంది. ఎక్కువ కాలం జైలులో ఉండటంతో సూర్యరశ్మి తాకని తెల్లటి చర్మం, బెదురుగా చూసే కళ్ళు. తరుచూ కింద పెదవిని నాకడం అతనికి అలవాటు.

"ఆ వజ్రాలు ఎక్కడ దాచావు?" ప్రశ్నించాడు లియో.

"నాకేం తెలియదు. లాయర్ లేకుండా నేనేం మాట్లాడను. నా హక్కులు నాకు తెలుసు. లాయర్ లేకుండా మీరు అసలు నన్నేం అడగకూడదు." బదులు చెప్పాడు.

లియోఫోర్డ్ అతనికి ఎదురుగా ఉన్న కుర్చీ మీద కూర్చుని అతని వంక నిశితంగా చూస్తూ చెప్పాడు.

‘‘ఈ సారి కిటికీ పగలకొట్టి దొంగతనం చేసిన నేరం కాదిది. నువ్వు తల పగలకొట్టిన పోలీసు చావచ్చు. జీవితాంతం నువ్వు ఊచలు లెక్కపెట్టాల్సిందే."

"గార్డ్స్ మాట్లాడేది నేను విన్నాను. తల చర్మం చిట్లిందంతే."

‘‘అయినప్పటికి మారణాయుధంతో డ్యూటీలో ఉన్న పోలీస్ ఆఫీసర్ని ఎదుర్కోవడం అనే నేరం చేసావు. నీకున్న నేర చరిత్రతో పెద్ద శిక్ష పడటానికి అది చాలు. ఆ వజ్రాలని దాచి పెట్టి నిన్ను నువ్వు రక్షించుకుంటున్నానని అనుకుంటున్నావేమో? అవి దొరక్కపోయినా నువ్వు హత్యా ప్రయత్న నేరం చేసావు."

"ఆ వజ్రాలు మీరు ఎప్పటికీ కనుక్కోలేని చోట ఉన్నాయి. ఆ విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను.'' రూడి హాఫ్మెన్ చిన్నగా నవ్వాడు.

లియోఫోర్డ్ కోపంగా లేచి, రూఢి హాఫ్మెన్ వంక ఉగ్రంగా చూసి బయటికి నడిచాడు.

ఫ్లెచర్ లియోఫోర్డ్ని అనుసరిస్తూ చెప్పాడు.

‘‘చెప్పాగా, వాడు ఆ విషయంలో నోరు మెదపడం లేదు."

"నేను వాటిని కనుక్కుని తీరతాను. కిటికీ అద్దం పగిలినప్పటి నించి ఏం జరిగిందో వివరంగా చెప్పు." అడిగాడు లియోఫోర్డ్

"వీణ్ణి పట్టుకోవడానికి ప్రయత్నించిన వాడు స్టేట్మెంట్ ఇవ్వడానికి ముందు గదిలో ఉన్నాడు. వాడు జరిగింది మొత్తం చూసాడు."

ఫ్లెచర్ వెళ్ళి, నైల్ క్వార్ట్ ని తీసుకువచ్చాడు. అతను జరిగింది చెప్పాడు.

"రంగు వేసే పని పూర్తి చేసుకుని నేను ఆఫీస్ నుంచి రాత్రి తొమ్మిదింటికి ఇంటికి వెళుతున్నాను. డైమండ్ ఎక్స్చేంజ్ దగ్గర ఈ దొంగ చేతి కర్రతో కిటికీని పగలకొట్టడం చూసాను. కాని అతడికి దూరంగా ఉండటం వల్ల పట్టుకోలేకపోయాను. ఈలోగా వాడు పోలీసు తల మీద తన కర్రతో బాదడం చూసాను. పోలీసు కింద పడగానే నేను వాడిని పట్టుకోడానికి వెంటపడ్డాను. మేమిద్దరం కలయబడ్డాం. వాడు తన చేతి కర్రతో నన్నూ కొట్టాలని చూసాడు. కాని నేను దాన్ని లాగేసుకున్నాను. తరువాత వాడు లేచి పారిపోతూంటే పోలీసులు వచ్చారు. ఒకరు గాల్లోకి తుపాకి పేల్చగానే వాడు లొంగిపోయాడు."

‘‘ఆ దొంగ నీకు ఎంత సేపు కనబడకుండా ఉన్నాడు?'' ప్రశ్నించాడు లియోఫోర్డ్

"ఒక్క క్షణం కూడా వాడు నా దృష్టి నించి దాటి పోలేదు. వాడు పోలీసుని కొట్టి పడేయగానే నేను వాడి కోసం పరిగెత్తాను."

"వాడు వీధిలోకి ఏదైనా విసిరేయడం నువ్వు చూసావా?"

‘‘లేదు. ’’

‘‘రివాల్వర్ కాల్పులు వినగానే చేతులు ఎత్తినప్పుడు విసిరేసి ఉండొచ్చుగా?"

‘‘లేదనుకుంటాను.’’

"పోలీసులు వాడిని ఓ సందు మొదట్లో అరెస్టు చేసారు. ఆ సందులోని ప్రతి అంగుళం వెతికారు. అయినా ఆ వజ్రాలు దొరకలేదు." చెప్పాడు ఫ్లెచర్,

"వాడు దొంగతనం చేసిన ఆ వజ్రాల గురించి మేం వెతుకుతున్నాం. వాడు వాటిని ఎలా మాయం చేసి ఉంటాడో నువ్వు ఏమైనా చెప్పగలవా?" ప్రశ్నించాడు లియోఫోర్డ్

"తెలియదు. కాకపోతే మేం కలియబడినప్పుడు ఖాళీ అట్ట పెట్టెల మీద పడ్డాం."

‘‘నిన్న రాత్రంతా పోలీసులు అవన్నీ వెదికారు. అక్కడ ఒక్క అంగుళం కూడా వదలకుండా గాలించారు. హాఫ్మన్ బట్టలు కూడ వెతికారు కాని ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. హాఫ్మన్ వాటిని మింగాడేమోనని ఎక్స్రే కూడా తీయించాం. కడుపులోనూ లేవవి." చెప్పాడు ఫ్లెచర్,

అతను ఇంకేం చెప్పలేకపోయాడు.

‘‘సరే. ఈ సంఘటన జరిగిన చోటికి వెళ్ళి చూద్దాం పద." ఫ్లెచర్తో చెప్పాడు లియోఫోర్డ్ టోపి అందుకుంటూ.

మిడ్ టౌన్ డైమండ్ ఎక్స్ఛేంజ్లో గత రాత్రి దొంగతనం జరిగినప్పుడు ఆ దుకాణంలో ఉన్న అసిస్టెంట్ మేనేజర్ పీటర్ ఆర్నాల్డ్ ని కలిసాడు లియోఫోర్డ్

“ఏం జరిగిందో ఏదీ వదలకుండా చెప్పండి." కోరాడు లియోఫోర్డ్.

"తొమ్మిది దాటాక సేల్స్ మెన్ అంతా బయటికి వెళ్ళారు. నేను దుకాణం కట్టేస్తూండగా కిటికీ అద్దం పగిలిన చప్పుడు వినిపించింది. చూస్తే, ఆ దొంగ విండో షో కేస్ లోని వజ్రాలని అందుకుంటున్నాడు.”

"ఆ షో కేస్లో ఎన్ని వజ్రాలు ఉన్నాయి?”

"డజన్ల కొద్దీ. ఉట్టి వజ్రాలు, ఇంకా ఉంగరాలలో బిగించిన వజ్రాలు. వాటి మొత్తం విలువ యాభై ఎనిమిది వేల డాలర్లు. కొద్ది నిమిషాల్లో నేను వాటిని అక్కడనించి తీసేసి ఐరన్ సేఫ్ లో ఉంచేవాణ్ణి. ఆ దొంగ పారిపోతూండగా పోలీసు ఆఫీసర్ బెగ్లర్ కనిపించాడు.”

ఫిల్ బెగ్లర్ ఆ ప్రాంతంలో గత నాలుగైదు ఏళ్ళుగా పని చేస్తున్నాడు. కాబట్టి అతను అందరికీ సుపరిచితుడే.

లియోఫోర్డ్ ఆ కిటికీ దగ్గరకు వెళ్ళి చూసాడు. ఖాళీ ట్రేలు కనబడ్డాయి.

"నాలుగు ఉంగరాలు మాత్రం వదిలేసాడు." చెప్పాడు ఆర్నాల్డ్

అతనికి రూడీ హాఫ్మన్ ఫోటో చూపించి అడిగాడు.

“ఇతన్ని ఇదివరకెప్పుడైనా చూసారా?"

“లేదు." పెదవి విరిచాడతను.

లియోఫోర్డ్ గొంతు తగ్గించి సాలోచనగా అడిగాడు.

"వజ్రాల కోసం వెతికిన మన వాళ్ళే వాటిని కాజేసారేమో, ఫ్లెచర్?"

"నో సర్ వాళ్ళంతా నిజాయితీపరులే." చెప్పాడు ఫ్లెచర్,

పోలీస్ స్టేషన్ కి వెళ్ళి హాఫ్మన్ దుస్తులనే కాక, అతని కట్టుడు పళ్ళు, విగ్ లాంటివి ఉంటే వాటిలో దాచాడేమోనని వెతికాడు లియోఫోర్డ్. కాని అతని ఒంటిమీద అలాంటివేం లేవు.

లియోఫోర్డ్ కి పోలీసు లేబ్ నించి ఫోన్ వచ్చింది. హాఫ్మన్ ఉపయోగించిన చేతి కర్రని కూడ ఎక్స్రే తీసారు. అందులోనూ ఎలాంటి వజ్రాలు లేవు.

మెమోరియల్ హాస్పిటల్ కి వెళ్ళి కోలుకుంటున్న బెగ్లర్ తో లియోఫోర్డ్ అరగంట గడిపి ఇంటికి వెళ్ళాడు.

తెల్లవారు జామున మూడున్నరకి పోలీస్ కార్ ఓ ఇంటి బయట ఆగింది. అందులోంచి దిగిన లియోఫోర్డ్, ఫ్లెచర్ ఎదురుగా ఉన్న ఆరోఅంతస్తులోని అపార్ట్మెంట్ నంబర్ సిక్స్ బికి వెళ్ళి తలుపు తట్టారు.

‘‘ఎవరది?" ఓ కంఠం వినిపించింది.

"పోలీస్. తలుపు తీయి."

"ఆ వజ్రాలు ఏవి?" లియోఫోర్డ్ తలుపు తీసిన నైల్ క్వార్ట్ ని ప్రశ్నించాడు.

"మీకేమైనా పిచ్చా? ఆ వజ్రాల గురించి నాకేం తెలుసు?" అడిగాడు నైల్ ఆవులిస్తూ,

"హాఫ్మన్ వజ్రాలు దొంగతనం చేసాక అతడి సమీపానికి వెళ్ళింది నువ్వు ఒక్కడివే. నువ్వు, హాఫ్మన్ మిత్రులు. ఆ వజ్రాలని వాడు నీకు ఇచ్చాడు. వాటిని నువ్వే మాయం చేసావు."

‘‘ఆ దొంగ నాకు మిత్రుడు కాదు. పోలీసులు నన్ను అక్కడే సోదా చేసారు. నా దగ్గర ఉంటే అప్పుడే అవి దొరికేవిగా. నాకు వాటి గురించి తెలియదు." చెప్పాడు నైల్ క్వార్ట్,

"వాటిని నువ్వు మూడో వ్యక్తికి ఇచ్చి పంపావు. ఎవరా వ్యక్తి?"

"నేను ఎవరికీ ఏ వజ్రాలు ఇవ్వలేదు."

నిజానికి నలుగురు సాక్షులు జరిగిందంతా చెప్పారు. వారికి ఒకరితో మరొకరికి సంబంధం లేదు. ఆ నలుగురు చెప్పింది ఏ మాత్రం తేడా లేకుండా ఒకేలా ఉంది. నైల్ ఎవరినీ కలవలేదు.

లియోఫోర్డ్, ఫ్లెచర్ గంటసేపు నైల్ ఫ్లాట్ మొత్తం గాలించారు. అతను అభ్యంతరం చెప్పకుండా టీ కూడా పెట్టిచ్చాడు. ఎక్కడా వాళ్ళకి ఆ వజ్రాలు కనబడలేదు.

ఇంటికి తిరిగి వెళుతూ లియోఫోర్డ్ విసుగు, కోపం ధ్వనించే స్వరంతో స్వగతంగా అనుకుంటున్నట్లుగా అన్నాడు.

‘‘హాఫ్ మేన్ ఆ వజ్రాలు ఎలా మాయం చేసాడు? ఎవరికీ ఇవ్వలేదని, ఎక్కడా దాచలేదని సాక్షులు చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. మరి రెక్కలు వచ్చినట్లు ఎలా ఎగిరి పోయాయువి?’’

ఫ్లెచర్ మౌనంగా ఉండిపోయాడు.

లియోఫోర్డ్ ఇంటికి చేరుకునేదాకా ఆ విషయం మీదే మనసు నిలిపి ఆలోచించాడు. ఆకస్మాతుగా కారు బ్రేక్ వేసి అరిచాడు.

"ఆ వజ్రాలు ఎలా మాయమయ్యాయో తెలిసింది."

‘‘ఎలా?" అడిగాడు ఫ్లెచర్ విస్మయంగా,

“చెప్తాను. రేపు ఉదయం నువ్వు అర్జెంట్ గా కొత్త సమాచారం సేకరించాలి. నువ్వేం చేయాలంటే..." ప్లెచర్ కి ఏం చేయాలో చెప్పాడు లియో.

మిడ్ టౌన్ డైమండ్ ఎక్స్చేంజ్ దుకాణంలోని సేల్స్ మెన్ & కస్టమర్ కి బంగారు ఉంగరాలు చూపిస్తూ ఉండగా లియోఫోర్డ్, ప్లెచర్ లోపకి వచ్చారు.

"పీటర్ ఆర్నాల్డ్ ఏడి?" అడిగాడు ప్లెచర్.

అతను మౌనంగా అసిస్టెంట్ మేనేజర్ అని రాసి ఉన్న కేబిన్ తలుపు వైపు చూపించాడు. ఇద్దరూ ఆ గదిలోకి వెళ్ళారు.

"రండి. వాడు వజ్రాలని ఎక్కడ దాచాడో కనుకున్నారా?" శాండ్విచ్ తినబోతున్న ఆర్నాల్డ్ ఆగి అసక్తిగా అడిగాడు.

“అవి ఎక్కడ ఉన్నాయో తెలిసింది." చెప్పాడు లియోఫోర్డ్

"వెరీ గుడ్, ఎక్కడ దాచాడు వాటిని?"

“దానికన్నా ముఖ్యం వాటి ఉనికిని ఎలా తెలుసుకున్నాం’ అన్న సంగతి. అది నువ్వు తెలుసుకోవాలి." ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని నవ్వుతూ చెప్పాడు లియోఫోర్డ్

“ఏలా తెలిసింది?”

"హాఫ్ మెన్ చెప్పాడు."

“ఏమని?”

"మీ ఇద్దరి మధ్య గల ఒప్పందం."

క్షణ కాలం ఆర్నాల్డ్ మొహం పాలిపోయింది. అంతలోనే తేరుకున్నాడు.

"మీరు చెప్పేది నాకు అర్థం కావడంలేదు." చెప్పాడు.

"నీది చాలా తెలివైన పథకం ఆర్నాల్డ్ ఆ రాత్రి నీ కింద పని చేసే సేల్స్ మెన్ వెళ్ళిపోయాక, నువ్వు నాలుగు ఉంగరాలు మాత్రం ఉంచి కిటికీ షో కేస్లోని మిగిలిన వజ్రాలన్నిటిని తీసేసుకున్నావు. ఆ తర్వాత తొమ్మిదింటికి మీ ప్లాన్ ప్రకారం హాఫ్ మెన్ వచ్చి కిటికీ అద్దాన్ని పగలకొట్టాడు తప్ప, వజ్రాలు దొంగతనం చేయలేదు. మీ పథకం సరిగ్గా ఫలించి ఉంటే, హాఫ్ మేన్ పారిపోయేవాడు. వాటిని తనే మాయం చేసాడని అంతా అనుకునేవాళ్ళం. కాని మీ పథకంలో ఎదురు చూడని పాత్ర ఆఫీసర్ బెగ్లర్. అనుకోకుండా ఆ సమయంలో అక్కడికి వచ్చి హాఫ్మన్ని పట్టుకోబోయాడు. పట్టుబడితే తన దగ్గర వజ్రాలు లేవని పోలీసులు తెలుసుకుంటారని, ఈ పథకం పాడవుతుందని హాఫ్మన్ అతడి తల మీద కొట్టి పారిపోయాడు. హాఫ్మన్ గతంలో ఎప్పుడు పట్టుబడినా ఎవరి మీదా, ఎలాంటి హింసకి పాల్పడలేదని రికార్డులు చెప్తున్నాయి. హాఫ్మన్ని పట్టుకోవడానికి నైల్ అతడితో కలబడ్డ సమయంలో నీ దగ్గరే ఆ వజ్రాలు ఉన్నాయి. వాటిని ఏం చేసావో నువ్వే చెప్పాలి."

"అబద్ధం. హాఫ్మన్ చెప్పింది శుద్ధ అబద్ధం." లేచి నిలబడి అరిచాడు ఆర్నాల్డ్

"హాఫ్మన్ ఈ నిజం చెప్పటానికి ఓ కారణం ఉంది. ఇందాక హాస్పిటల్లో బెగ్లర్ మరణించాడు. దాంతో హాఫ్ మేన్ హంతకుడయ్యాడు. ఆ సంగతి తెలియగానే తను చంపాలనుకుని అతడ్ని కొట్టలేదని, ఎందుకు కొట్టాల్సి వచ్చిందో చెప్పి తన నేరాన్ని ఒప్పుకున్నాడు."

పీటర్ ఆర్నాల్డ్ మొహం మరోసారి పాలిపోయింది.

"దీనికి సాక్ష్యం ఉందా అని నువ్వు నన్ను అడగచ్చు. హాఫ్మన్ రాక మునుపు నువ్వు వాటిని తీసి నీ జేబులో వేసుకోవడం అదృష్టవశాత్తు రోడ్ మీంచి చూసిన ఓ సాక్షి ఉన్నాడు ఆర్నాల్డ్ నీ గురించి మొత్తం విచారించాం. నువ్వు ఆర్థికంగా చితికిపోయావు. నీ భార్య నీ గుర్రపు పందేల

పిచ్చిని భరించలేక విడాకులు ఇచ్చేసింది. ఆమెకి నీ జీతంలో సగం నెలనెలా భరణంగా వెళ్తోంది. నువ్వు అప్పుల్లో ఉన్నావు."

పీటర్ ఆర్నాల్డ్ కి ముచ్చెమటలు పోసాయి.

"నీ అంతగా నువ్వు నేరం ఒప్పుకుంటే, తక్కువ శిక్ష పడుతుంది. లేదా కటకటాలని ఎక్కువ కాలం లెక్కపెట్టాల్సి ఉంటుంది."

యూనిఫాంలో ఉన్న ఓ పోలీస్ కానిస్టేబుల్ తలుపు తెరుచుకొని లోపలికి వచ్చి సెల్యూట్ చేసి లియోఫోర్డ్ చెవిలో ఏదో చెప్పాడు.

లియోఫోర్డ్ చిన్నగా నవ్వుతూ చెప్పాడు.

"సెర్చ్ వారెంట్ లేకుండా వెదికినందుకు సారీ. వజ్రాలు మాకు దొరికాయి."

వెంటనే ఆర్నాల్డ్ తల వంచుకున్నాడు.

"పట్టుబడ్డాక దబాయించి ప్రయోజనం లేదు. మీరు చెప్పినవన్నీ నిజాలే. నా తప్పు ఒప్పుకుంటున్నాను."

పోలీస్ కారులో ఎక్కాక పీటర్ ఆర్నాల్డ్ అడిగాడు.

"నా కారు స్టెఫినీలో దాచిన ఆ వజ్రాలని ఎవరూ కనుక్కోలేరని అనుకున్నాను. ఎలా కనుకున్నారు?"

"పోలీసుల్ని తప్పగా అంచనా వేసావంతే." సన్నగా నవ్వాడు లియోఫోర్డ్.

టైప్ చేసిన కన్ఫెషన్ పేపర్లని ఆర్నాల్డ్ ఓ సారి చదివి సంతకం చేసాక, అతన్ని సెల్లోకి తీసుకెళ్ళారు.

"బాస్! ఆర్నాల్డ్ తో ఎంత అలవోకగా ఎన్ని అబద్ధాలు ఆడారు? హాఫ్మేన్ మనకి ఒప్పందం గురించి చెప్పాడని, బెగ్లర్ మరణించాడని, వజ్రాలు దొరికాయని…" ఫ్లెచర్ లియోఫోర్డ్ వంక ఆశ్చర్యంగా చూస్తూ చెప్పాడు.

"అసలు హాఫ్మేన్ వజ్రాలని దొంగలించలేదన్న ఆలోచన నాకు మెరుపులా తట్టాక, టైం లేక హాఫ్మేన్ వాటిని తీసుకోకపోయినా ఆ దొంగతనం అతడి మీదకే వెళ్తుందనే ఉద్దేశంతో ఆర్నాల్డ్ వాటిని దొంగిలించి ఉంటాడని అనిపించింది. కాని తను దొంగతనం చేయలేదన్న సంగతి హాఫ్మేన్ మనకి చెప్పొచ్చుగా? చెప్పలేదంటే అందుకు బలమైన కారణం వాళ్ళిద్దరూ తోడుదొంగలు కావడమే అనిపించింది. నువ్వు ఆర్నాల్డ్ గురించి విచారించడంతో, అతను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసింది. హాఫ్ మేనే స్వయంగా జరిగిందంతా చెప్పేసాడంటే ఆర్నాల్డ్ కాదనలేడు అనిపించి, అలా గాల్లోకి ఓ బాణం వేసాను. దొంగిలించిన వజ్రాలని తన కేబిన్లో దాచాడనుకున్నాను. అదృష్టవశాత్తు ఆర్నాల్డే ఆ రహస్యం కూడా చెప్పేసాడు. వజ్రాలు దొరక్కపోతే ఆర్నాల్డ్ మీద కేస్ ని పెట్టలేం కదా?" వివరించాడు లియోఫోర్డ్.

"నిజమే. మిగిలినవాళ్ళు ఎంత నిజాయితీగా పరిశోధన చేసినా అంతు చిక్కని కేసు మీరు ఆడిన అబద్ధాలతో ఇట్టే తేలిపోయింది." మెచ్చుకోలుగా చెప్పాడు ఫ్లెచర్.

"సమయం అనుకూలిస్తే తప్ప అన్నిసార్లు ఇలా కుదరదు. కాబట్టి నిజాయితీయే ఎప్పటికీ సరైన దారి." నవ్వుతూ చెప్పాడు లియోఫోర్డ్.

---

## తేనెతీగ - జేమ్స్ హోల్డింగ్

డోరిస్కి, మా ఇంటి పక్క ఫ్లాట్లో ఉండే బ్రహ్మచారి, రచయిత విల్ కిన్స్ కి శారీరక సంబంధం ఉందన్న సంగతి తెలియగానే నేను అబ్బురపడ్డానంటే సరైన పదం ఉపయోగించానా లేదా అన్నది మీరే చెప్పాలి. కారణం చివరలో తెలుస్తుంది మీకు.

నేను నా భార్యని ప్రేమించినట్లుగా మీరు మీ భార్యని ప్రేమించి ఉంటే, నేను నమ్మినట్లుగా మీరు మీ భార్యని నమ్మి ఉంటే, నా భార్యలాగా మీ భార్య తప్పు చేస్తోందని తెలిసిన నాడు నేను పడే బాధని మీరు అర్థం చేసుకోగలరు. దాన్ని ఎలా వర్ణించాలో రచయితలకే తెలుస్తుంది. అంతే కాని సామాన్యులకి అది సాధ్యం కాదు.

నేను ఉద్యోగ రీత్యా నెలకి రెండు వారాలు ఊళ్ళో ఉండను. ట్రావెలింగ్ సేల్స్ మెన్ ఉద్యోగం కాబట్టి తప్పనిసరిగా బయటికి వెళ్ళాల్సి ఉంటుంది.

డోరిస్ లాంటి అందాలరాశి విల్కిన్స్ లాంటి అర్భకుడి వలలో పడటం ఏమిటి? సన్నగా, పొడుగ్గా, కథల మీద వచ్చే డబ్బు తప్ప మరే ఆధారం లేని, నాకన్నా అందవిహీనుడైన అతన్ని నా భార్య ప్రేమించడం నాకు చిత్రంగా ఉంది. ఆడవాళ్ళని అర్థం చేసుకోలేం అనే వాక్యానికి అర్థం సరిగ్గా ఇదే. నేను నవ మన్మథుడినని చెప్పకోను కాని విల్కిన్స్ కన్నా నేను ఖచ్చితంగా అందగాడ్నే.

వారి మధ్య శారీరక సంబంధం ఉందన్న నిజం తెలిసిన తర్వాత కూడా నేను ఇంకా డోరిస్ ని ప్రేమిస్తున్నాను అంటే నాకు ఆమె మీద గల ప్రేమని మీరు అర్థం చేసుకోవచ్చు. నిజాయితీగా చెప్తున్నాను. ఈ క్షణం దాకా ఆమె మీద నా ప్రేమ చెదరలేదు. ఎందుకంటే పూర్తిగా ఆమె తప్పు కాదిది. నేను రెండు వారాలు ఊళ్ళో లేకపోతే ఆమెని ఒంటరితనం ఆలుముకుంటుంది. ఆమెలాంటి అందగత్తె కోసం వలలు వేసే మగాళ్ళు మా ఊళ్ళో చాలామందే ఉన్నారు. పక్క గుమ్మమే కాబట్టి ఏవో డిటెక్టివ్ కథలు రాసుకునే విల్కిన్స్ అనే వెధవ ప్రయత్నాలు ఫలించాయి.

ఇందుకు కారణం ఆమె ఒంటరితనం. అందుకే డోరిస్ ని తప్పు పట్టను. కాని ఓ డిటెక్టివ్ కథా రచయిత పరాయి భార్యని ఆశించడం తప్పు. అతనికి తగిన గుణపాఠం నేర్పి తీరుతాను. సరయిన విధంగా శాశ్వత గుణపాఠం నేర్పుతాను. అంతే!

తొందరపడి అతన్ని చంపకు జిమ్! అలా చేస్తే వాడు చస్తాడు. తర్వాత ఎలక్ట్రిక్ కుర్చీలో నువ్వు చస్తావు. మిగిలేది డోరిస్, ఆమె ఒంటరితనం. నాకు నేను చెప్పుకున్నాను.

ఆ తర్వాత సరయిన అవకాశం కోసం ఎదురు చూస్తూ ఏం చేయాలా అని ఆలోచించసాగాను. వాళ్ళ విషయం నాకు తెలిసినట్లుగా డోరిస్ కి తెలియనివ్వలేదు.

విల్కిన్స్ కి కూడా!

పోస్ట్ బాక్స్ దగ్గర కాని, లిఫ్ట్లో కాని, చెత్త పారపోసే చోట కాని అతను కనబడితే ఎప్పటిలా పలకరింపుగా నవ్వసాగాను. అతనూ సమాధానంగా తల ఊపేవాడు. నన్నో చవట కింద జమకట్టి మనసులో నవ్వుకుంటున్నాడని అనుకునేవాడిని.

కాని ఎంతకాలం? తొందరపడకు. నీకు ఈ భూమి మీద నూకలు చెల్లాయి' అని మనసులో అనుకునేవాణ్ణి. అప్పుడు హాయిగా ఉండేది.

ఈ విధంగా కొన్ని నెలలు గడిచాయి. సరయిన అవకాశం కోసం ఎదురు చూస్తున్న నాకు అత్యంత అదృష్టవశాత్తు అతన్ని చంపే ఓ విధానం తెలిసింది.

అది ఆగస్ట్ నెల. నా భార్య డోరిస్ కి గుడ్ బై కిస్ ఇచ్చి సూట్కేస్ తో కిందికి వచ్చాను. దాన్ని కారు డిక్కీలో పడేసి, డిక్కీ తాళం వేసి కారులో కూర్చున్నాను.

అప్పడే ఓ టేక్సీ వచ్చి ఆగింది. అందులోంచి విల్కిన్స్ దిగి టేక్సీ వాడికి డబ్బిచ్చి లోపలికి వచ్చాడు. చేతిలో సరుకులు ఉన్న బ్రవున్ కలర్ కవరు, కాగితాల కట్ట, ఉత్తరాలతో వస్తున్న అతన్ని కారులోంచి చూస్తూ కూర్చున్నాను. మరో రెండు వారాల పాటు డోరిస్ తో వీడిది ఇష్టారాజ్యం. పళ్ళు పటపట కొరికాను. ఆట్టే కాలం సాగనివ్వను అనుకున్నాను.

నా అదృష్టవశాత్తూ అప్పుడు అది సంభవించింది. గేటునించి ఇంటి ప్రహరీ గుమ్మం దాకా రెండు పక్కలా గులాబీ చెట్లు ఉన్నాయి. అన్నిటికీ పూలు పూసి ఉన్నాయి. అకస్మాత్తుగా

విల్కిన్స్ మొహంలోకి భయం పాకింది. వెనక్కి తూలుతూ రెండడుగులు వేసాడు. అతనికి అంత భయం కలిగించే విశేషం ఏమిటా అని ఆస్తకిగా చూసాను.

తేనెటీగ!

గులాబీ పువ్వు మీద ఓ తేనెటీగ వాలి ఉంది. విల్కిన్స్ గట్టిగా చేతిలోని కవరుని పట్టుకుని ఆ చెట్టుకి దూరంగా జరిగి, భయం భయంగా వెనక్కి అడుగులు వేయసాగాడు.

గులాబీ పువ్వు మీద వాలి ఉన్న ఆ తేనెటీగ రుయిమ్మంటూ పైకి ఎగిరింది. ఎగిరి విల్కిన్స్ వైపు వెళ్ళింది. విల్కిన్స్ కళ్ళలో విపరీతమయిన భయం నాకు కనిపించింది. అతన్ని పలకరించడానికా అన్నట్లు అది మీద మీదకి వెళ్ళసాగింది. విల్కిన్స్ కెవ్వున కేక పెట్టాడు. అతని చేతిలోకి కవరు కిందపడి అందులోని వస్తువులన్నీ నేలపాలయ్యాయి. వాటిని ఏరుకోడానికి ఆగలేదు. ఒక్కసారిగా పరుగు లంకించుకున్నాడు. పరిగెత్తుతూ వెనక్కి తిరిగి కూడా చూడలేదు. ప్రహరీ గుమ్మం దాటి లోపలికి వెళ్ళాక ఆ తలుపు మూసేసాడు.

నా కారులో కూర్చుని నిశ్శబ్దంగా ఇదంతా గమనించాను.

ఇతన్నా నా భార్య ప్రేమించేది? తేనెటీగకి భయపడే పిరికివాడినా? చిన్నపిల్లలు కూడా భయపడరే? ఆరడుగులు పొడవుండే మనిషి శెనగగింజంత తేనెటీగకి భయపడటం నాకు ఆశ్చర్యం అనిపించింది.

అందుకు ఏదో కారణం ఉండి ఉండాలని అనిపించింది. కాని అదేమిటో నాకు అంతుపట్టలేదు. విల్కిన్స్ దేనికి భయపడతాడో నాకిప్పుడు తెలిసింది. తృప్తిగా కారు స్టార్ట్ చేసాను. మరో పది రోజుల దాకా నా పని మీద నాకు కేటాయించబడ్డ ఊళ్ళన్నీ తిరిగి కేవలం నా పని గురించే ఆలోచించాను. ప్రతీ రాత్రి నిద్రబోయే ముందు డోరిస్, విల్కిన్స్ లు నా కళ్ళ ముందు కదలాడేవాళ్ళు.

పదకొండో రోజు తిరిగి ఇంటికి వస్తూ కారుని హై వే పక్కన ఆపాను. నా కారుని దాటి వెళ్ళే మిగతా కార్లలోని వాళ్ళు నా కారు పేడెక్కడం వల్ల ఆపానని అనుకోవాలని, నా కారు బానెట్ తీసి ఉంచాను.

తర్వాత అంతకు ముందు రోజు కొన్న సీతాకోక చిలుకలని పట్టే వలని తీసుకున్నాను. రోడ్డు దాటి పక్కన ఉన్న చెట్ల మధ్యకి వెళ్ళాను. అరగంటలో ఓ తేనెపట్టు నా కళ్ళ పడింది. వాటన్నిటినీ కదిలించకుండా జాగ్రత్తగా వలలోకి అయిదారింటిని పట్టాను.

కారులో కూర్చుని వలలోంచి వాటిని జాగ్రత్తగా ఓ చిన్న అట్ట పెట్టెలోకి పంపాను. లోపలికి గాలి వెళ్ళే విధంగా ఆ పెట్టెకి అవి బయటికి రాలేనంత చిన్న బెజ్జాలు చేసాను. మూత మూసి పైన బ్రవున్ రంగు కాగితం అంటించాను. ముందరే సిద్దంగా ఉంచిన విల్కిన్స్ చిరునామా టైప్ చేసిన కాగితం ఆ పెట్టె మీద అతికించాను. ఫ్రమ్ ఎడ్రస్ రాయలేదు.

ఫస్ట్ క్లాస్ డెలివరీలో (స్పీడ్ పోస్ట్) ఆ పెట్టె వెళ్ళడానికి తగినన్ని స్టాంపులు అతికించి దాన్ని దారిలోని ఓ పోస్ట్ డబ్బాలో పడేసాను. బుధవారం జరిగిందది.

శుక్రవారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్నాను. కారుని షెడ్లో పెట్టి బయటికి వచ్చాను. బయట పోలీస్ అంబులెన్స్ ఆగి ఉండటం గుర్తించాను.

లిఫ్ట్ ముందు ఆగి బటన్ నొక్కాను. ఓ నిమిషం సేపు ఏం జరగలేదు. తర్వాత లిఫ్ట్ తలుపు తెరుచుకొంది.

వెంటనే పక్కకి తప్పుకున్నాను. ఇద్దరు పోలీసులు బయటికి వచ్చారు. వెనకే స్ట్రెచర్ లో తెల్ల దుస్తుల్లోని ఇద్దరు అంబులెన్స్ ఉద్యోగులు ఎవరినో పడుకోపెట్టి మోసుకు వచ్చారు. ఎవరు పడుకున్నారో కనబడకుండా మొహం దాకా గుడ్డ కప్పి ఉంది.

కాలింగ్ బెల్ విని డోరిస్ తలుపు తెరిచింది. ఆమె కళ్ళు ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నాయి. మొహం ఎంతో విషాదంగా ఉంది.

"రండి." చెప్పింది.

లోపలకు వెళ్ళి డ్రై మార్టిని కలుపుకుని తాగి అడిగాను.

"ఎవరికి జబ్బు చేసింది?"

"జబ్బు కాదు. చావు."

"ఎవరు పోయారు?"

"మిష్టర్ విల్కిన్స్. డిటెక్టివ్ రచయిత." డోరిస్ ఏడుస్తూ చెప్పింది.

"ఎందుకు? వద్దు. బాధపడకు." చెప్పాను డోరిస్ ని నా చేతులోకి తీసుకుని.

"మ... మధ్యాహ్నం గుర్తొచ్చింది వి...విల్కిన్స్ ని చూసి రోజున్నర పైనే అ... అయిందని. తలుపు కొడితే తీయలేదు. ఆ..ఆ సమయంలో బయటికి వెళ్ళడు. తలుపు లోపల గడియ పెట్టుకోడు. ఎంత కొట్టినా తలుపు తీయకపోతే భయం వేసి పో...పోలీసులకి ఫోన్ చేసాను. వాళ్లొచ్చి తలుపు పగలకొట్టి చూస్తే నేల మీద చచ్చి పడి ఉన్నాడు."

"పోలీస్ డాక్టర్ ఏమన్నాడు?" నాలోని ఆనందాన్ని డోరిస్ గుర్తించకుండా జాగ్రత్త పడుతూ అడిగాను.

"శవ పరీక్ష చేసి కాని ఏదీ నిర్ణయించలేమన్నారు."

"తలుపు కొట్టానన్నావు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉంటాడని నీకెలా తెలుసు? అసలా సమయంలో ఎందుకు వెళ్ళావు?" వీలయినంత సాధారణంగా అడిగాను.

బదులుగా డోరిస్ ఎక్కిళ్ళు వినపడ్డాయి.

"నాకు ఇంకో డ్రై మార్టిని కలుపు. ఇప్పుడే ఓ నిమిషంలో వస్తాను. ఏడవకు."

బయటికి వచ్చి విల్కిన్స్ ఫ్లాట్ తలుపు నెట్టాను. నా అదృష్టం మరోసారి పని చేసింది. తలుపు తీసే ఉండటం వల్ల తెరచుకుంది.

లోపలకి అడుగు పెట్టి ఆ గది వంక పరీక్షగా చూసాను. అలమారలో చిందర వందరగా పడి ఉన్న పుస్తకాలు, బల్ల మీద కాగితాల దొంతర. ఆ పక్కనే ఉన్న నేను పంపిన అట్ట పెట్టె నా దృష్టిని ఆకర్షించింది. దాని దగ్గరకి వెళ్ళి చూసాను. ఖాళీగా ఉంది.

చిన్నగా నవ్వుకున్నాను. కొందరి శరీర స్థితికి తేనెటీగ విషం పడదు. అది తాచుపాము విషం కన్నా ప్రాణాంతకం అవుతుంది. నేను ఓ మందుల కంపెనీకి సేల్స్ మెన్ గా పని చేస్తున్నాను కాబట్టి ఈ సంగతి నాకు తెలుసు. నా ఊహ నిజమైంది. ఇంటి బయట ఎదురైన ఆ తేనెటీగని చూసి విల్కిన్స్ ఊరికే భయపడలేదు. పెట్టె మూత తెరవగానే ఆరు తేనెటీగలు బయటికి రాగానే, ఈ గదిలో ఇక్కడే అతను పడ్డ భయం ఊహించుకుంటే నవ్వు వచ్చింది.

కథలు రాసుకోక మరి డోరిస్ ని ఎందుకు మచ్చిక చేసుకోవాలి?

వెనక గదిలోకి నడిచాను.

అక్కడున్నాయి ఆ చిన్న హంతకులు.

బయటికి వెళ్ళడానికి మార్గం లేక అవి అక్కడక్కడే ఎగురుతున్నాయి. కిటికీ గాజు తలుపు తెరిచాను. మార్గం కనపడగానే క్షణాల్లో అవి బయటికి ఎగిరిపోయాయి. బయటికి రాబోయే ముందు తేనెటీగలు పంపిన పెట్టె మీద నా వేలిముద్రలని శుభ్రంగా తుడిచేసాను. ఆ డబ్బాని పోస్ట్ చేసాక వాటి మీద నా వేలి ముద్రలని తుడవలేదన్న సంగతి గుర్తుకు వచ్చింది. ఇక ఏ డిటెక్టివ్ ఇదెలా సంభవించిందో తెలుసుకోలేడు.

డోరిస్ అందించిన డ్రై మార్టిని తాగి డోరిస్ ని దగ్గరకి తీసుకున్నాను.

నా భార్య ఇప్పుడు కేవలం నా ఒక్కడి కోసమే అనే ఆలోచన ఎంతో హాయిగా ఉంది. నేను బయటికి వెళ్ళినపుడు ఏర్పడే ఒంటరితనం వల్లే, నేను ఇంట్లో ఉంటే డోరిస్ మరో మగ పురుగు గురించి ఆలోచించదు కూడా.

ఆమెని ముద్దు పెట్టుకుని చెప్పాను.
"నేను నా ఉద్యోగం వదిలేస్తున్నాను."
"ఏమిటీ?" షాక్ తగిలినట్లుగా అడిగింది.

"అవును డోరిస్! నీతో ఇలా ఇంట్లో గడపాలని ఉంది నాకు. కారేసుకుని నిన్నొదిలి దేశం అంతా తిరగడం నాకు విసుగ్గా ఉంది. నేను వేల మైళ్ళ దూరంలోని ఏ హోటల్ గదిలోనో నిద్రపోతున్నప్పుడు నువ్వు ఈ గదిలో ఒంటరి రాత్రుళ్ళు గడపటం నాకు ఇంక ఎంతమాత్రం ఇష్టం లేదు."

"అవును. నువ్వు నన్ను వదిలి వెళితే నేను ఎంతో ఒంటరిగా ఫీల్ అవుతాను." డోరిస్ గోముగా చెప్పింది.

"ఇంట్లో ఇలా నీ దగ్గరే ఉండే ఉద్యోగం ఒకటి ఆలోచించాను." చెప్పాను.
నా వంక కళ్ళు విప్పార్చి చూసింది.
"ఏమిటది?" ఆసక్తిగా అడిగింది.
"విల్కిన్స్ లాగా డిటెక్టివ్ కథలు రాయడం. నిజానికి నేను తెలివిగల హంతకుడిని కూడా అవగలను అని అనుకుంటాను."

"డార్లింగ్, నువ్వు నాతో పాటే ఇంట్లో ఉంటే ఇంక నాకేం అదృష్టం కావాలి?"
నోరు తెరిచి చెప్పకపోయినా, డోరిస్ నన్ను గాఢంగా ముద్దు పెట్టుకునే రీతిలో పై వాక్యం నాకు అర్థమైంది

ఇది నా మొదటి కథ.

మీకు నచ్చిందా?

---

## ముల్లు - సెల్విన్ జప్సన్

నేను పంపిన టెలిగ్రాం మీకు బాధ కలిగించి ఉండచ్చు. కాని మీ అక్క మేరీ మరణవార్త మీరు రేపు ఉదయం పేపరులో చదివి తెలుసుకోవడం ఇష్టం లేక ముందే ఆ టెలిగ్రాం పంపాను.

ఆమె చెల్లెలిగా మీకు ఆమె మీద ప్రేమ ఉండచ్చు. కాని గత పదిహేడు సంవత్సరాలుగా నేను ఆమెతో కలిసి ఉంటూ ఆమె అవసరాలు చూసుకుంటున్నాను కాబట్టి ఆమె మీద నాకు ఇంచుమించుగా మీకున్నంత ప్రేమా ఉంది.

ఇదంతా తక్కువ వ్యవధిలో జరిగిపోయింది. కాబట్టి నేనింకా ఆ షాక్ నించి తేరుకోలేక పోతున్నాను. జరిగిందంతా వివరంగా రాస్తాను. నే చేసింది సరయినదేనని, సబబేనని అనిపిస్తోంది నాకయితే, ఈ ఉత్తరాన్ని వంటరిగా ఉన్నప్పుడు చదివి, తర్వాత కాల్చేయండి. మర్చిపోవద్దు.

మీ అక్క మిస్టర్ జార్విస్ ను మంచివాడు అనుకోవడం పొరబాటు. అతనో విలన్ అని గ్రహించలేకపోయింది. మా ఇంటి మేడ మీద ఉండటంతో అతను తరచూ ఇంటికి వస్తూండేవాడు. అతని బ్రీఫ్ కేస్ తాళాలు బంగారంతో చేయబడ్డాయి. ఎప్పుడూ నీట్ గా ఉండేవాడు. టైకి ముత్యంతో చేసిన పిన్ ధరించేవాడు. బాగా ధనవంతుడిలా కనిపిస్తాడు.

మేరీ నేనెంత చెప్పినా వినిపించుకోలేదు. సాయంత్రం వచ్చి మాతో టీ తాగుతూ, ఆ రోజు మూడు వేల డాలర్లు ఎలా సంపాదించ గలిగాడో చెప్తే ఆశ్చర్యంగా వినేది.

‘‘ధనం సంపాదించడం కష్టం కాదు. జాగ్రత్తగా స్టాక్ మార్కెట్ ని పరిశీలించి సరయిన సమయంలో సరయిన షేర్లు కొని, అమ్మాల్సిన సమయంలో అమ్మితే చాలు." చెప్పేవాడు.

మరో నెల రోజుల్లో మేరీ తన ఆర్థిక వ్యవహారాలని మిస్టర్ జార్విస్ కి అప్పగించేసింది. అతన్ని నమ్మొద్దని చెప్తే మేరీ బాధపడటంతో ఆ ప్రస్తావన మళ్ళీ తీసుకురాలేదు నేను.

వారానికి మూడు సార్లు వచ్చి టీ తాగుతూ, మేరీతో ఆమె ఎంత ధనవంతురాలైందో నీలం రంగు కాగితాల మీద లెక్కలు వేసి చూపించేవాడు.

"వారం క్రితం కన్నా ఇరవై రెండు శాతం పెరిగింది మీ ధనం. ఇరవై రెండు శాతం!!" అనేవాడు.

మేరీ అన్నీ నమ్మేది.

క్రమంగా భోజనానికి కూడా రాసాగాడు అతను. భోజనానంతరం అతనికి వైన్ తాగే అలవాటు ఉండటంతో, అర డజను బాటిల్స్ ఎప్పుడూ ఇంట్లో సిద్ధంగా ఉంచాల్సి వచ్చేది. అతని కోసం సిగార్స్ పెట్టె కూడా తేవాల్సి వచ్చేది.

మేరీ అతను బ్రీఫ్ కేసులో తెచ్చే కాగితాల మీద సంతకాలు చేసేది. తనో పెద్ద వ్యాపారవేత్తని అనుకుని మురిసిపోయేది.

అలా ఆరు వారాలు గడిచాయి.

సరిగ్గా ఆరు వారాల్లో మిస్టర్ జార్విస్ తన పని ముగించేసాడు. మోసం. మోసమే అతని పని. ఆరు వారాల తర్వాత ఓ రోజు 'ఆర్లో ట్రస్ట్' మూసేయడంతో మార్కెట్లోని మేరీ షేర్ల విలువ ఎలా పడిపోయిందో వివరించాడు. అది కేవలం కాగితం మీదే. నిజానికి అతను మేరీని మోసం చేసాడు. అన్నీ సక్రమంగా, పకడ్బందీగా న్యాయశాస్త్ర పరిధిలో జరిగిపోయాయి కాబట్టి అతన్ని ఎవరూ ఏం చేయలేరు.

క్రితం వారం జార్విస్ టీకి కాని, భోజనానికి కాని రాలేదు. మేరీ ఏ విధంగా ఉందో చూడటానికైనా కనీసం ఒకసారి కూడా మళ్ళీ రాలేదు. మేరీ ఆదాయం ఆగిపోయింది. తన కూతురిని పర్షియాలోని అల్లుడు రోజర్ దగ్గరకి పంపడానికి పైకం లేదు. బేంక్ బేలన్స్ ఉపయోగిస్తే వచ్చే

నెల అద్దె చెల్లించడానికి ఉండదు. అమ్మడానికి విలువైన సామాను కూడా ఆమె దగ్గర ఏం లేదు. ఒక్కోసారి కొన్ని గంటల దాకా నిశ్శబ్దంగా ఉండిపోయేది.

ఇక ప్రస్తుతానికి వస్తాను. గుండెలోని బాధ ఈ చేతిలోని కలాన్ని రాయిస్తోంది.

ఈ రోజు ఉదయం పదింపావుకి బయటకి వెళ్ళాను నేను. గత మూడు రోజులుగా మేరీ సరిగ్గా ఏం తినడం లేదు కాబట్టి కోడి మాంసం కొని తీసుకు వచ్చాను. మీకు తెలుసు కదా అదంటే మేరీకి ఎంతో ఇష్టం అని. పదకొండింటికి వచ్చాను. వంటగదిలోకి వెళ్ళి ఆవిడ ఆ సమయంలో తాగే పాలగ్లాసు తీసుకుని ఆమె గదిలోకి అడుగుపెట్టాను. సోఫా మీద పడుకొని ఉంది. ఇటీవల ఆమె సరిగ్గా నిద్రపోవడం లేదు కాబట్టి, పగటి పూట ఆమె నిద్ర పోతే ఆశ్చర్యం అనిపించలేదు.

అది ఆమె ఆఖరి నిద్ర అని దగ్గరకి వెళ్ళాక గ్రహించాను. నేల మీద ఆమె కుడిచేతి వైపు పడి ఉంది ఓ చిన్న పిస్తోలు. నాకు గుండె ఆగిపోయినట్లయింది. నా చేతిలోని పాల గ్లాసుని ఎందుకు నేల మీద పడేయలేదో, ఎందుకు అరవలేదో నాకే అర్థం కాలేదు. శిలా విగ్రహంలా నిల్చుండిపోయాను. ఆమె శాశ్వత నిద్రలో ఉంది.

నిశ్శబ్దంగా వంటగదిలోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను. కొద్ది నిముషాల్లోనే నన్ను ఆలోచనలు వేగంగా ముసురుకోసాగాయి.

ఇప్పుడు ఆలోచిస్తే ఆ తర్వాత అరగంటలో అలా చేయాలనే ఆలోచన నాకెలా వచ్చిందా అని ఆశ్చర్యం కలుగుతోంది. అగాథాకి అన్ని తెలివితేటలెలా వచ్చాయి అనిపిస్తుంది మీక్కూడా. ఎవరో నన్ను స్వాధీనపరచుకొని నా చేత అలా చేయించారని అనిపిస్తోంది.

మళ్ళీ ఆమె గదిలోకి వెళ్ళాను. ఆమె నుదుటి నించి కారిన రక్తాన్ని తుడవలేదు. వంగి కింద పడి ఉన్న పిస్తోలుని ముని వేళ్ళతో అందుకుని ముందు గదిలోకి వచ్చాను.

దాని మీద ఉన్న వేలిముద్రలను తుడిచి ఆ పిస్తోలుని డ్రాయింగ్ రూంలోని టేబిల్ కి ఉన్న సొరుగులో ఉంచాను.

తర్వాత మిస్టర్ జార్విస్ కి ఫోన్ చేసాను. నా కంఠం వినగానే అతను ఎందుకు? అంటూ విసుకున్నాడు.

"ఓ నిముషం రాగలరా? మేరీ మిమ్మల్ని చూడాలనుకుంటోంది." చెప్పాను.

"సారీ. నేనిప్పుడు రాలేను. బిజీగా ఉన్నాను. నిజానికి ఓ ముఖ్యమైన ఫోన్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాను. దయచేసి ఫోన్ పెట్టేయండి. జరిగిందంతా మేరీకి వివరించాను. కొత్తగా చెప్పేదేం లేదు." చెప్పాడు విసుగ్గా

సరిగ్గా ఆ సమయంలో డోర్ బెల్ మోగింది. నా గుండె ఆగినట్లయింది మరోసారి. జార్విస్ ఫోన్ పెట్టేసాడు. తలుపు తెరవాలా వద్దా అనే ఆలోచన కలిగింది. ఎవరై ఉండచ్చు?

వచ్చింది ఎలీన్. తన భర్తని కలుసుకోడానికి పర్షియాకి వెళ్ళడానికి డబ్బు లేదని తెలిసి వచ్చింది. ఆమె ఏడ్చిన గుర్తులు మొహం మీద కనబడ్డాయి. జరిగిన ఘరోరం గురించి మేరీ ఉత్తరం రాసి ఉంటుంది. ఉత్తరం అందుకుని వెంటనే వచ్చింది.

"అగాథా! మా అమ్మ తన డబ్బుని ఎలా పోగొట్టుకుంది?" అడిగింది.
జరిగింది వివరించాను.
"అమ్మని చూడాలి." ఆమె గది వేపు అడుగులు వేస్తూ చెప్పింది.

‘‘వద్దు. అమ్మ నిద్రపోతోంది. పైగా షేర్ల బిజినెస్ లో ఆమెని మోసగించిన వ్యక్తి కొద్దిసేపట్లో వస్తున్నాడు." చెప్పాను.
"అమ్మ పోలీసులకి జరిగిన మోసం చెప్పి, అతని మీద ఫిర్యాదు చేయవచ్చుగా?" అడిగింది.
"ఆ పనే చేయబోతోంది." చెప్పాను.

ఎలీన్లో కొద్దిగా ఉత్సాహం ప్రవేశించింది.
"సాయంత్రం వస్తాను." చెప్పి వెళ్ళిపోయింది.

మళ్ళీ జార్విస్ కి ఫోన్ చేసాను.
"నేనేం చేయలేనని చెప్తే వినిపించుకోవేం?" ఎగిరిపడ్డాడు నా మీద.
"ఓ అయిదు నిముషాలు మాట్లాడి వెళ్ళండి చాలు. లేదా ఆమె ఇంకెవరి సహాయమైనా తీసుకుంటుంది." చెప్పాను.
"ఏం సహాయం?" అడిగాడు.

"అల్లుడు పర్షియానించి పదిహేను వేల డాలర్లు పంపాడు. మళ్ళీ షేర్స్ కొనాలని అనుకుంటోంది. మిమ్మల్ని పిలవమని కోరింది. మీరు రాకపోతే బేంక్ మేనేజర్ సలహాతో."

చిన్నగా దగ్గాడు.

"బేంక్ మేనేజర్స్ కి షేర్ల గురించి ఏం తెలుస్తుంది? అల్లుడు పదిహేను వేల డాలర్లు పంపాడన్నావా?" అడిగాడు మెల్లిగా.
"అవును. మీరు రానట్లేగా?"
"నేను బిజీగా ఉన్నాను. అయినా మేరీ పిలిస్తే రాకుండా ఉండలేను..."

కొద్ది నిమిషాల తర్వాత బెల్ మోగింది. కావాలని వెంటనే తలుపు తెరవలేదు నేను. తెరిచాక కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాను.

"ముఖ్యమయిన ఫోన్ కాల్ వదులుకుని వచ్చారా? తర్వాత రావచ్చుగా?"
"ఆ పని పూర్తయ్యాకే వస్తున్నాను." లోపలికి వచ్చాడు నవ్వుతూ.
ఇందాక ఫోన్లో ప్రదర్శించిన చిరాకు, విసుగు మటుమాయం అయ్యాయి.
నేను మౌనంగా ఉండిపోయాను.
"ఏదీ ఆవిడ?" అడిగాడు.

‘‘తన గదిలో పడుకుని ఉన్నారు. మీరు వస్తే తన గదిలోకి పంపమన్నారు. రెండు విషయాలు అడగచ్చా?"

‘‘అడుగు." సాదరంగా చెప్పాడు.

"మేరీ పేర ఉండాల్సిన షేర్లన్నీ మీ పేరు మీదకి ఎలా బదిలీ అయ్యాయి?’’ అడిగాను.

క్షణ కాలం కలవరపడ్డా చిరునవ్వుతో చెప్పాడు.

"ఈ సంగతి మేరీకి ఇదివరకే చెప్పాను. షేర్ మార్కెట్లో తొందరగా అమ్మడం జరగకపోతే నష్టం అధికంగా ఉంటుంది. ప్రతీసారి సంతకం కోసం పరిగెత్తుకు రావడం నాకు కుదరదు. అందుకని నాపేరు మీద ఉంటే అది సాధ్యం అవుతుందని అలా చేసాను. అందుకు మేరీ ఒప్పుకుంది కూడా."

"ఆర్లో ట్రస్ట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ లో మీరూ ఉన్నారు కదా?"

‘‘ఉన్నాను. కాని మూడు నెలల క్రితం నేను రాజీనామా చేసాను."

"నాకు మీరు ఓ సహాయం చేస్తారా?" అడిగాను.

‘‘ఏమిటి???

‘‘ఓ వస్తువుని అమ్మి పెట్టాలి. నాకు ఎక్కడ ఎంతకి అమ్మాలో తెలీదు కాబట్టి మీ సహాయం కోరుతున్నాను.’’

‘‘ఏమిటది?’’

వెంటనే డ్రాయర్ సొరుగు తెరచాను.

‘‘ఈ పిస్తోలు ఖరీదు ఎంతుండచ్చు?" అడిగాను.

దాన్ని అందుకుని పరీక్షించి చెప్పాడు.

‘‘పాతిక డాలర్లు. ఎవరిది ఇది?"

"నాది. అమ్మి పెట్టగలరా?" అడిగాను.

‘‘తప్పకుండా. లైసెన్స్ ఉందా?" అడిగాడు దాన్ని జేబులో వేసుకుని.

‘‘ఉంది. మేరీతో మాట్లాడి వచ్చాక యిస్తాను." చెప్పాను.

ఆ పిస్తోలుని కనీసం నూట యాభై డాలర్లకి కొంటారు ఎవరైనా. ఆ బేరంలో కూడా మోసం చేయాలనుకున్నాడు నన్ను. ఆమె పడక గది తలుపు తెరిచాను. మిస్టర్ జార్విస్ లోపలికి అడుగు పెట్టాక తలుపు వెంటనే మూసి బయట గడియపెట్టాను.

టెలిఫోన్ దగ్గరకి నడుస్తూ డ్రాయర్ సొరుగు మూసాను. గదిలోంచి అతను గట్టిగా కేక పెట్టడం వినిపించింది నాకు. పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేసి చిరునామా చెప్పాను.

‘‘ఇక్కడ హత్య జరిగింది. హంతకుడు గదిలో ఉండగా ఆ గది తలుపు మూసి బయట గడియపెట్టాను. వెంటనే రండి." చెప్పాను వణికే కంఠంతో,

మిస్టర్ జార్విస్ లోపలనించి అరుస్తూ తలుపు మీద బాదుతున్నాడు తలుపు తెరవమని. తలుపు గడియవేపు పిస్తోలుని కాల్చాడు అతను.

తృప్తిగా నిటూర్చాను. ఇప్పుడు వేలి ముద్రలు ట్రిగ్గర్ మీద కూడా పడతాయి.

పోలీసులు వచ్చి అతడిని తీసుకెళ్ళారు. హంతకుడు లోపల ఉండగా బయట గడియపెట్టి వాళ్ళకి ఫోన్ చేసినందుకు నన్ను అభినందించారు.

"మేరీని అతను ఎందుకు చంపి ఉండవచ్చు?" అడిగాడు పోలీసు ఇన్ స్పెక్టర్ తర్వాత నన్ను.

‘‘తెలీదు. బహుశా అతను మేరీని పేర్ల విషయంలో మోసం చేసిన సంగతి మీకు ఫిర్యాదు చేస్తానన్నందుకు అయివుండవచ్చు." చెప్పాను.

‘‘అలాగా?’’ తల పంకించాడు.

వెళ్ళబోయేముందు అడిగాడు.

"ఒక్క చిన్న విషయం. మీరు పిస్తోలుని అమ్మిపెట్టమని జార్విస్ ని అడిగారా?"

"పిస్తోలా? అమ్మి పెట్టడమా?" నవ్వి చెప్పాను.

"నాకు పిస్తోలు లేదు.’’

ఇన్ స్పెక్టర్ కూడా నవ్వి చెప్పాడు.
"మిస్టర్ జార్విస్ కి అబద్ధం ఆడటం కూడా తెలియదు."

మిసెస్ బ్రౌన్. జరిగింది ఇది. మీ అక్క మేరీని మోసం చేసి దాని ఫలితంగా ఆమె తన ప్రాణాలే తీసుకునే పరిస్థితిని కల్పించిన మిస్టర్ జార్విస్ కి తగిన శిక్ష విధించాను. నే చేసిందాంట్లో ఎలాంటి తప్పు లేదనే భావిస్తున్నాను.

మేరీ ఆత్మ నేను చేసిన పనికి హర్షిస్తుంది అని నీకు అనిపించడం లేదూ? నాకైతే ఆ నమ్మకం ఉంది.

---

## అనుకోని అతిథులు - జేమ్స్ మైఖేల్ ఉల్మన్

సాయంత్రం నించి గాల్లో తేమ శాతం అధికంగా ఉంది. అంతే కాదు. ఆకు కూడా కదలడం లేదు. ఆకాశంలో మూగుతున్న మబ్బుల్ని చూస్తే జరగబోయేది కాలిఫోర్నియా వాసులకి అర్థమైంది. సూర్యాస్తమయ సమయంలో ఉరుముల చప్పుడుతో వర్షం మొదలైంది. వర్షానికి వాళ్ళు ఎన్నడూ భయపడరు. దాంతో పాటు వచ్చే టోర్నెడోలకే భయపడతారు. గాలి భూమి మీద సుడులు తిరుగుతూ వేగంగా ప్రయాణిస్తూ తన దారిలో అడ్డం వచ్చిన వాటిని టోర్నెడో పెళ్ళగించి వేస్తుంది.

కరెన్ రేడియోలో వాతావరణ సమాచారాన్ని ఆసక్తిగా విన్నది.

టోర్నెడో ఓ మొబైల్ హోంని పెళ్ళగించి తీసుకెళ్ళి అవతలకి విసిరేసింది. అందులో ఉన్న ఐదుగురూ మరణించారు. మరో టార్నెడో 'సెయింట్ లూయిస్- శాన్ ఫ్రాన్సిస్కో' రైలు మార్గంలోని ఓ రైల్వే కేబిన్ ని పెళ్ళగిస్తే మూడోది ఓ సెడాన్ కారుని గాల్లో ఎగరేసింది. ఆ కారులో ఉన్న వాళ్ళు తీవ్రంగా గాయపడ్డారు.

అలాంటి మరో డజను సంఘటనల గురించి చెప్పాడు న్యూస్ రీడర్. కరెన్ ఇంటికి కొన్ని మైళ్ళ దూరంలో చుట్టుపక్కల ఇంకో ఇల్లు లేదు. విసిరేసినట్లుగా ఉన్న ఓ ఫాంహౌస్ లో కరెన్ ఒంటరిగా ఉంటోంది.

బయట కారు ఆగిన చప్పడు, కారు తలుపులు రెండు మూసుకున్న చప్పుడు వినిపించాయి. ఆమె కిటికీ దగ్గరికి వెళ్ళే లోగానే ఎవరో ఫాం హౌస్ తలుపుని గట్టిగా తన్ని తెరిచారు. లోపలికి వచ్చిన ఇద్దరు యువకుల చేతుల్లో రెండు పిస్తోళ్ళు ఉన్నాయి.

వాళ్ళిద్దరి నీలం రంగు డెనిమ్ పేంట్లు, టీ షర్ట్లు తడిసి ముద్దయ్యాయి.

ఇద్దరిలోనూ పొడుగ్గా, పెద్దగా ఉన్న వ్యక్తి కరెన్ కు పిస్తోలు గురి పెట్టి చెప్పాడు.

"కదలకు. ఇంట్లో ఇంకెవరైనా ఉన్నారా?"

నోరు మెదపకుండా ఆమె తల అడ్డంగా ఊపింది.

“సరే. ఆ కుర్చీలో కూర్చో నీ చేతుల్ని మోకాళ్ళ మీద ఉంచు."

ఆమె నెమ్మదిగా కుర్చీలో కూర్చుని వాళ్ళు చెప్పినట్లే చేసింది. ఆ గదిలో కేవలం చిన్న కిరోసిన్ లాంతరే వెలుగుతోంది. వంట గదిలోని ట్రాన్సిస్టర్ నించి సంగీతం వినిపిస్తోంది.

"జెర్రీ. ఇంట్లో ఎవరైనా ఉన్నారేమో చూడు." పెద్దవాడు రెండో వ్యక్తిని ఆజ్ఞాపించాడు.

సన్నగా, దాదాపు ఇరవై ఏళ్ళున్న జెర్రీ, చక్కటి ఆంగసౌష్టవంతో గులాబీ రంగు స్లీవ్లెస్ హౌస్ గౌనులో సన్నగా ఉన్న కరెన్ వంక ఓసారి చూసాక ఇంటి తలుపు మూసి వెదకడానికి లోపలికి వెళ్ళాడు.

పొడుగ్గా ఉన్న అతని వయసు ముప్పై అయిదు నించి నలభై లోపు ఎంతైనా ఉండొచ్చు. అతను ఒకసారి కరెన్ కుర్చీ చుట్టూ తిరిగి, ఆమె ఎదుటికి వచ్చాడు. పిస్తోలు గొట్టాన్ని ఆమె తలకి అనించి అడిగాడు.

“నీ పేరు?”

‘కరెన్ స్మాల్ వుడ్"

"నీతో పాటు ఇంకా ఈ ఇంట్లో ఎవరెవరు ఉంటున్నారు?"

"నేనీ ఇంట్లో ఉండను. నా తల్లితండ్రులుంటారు. నేను టౌన్లో ఉంటాను. అక్కడ టీచర్ గా పని చేస్తున్నాను."

“వాళ్ళేరి?"

"శాన్ ఫ్రాన్సిస్కో కి పెళ్ళికి వెళ్ళారు. నేను కొన్ని పుస్తకాల కోసం వచ్చి తుఫానులో ఇక్కడ చిక్కుకు పోయాను."

"మేం దారీ తెన్నూ తెలీక ఇటొచ్చి పడ్డాం. ఇంటర్ స్టేట్లో (రెండు రాష్ట్రాలని కలిపే హై వే) బ్రిడ్జీలు కొట్టుకు పోయాయి. మేం వచ్చిన రోడ్డు ఎక్కడికి వెళ్తుంది?"

"ముప్పై మైళ్ళ తర్వాత ఆగిపోతుంది. కొండ అవతల ముప్పై మైళ్ళ దూరంలో ఇంకో ఫాం హౌస్ ఉంది. అక్కడిదాకా వెళ్తుందీ రోడ్డు."

“ఈ ముప్పై మైళ్ళ దూరంలో ఇంకో ఇల్లు లేదా?"

“లేదు.”

“నువ్వు ట్రాన్సిస్టర్ వింటున్నావుగా. మేమెవరో నీకు తెలిసి ఉండాలి."

“తెలుసు. కాని మీ పేర్లు తెలీదు."

“నా పేరు బెన్ గార్త్"

“నువ్వు, నీ మిత్రుడు నిన్న జైల్లోంచి తప్పించుకున్నారు. మీ కోసం పోలీసులు వెదుకుతున్నారు." చెప్పింది కరెన్.

హత్యా నేరం మీద గార్త్, బలాత్కారం నేరం మీద జెర్రి జైలు శిక్ష అనుభవిస్తున్నారని తను విన్న సంగతి మాత్రం కరెన్ అతనికి చెప్పలేదు. వాళ్ళు జైలునించి తప్పించుకున్నాక కారులో వెళ్ళే ఒకతన్ని చంపి అతని పిస్తోలు దొంగిలించారని, రోడ్డు పక్కన ఉండే ఓ చిన్న హోటల్లోని వెయిట్రెస్ ని రేప్ చేసి చంపారని కరెన్ కి రేడియో ద్వారా తెలిసింది.

ఈ రెండూ అనవసరపు హత్యలు అని న్యూస్ రీడర్ చెప్పడం కరెన్ కి గుర్తొచ్చింది.

జెర్రీ మళ్ళీ ఆ గదిలోకి వచ్చాడు.

"ఎవరూ లేరు కాని, పై గదిలో ఇవి ఉన్నాయి."

రెండు పిస్తోళ్ళని గార్త్ కి అందించాడు. అవి రక్షణ కోసం అమెరికన్ కుటుంబాలు తమ ఇళ్ళల్లో ఉంచుకునే పిస్తోళ్ళు.

"మీ నాన్న ఏం చేస్తుంటాడు?" అడిగాడు గార్త్.

"పాత సామాను కొని మారు బేరానికి అమ్ముతూంటారు. రిటైరయ్యారు. వచ్చే పెన్షన్ సరిపోదు. అందుకని ఈ వ్యాపారం చేస్తున్నారు. చుట్టుపక్కల పల్లెలకి వెళ్ళి అక్కడ ఇళ్ళల్లోని పాత సామాను కొని శాన్ ఫ్రాన్సిస్కో కి తీసుకెళ్ళి వాటిని లాభానికి అమ్ముతూంటారు.

"ఆ గదిలోని గోడలకి ఉన్న అద్దాల అల్మైరాల నిండా పాత పింగాణీ కప్పులు, లోహపు సామానుని గమనించి అర్థమైందన్నట్లుగా తల ఊపాడు గార్త్ కొన్ని పాత ఫోటోలు గోడలకి వేలాడుతున్నాయి. వాటి ఫ్రేములు బాగా పాతవి.

"మా గురించి తెలిసి కూడా నువ్వు భయపడటం లేదు. నాకు నిర్భయంగా ఉండే అమ్మాయిలంటే ఇష్టం. ఇవాళ ఉదయం దారిలో హోటల్లోని వెయిట్రెస్ నీలా కాదు. ఉత్త పిరికిది. దాంతో తగిన శిక్ష అనుభవించింది."

‘‘అరిచి, భయపడి ప్రయోజనం లేదు. నేనెంత అరిచినా ఆ ఆరుపులు వినేది మీ ఇద్దరేగా?" చెప్పింది కరెన్.

"తెలివైనదానివి. రాత్రికి తుఫాను ఎక్కువైతే ఎలా? మీ ఇంట్లో స్టాం షెల్టర్ ఉందా?" అడిగాడు గార్త్.

‘‘ఉంది. వంట గది నేలలో దాని తలుపు ఉంది." జవాబు చెప్పింది కరెన్.

ఆమె వంటిని గుడ్లప్పగించి చూస్తున్నాడు జెర్రీ.

బెన్ గార్త్ జెర్రీ వీపుమీద తట్టి సైగ చేసాడు. వెంటనే అతను కిరోసిన్ దీపం చేత పట్టుకుని వంటగదిలోకి వెళ్ళి నేల మీద ఉన్న తలుపుని తీసి చూసాడు.

లోపల ఇద్దరు పట్టే చిన్న గది ఉంది. లోపలకి ఆరు మెట్లు ఉన్నాయని గ్రహించాడు. తిరిగి వచ్చి ఆ సంగతి చెప్పాడు.

‘‘అవసరం వస్తే మనిద్దరం మాత్రమే అందులో ఇరుకోగలం. ఎక్కువ చోటు లేదు."

"దాన్నేమంటారు? ట్విస్టరా?" అడిగాడు గార్త్

“అవును. మీరు కారుని వదిలి ఇంట్లోకి వచ్చి మంచి పని చేసారు. ట్విస్టర్ కారుని తేలిగ్గా వందల అడుగులు పైకి తీసుకెళ్ళి కిందకి విసిరి పారేస్తుంది."

“సరే. మాకు ఆకలిగా ఉంది. వంట గదిలోకి పద. మాకేం చేస్తావో చెయ్యి" పిస్తోలుని తన డెనిమ్ పేంట్లోకి దోపుకున్నాడు బెన్ గార్త్.

మిగిలిన రెండు పిస్తోళ్ళను ఇద్దరూ చెరొకటి తమ జేబుల్లో దాచుకున్నారు.

ఫ్రిజ్ తెరిచి, అందులోంచి రెండు బీర్ కేన్స్ తీసి ఓపేన్ చేసి ఒకటి గార్త్ కి ఇచ్చి జెర్రి మరొకటి తను తీసుకున్నాడు.

"చల్లగా లేవు." చెప్పాడు గార్త్.

‘కరెంట్ పోయి ఆరు గంటలు దాటింది.’’ కరెన్ వివరించింది.

"తుఫాన్ వచ్చినప్పుడల్లా కరెంట్ పోతూంటుందా?’’

“ఊహు. తుఫానుతో పాటు అరుదుగా ట్విస్టర్ అనే టోర్నెడోలు వచ్చి అవి ఎలక్ట్రిక్ స్తంభాలని పెకలించి వేస్తాయి. అప్పుడు కరెంట్ పోతుంది."

‘నాది కేలిఫోర్నియా కాదు. అయోవా, ఈ టోర్నెడో గురించి వింటూంటాను. అసలు టోర్నెడో అంటే ఏమిటీ?" అడిగాడు జెర్రీ.

వెంటనే గార్త్ కరెన్ మొహంలో భయాన్ని గుర్తించాడు.

"మీ ఇద్దరిలో ఎవరూ ఇంతదాకా టొర్నెడోని చూడనే లేదా?" అడిగింది కరెన్ ఫ్రిజ్ లోంచి ఎగ్స్ బయటకి తీస్తూ,

“లేదు." జవాబు చెప్పాడు జెర్రీ.

గార్త్ కూడా తల అడ్డంగా ఊపాడు.

“ఎలా ఉంటుందో చెప్పు." అడిగాడు జెర్రీ కాసేపు ఆగి.

“చాలా ఏళ్ళ క్రితం నేను దాన్ని ప్రత్యక్షంగా చూశాను. అబ్బ! ఎంత భయంకరమో! నల్లగా ఉండి గుడ్రంగా తిరుగుతూ వచ్చే నరకం అది. గాలి శంఖాకృతిలో ఎంత వేగంగా తిరుగుతూ ప్రయాణిస్తుందంటే, ఓ చిన్న చీపురు పుల్లని అది మీ కపాలంలోంచి, మెదడులోని మెత్తని పదార్థంలోకి బుల్లెట్లా దింపగలుగుతుంది. ఇంక గాజుముక్కల మాటేం చెప్పాలి? దాని వేగానికి కిటికీ అద్దాలు పగిలి మనకి గుచ్చుకుంటే శరీరం రిబ్బన్స్ లా చీలిపోతుంది."

జెర్రీ భయంగా ఆ ఇంటికి ఉన్న అద్దాల కిటికీల వంక చూసాడు.

"అలాంటప్పుడు అద్దాలు ఎందుకు పెట్టుకున్నారు?"

"అదెప్పుడో వస్తుందని అద్దాలు లేని కిటికీలతో ఎలా జీవించగలం? అయినా, అది వచ్చేదాకా ఆగుతామా ఏమిటి? ఈ లోగానే తలుపు తెరుచుకుని స్టాం సెల్లార్లోకి పరిగెత్తి దాక్కుంటాం. కాని ఒకోసారి ట్విస్టర్ దూరం నించి నేల మీద కాకుండా ఆకాశంలో ప్రయాణిస్తూ సరాసరి ఇంటి కప్పు చీల్చుకుని ఇక్కడ దిగచ్చు. అప్పుడు మనకి తలుపు తెరచుకుని స్టాం సెల్లార్లోకి పరిగెత్తుకు పోయేంత వ్యవధి ఉండదు. అది నేలమీద ప్రయాణిస్తూ వస్తున్నప్పుడు మాత్రమే తగిన జాగ్రత్త తీసుకోగలం."

"అది పై నించి వస్తునట్లు ఎలా తెలుస్తుంది?" జెర్రీ సందేహంగా అడిగాడు.

"శబ్దాన్ని బట్టే తెలుసుకోవచ్చు. రాత్రుళ్ళు చీకట్లో దాన్ని చూడలేకపోయినా ఆ శబ్దమే మనకి హెచ్చరికగా పని చేస్తుంది. మన మీద దయతో దేవుడు ఆ ఒక్క ఏర్పాటు చేసాడు." కరెన్ కోడి గుడ్లని కొట్టి వాటిని ఫ్రై చేస్తూ చెప్పింది.

“అవును. అవి శబ్దం చేయడం గురించి నేనూ చదివాను." చెప్పాడు జెర్రీ.

"ఎలాంటి శబ్దం చేస్తాయి? అవి వస్తున్నట్లు ఎలా గుర్తించటం?" గార్త్ ప్రశ్నలో ఆసక్తి.

"ఎలాంటి శబ్దం అంటే...గూడ్స్ బండి దూరంగా పట్టాల మీద నించి మన వైపు వస్తూంటే వినిపించేలాంటి శబ్దం. ఇంచుమించు అలాంటి శబ్దమే. తన వెంట ఎన్నో రాళ్ళని, చెట్లని ఇంకా ఎన్నిటినో మోసుకు వస్తుంది. మా నాన్నగారు ఓసారి అలాంటి శబ్దం విని ఇంటి వెనక ఉన్న గోతిలోకి దూకి తర్వాత అదేమిటా అని చూసారు. దాంతో బతికిపోయారు. ఒక్క క్షణం ఆలస్యమైనా ఆయన నామరూపాలు లేకుండా పోయేవారు. ఒకసారి అది మనిషిని పైకి ఈడ్చుకెళ్ళి మళ్ళీ కిందికి పడేసేలోగా శరీరం చలికి గడ్డ కట్టుకుపోతుంది. వాతావరణంలో చలి అధికంగా ఉండేంత పైకి కూడా తీసుకెళ్తుందది. ఒక్కోసారి...''

"ఇంక చాలు. దాని గురించి ఇంక చెప్పకు." గార్త్ కరెన్ మాటలకి అడ్డుపడ్డాడు. అప్పటికే జెర్రీకి ఉన్న భయం అతనికి అంటుకుంది. ఈ సారి అతనికి కిటికీల అద్దాలు మృత్యు దేవత నోళ్ళలా కనపడ్డాయి.

గార్త్ చుట్టు చూసాడు. గోడకి వేలాడుతున్న పాత తుపాకీని చూపించి అడిగాడు.

''అది పని చేస్తుందా?"

''ఉపయోగించి చూడండి. మీకే తెలుస్తుంది." నవ్వింది కరెన్.

"ఆ అలంకార వస్తువుని మా నాన్న పాతిక డాలర్లకి కొన్నాడు. దాని ధర ఇప్పుడు నూట పాతిక డాలర్ల దాకా పలుకుతుంది.'' మళ్ళీ చెప్పింది.

"ఇంట్లో డబ్బేమైనా ఉందా?" అడిగాడు గార్త్ చేతులు రుద్దుకుంటూ.

"నా దగ్గర కొద్దిగా ఉంది. మా నాన్నగారు డబ్బు ఇంట్లో ఉంచరు. చుట్టుపక్కల ఎవరూ ఉండరుగా? అందుకని బేంక్ లోనే దాస్తారు.''

గార్త్ కరెన్ పర్సని వెతికి ఐదు డాలర్ల పదకొండు సెంట్లు తీసుకున్నాడు.

"జెర్రీ! మనం వెళ్ళేటప్పుడు ఆ పాత తుపాకిని తీసుకెళ్ళాలని గుర్తుంచుకో. నూట పాతిక డాలర్లు తక్కువ మొత్తం కాదు."

సరే అన్నట్లుగా తల ఊపాడు జెర్రీ.

వారి ఇంట్లో ఎక్కడయినా డబ్బు దొరుకుతుందేమోనని గార్త్ వెతికాడు. అద్దాల తలుపులు పగలకొట్టి అందులోని పింగాణి కప్పులని నేల మీదకి విసిరేసాడు. అది చూసిన కరెన్ మొహం ముడుచుకుపోయింది.

అమ్మితే ఒక్కో దానికి పది డాలర్ల దాకా వస్తుంది. తన తండ్రి చాలా సంవత్సరాలు తిరిగి, వెతికి కొన్న పాత సామానది. అయినా గార్త్ ని వారించ దల్చుకోలేదు. అతనికి ఎదురు చెప్పిన హోటల్లోని వెయిట్రెస్ గతి ఏమైందో కరెన్ కి తెలుసు. అందుకే తన దుఖాన్ని లోలోపలే దాచుకుంది.

ఆ సమయంలో అతడి మొహంలో కనిపించిన నవ్వు చూసిన కరెన్ కి భయం వేసింది. అతడు ఎలాంటి కవ్వింపు లేకుండా ఇతరులని నిర్ధయగా హింసించగల శాడిస్ట్ అని ఆ నవ్వుని బట్టి గ్రహించింది. తాగిన కాస్త బీరు మత్తుకే అతనిలో ఆ మార్పు వచ్చిందని కూడా గ్రహించింది.

"నిజంగా ఇంట్లో డబ్బు లేదా?" అడిగాడు గార్త్

"ఐయాం సారీ. నాకు తెలిసి లేదు."

"మేం ఇక్కడనించి వెళ్ళేలోగా అందుకు నువ్వు తప్పక సారీ అవుతావు చూస్తూండు." కర్కశంగా చెప్పాడు.

హింస ఒక్క శారీరకమే కాదు. అలా ముందుగా తనని మాటలతో భయపెట్టటం కూడా అతనికి సరదానే అనుకుంది కరెన్.

"నేను మీరేం అడిగితే అది చేస్తూనే ఉన్నాగా? నేను నో అంటే అప్పుడు నువ్వు ఆ మాట అనాలి."

"ఎందుకంటే, మాకు టీచర్లంటే ఇష్టం లేదు. ఏం జెర్రీ? నీకు?" అడిగాడు గార్త్

జెర్రీ కూడా కర్కశంగా నవ్వాడు.

"నిన్నిక్కడ ప్రాణాలతో వదిలి వెళ్ళడం మూర్ఖత్వం. మేం ఇక్కడ ఉన్నామని పోలీసులకి తెలియదు. మేం వెళ్ళాక నువ్వు వాళ్ళకి ఫిర్యాదు చేస్తావు." చెప్పాడు జెర్రీ.

‘‘నన్ను స్టాం సెల్లార్లో పెట్టి తాళం వేసి వెళ్ళండి. అప్పుడు మీకా భయమే ఉండదు."

‘‘అలాగే, తప్పకుండా నిన్ను అక్కడే ఉంచి తాళం వేస్తాం. నీ అంతట నువ్వుగా బయటికి రాలేనట్లుగా చేసాకే ఈ పని చేస్తాం. మేం ప్రమాదంలో పడకుండా ఉండాలంటే అదే మార్గం. మీ అమ్మానాన్న తిరిగి వచ్చాక ఏమిటా వాసన అనుకుంటూ తీసి చూస్తే కాని నీ గురించి ప్రపంచానికి తెలియదు."

మనసులోనే భయాన్ని అణిచేసుకుని బయటికి నవ్వుతూ చెప్పింది కరెన్.

‘‘నన్ను ఊరికే భయపెట్టాలని అలా అంటున్నావు గార్త్ మాటలతో నాతో ఆటలు ఆడుతున్నావు. నిజమే. నాకు భయంగా ఉంది. నా స్థానంలో ఉన్న ఎవరికైనా భయం కలగక మానదు. నువ్వు నన్ను చంపకర్లేదు. నన్ను ప్రాణాలతో ఒదిలి వెళ్ళడం ప్రమాదం అనుకుంటే నన్ను నీ వెంట తీసుకెళ్ళచ్చు. నా వల్ల మీకు ఏం ఇబ్బందీ కలగదు. నేను..." అని అంతలోనే హఠాత్తుగా ఆగిపోయి 'ఒక్క నిమిషం ఎవరూ మాట్లాడకండి’ అని అరిచింది. ఆమె చెవులు రిక్కించి వింటోందని గ్రహించారు ఇద్దరూ.

‘‘వినిపిస్తోందా?'' అడిగింది కరెన్.

జెర్రీ మొహంలోని చిరునవ్వు తక్షణం మాయమైంది.

‘‘వినిపిస్తోంది.'' చెప్పాడు అతను.

మరికొద్ది క్షణల్లో గార్త్ కూడా విన్నాడు. ముగ్గురికీ ఇప్పుడది మరింత స్పష్టంగా వినిపిస్తోంది. దూరంనించి వినిపించే ఆ శబ్దం క్షణక్షణానికి దగ్గర అవుతోంది.

"ఏదో గూడ్స్ బండి దూరం నించి దగ్గరకు వస్తున్న శబ్దంలా ఉంది." చెప్పాడు గార్త్

‘‘బతకాలంటే మనం వెంటనే స్టాం సెల్లార్లోకి వెళ్ళాలి..." కరెన్ లేచి అటు వైపు అడుగులు వేసింది.

కాని జెర్రీ ఆమె వైపు గెంతి కరెన్ ని బలంగా పక్కకు లాగి ఆరిచాడు.

"గార్త్ రా. ఇద్దరికే చోటుంది అందులో."

గార్త్, జెర్రీ స్టాం సెల్లర్ వైపు వెళ్తుంటే భయంగా అరిచింది కరెన్.

‘‘నన్నొదలకండి. చచ్చిపోతాను. ముగ్గురం ఇరుక్కుందాం."

వాళ్ళిద్దరూ స్టాం సెల్లార్ డోర్ దగ్గరికి వెళ్ళేలోగా కరెన్ కుర్చీ ఎక్కింది. వాళ్ళు తలుపు తెరిచే లోగా గోడ మీద వేలాడే తుపాకీ అందుకుంది. ఆ ఇద్దరూ మెట్లు దిగే లోగా రెండు సార్లు పేల్చింది. రెండు గుళ్ళు వాళ్ళ వీపుల్లోంచి దూసుకు పోయాయి.

* * *

ఉదయం ఆ ఇంటి బయట ఆగిన అంబులెన్స్ లో ఆ ఇద్దరి శవాలని ఎక్కించడం కిటికీ అద్దాల్లోంచి కరెన్ చూసింది. గుండెలో దిగిన తుపాకీ గుండుతో గార్త్ తక్షణం మరణించాడు. జెర్రి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. అతడు బతుకుతాడో లేదో డాక్టర్ చూసే దాకా తెలియదు.

కరెన్ పక్కన నిలబడ్డ పోలీసు ఆఫీసర్ ఆమెతో చెప్పాడు.

‘‘నీ మనసు ఎలా ఉందో నేను ఊహించగలను. కాని నీకు ఇంకో ఛాయస్ లేదు. నువ్వు వాళ్ళని చంపకపోతే వాళ్ళే నిన్ను చంపి ఉండేవాళ్ళు."

‘‘ఆ ఒక్క ఆలోచన వల్లే నేను ఈ భారాన్ని మోస్తూ బతకగలను అనుకుంటున్నాను. కారణం ఏదైనా ఇంకో మనిషిని చంపడం అనేది బాధాకరమైన చర్య"

‘‘నువ్వు తుపాకీ అందుకుంటూండగా నిర్లక్ష్యంగా ఉండటం వాళ్ళ దురదృష్టం."

‘‘ఆ సమయంలో వాళ్ళు స్టాం సెల్లార్ తలుపు తెరచుకుని లోపలకి వెళ్ళే హడావిడిలో ఉన్నారు. ట్రాన్సిస్టర్లో గార్త్, జెర్రీల గురించి వినగానే ఎందుకయినా మంచిదని ఆ తుపాకీని శుభ్రం చేసి రెండు గుళ్ళు నింపి ఉంచాను. టోర్నెడో వచ్చే శబ్దం దూరంనించి వచ్చే గూడ్స్ బండి శబ్దంలా వినిపిస్తుందని వాళ్ళకి చెప్పాను."

"కాని ఆ శబ్దం అలా ఉండదుగా?"

"అది మీకు తెలుసు. నాకు తెలుసు. ఈ రాష్ట్రానికి చెందని వాళ్ళకి తెలియదుగా? రాత్రి తొమ్మిదీ నలభై ఐదుకి వచ్చే గూడ్స్ బండి తుఫాన్ వల్ల ఆలస్యం కాకుండా సమయానికి రావడం నా అదృష్టం. దాని చప్పుడుని టోర్నెడో శబ్దమని నేను చెప్పినప్పుడు వాళ్ళు నమ్మడమూ నా అదృష్టమే."

కిటికీలోంచి దూరంగా కనబడే 'సెయింట్ లూయిస్- శాన్ ఫ్రాన్సిస్కో' రైల్వే లైన్ని చూస్తూ చెప్పింది కరెన్.

మర్నాడు పోలీస్ అధికారి కరెన్ కి ఫోన్ చేసి చెప్పాడు.

“నీ వల్ల గొప్ప పొయిటిక్ జస్టిస్ జరిగింది. హంతకుడైన గార్త్ మరణించాడు. బలాత్కార నేరం చేసిన జెర్రీ వెన్నెముకలో దిగిన గుండుని ఆపరేట్ చేసి తీసారు. ఇంక జీవితాంతం అతడు నడవలేడు. నడుం కింది భాగం పక్షవాతంతో చచ్చుపడి పోయింది."

"పాపం." సానుభూతిగా చెప్పింది కరెన్.

---

## సాక్ష్యం - సి.బి.గిల్ ఫోర్డ్

పాల్ సేన్టిన్ ఊరూరు తిరిగి మందులు అమ్మే వృత్తిలో ఉన్నాడు. ఓ చిన్న ఊళ్ళోని డాక్టర్ దగ్గరికి వెళ్ళి, తను పని చేసే కంపెనీ తయారు చేసే మందుల గురించి చెప్పి, ఆర్డర్లు తీసుకుని తిరిగి తన కారులో వస్తున్నాడు.

రాత్రి పదకొండు దాటింది. అర్ధరాత్రి అవక ముందే ఇంటికి చేరాలనే ఉద్దేశంతో బాగా అలసిపోయిన పాల్ ఆ రోడ్డు మీద వేగంగా కారుని పోనిస్తున్నాడు. కళ్ళ మీదికి నిద్ర కూరుకు వస్తూంటే దాన్ని పారద్రోలడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇంకో అరగంటలో ఇంట్లో ఉంటాడు. ముంచుకు వస్తున్న నిద్రని అణచుకుంటూ జాగ్రత్తగా డ్రయివ్ చేస్తున్నాడు.

పాల్ సేన్టిన్ కారుని దాటి వెళ్ళాయి కొన్ని కార్లు. ఆ చీకటి రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అతను ఈ రోడ్డునే ఎన్నుకోవడానికి కారణం అదే. ట్రాఫిక్ పలచగా ఉంటుంది.

ఎదురుగా వచ్చే కారుని అకస్మాత్తుగా చూసాడు. వెంటనే కళ్ళు చిట్లించాడు. ఆ కారు వేగంగా దూసుకు వస్తోంది. ఆ రోడ్డు మీద వెళ్ళాల్సిన వేగం కన్నా అధికంగా ఉందా కారు వేగం. అటూ ఇటూ ఊగుతూ ఆ కారు రోడ్డు మధ్యగా వస్తోంది. యాంత్రికంగా తన కారు వేగాన్ని తగ్గించేసాడు పాల్. ఎదురుగా వచ్చే కారు హెడ్ లైట్ల వంక చూడకుండా రోడ్డుకి పూర్తిగా కుడి వైపు తిప్పాడు కారుని. కాని అప్పటికే ఆలస్యం అయిపోయింది.

పాల్ కి తెలుసు తనకి రెండే అవకాశాలు ఉన్నాయని. హారన్ మోగిస్తూ కారుని రోడ్డుకి అవతల వైపుకి తీసుకెళ్ళాలి. హారన్ విని ఆ కారు డ్రైవర్ వేగం తగ్గించి కారుని పక్కకి మళ్ళించవచ్చు. లేదా కారుని ఇంకా కుడి వైపు పోనివ్వాలి. రోడ్డు దిగి ఏ చెట్టుకో తన కారు గుద్దుకోవచ్చు. రెండో పని చేసాడు పాల్ కాని వెంటనే కాదు. ఆ కారు వేగం తగ్గకపోవడంతో తన కారుని కోపంగా కుడి వైపుకి కోసాడు.

బ్రేక్ వేయగానే పాల్ కారు చక్రాలు కీచుమన్నాయి. బ్రేక్ వేసినా ఆగలేదు కారు. ఎదురుగా వచ్చే కారు పాల్ కారు ఎడమ చక్రాన్ని బోసెట్ని బలంగా తాకింది. కొన్ని క్షణాలు పాల్ కారు గాల్లోకి లేచింది. అదే సమయంలో ఆ కారు తాకిడికి తలుపు తెరచుకుని పాల్ తన కారు లోంచి బయటికి విసిరి వేయబడ్డాడు.

పాల్ తన కారుని చూడలేదు. అది దేనికో గుద్దుకునే శబ్దం కూడా వినలేదు. గాలిలో లేచిన తన శరీరం మళ్ళీ నేల మీదకి దిగి గోడలా ఉన్న ఓ బండకి బలంగా తగలడమే తెలుసు. ఆ తర్వాత కదలకుండా అలాగే ఉండిపోయాడు. అతని చుట్టుపక్కల ప్రపంచంలా అతను కూడా కొద్ది క్షణాల్లో చీకట్లోకి జారిపోయాడు.

కొద్ది క్షణాల్లో మళ్ళీ మెలకువ రాగానే, పాల్కి వెంటనే బాధ అనిపించలేదు. ఆ షాక్ పాల్ ని పూర్తిగా భావరహితం చేసింది. 'తను బ్రతికే ఉన్నాడు" అనుకున్నాడు పాల్, తన శరీరానికి బాగా దెబ్బలు తగిలాయని ఆ చీకట్లో పాల్ కి తెలిసింది.

ఇప్పుడు కళ్ళు చెదిరే లైట్లు లేవు. చీకటిలో గడ్డి పొద మీద వెల్లకిలా పడి ఉన్నాడు. పైన ఆకాశంలో పూర్ణిమ నాటి చంద్రుడు, నక్షత్రాలు. అవి ఎప్పటికన్నా ఎంతో దగ్గరగా ఉన్నట్లుగా పాల్ కి అనిపించాయి. కంటికి తగిలిన దెబ్బ వల్లా? మొదటిసారిగా, "ఇక తను చచ్చిపోతాడు" అనిపించింది.

ఆ ఆలోచన అతనిలో కోపాన్ని బాధని తెప్పించలేదు. కారులోంచి గాలిలోకి విసిరి వేయబడ్డప్పుడు మాత్రం క్షణకాలం కోపం వచ్చింది. ఇప్పుడు అదీ లేదు. మళ్ళీ మరణానికి సంబంధించిన ఆలోచన కలిగింది. ఈ ప్రపంచంలో తను ఒంటరి వాడు ఇప్పుడు.

అతనికి అప్పుడు వినబడ్డాయి ఆ గొంతుకలు. మళ్ళీ ప్రపంచంతో సంబంధం ఏర్పడింది. తనని గుద్దిన కారులోని మనుషులు తనని రక్షించడానికి, తనకి సహాయం చేయడానికి వచ్చి ఉంటారు.

''ఇక్కడ లేదు."

ఓ యువకుడి కంఠం వినపడింది. ఆ రెండో కారుకి కూడా దెబ్బ తగిలి ఆగిపోయి ఉంటుంది. లేదా డ్రయివర్ ఆపి ఉంటాడు.

ఆ రెండో కారులోని వాళ్ళు తన కారు దగ్గరికి వెళ్ళి ఉంటారు. అందులో తను లేకపోవడం చూసి బహుశ తన కోసం వెదుకుతున్నారు. తమ తప్పిదం గుర్తించి ఇప్పుడు సహాయానికి వస్తున్నారు.

వెంటనే గొంతు విప్పి అరవాలని ప్రయత్నించాడు. కాని ఆ పని అతను చేయలేక పోయాడు. కంఠం పెగల్లేదు.

"కారులో లేడు. బయటికి విసిరి వేయబడి ఉంటాడు. నాకు భయంగా ఉంది." ఆడపిల్ల గొంతు అది.

ఆ కారులో ఇద్దరు ఉన్నారన్నమాట.

''ఏం చేద్దాం అయితే?" ఇందాకటి మొగ గొంతు.

"వెదుకు." ఆ అమ్మాయి గొంతు మళ్ళీ వినబడింది.

"ఎందుకు?" అతని కంఠంలో తొట్రుపాటు.

‘‘అతనికి ఏమయిందో తెలుసుకోవాలి. లేదా...’’

‘‘అంతా చీకటి.’’

"చుట్టుపక్కల వెదుకుదాం. ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో చూడాలి."

"టార్చ్ లైట్."

‘‘ఉంది. తెస్తానుండు."

అడుగుల చప్పుడు. మళ్ళీ నిశ్శబ్దం.

పాల్ సెన్టిన్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అతనిలో కొత్త భయం ప్రవేశించింది. వాళ్ళ కంఠాలు అతనికి నచ్చలేదు. వాళ్ళ కంఠంలో దయ, కారుణ్యం లేవు. ఆసక్తి, భయం మాత్రమే ఉన్నాయి. వాళ్ళు సహాయం చేసే మనుషులు కాదు. తను మరణిస్తున్నా నిర్లక్ష్యంగా ఉండగలరు అనుకున్నాడు.

తను చచ్చిపోతున్నాడా?

అది తప్పదని తెలుసు పాల్ కి. బాధ మొదలైంది. శరీరంలో అనేక ప్రదేశాల్లో బాధ. మొహం, ఛాతి, రెండు కాళ్ళు, లోపల, ఇంకా ఎక్కడో. తనని వాళ్ళు చూసినా, చూడక తిరిగి వెళ్ళిపోయినా ఒకటే. డాక్టర్ తప్ప తనని ఎవరూ రక్షించలేరు.

"టార్చ్ దొరికింది. ఎక్కడ చూద్దాం?" దూరం నించి మొగ కంఠం.

*ఈ గోతిలో. "

అడుగుల శబ్దం. బూట్ల కింద రాళ్ళు నలుగుతున్న శబ్దం. నడకతో పాటు ఊగుతున్న టార్చ్ లైట్ కాంతి. తనని తప్పక చూస్తారు. పిలిస్తే వెదికే శ్రమ తప్పుతుంది. ఐనా గొంతు పెగల్లేదు.

‘‘ఎయ్!"

పాల్ మొహం మీద కాంతి పడింది. కాంతి నించి తలని పక్కకి తిప్పుదామని అనుకున్నాడు. కాని తల కదల్లేదు. గబగబా అడుగుల శబ్దం. ఇద్దరూ తన పక్కన నించున్నారు. కళ్ళల్లో గుచ్చుకుంటోంది కాంతి. కాని తన బాధని వాళ్ళు అర్ధం చేసుకున్నట్లు లేదు.

‘‘బ్రతికే ఉన్నాడు. చూస్తున్నాడు." ఆ అమ్మాయి కంఠం.

"కాని దెబ్బలు బాగా తగిలాయి."

పాల్ పక్కన మోకాళ్ళ మీద కూర్చుంది ఆ అమ్మాయి. ఇప్పుడు వెలుగు మీద పడటం లేదు. వెన్నెల్లో ఆ అమ్మాయి మొహం పాల్ కి స్పష్టంగా కనబడింది. చాలా చిన్న పిల్ల. పదహారు ఉండచ్చు. అందంగా కూడా ఉంది. నల్లటి జుట్టు. తెల్ల చర్మం. మొహంలో ఎలాంటి భావం లేదు. బహుశా షాక్లో ఉండి ఉంటుంది. ఆమె కళ్ళు పాల్ ఒంటి మీది గాయాలని చూసినా ఎలాంటి జాలి లేదా కళ్ళల్లో.

‘‘రక్తం బాగా కారుతోంది. నీకు బాగా దెబ్బలు తగలాయి కదూ?"

‘‘అవును.’’ ఈ సారి మాట పెగిలి తేలికగానే మాట్లాడగలిగాడు.

"ఎక్కడ? తెలుసా?"

‘‘ఒంటి నిండా, లోపల కూడా. " పాల్ కొద్ది సేపు ఆలోచించి చెప్పాడు.

‘‘నీకు సహాయం చేస్తే బతక గలవనే ఆశ ఉందా?" అడిగింది.

సమాధానం చెప్పే విషయంలో పాల్ తనకి తెలీకుండానే పొరపాటు చేసాడు.

"చచ్చిపోతాననే అనుకుంటాను." చెప్పాడు.

ఆ అమ్మాయి మొహంలో వెంటనే మార్పు వచ్చింది. మోకాళ్ళ మీద నించి లేచి నిలబడింది.

"చచ్చిపోతాడు." తనకి ఆ సంగతి తెలుసన్నట్లుగా ఆ యువకుడితో చెప్పింది.

"డాక్టర్ కోసం ప్రయత్నం అనవసరం కదా అయితే?" అడిగాడు ఆ యువకుడు.

ఆ మాటల్లో 'నా బాధ్యత తీరింది కదా?' అనే సంతోషం వినిపించింది పాల్ కి.

"డాక్టర్ అనవసరం అనుకుంటాను." ఆ అమ్మాయి.

"అయితే ఏం చేద్దాం?"

"చేసేది ఏం లేదు. ఆగాలి. కాసేపటిలో ఏదో ఓ కారు వస్తుంది."

"వాళ్ళు లిఫ్ట్ ఇస్తే తిరిగి ఆ కారులో మనం వెళ్ళవచ్చు. అవునా?"

ఆ యువకుడు ఇప్పుడు ఆ అమ్మాయికే నాయకత్వం ఇచ్చేసాడు.

"అవును. డాక్టర్నో లేదా ఇంకెవరినయినా ఇక్కడకు మనం పంపచ్చు. కాని ఆ సరికే ఇతను చచ్చిపోయి ఉంటాడు. దీని గురించి పోలీసులకి తెలియపర్చాలి మనం."

"పోలీసులకా?" అదిరిపడ్డాడు ఆ యువకుడు.

"తప్పదు. నువ్వో మనిషిని చంపావు."

మళ్ళీ నిశ్శబ్దం. పాల్ సేన్టిన్ వాళ్ళ కాళ్ళ దగ్గర గడ్డి మీద పడుకుని చూస్తున్నాడు. తను అప్పుడే మరణించినట్లుగా వాళ్ళిద్దరూ మాట్లాడేస్తున్నారు. అయినా అతనికి వారి మీద కోపం రాలేదు. కారణం తనకీ లోకంతో ఋణం తీరిందని తనే భావిస్తున్నాడు.

‘‘ఆర్లెన్....నన్నేం చేస్తారు వాళ్ళు?" అతను ఆమెని అడిగాడు.

‘‘ఎవరు? పోలీసులా?’’

‘‘అవును...నేనో మనిషిని చంపానన్నావుగా."

‘‘నువ్వు చంపావు. చంపలేదా?"

"కాని అది కావాలని జరిగింది కాదు. ఏక్సిడెంట్. నీకూ తెలుసు అది ఏక్సిడెంట్ అని. అనుకోకుండా అయిపోయింది." తొట్రుపడ్డాడు.

గొంతు తగ్గించి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. అయినా పాల్ కి ప్రతీ మాటా వినపడుతోంది.

‘‘ప్రతీ ఏక్సిడెంట్లో ఎవరిదో ఒకరి తప్పు ఉంటుంది." బలహీనంగా చెప్పాడు పాల్ వాళ్ళకి.

కొద్దిగా ఉలిక్కిపడ్డారు ఇద్దరు. ఒకరి మొహాలు మరొకరు చూసుకొని పాల్ వంక చూసారు.

‘‘అంటే?’’ అడిగాడు యువకుడు.

‘‘ఈ ప్రమాదం నీ తప్పు వల్ల జరిగింది.’’ తప్ప తనది కాదని చెప్పాలనిపించి చెప్పాడు.

‘‘తప్పు నాదేట్ల అవుతుంది?"

‘‘నీ కారు లైట్స్ ని నువ్వు డిమ్ చేయలేదు."

అతను మాట్లాడలేదు.

"ముఖ్యంగా నీ లేన్ వదిలి రోడ్డుకి కుడి వైపు నా లేన్లోకి వచ్చావు."

"ఆర్లెన్ ఇతను చెప్పేది నిజమేనా?" సందిగ్ధంగా అడిగాడు ఆ యువకుడు.

ఆ అమ్మాయి సన్నగా నవ్వినట్లుగా అనిపించింది పాల్ కి.

"నాకెట్లా తెలుసు? మనం...?"

ఆమె వాక్యం పూర్తి చేయలేదు. మిగతాది పాల్ అర్థం చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ నడిచే కారులో శృంగారం జరుపుతున్నారు. అందుకే కారు అతని కంట్రోల్లో లేదప్పుడు. వాళ్ళ సంతోషానికి ఫలితంగా తను బాధితుడు అయ్యాడు.

పాల్ కి ఈ సారి కోపం వచ్చింది. వెంటనే తను మరణించబోతున్నాడని తెలుసు. అయినా వాళ్ళ మీద కోపం ముంచుకు వచ్చింది.

"అర్థమయిందా? నీది తప్పు, రాంగ్ సైడ్ వచ్చావు నువ్వు"

ఆ యువకుడు ఆ అమ్మాయిని అడిగాడు.

"పోలీసులు నన్నేం చేస్తారు?"

"నాకెలా తెలుసు?" ఆమె కరకుగా చెప్పింది.

"నేను రాంగ్ సైడ్ వచ్చినా అది ఏక్సిడెంట్. నేను కావాలని చంపాలని ప్రయత్నించలేదు."

"నిజమే."

ఆ యువకుడు కొద్దిగా ధైర్యం పుంజుకుని చెప్పాడు.

“ఇలాంటి విషయాలు పేపర్లో చదివాను. డ్రయివర్ కి ఏం కాదు. ఫైన్ వేస్తారు. మా నాన్నగారు కడతారది. నేను జైలుకి వెళ్ళాల్సి వచ్చినా ఎక్కువ కాలం ఉండను ఆర్లెన్, ఓ నెల. అంతే."

“లేదా రెండు నెలలు. అంతకు మించదు."

పాల్ కి ఆ సంభాషణ విన్నాక కోపం అధికం అయింది. లేదా మూడు నెలలు అనుకున్నాడు మనసులో. ఆ మాట బయటికి అనలేదు.

"ఇంకోటుంది." ఆ యువకుడు ఆకస్మాత్తుగా చెప్పాడు.

“ఏమిటి?”

"దీన్ని ఏక్సిడెంట్ అంటారు. నా తప్పంటారు. ఎప్పుడు? ఇతను ఇతరులకి చెప్తే. అసలు ఇతను చచ్చిపోతే ఎవరికీ ఏమీ చెప్పలేడు కదా?"

అకస్మాత్తుగా ఆ అమ్మాయి కంఠంలో కూడా ఏదో మార్పు

“నిజమే సుమా."

"కాబట్టి వీడు చచ్చిపోవాలి. నే చెప్పేది అర్థమవుతోందా ఆర్లెన్?"

"ఇందాకే తను చచ్చిపోతానని నాకు చెప్పాడు."

“అవును. అందుకని ఇతను తప్పక చావాలి. చస్తాడని మనం నిశ్చయం చేసుకోవాలి." ఆ యువకుడి కంఠం ఆవేశంగా పలికింది.

ఆ అమ్మాయి ఆ యువకుడి చేతిని గట్టిగా పట్టుకుని అతని మొహంలోకి చూడటం పాల్ చూసాడు. పాల్ కి వారి ఆలోచనా ధోరణి భయాన్ని కలిగించింది.

‘‘ఇంకోటి కూడా ఉంది." ఆ యువకుడు గొణుగుతున్నట్లుగా చెప్పాడు.

‘‘ఏమిటి???

"ఇన్సూరెన్స్. మరణించిన మనిషి కంటే అవకరం గల వ్యక్తికే ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలి. ఎంత ఎక్కువో తెలియదు నాకు. వీడు చావకుండా బ్రతికే ఉండి ఏ కుంటి వాడో అయితే చాలా ఇచ్చుకోవాలి."

"కాని వీడు ఇంకాసేపట్లో చచ్చిపోతాడుగా?" ఆ అమ్మాయి కంఠంలో కూడా భయం తొణికిసలాడింది.

"అది రూఢీగా మనకి ఎలా తెలుసు?"

పాల్ కి బాధ వేయటం లేదు ఇప్పుడు. కోపం మాత్రమే కలుగుతోంది. తనకి సహాయం చేయటం లేదు. పైగా తను చావాలని కోరుకుంటున్నారు. వారి ఆలోచనలు స్వార్థంతో నిండి ఉన్నాయి. ఇద్దరూ స్వార్థపరులు! నమ్మలేనంత స్వార్థపరులు! తన ముందే ధైర్యంగా ఈ విషయాలు చర్చించ గలిగేంత క్రూరులు.

వెంటనే ఆ యువకుడు మోకాళ్ళ మీద కూర్చుని పాల్ మొహం మీదికి టార్చ్ లైట్ వేసి పరీక్షగా చూసాడు. పాల్ కూడా అతని మొహంలోకి చూసాడు. కుర్రవాడే. ఆ అమ్మాయి కన్నా రెండు మూడేళ్ళు ఎక్కువ వయసు. అంతే. అతని కళ్ళ నిండా భయం. తలకి ఎడం పక్క అతనికీ దెబ్బ తగిలింది. గాయంలోంచి కారిన నెత్తురు జుట్టుకి అతుక్కుని ఉంది.

‘‘ఎట్లా ఉంది నీకు?’’ అడిగాడు.

మృత్యువు చెవిలో గుసగుస లాడుతున్నట్లుగా అనిపిస్తున్నా వంటి నిండా బాధగా ఉన్నా ఈ సారి ఇదివరకు చెప్పిన సమాధానం చెప్పదలుచుకోలేదు పాల్. ఆ యువకుడి కళ్ళలో ఆత్రుత

చూసిన పాల్ మౌనంగా ఉండిపోయాడు. ఓసారి పాల్ వంటిని టార్చ్ లైట్ వెలుగులో పరిశీలించి లేచాడతను.

"చచ్చిపోయేంత ప్రమాదకరమైన దెబ్బలు తగిలినట్లుగా లేవు." ఆ అమ్మాయితో చెప్పాడతను.

ఆకస్మాత్తుగా కడుపులోని బాధ మెలిపెట్టినట్లుగా అయ్యింది పాల్ కి. స్పృహ తప్పుతుందా అన్నట్లుగా అనిపించింది.

‘‘ఏం చేస్తున్నావు?" ఆ అమ్మాయి అరుపు పాల్ కి వినిపించింది.

‘‘వీడు చావాలి. వీడు చచ్చేలా చెయ్యాలి." అతని సమాధానం కూడా వినిపించింది.

ఇద్దరి కంఠాల్లో ఆవేశం ధ్వనించడం పాల్ విన్నాడు.

"కాని చంపడం నేరం."

"అది బయటకి వచ్చినప్పుడుగా. నేనెలాగో వీడిని సగం చంపాను. పూర్తిగా చావాలంటే ఆలస్యం అవుతుంది. ఇతను త్వరగా చావాలి. ఇది మన మంచి కోసమే."

ఆ అమ్మాయి భయంగా మూలిగింది.

‘‘ఇక్కడ జరిగింది ఎవరికీ తెలియదు. ఎటూ ఒంటి మీద దెబ్బలు తగిలే ఉన్నాయి. రేపు చూస్తే ఏక్సిడెంట్లో తగిలి మరణించాడని అనుకుంటారు.

’’ఇద్దరూ కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. తన రక్షణ కోసం తల తిప్పగలిగినంత వరకు తిప్పి చూసాడు పాల్. ఆ అమ్మాయిలో అమానుష స్వార్ధం. అతనిలో మృగత్వం. అందుకే ఆ అమ్మాయి అతన్ని ప్రేమించ గలుగుతోందా?

"అలాగే కాని జేమ్స్." చివరికి నెమ్మదిగా చెప్పింది.

పాల్ చేయగలిగిందంతా కదలకుండా అలా పడి ఉండటమే. బహుశా చచ్చే దాకా కొట్టి చంపుతారు. ఈ చావంటే భయంగా ఉంది.

"ఒద్దు శక్తి కొద్ది అరిచాడు."

మళ్ళీ ఆ యువకుడి టార్చ్ లైట్ కాంతి పాల్ మొహం మీద పడింది. అతని మొహంలోని, కళ్ళల్లోని భయాన్ని వాళ్ళిద్దరూ చూసారు.

"నిజంగా ఇతన్ని చంపగలవా జేమ్స్?" ఆ అమ్మాయి అడిగింది.

ఇప్పుడు ఆమె కంఠం తేరుకున్నట్లుగా మామూలుగా ఉంది.

"తెలియదు. కాని తప్పదు."

"ఎలా? నీ రక్తం అతనికి అంటుకుంటే తర్వాత ఆ సంగతి బయట పడుతుంది. ఎవరి రక్తం ఏదో లేబోరేటరీలో కనుకోగలరు."

ఆ మాటలతో పాల్ లో కొత్త ఆశ చిగురించింది.

"ఏం చెయ్యాలో నాకు తెలుసు." కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు ఆ యువకుడు.

అతను పొదల దగ్గర దేనికోసమో వెతుకుతున్నాడని పాల్ గమనించాడు.

"ఆర్లెన్! ఇది పైకి లేపడానికి ఓ చెయ్యి వేయి."

ఆ అమ్మాయి నడిచిన చప్పుడు.

“వీడు కారులోంచి ఎగిరి వచ్చి ఇక్కడ పడ్డాడు కదా? పడుతుంటే తల ఈ బండకి తగిలింది. అంతే. తర్వాత శరీరాన్ని అలా అమరుస్తే చాలు. పైకి లేపు."

నెమ్మదిగా అతను రొప్పుతూ తన దగ్గరకి వస్తున్న అడుగుల చప్పుడు. పాల్ చూసాడు. వంగుని నెమ్మదిగా చేతిలో దేనితోనో వస్తున్నారు ఇద్దరు. వాళ్ళ చేతిలోని వస్తువు బలంగా బరువుగా ఉంది.

ఈ సారి అరవలేదు పాల్. అరవలేకపోయాడు. నెమ్మదిగా వస్తున్నారు. వచ్చి అతనికి చెరో పక్క నిలబడ్డారు.

వాళ్ళిద్దరి చేతుల్లోని వస్తువు పాల్ కళ్ళకి, ఆకాశానికి మధ్య అడ్డుగా వచ్చింది.

తను క్షణాలలో మరణించబోతున్నట్లుగా పాల్ కి తెలిసిపోయింది. ఇది మంచి చావు. త్వరగా చావచ్చు. అయినా ఇది హత్య.

పాల్ నిశ్శబ్దంగా ప్రార్ధించాడు.

దేవుడిని కాదు.

తెలివి గల డిటెక్టివ్ కోసం ప్రార్ధించాడు.

రహదారి పెట్రోల్ యూనిట్లో పని చేసే సార్జెంట్ విన్నెక్ తెలివి గల డిటెక్టివ్ గా పేరు తెచ్చుకున్నాడు. రహదారి మీద జరిగిన ఓ ఏక్సిడెంట్ గురించి అతనికి వైర్లెస్ సెట్లో మెసేజ్ అందగానే తక్షణం అక్కడికి బయలుదేరాడు. అతను దూరంనించే రోడ్డు మీద నిలబడ్డ ఓ టీనేజ్ జంటని చూసాడు. తన కారుని వారి పక్కన ఆపి దిగి తనని పరిచయం చేసుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి. ఎలా జరిగిందిది? అంతా నిజమే చెప్పండి." సార్జెంట్ విన్నెక్ వాళ్ళని అడిగాడు.

ఆ ఏక్సిడెంట్ ఎలా జరిగిందో ముందే ఆర్లెన్, జేమ్స్ కలిసి అల్లిన ఓ కథని జేమ్స్ తడబడకుండా చెప్పాడు. అది మరణించిన ఆ ఇంకో కారు డ్రైవర్ తప్పిదంగా అల్లిన కథ. సార్జెంట్ విన్నెక్ ఉదయపు వెలుగులో రోడ్డు మీద ఉన్న కారు టైరు గుర్తులని పరిశీలించాడు. ఆట్టే గుర్తులు లేవు.

కొద్ది దూరంలో నిలుచున్న ఆ జంట అతను చేసే పనిని గమనిస్తున్నారు.

సార్జెంట్ విన్నెక్ ఆ ప్రాంతంలో వెతకసాగాడు. త్వరలోనే అతనికి అవసరం అయిన దాని కన్నా సార్జెంట్ విన్నెక్కి ఎక్కువే కనిపించింది. ఓ మూగ సాక్ష్యం అతని కళ్ళబడింది. చక్కటి, తిరుగులేని సాక్ష్యం అది.

ఆ గోతిలోంచి రోడ్డు మీదకి వచ్చి ఆ యువకుడు, యువతి దగ్గరకి వెళ్ళాడు. వాళ్ళ వంక తీక్షణంగా చూసాడు. అతని మొహం చూసి భయపడుతూ అడిగాడు ఆ యువకుడు.

‘‘ఏమయింది సార్జెంట్?''

''రాతికి రెండు పక్కలు ఉంటాయి. అవునా?’’ కఠినంగా చూస్తూ అడిగాడు సార్జెంట్ విన్నెక్.

వారిద్దరూ అతని వంక అర్థం కానట్లుగా చూసారు.

‘‘పై భాగం వాన చేత కడగబడి శుభ్రంగా ఉంటుంది. కింది భాగం మట్టిలో పాతుకు పోయి, మట్టి అంటుకుని శుభ్రంగా ఉండదు. అవునా?''

‘‘అవును.’’ ఇద్దరూ ఒప్పుకున్నారు.

''కారులోంచి విసిరి వేయబడ్డ పాల్ సేస్టేన్ తల మట్టి అంటుకున్న రాతి కింది భాగానికి ఎలా తగిలింది?''

''అంటే?'' భయంగా అడిగింది ఆ అమ్మాయి.

"మీరిద్దరూ కలిసి ఆ రాతిని పెకలించి దాంతో పాల్ తల బద్దలు కొట్టి చంపారు. మీరా హత్య చేసాక పెకలించిన రాతిని చీకట్లో మళ్ళీ పెకలించిన చోట ఉంచారు. ఐతే శుభ్రంగా ఉండే భాగం కింద ఉంచారు. రక్తం అంటిన, మట్టి కొట్టుకు పోయిన భాగం పైకి ఉంచారు. కావాలంటే వచ్చి చూడండి."

ఆ యువతీ యువకులు ఇద్దరూ ఒకరి మొహం వంక మరొకరు భయంగా చూసుకున్నారు.

పాల్ ప్రార్ధన ఫలించింది.

మర్నాడు పోలీస్ కస్టడీలోని వారిద్దరికీ సార్జెంట్ విన్నెక్ అడిగాడు.

"అసలు అతన్ని మీరు ఎందుకు చంపారు? పోస్ట్మార్టమ్ రిపోర్ట్ ప్రకారం మీరు చంపకపోతే అతను జీవించేవాడు. అతనికి తగిలినవి అన్నీ పైపై గాయాలే."

---

## గ్రహణం - డేవిడ్ అలెగ్జాండర్

జీవితంలో అనుకోని సంఘటన అకస్మాత్తుగా జరగడం, దానివల్ల భవిష్యత్తులో ఎన్నో చిక్కులు ఎదుర్కోవడం చాలామందికి అనుభవమే. మార్సియా జీవితంలో కూడా అలాంటి దుర్ఘటన ఒకటి జరిగింది.

పెళ్ళయి ఇద్దరు పిల్లలున్నా ఆమె కార్టర్ని ప్రేమించడం కాదు అది. అతని దగ్గర సెక్రటరీగా ఉద్యోగం చేయడం కూడా కాదు ఆ దుర్ఘటన. అతనికి తన శరీరాన్ని అప్పగించడం అంతకంటే కాదు. వారిద్దరి గురించి కార్టర్ భార్యకి తెలియగానే గొడవ చేసి మార్సియాని ఉద్యోగంలోంచి తీసేయడం అంతకంటే కాదా దుర్ఘటన.

మార్సియా, ఆమె సోదరి హెలెన్ల జీవితాల్లోకి మిస్టర్ రిడ్జ్ ప్రవేశించడమే ఆ దుర్ఘటన. ఇంక పాల్ కార్టర్ని తమ ఇంటికి రానివ్వద్దని మార్సియా అక్కయ్య హెలెన్ హెచ్చరించింది. అది వాళ్ళిద్దరికీ మంచిది కాదని చెప్పింది.

ఆ రోజు బాగా చీకటి పడ్డాక వచ్చాడు పాల్ కార్టర్. మార్సియా గదిలోకి వెళ్ళాడు. అతన్ని చూసి మార్సియా మండిపడింది. గట్టిగా అరిచి పోట్లాడింది. మాటా మాటా పెరిగింది. వాళ్ళ ఇద్దరి పోట్లాటని పక్కవాళ్ళు వింటారని హెలెన్ భయపడింది. పెద్దగా చప్పుడయితే గబగబా చెల్లెలి గదిలోకి వెళ్ళింది హెలెన్. అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టురాలైంది.

పాల్ కార్టర్ తల మీద నించి రక్తం కారుతోంది. తల బాగా చిట్లి ఉంది. మార్సియా అతని తల మీద పగలకొట్టిన పూలకుండీ ముక్కలు ముక్కలై నేల మీద పడి ఉంది. క్షణకాలం కార్టర్ మరణించాడనుకుంది హెలెన్.

లేదు.

తల నించి కారే రక్తంతో తడబడుతూ బయటకి నడిచాడు. మార్సియా మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

కార్టర్ ఏమాత్రం తెలివిగలవాడయినా డాక్టరు దగ్గరకి వెళ్ళి ఉంటాడు. తన తల పగలడానికి ఏదైనా నమ్మకమయిన కారణం చెప్పి ఉంటాడు. అతనికేం కాకూడదని హెలెన్ దేవుడిని ప్రార్థించింది. మార్సియా గది కిటికీ తలుపు తీసి ఉండటం గమనించి వెళ్ళి దాన్ని మూసేసింది. ఆ కిటికీకి ఎదురుగా ఉన్న ఇంట్లో ఓ ముసలాయన నివసిస్తున్నాడు. రాత్రిళ్ళు ఆ ఇల్లెప్పుడూ చీకటిగా ఉంటుంది.

భోజనం చేయాలనిపించలేదు. రాత్రి పన్నెండు దాటుతోంది. ఇంట్లోని దీపాలన్నీ ఆర్పి పక్కమీదకి చేరుతూండగా బయటనించి ఎవరో తలుపు కొట్టడం వినిపించింది హెలెన్కి.

భయంతో కట్టెలా బిగుసుకుపోయింది కొన్ని క్షణాలు. పోలీసులా? పాల్ కార్టర్ రక్తం బాగా కారడంతో పడిపోయాడా? మరణించాడా? లేదా సరాసరి పోలీసుల దగ్గరకి వెళ్ళి జరిగింది చెప్పాడా?

వెళ్ళి తలుపు తెరచింది.

ఎదురింటి డెబ్భై రెండేళ్ళ ముసలాయన!

"ఇంత అర్ధరాత్రి ఏం కావాలి?" చిరాకుగా అడిగింది హెలెన్.

‘‘ఈ సమయంలో డిస్టర్బ్ చేస్తున్నందుకు మన్నించాలి. ముందుగా నన్ను పరిచయం చేసుకోనీ. నా పేరు రిడ్జ్ రిటైరయ్యాను, నా నించి మీకు ఎలాంటి ఆపదా రాదు."

‘‘మీ నించి మాకు ఎందుకు ఆపద వస్తుంది?" తిరస్కారంగా చూస్తూ అడిగింది హెలెన్.

వంకర నవ్వుతో లోపలికి వచ్చాడు.

‘‘ఇక నా రాకకి కారణం గది గురించి."

"ఏ గది?" ఆయన నించి వచ్చే పొగాకు వాసనకి ముక్కు మూసుకుని అడిగింది హెలెన్.

"పేపర్లో మీ ఇంట్లో గది అద్దెకి ఉందని వేసిన ప్రకటన గురించి."

"ప్రకటనా? అలాంటిదేం లేదే!" ఆశ్చర్యంగా చెప్పింది హెలెన్.

"ఒకవేళ ప్రకటన వేసినా, దాన్ని గురించి అడగడానికి ఇదా సమయం?"

ఆయన తన కుడి చేతి వేలిని 'జాగ్రత్త' అన్నట్లుగా ఆడించి చెప్పాడు.

“నిజంగా నువ్వు ప్రకటన ఇచ్చావు. మర్చిపోయావా? ఒప్పుకోవటం మంచిది. నేను ఆ గదిలో ఉండటానికి వచ్చాను. అర్థమైందా? ఈ ముందు గది నాకు బావుంది. ఈ రాత్రికి కావలసిన వస్తువులు తెచ్చాను. నెమ్మది నెమ్మదిగా మిగతా వస్తువులు తెచ్చుకుంటాను. నా అపార్ట్మెంట్ ని మంచి ధర వస్తే అద్దెకి ఇస్తాను. నీకూ, నీ చెల్లెలికి ఇక నించి నా అవసరం అధికంగా ఉంది. మీ ఇద్దరికీ నా రక్షణని ఇస్తాను."

ఆయన వంక పిచ్చివాడిని చూసినట్లుగా చూసింది. తర్వాత తల నెమ్మదిగా అడ్డంగా ఊపి చెప్పింది.

"మీకు పిచ్చిలా ఉంది."

పకపక నవ్వి చెప్పాడు ఆయన.

"పోలీసులకి శవం దొరికింది డియర్. ఈ ఇంటికి కొద్ది దూరంలో పడి ఉన్న అతని శవం పోలీసులు తీసుకెళ్ళారు. అంత చిన్న వయసులో హత్య చేయబడటం నిజంగా దారుణం. కాదంటావా?" అడిగాడు రిడ్జ్.

హెలెన్ జవాబు చెప్పాలని ప్రయత్నించింది. కాని మాట్లాడలేకపోయింది.

“ఏం?" అడిగాడు నవ్వుతూ.

"వెంటనే బయటకి నడు. లేదా...” గొంతు పెగుల్చుకొని చెప్పింది హెలెన్.

రిడ్జ్ ఆరిపోయిన చుట్టని చెవిలోంచి తీసి వెలిగించి గుప్పగుప్పన పొగ వదిలాడు.

"చుట్ట తాగితే ఏం అనుకోవనుకుంటాను. చాలా తాగుతాను. ఇదొక్కటే నా వ్యసనం డియర్. క్రమంగా అలవాటై పోతుందిలే." చుట్ట తాగడం వల్ల కలిగిన తృప్తితో చెప్పాడు మళ్ళీ.

"మీరు బయటికి వెళ్తే తలుపు వేసుకుంటాను." ఓపికగా చెప్పింది హెలెన్.

"నువ్వు నీ చెల్లాయ్ కిటికీ తలుపుల విషయంలో అశ్రద్ధ మనుషులనే చెప్పాలి. చీకట్లో కూర్చుని మిమ్మల్నిద్దరినీ చాలా కాలంగా గమనిస్తున్నాను. వెలుగు కన్నా చీకటికే నేనంటే దయ. ఆ చీకట్లో ఎన్నో గుర్తులు. స్మశానం నించి ఆ చీకట్లో నా కూతుళ్ళు ఇద్దరూ నా దగ్గరకు వస్తూంటారు. అలా చాలాసార్లు వచ్చారు. కానీ మీరిద్దరూ ఈ ఇంట్లోకి వచ్చాక, నాకు చీకట్లో కనబడే నా కూతుళ్ళు ఇద్దరూ మీరేనని అనిపించింది. అవును. వాళ్ళు మీరే. బతికొచ్చారు! నువ్వు అచ్చం నా పెద్ద కూతురు అలైస్ లాగా ఉంటావు. నీ చెల్లాయ్ అయితే పూర్తిగా డోరాయే. డోరా నా రెండో కూతురు. మై డియర్! ఇక నించి నువ్వు, నీ చెల్లెలు నా కూతుళ్ళు. నేను మిమ్మల్ని ప్రేమించే తండ్రిని. మీ రక్షణ భారం నాది. ఈ ఇంట్లో మనం ముగ్గురం ఎంతో సంతోషంగా గడపచ్చు."

ఆయన గుప్పుగుప్పున చుట్ట పొగ వదులుతూ కాసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తర్వాత చెప్పాడు.

"నా కూతుళ్ళని ఇద్దరినీ నేనే చంపేసాను తెలుసా? ఇరవై ఏళ్ళ క్రితం."

"నిజమా?" దిగ్భ్రాంతిగా అడిగింది హెలెన్.

ముసలాయన తాపీగా తల ఊపాడు.

"హత్య కాదు డియర్. ఈ రాత్రి ఇందాక ఇక్కడ జరిగినట్లు కాదు. వాళ్ళిద్దరి చిన్నతనంలో నా భార్య మరణించడంతో గారాబంగా పెంచాను. పెద్ద వాళ్ళయ్యాక కారు కావాలన్నారు. కాదనలేకపోయాను. నాకు డ్రయివింగ్ సరిగ్గా రాదు. ఆ ఆటలో వాళ్ళు సమయానికి పక్కకి తప్పుకోలేక పోయారు. అప్పటినించి ఒంటరి జీవితం. అలైస్, డోరాలు తిరిగి ఇప్పుడు నాకు దొరికారు. ఇదివరలోలాగా గారాబం పనికి రాదు. మిమ్మల్నిద్దరినీ ప్రేమగా చూసుకుంటాను."

"నో కుదరదు." పళ్ళు పటపట కొరికింది హెలెన్.

“నీ ఇష్టం. నీ చెల్లెల్ని ఉరి తీయరు. జీవితాంతం కారాగారంలో ఉంచుతారు. నేనంతా చూసాగా. పూలకుండీతో కొట్టి చంపింది. ఇంత చిన్న వయసులో జైల్లో..మీ ఇంట్లోంచి బయటకి వచ్చి నేల కూలాడు పాపం. దగ్గరకి వెళ్ళి చూస్తే చచ్చి పడున్నాడు. నా విద్యుక్త ధర్మం. పోలీసులని పిలిచాను. వాళ్ళకి మీ పేరు ముఖ్యంగా నీ చెల్లెలి పేరు చెప్పలేదు. ఒకవేళ వాళ్ళు వచ్చి మిమ్మల్ని అనుమానం మీద ప్రశ్నించినా ఇవాళ సాయంత్రంనించి మీతోనే ఉన్నానని, ఆ హత్య ఈ ఇంట్లో జరగలేదని చెప్తాను. అలా కుదరదంటే ఇప్పుడే వెళ్ళి జరిగింది చెప్తాను. అది కూడా నా విద్యుక్తధర్మం కదా."

“ఒద్దు. పోలీసులకి చెప్పద్దు." ఏడుస్తూ బిగ్గరగా చెప్పింది తన గది గుమ్మం దగ్గిర నిలబడ్డ మార్సియా. ఆమె అంతా విన్నది.

రిడ్జ్ తన కుర్చీలోంచి నెమ్మదిగా లేచాడు. మార్సియా దగ్గరకి గబగబా నడిచి వెళ్ళి ఛెళ్ళమనేట్లుగా ఆమె చెంప మీద కొట్టాడు.

“నీ గదిలోకి వెళ్ళు డోరా! ఏం చెయ్యాలో నేను, నీ అక్కయ్య ఆలోచిస్తాం."

మార్సియా తన గదిలోకి పరిగెత్తి వెళ్ళి మంచం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. హెలెన్కి తన చెల్లెల్ని రక్షించుకోడానికి ఆ ముసలాయన మాట వినడం తప్ప ఏం చేయాలో తోచలేదు. వేరే గత్యంతరం లేదు. ఆయన్ని నాన్నగారు’ అని పిలవడం ఇద్దరికీ అత్యంత అసహ్యకరమయిన విషయమయినా తప్పేది కాదు.

హెలెన్ చిత్రాలు గీసే గదిని రిడ్జ్ తీసుకున్నాడు. ఆమె తన చెల్లెలు మార్సియా గదిలోకి మారక తప్పలేదు. మొట్ట మొదటిరోజు మార్సియా డైరీ చదివి ఆమె పూలకుండీతో కొట్టిన వ్యక్తి పేరు పాల్ కార్టర్ అని గ్రహించాడు రిడ్జ్.

మర్నాడు ఉదయం తన పాస్ బుక్, ఉత్తరాలు రిడ్జ్ చదవడం గమనించింది హెలెన్. ఆమె అభ్యంతరం చెస్తే, అంత ఆలస్యంగా నిద్ర లేచినందుకు కోప్పడ్డాడు.

‘‘ఇక నుంచి ఉదయం ఆరున్నరకల్లా మీ ఇద్దరూ నిద్ర లేవాలి. ఏడింటికల్లా నాకు బ్రేక్ ఫాస్ట్ ఇవ్వాలి. రాత్రి పదిన్నర కల్లా నిద్రపోవాలి." చెప్పాడు.

ఆ రాత్రి పదకొండింటికి ఇంకా వాళ్ళ గదిలో లైటు వెలుగుతూండటం చూసి కోపంగా లోపలికి వెళ్ళాడు. సాకెట్ నించి బల్బులని తీసేసాడు.

"మీ తండ్రి మాటంటే లెక్క లేదా?" అరిచాడు కోపంగా.

ఆ రోజు నించి రాత్రి పదిన్నరకి వాళ్ళ గదిలో బల్బులు తీసి, మర్నాడు చీకటి పడ్డాక మళ్ళీ ఉంచసాగాడు. ఆయన తన ఇంటిని అద్దెకి ఇవ్వడం మానుకున్నాడు. అప్పుడప్పుడూ అక్కడనించి సామాను తెస్తూండేవాడు.

దుకాణానికి వెళ్ళి వస్తూ దినపత్రిక తెచ్చేవాడు. ఇంట్లోకి చేరిన మొట్టమొదటి వారం రోజులూ మొదటి పేజీలోనో, రెండో పేజీలోనో ఓ ఐటమ్ కత్తిరించబడి ఉండటం అక్కాచెల్లెళ్ళిద్దరూ గమనించారు. వాళ్ళు అడిగితే అవి కార్టర్ హత్యకి సంబంధించినవని చెప్పాడు. మొదటి వారం తర్వాత, కార్టర్ హత్య గురించిన వివరాలు దినపత్రికలు ప్రచురించడం మానేసాయని ఇదివరలా కత్తిరింపబడక పోవడంవల్ల వాళ్ళిద్దరూ గ్రహించారు.

తనకి పెద్ద చప్పుళ్ళు, రోడ్డు మీద వాహనాల శబ్దాలు, సూర్యరశ్మి పడవని చెప్పి కిటికీ తలుపులన్నీ మూసేసాడు. ఆ ఇంటికి ఉన్న టెలిఫోన్ని తీయించేసాడు. రేడియో, టెలివిజన్లలో ఉండే వాల్వ్ లను , వాటిని వాడకూడదని తీసేసాడు. వాళ్ళు గోళ్ళకి రంగు వేసుకోకూడదు. సబ్బు, పువ్వులు వాడకూడదు. గట్టిగా మాట్లాడకూడదు. కిటికీ తలుపులన్నీ మూసి ఉన్న ఆ ఇంటి నిండా పొగాకు వాసన. వాళ్ళిద్దరి బట్టలు పరిశీలించి, ఎబ్బెట్టుగా తోచినవి పరపరా చింపేసాడు. వాటిని ఇంటిని తుడిచేందుకు వాడమని సలహా ఇచ్చాడు. వాళ్ళిద్దరికీ బట్టలు ఉంచుకోడానికి ఆయన ఒకే ఒక అల్మైరా ఇచ్చి, మిగతా రెంటిలో తన బట్టలు, వస్తువులు ఉంచుకున్నాడు.

హెలెన్ ని అలైస్ అని, మార్సియాని డోరా' అని పిలవసాగాడు. వాళ్ళలో వాళ్ళు ఆ పేర్లతో పిలుచుకోకపోతే చెంప పగలకొట్టేవాడు. రాత్రి నిద్రపోబోయే ముందు వాళ్ళ చేత ఓ అరగంట బైబిల్ చదివించుకోసాగాడు.

వంటగదిలో వంట వండుతూ తలుపులు తెరిస్తే వాసన బయటకు పోతోందని ఉగ్ర రూపం దాల్చేవాడు. ఆ ముసలాయనకి పిచ్చేమోనని చాలా సార్లు హెలెన్ భయపడింది. చనిపోయిన ఆయన కూతుళ్ళు, అలైస్, డోరాలు చేసిన అల్లరికి వాళ్ళిద్దరినీ కొట్టడానికి ఎంతమాత్రం వెనుకాడేవాడు కాదు.

ఆయనలో శుభ్రత లేదు. చుట్ట నుసి నేల మీద పోసేవాడు. చుట్టపీకని చెక్క బల్ల మీద నొక్కి ఆర్పడంతో బల్లలన్నీ పాడయ్యాయి.

వారిద్దరూ కేవలం కూతుళ్ళే కాదు. ఆయనకి వంటవాళ్ళు, పనివాళ్ళు, కబుర్లు చెప్పేవాళ్ళు, నర్సులు. భోజనం తర్వాత విధిగా మందుతెచ్చి ఇవ్వాలి. ఆయన మింగే రకరకాల మందులని సమయానికి గుర్తు చేసి ఇవ్వకపోతే ఇద్దరినీ కొట్టేవాడు. ఆయనకి బ్లడ్ ప్రెషర్, గుండె జబ్బు ఉన్నాయి. ప్రతీ రాత్రి ఎవరో ఒకరు ఆయన వీపు మీద ఆల్కహాల్ వేసి రుద్దాలి.

ప్రతి రోజు ఓ గంట సేపు బయటకి వెళ్ళేవాడు. వారంలో ఓసారి హెలెన్ చేత ఓ చెక్కు రాయించుకుని వెళ్ళేవాడు. హెలెన్ ఎప్పుడూ వాటి తాలూకు సొమ్ము చూడలేదు. తన మందులు, చుట్టలు, భోజన సామగ్రి ఆ డబ్బుతో కొని తెచ్చుకునేవాడు. వెళ్ళేప్పుడు ఇంటికి తాళం వేసి వెళ్ళేవాడు. హెలెన్ గీసిన బొమ్మలని తనే స్వయంగా పత్రికలకి పోస్ట్ చేసేవాడు. ఆర్ట్ ఎడిటర్స్ కి తను స్వయంగా రాలేక పోస్ట్లో పంపుతున్నానని, చెక్స్ పోస్ట్ లో పంపమని హెలెన్ చేత బలవంతంగా ఉత్తరాలు రాయించాడు. చెక్స్ రాగానే వాటిని తన పేర మార్పించుకొని పర్స్ లో పెట్టుకొనేవాడు. అవి ఏమయ్యేవో హెలెన్కి తెలిసేది కాదు.

బయటి వాళ్ళ సహాయం కోరే సూచనలు వాటిలో ఉన్నాయేమోననే భయంతో హెలెన్ వేసిన బొమ్మలని క్షుణ్ణంగా పరిశీలించేవాడు. అలాగే ఆమె రాసే ఉత్తరాలు కూడా.

పోలీసు కానిస్టేబుల్ ని కిటికీలోంచి అనేకసార్లు అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ చూసారు. అతన్ని పిలిచి రిడ్జ్ గురించి చెప్పాలని హెలెన్ కి అనిపించేది. కాని తన చెల్లెలు హంతకురాలన్న సంగతి బయట పడుతుందనే భయంతో ఎంతో ప్రయత్నం మీద అతన్ని పిలవకుండా నిబ్బరించుకోగలిగేది.

హెలెన్ తోలుబొమ్మల ఆటగాడి చేతిలో తోలుబొమ్మలా తయారైంది. రిడ్జ్ ఆ ఇంట్లోకి అడుగు పెట్టిన రాత్రి తను మరణించిందనీ, కేవలం తన శరీరం మాత్రం మిగిలి ఉందనీ ఆమె భావించేది. ఇద్దరూ ఇలా ఆ ఇంట్లో ప్రత్యక్ష నరకం అనుభవిస్తూండగా ఓ రోజు మార్సియా దర్జాగా పొద్దున్నే తను కూర్చునే కుర్చీలో కూర్చోవడం గమనించాడు రిడ్జ్.

“లే అక్కడ." అరిచాడు మార్సియాని చూసిన రిడ్జ్ అధికారంగా.

మార్సియా ఎప్పటిలా భయపడుతూ లేవలేదు.

"మీకోటి చదివి వినిపించాలి నాన్నారు!” వెటకారంగా చెప్పింది.

కోపంతో రిడ్జ్ మొహం ఎర్రబడింది.

“డోరా! ఏమని పిలిచావ్ నన్ను?” అడిగాడు.

"నాన్నారు అని పిలిచా నాన్నారు! నా పేరు డోరా కాదు. మార్సియా." నిర్లక్ష్యంగా కాళ్ళాడిస్తూ చెప్పింది.

తన కుర్చీలోంచి లేచి, గట్టిగా కొడతానన్నట్లుగా చేతిని ఊపుతూ మార్సియా వైపు నడిచాడు ఆ ముసలాయన. అప్పటికే ఆమె నిర్లక్ష్యానికి కోపంతో వణికి పోతున్నాడు.

"నేనోటి చదివి వినిపించే దాకా నువ్వు నన్ను కొట్టకూడదు నాన్నారు!"

లేచి నిలబడి చెప్పింది. మళ్ళీ కోపంగా అరిచింది.

‘‘ఆగు. పోలీసులని పిలుస్తాను ముసలి నక్కా జాగ్రత్త!"

ముసలాయన ఎదురు చూడని ఆ మాటలకి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఆమె వంక తెల్లబోయి చూసాడు. హెలెన్ కూడా దాదాపుగా అదే స్థితిలో ఉంది.

‘‘పిలు." చెప్పాడు అస్పష్టంగా.

‘‘ముందర ఈ దిన పత్రిక చదివాక..."

"ఇందాకే చదివేసాను డోరా!" చెప్పాడాయన.

"మీరు పూర్తిగా చదవలేదు నాన్నారు!"

"మీ నాన్నగారిని అలా వెక్కిరించవచ్చా?"

"ఇంకెంత మాత్రం నువ్వు నాన్న కాదు." ఆయన కళ్ళలోకి అవహేళనగా చూసింది.

‘‘నువ్వు సొసైటీ పేజీ చదవలేదు నాన్నారు." వెక్కిరింపుగా చెప్పింది.

ఆయన మొహంలో కంగారు ప్రవేశించింది. మార్సియా వంక నిశ్చలంగా చూస్తూ చుట్ట తాగసాగాడు.

"మిస్టర్ పాల్ కార్టర్ తన భార్యతో ఎస్.ఎస్. కాన్స్టిట్యూషన్ అనే ఓడలో నిన్న సాయంత్రం యూరప్ కి బయలుదేరారు. ఇంగ్లండ్ కూడా దర్శించి నెల తరువాత తిరిగి వస్తారు. మిష్టర్

కార్టర్ వైస్ ప్రెసిడెంటుగా పని చేసే ఎన్రైట్ అడ్వర్టైజింగ్ ఏజన్సీ ఆయన్ని ఈ వ్యాపార సంబంధమయిన పర్యటనకు పంపించింది." బిగ్గరగా చదివింది మార్సియా.

"నేను హత్య చేసానని నువ్వు చెప్పిన వ్యక్తే పాల్ కార్టర్." చెప్పింది మార్సియా కళ్ళల్లోంచి నిప్పులు కురిపిస్తూ.

రిడ్జ్ తడబడ్డాడు. అవస్థ పడుతూ గట్టిగా ఊపిరి పీల్చుకోసాగాడు. ఆయన మొహం బాధతో నిండిపోయింది. దేహం కొద్దిగా ముందుకి వాలింది. చేతులు ఛాతీని ఎడమ వైపు గట్టిగా పట్టుకున్నాయి.

"గుండె నొప్పి. త్వరగా బాత్రూంలో ఉన్న టేబ్లెట్స్ తీసుకురా." బాధగా కోరాడు.

"నీ డియర్ డోరా తెస్తుందిలే నన్నారు." ఎగతాళిగా చెప్పింది.

మార్సియా, మార్సియా లేచి బాత్ రూమ్ వైపు కదిలింది. హెలెన్ కదలకుండా ముసలాయనని గుడ్లప్పగించి చూస్తూండి పోయింది.

చచ్చిపోతున్నాడు. అసలు చస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. ఇంతవరకూ ఎవరూ చావడం నేను చూడలేదు. మేమిద్దరం చిన్నపిల్లలుగా ఉండగానే అమ్మా, నాన్న పోయారు. ఇదివరకు ఎవర్నీ మరణిస్తూండగా చూడలేదు. ఇప్పుడు రిడ్జ్ ని చూస్తున్నా బాధ అనిపించడం లేదు. హెలెన్ మనసులో ఆలోచనలు.

మార్సియా ఇందాకటి ఎగతాళి నవ్వుతో బాత్రూంలోంచి వచ్చి చెప్పింది.

"సారీ నన్నారు. టేబ్లెట్స్ లేవు. ఒక్కటి కూడా లేదు. ఫోన్ లేకపోవడం ఎంత నష్టం? ఉంటే డాక్టర్ని పిలిచి ఉండేదాన్ని నాన్నారు."

మార్సియా వంక రిడ్జ్ భయంగా చూసాడు.

"ప్లీజ్... ప్లీజ్ మార్సియా. ఒక్క టేబ్లెట్."

"ఉహూ."

రిడ్జ్ ముందుకు వాలిపోయాడు. మార్సియా నవ్వుతూ ఆయన బట్ట తల మీద మిగిలిన వెంట్రుకలని వేళ్ళతో చుట్టి ఆయన తలని పైకెత్తి చూసి అక్కయ్యకి చెప్పింది.

"పాపం! నాన్నారు చచ్చిపోయారు హెలెన్."

‘‘మార్సియా? ఏం చేయాలిప్పుడు? ఈ శవాన్ని మనింట్లో ఎవరూ చూడకూడదు.’’ భయంగా చెప్పింది హెలెన్.

‘‘తేలిక. రాత్రి అయ్యే దాకా ఆగాలి. ఈయన ఇంటి తాళం చెవి జేబులో ఉంటుంది. ఈయన్ని ఈయన సామాన్ని అర్ధరాత్రి ఈయన ఇంటికి చేరిస్తే సరి. ఎవరయినా రేపు చూస్తారు. హార్ట్ అటాక్ వచ్చి మరణించాడని అనుకుంటారు అంతా. పోస్ట్ మార్టం చేసినా అదే తెలుస్తుంది. కాకపోతే అది ఇక్కడ జరిగిందని ఎవరికీ తెలీదు.

’’మార్సియా తన కోటు జేబులోంచి మాత్రల సీసా బయటకి తీసి దాని వంక చూసింది.

‘‘వీటిని పారేసి ఖాళీ సీసాని ఈయన శవం పక్కన ఉంచితే బావుంటుంది. ఏం అంటావ్?" అడిగింది అక్కయ్యని.

అకస్మాత్తుగా హెలెన్, మార్సియా పెద్దగా నవ్వసాగారు. పిచ్చివాళ్ళ నవ్వులా ఉంది వాళ్ళ నవ్వు.

---

## మరణ దండన - ఎడ్వర్డ్ డి.హోచ్

ఉదయం నిద్ర లేచాక పేపర్ని అందుకుని ఓ వార్త కోసం వెదికాను. అది నాలుగో పేజీలో నాకంట పడింది.

ఉదయం సముద్రానికి చేపల వేటకి బయలుదేరిన కొందరు జాలరులు, సముద్రం లోంచి బీచ్ కి కొట్టుకు వచ్చిన ఓ శవాన్ని చూసారు. వాళ్ళు ఆ సంగతి పోలీసులకి చెప్పిన కొన్ని గంటలకే మరణించిన వ్యక్తి పేరు సేమ్ జోడియా అని, అవివాహితుడైన అతను సెకండ్ హేండ్ కార్లని అమ్మే వ్యాపారస్థుడని పోలీసులు కనుక్కున్నారు.

నేనా వార్తని అంత ఆసక్తిగా చదవడానికి ముఖ్య కారణం సేమ్ జోడియాక్ బహుశా ఒకప్పుడు నా ప్రియ మిత్రుడు. నాకు అతనితో పరిచయమైనప్పుడు అతను సైన్యంలో సార్జెంట్ గా పని చేస్తున్నాడు. అది పదిహేనేళ్ళ కిందటి మాట. నేను సైన్యంలో చేరిన కొత్తల్లో కొరియాకి వెళ్ళినప్పుడు సేమ్ జోడియాక్ కింద కార్పోరల్ గా పని చేసాను.

నాకు ఆ రోజుల్లో ఎంతో భయంగా ఉండేది. పరిచయం లేని కొత్త ప్రదేశం, అర్ధం కాని భాష మాట్లాడే కొత్త రకం ప్రజలు. వాళ్ళ చర్మం రంగు, ముఖాకృతి, వారి సంస్కృతి అన్నిటి కన్నా నా దేశ ప్రజలకి, నా సంస్కృతికి ఎంతో భిన్నంగా ఉండేవి.

ఇంటికి దూరమై ఒంటరిగా ఫీలవుతూ నేను రాత్రుళ్ళు సియోల్ నగరంలో కాలక్షేపం కోసం తిరిగేప్పుడు, సేమ్ నాకు కంపెనీగా ఉండేవాడు. ఇతరుల్లా అతను కొరియన్ అమ్మాయిల కోసం వేటాడేవాడు కాదు. తప్ప తాగేవాడు కూడా కాదు.

‘‘శత్రువులే అయినా సాటి మనుషులని చంపడం బాధాకరంగా ఉంటుంది.'' ఓ సారి అతనితో చెప్పాను.

"ప్రపంచంలో ఏ భాషలో అయినా ఉండే రెండు ముఖ్య పదాలు ఏమిటో తెలుసా? యుద్ధం, న్యాయం. నిజానికి అవి ఒకదానికొకటి విరుద్ధమైన విషయాలు కావు. నన్నడిగితే, ఆ రెండూ కలిసే ఉంటాయి. చొరబాటు దారులని చంపేయాలి. మనం న్యాయం చేయడానికే ఇక్కడికి

పంపబడ్డాం. అది తప్పక చేసి తీరాలి." బార్లో నా ఎదురుగా కంపెనీకి కూర్చుని కోక్ తాగే సేమ్ బదులు చెప్పాడు.

చాలా కాలంగా సైన్యంలో ఉన్న సేమ్ జోడియాక్కి సైనికుడిగా అపార అనుభవం ఉంది. అతను ఓ మనిషిని చంపడానికి నాలా వెరవడు. బాగా కరుకు తేలాడు.

“ఈ యుద్ధం చాలా కాలం కొనసాగుతుందని చాలామంది అంటున్నారు."

"ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే, ఎంత కాలం న్యాయం జరగాలో అంత కాలం యుద్ధం కొనసాగక తప్పదు.”

“అప్పుడు మనం కూడా ఇక్కడ ఎక్కువ కాలం ఉండక తప్పదు.” నిరుత్సాహంగా చెప్పాను.

"నాకు ఎక్కడైనా ఒక్కటే. ఇంటికి వెళ్ళి మాత్రం ఏం చేస్తాం? అక్కడా యుద్ధం, న్యాయం తప్పవు." చెప్పాడు సేమ్.

"అదెలా సాధ్యం? అమెరికా నేల మీదకి ఇంతదాకా ఎవరూ దండెత్త లేదు. దండెత్త లేరు కూడా."

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, దాని వంక చూసి నర్మగర్భంగా నవ్వి, దాన్ని ఏష్ ట్రే లో నలిపేసి చెప్పాడు.

"యుద్ధం, న్యాయం. వెతికితే ఈ రెండూ ఉండని చోటు ఉండదు."

రెండు వారాల తరువాత మేం ఇద్దరం పెట్రోల్ డ్యూటీలో ఉండగా అతని మాటల వెనక అర్థం ఏమిటో నాకు తెలిసింది.

"థర్టీ ఎయిట్ పేరలల్ అని మా మేప్లో సైన్యం పేరు పెట్టిన ఓ కొండ పక్కనే ఉన్న పొలంలోకి వెళ్ళాం. అప్పటికే అది రెండు సార్లు అమెరికన్, కొరియన్ సైన్యం చేతులు మారింది. అమెరికన్

యుద్ద విమానాలు అక్కడ కురిపించిన బాంబుల వర్షం వల్ల ఇప్పుడు అక్కడ ప్రజలెవరూ నివసించడం లేదు. అంతా ఇళ్ళు వదిలి పారిపోయారు. పదిళ్ళు మించి లేవక్కడ రైఫిల్స్ ని సిద్దంగా పట్టుకుని మేం పెట్రోలింగ్ లో ఉండగా, దూరంగా కొరియన్ సైనిక దళం ఆ పొలంలోని ఓ ఇంట్లో మా కంట పడింది. వైర్లెస్ లో మేం ఆ విషయం తెలియ చేయగానే, ఓ మోర్టార్ దళం ఆఘుమేఘుల మీద వచ్చి ఆ చిన్న దళాన్ని ఎదుర్కొంది. గంట తరువాత మేం ఆ ఇంటిని స్వాధీనం చేసుకోగలిగాం.

ఆ ప్రదేశాన్నంతా సేమ్ తో కలిసి నేను గాలిస్తూండగా, ఓ గోతిలో దాక్కుని ఉన్న ఓ కొరియన్ మా కంట పడ్డాడు. తక్షణం మేం అతన్ని స్వాధీనంలోకి తీసుకున్నాం. సివిల్ దుస్తుల్లోని అతను గూఢచారి అనే అనుమానం మాకు కలిగింది. నిజానికి ఎవరిని చూసినా మాకు అదే అనుమానం కలుగుతూండేది.

అతనికి కాపలాగా ఉన్న ఓ సైనికుడు తన రైఫిల్ని కింద పెట్టి సిగరెట్ ని వెలిగించు కుంటూంటే, అతను అకస్మాత్తుగా ఆ రైఫిల్ని లాక్కుని ఆ సైనికుడి మీద రెండు సార్లు కాల్పులు జరిపి చంపేసాడు.

సేమ్ అతని మీదకి దూకి, తన రైఫిల్తో అతని చేతి మీద కొట్టి, ఆ రైఫిల్ అతని చేతిలోంచి కింద పడేలా చేసాడు. ఆ కొరియన్లో ఎలాంటి భయం నాకు కనపడలేదు.

"ఇతను కొరియన్ ఆర్మీ ఆఫీసర్. సివిల్ దుస్తుల్లో ఉన్న గూఢచారి. మామూలు పౌరుడైతే రైఫిల్ని ఎలా ఉపయోగించాలో తెలియదు." చెప్పాడు సేమ్ నాతో,

అతని వంక చూసాను. రైఫిల్ తగిలిన చోట నించి కారే రక్తాన్ని చేత్తో తుడుచు కుంటున్నాడు.

‘‘ఇతన్ని మన దళ కమాండర్ దగ్గరికి తీసుకెళాదాం." సేమ్ కి సూచించాను.

గూఢచారి అయినా, పౌరుడైనా, అతను మా వాళ్ళని చంపాడు కాబట్టి మేం చేయాల్సింది అదే.

"అప్పుడు యుద్ధ ఖైదీ అవుతాడు. అందువల్ల తక్షణ న్యాయం జరగదు."

‘‘కానీ మనం చేయాల్సిన పని అదే కదా?’’

‘‘మన సైనికుడ్ని చంపిన ఇతనికి మరణ శిక్షే తగిన శిక్ష" చెప్పాడు సేమ్.

"కావచ్చు. కాని న్యాయ విచారణ అనంతరం కదా అది జరగాల్సింది?"

నా వాక్యం పూర్తి కాకుండానే, సేమ్ చేతిలోని రైఫిల్ రెండు సార్లు పేలింది. ఆ రెండు గుళ్ళ తాకిడికి ఆ కొరియన్ నేల కూలాడు. సేమ్ చర్యకి నివ్వెరపోయాను.

‘‘నిరాయుధుడైన అతన్ని ఎందుకు చంపావు?’’ వెంటనే నేను ప్రశ్నించాను.

‘‘యూనిఫాంలో లేడు. కాబట్టి వీడు ఖచ్చితంగా గూఢచారే. అంతే కాక హంతకుడు కూడా. వాడికి పడాల్సిన శిక్ష మరణ దండనే." చెప్పాడు సేమ్.

అతని శరీరాన్ని పూడ్చకుండా అలాగే వదిలి, మా పెట్రోలింగ్ డ్యూటీని నిర్వహిస్తూ ముందుకు సాగాం. ఆ సంఘటన నా మనసులో నిలిచిపోయింది.

రెండు వారాల తరువాత యుద్ధం ముగిసింది. శాంతి పత్రం మీద ఇరు పక్షాల వాళ్ళు సంతకాలు చేసారు. అంతా తిరిగి అమెరికాకి వెళ్ళిపోయాం.

శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ లో, నేను సైన్యం నించి డిశ్చార్జ్ అయ్యే సమయంలో సేమ్ జోడియాక్ నాకు మళ్ళీ తారసపడ్డాడు. అదే రోజు అతను కూడా సైన్యం నించి డిశ్చార్జి అయ్యాడు.

నేను తూర్పుకి వెళ్ళి, ఒహాయో రాష్ట్రంలో మధ్యలో వదిలిన నా చదువుని పూర్తి చేసాను. సేమ్ జోడియక్ కి తరచూ ఉత్తరాలు రాస్తూ, అతనితో స్నేహ సంబంధాన్ని కొనసాగించాను. ఓ సారి పడమరకి వెళ్ళినప్పుడు నేను సేమ్ ని కలిసాను. శాన్ ఫ్రాన్సిస్కోలో సెకండ్ హేండ్ కార్లని

కొని అమ్మే వ్యాపారం చేస్తున్నాడు. ఖచ్చితమైన, నిజాయితీ గల వ్యాపారసుడిగా పేరు తెచ్చుకోవడంతో అతను ఆర్థికంగా బాగానే ఉన్నాడని తెలుసుకున్నాను.

"న్యాయం, నిజాయితీ. ఇవి సెకండ్ హేండ్ కార్ల డీలర్ల దగ్గర ఉండవు. నాకు ఆ రెండూ పుష్కలంగా ఉండబట్టే కస్టమర్స్ పెరిగారు. కష్టమర్స్ అంటే ఆదాయం." తన విజయ రహస్యం చెప్పాడు సేమ్.

ఆరు నెలలు తరువాత కాలేజీలో పరిచయమైన ఓ అమ్మాయితో నా వివాహం జరిగింది. సేమ్ జోడియక్ దానికి హాజరవడమే కాక బెస్ట్ మేన్ గా వ్యవహరించాడు. మా పెళ్ళయ్యాక కూడా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఎప్పటిలా కొనసాగుతూనే ఉన్నాయి.

సంవత్సరం తరువాత ఓరోజు సేమ్ నించి నాకు ఫోన్ కాల్ వచ్చింది.

‘‘చాలా సంతోషకరమైన వార్త ఇది. నేను పెళ్ళిచేసుకోబోతున్నాను. వచ్చే నెల పదహారో తారీఖున ఆ శుభకార్యం జరుగుతుంది. నువ్వు నీ భార్యతో తప్పక రా." ఆహ్వానించాడు.

‘‘నీ సంతోషంలో భాగం పంచుకోడానికి రాకుండా ఉంటానా? వస్తాను.’’ నేనూ ఆనందంగా చెప్పాను.

వారి పెళ్ళికి నాలుగు రోజుల ముందు మళ్ళీ సేమ్ నించి నాకో ఫోన్ కాల్ వచ్చింది.

‘‘విమానం టిక్కెట్లు కూడా రిజర్వ్ చేయించాను. మీ పెళ్ళికి మేం ఇద్దరం హాజరవుతున్నాం." అతనితో చెప్పాను.

"మా పెళ్ళి రద్దయింది." బాధగా చెప్పాడు సేమ్.

‘‘ఆదేం?" ఆశ్చర్యం అడిగాను.

‘‘ఏన్ చనిపోయింది.’’

‘‘అరెరె! ఎలా?’’ అడిగాను.

‘‘బేంక్ దొంగతనానికి పాల్పడ్డ ఒకడు, ఆ బేంక్ ని పోలీసులు చుట్టు ముట్టడంతో బెదిరింపుగా బేంక్ లోని ఒకరిని కాల్చి చంపాడు. ఆమే ఏన్."

‘‘అయ్యాయ్యో!"

మా ఆవిడ సలహా ప్రకారం, నేను ఒక్కడ్నే వెంటనే అతని విచారంలో భాగం పంచుకోడానికి శాన్ ఫ్రాన్సిస్కోకి వెళ్ళి సేమ్ ని కలిసాను.

సేమ్ నన్ను చూసి చాలా సంతోషించాడు. నేను వస్తాననుకోలేదు. నా భుజాల్ని గట్టిగా వత్తి చెప్పాడు.

"పెళ్ళి జరిగేప్పటికన్నా ఇప్పడే నాకు నీ అవసరం ఉంది."

రెండు రోజులు అతనితో ఉన్నాను. ఓదార్చడం నాకు చేత కాదు. అంచేత మేం కలిసి, కొరియాలో పని చేసిన రోజుల్లో తమాషా సంఘటనల గురించి మాట్లాడాను. అతను వాటికి నవ్వినా, ఆ నవ్వులో జీవం లేదు.

‘‘ఏన్ ని చంపిన బేంక్ దొంగ పేరు గార్డన్. అతను కొద్ది సంవత్సరాల తర్వాత మళ్ళీ స్వేచ్ఛగా జైలులోంచి బయటికి వచ్చేస్తాడు. కాని మరణించిన ఏన్ తిరిగి బతికి రాదుగా? ఈ రాష్ట్రంలో మరణ దండన శిక్ష అమలులో లేదు." చెప్పాడు సేమ్ ఓ సాయంత్రం.

మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. ఓ ఉత్తరంలో రాసాడు సేమ్.

నే చెప్పినట్లే జరిగింది చూసావా? నా కాబోయే భార్యని చంపిన జార్జ్ గార్డన్ జైలు నించి పూర్తి శిక్ష అనుభవించకుండానే విడుదలయ్యాడు. సత్ ప్రవర్తనట. జైల్లో కాదు. జైలు బయట మనుషులు సత్ప్రవర్తనతో ఉండాలి."

ఆ ఉత్తరానికి ఓ దినపత్రికలోని కటింగ్ జత చేసి ఉంది. అందులో జార్జ్ గార్డన్ ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కాల్చి చంపాడన్న వార్త ఉంది. ఆ వార్త కింద సేమ్ చేతి రాతతో ఇలా ఉంది.

దీన్నే నేను న్యాయం అనేది. పగ కాదు. న్యాయం'

కొద్ది నెలల తర్వాత నేను ఉద్యోగం మారాను. నా కొత్త కంపెనీ మందుల కంపెనీ. ముడి సరుకు కొనే నిమిత్తం నేను రెండు మూడు నెలలకి ఓసారి శాన్ ఫ్రాన్సిస్కోకి వెళ్ళాల్సి వచ్చేది. ప్రతిసారీ సేమ్ ని కలిసే వాడిని.

ఓ రోజు సాయంత్రం బీర్ల మధ్య అడిగాను.

“నువ్వు పెళ్ళి చేసుకోదగ్గ అమ్మాయి నీకు మళ్ళీ తారస పడలేదా సేమ్?"

ఆ ప్రశ్నకి జవాబు చెప్పే ముందు అతను చూసిన చూపులో నా హృదయం ద్రవించే బాధ కనిపించింది.

“లేదు. ఏన్ ఇక తిరిగి బతికి రాదుగా."

"నేను నిన్నో ప్రశ్న చాలా కాలంగా అడగాలని అనుకుంటున్నాను." చెప్పాను.

“అడుగు. నీ దగ్గర నాకు దాపరికం ఏదీ లేదు."

“ఏన్ని చంపిన అతని మరణం గురించిన వార్త గల పేపర్ కటింగ్ ని నువ్వు నాకు పంపావు. గుర్తుందా?”

“గుర్తుంది. ఏం?"

నేను నా మనసులోని విషయాన్ని మాటల్లోకి ప్రశ్న రూపంలో అనువాదం చేయడానికి పడే అవస్థని, నా మొహమాటాన్ని కూడా గమనించి నవ్వి చెప్పాడు.

‘‘నువ్వు అడగని ప్రశ్నకి నేను జవాబు చెప్తాను విను. ఇదేం రహస్యం కాదు."

కొద్దిగా బీర్ ని తాగి చెప్పాడు.

"బైబిల్లో దీని గురించి ఉంది. కంటికి కన్ను ఈ రాష్ట్రంలో మరణదండన లేదు."

అతని సమాధానానికి నా మొహంలోకి రక్తం తన్నుకొచ్చింది. పొలమూరి దగ్గాను.

"నాకు తెలుసు నువ్వేం ఆలోచిస్తున్నావో. ఆ రోజు కొరియాలో జరిగిన సంఘటన, ఆ తరువాత నేను చెప్పిన మాటలు. కదా?’’ నవ్వాడు.

నేనేం మాట్లాడలేదు.

"కొరియాలో ఆ రోజు నేను చేసింది సరైన పనే. ఇక్కడ అమెరికాలో నేను చేసిందీ సరైన పనే. ఏన్ ని చంపినందుకు అతన్ని బైబిల్లో చెప్పినట్లుగా ఎవరూ సరిగ్గా శిక్షించలేదు. మరి నేనేం చెయ్యాలి?"

నేనా ప్రశ్నకు జవాబు చెప్పలేదు. చెప్పలేను కూడా. సాధ్యమైనంత త్వరగా సేమ్ నించి దూరంగా వెళ్ళాలని అనిపించింది. ఆ తరువాత నేను సేమ్ ని కలవడం చాలా తగ్గించేసాను. అతని సెకండ్ హేండ్ కార్ల అమ్మకం వ్యాపారం బాగా అభివృద్ధి చెందిన గుర్తుగా శాన్ ఫ్రాన్సిస్కోలో చాలా చోట్ల కనిపించే అతని కంపెనీ ప్రకటన బోర్డులు నాకతన్ని గుర్తుకు తెచ్చేవి. సేమ్ ఎంతో నిజాయితీపరుడైన వ్యాపారి అని అనేకమంది చెప్పగా విన్నాను. అంతటి నిజాయితీ మనిషి ఈ ఒక్క విషయంలో ఎందుకిలా ప్రవర్తిస్తాడు అనిపించేది.

ఏడాది తరువాత నేను శాన్ ఫ్రాన్సిస్కోకి నా ఉద్యోగరీత్యా వచ్చినప్పుడు, ఓ ఉదయం హోటల్ గదిలో వేసిన లోకల్ పేపర్ని తిరగేస్తూంటే ఓ వార్త నా కళ్ళబడింది.

పధ్నాలుగేళ్ళ అమ్మాయిని ఎవరో పాశవికంగా బలాత్కారం చేసారు. అమె శరీరం ఓ కారు ట్రంక్లో దొరికింది. గంటలో పోలీసులు ఆ కారు యజమాని పేరు, చిరునామాలని కనుగొన్నారు. అతన్ని పోలీసులు నెవేడా రాష్ట్రంలో అరెస్టు చేసి, క్రితం రోజు శాన్ ఫ్రాన్సిస్కోకి తీసుకువచ్చారు. అతన్ని రైల్వే స్టేషన్ నించి పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ప్రశ్నించడానికి తరలిస్తూ ఉండగా ఫోటోలు తీయడానికి పత్రికా విలేకరులు, చూడడానికి ప్రజలు హెడ్ క్వార్టర్స్ బయట గుమిగూడారు. అతన్ని లోపలికి తీసుకెళుతూండగా, ఆ గుంపులోంచి పేలిన తుపాకి నించి వెలువడిన ఒకే ఒక గుండు అతని తల వెనక భాగంలో దిగి ఆ నిందితుడు తక్షణం మరణించాడు. గుమిగూడిన వందల మంది ఆ హత్యకి బెదిరి పారిపోయారు. వాళ్ళతో పాటు హంతకుడు కూడా ఆయుధంతో సహా మాయమయ్యాడు.

అది చదివాక నాకు సేమ్ గుర్తుకు వచ్చాడు. నేను అతన్ని చూసి ఏడాది దాటుతోంది. ఓ సారి అతన్ని చూడాలని అనిపించింది. వెంటనే అతనికి ఫోన్ చేసాను. నా కంఠం విని సేమ్ చాలా ఆనందపడ్డాడు.

"సాయంత్రం ఏం చేస్తున్నావు? కలుద్దాం." చెప్పాడు ఉత్సాహంగా. ఆ సాయంత్రం చీకటి పడుతూండగా నేను సేమ్ ని కలిసాను.

‘‘ఎలా ఉన్నావు ఎక్స్ కార్పొరల్? మీ ఆవిడ ఎలా ఉంది? తండ్రివి అయ్యావా?" నవ్వుతూ అడిగాడు.

ఏన్ తో పరిచయం కాక ముందు సేమ్ లానే కనిపించాడు. అతనిలో పూర్వపు విషాదం లేదు. మా భోజనానంతరం అతనితో నేను మాట్లాడదలచుకున్న టాపిక్లోకి సంభాషణని తీసుకెళ్ళాను.

"ఇవాళ పేపర్లో పోలీస్ హెడ్ క్వార్టర్స్ ముందు ఆస్కార్ అనే రేపిస్టుని ఎవరో కాల్చి చంపారని చదివాను. ఘోరం కదా?" అడిగాను.

"ఘోరం? ఆస్కార్ చేసింది ఘోరం కాదా? ఓ మైనర్ అమ్మాయిని చంపడం ఇంకా ఘోరం.’’

"కాని ఆస్కర్ నేరం విచారణ ద్వారా ఇంకా ఋజువు కాలేదు కదా?"

‘‘విచారణ వల్ల కలిగే లాభం ఏమిటి? ఈ రాష్ట్రంలో మరణదండన లేదు."

‘‘అందువల్ల ఆ హత్య న్యాయ సమ్మతమనే అంటావా?" అడిగాను సిగరెట్ వెలిగిస్తూ,

‘‘అవును.’’

"జార్జ్ గార్డెన్ హత్యలానా?"

‘‘అవును. జార్జ్ గార్డెన్ హత్యలా, ఆ కొరియన్ ఆఫీసర్ హత్యలా ఇదీ న్యాయమే."

"సేమ్! నీకేమైంది?" ప్రశ్నించాను.

"నాకేం కాలేదు. ఆధునిక మొరాలిటిలోనే ఏదో అయింది. నన్ను చూసిన వారంతా సెకండ్ హేండ్ కార్ల వ్యాపారి అనుకుంటారు. నాలాటి వాడికి న్యాయం ఉండదని అనుకుంటారు. కాని వాళ్ళని చూడు. హంతకులకి మరణదండన వేయరు. జైలులో కూర్చోపెట్టి మేపి పంపుతారు. వాళ్ళకి హంతకులంటే సానుభూతి ఉంది. బాల్యంలో విషాదం, తక్కువ మేధా శక్తి, మానసిక అనారోగ్యం, దరిద్రం. ఇలా ఏదో ఓ కారణంగా ప్రతి హంతకుడి మీద సానుభూతిని వరిస్తున్నారు. హంతకులకి మరణ దండన విధించే బదులు వాళ్ళని పిచ్చాసుపత్రులకో, జైళ్ళకో పంపుతున్నారు. తర్వాత బయటికి పంపి మళ్ళీ వాళ్ళు హంతకులు అవడానికి కారణం అవుతున్నారు."

నాకు అతని మాటలకి గాలి ఆడలేదు. దీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీసుకొని వదిలాను. సేమ్ బిల్ పే చేసి, నా భుజం మీద చేతులు వేసి నడుస్తూ చెప్పాడు.

‘‘నేను న్యాయం జరిపించే విషయంలో వీరుడ్ని యుద్ధ వీరుడ్ని మరణ దండనని విధించే యుద్ధ వీరుడ్ని"

‘‘నీకు పిచ్చెక్కింది. ఇలా ఎంత కాలం?" ప్రశ్నించాను.

చీకట్లో అతని ఒంకర నవ్వు స్పష్టంగా కనపడకపోయినా, క్షణకాలం కనబడ్డ అతని పళ్ళ ద్వారా దాన్ని గ్రహించ గలిగాను.

‘‘నువ్వు నా ప్రియ మిత్రుడివి కాబట్టి నీకో రహస్యం చెప్తున్నాను విను. దీన్ని పోలీసుల ముందు నువ్వు ఋజువు చేయలేవు కూడా. అందువల్ల నీకు చెప్పడంలో నాకు ఎలాంటి హానీ కలగదు. గత సంవత్సరంలో ఐదుగురు హంతకుల హత్యల గురించి వార్తల్లో వచ్చాయి. ఎందుకోవారి హత్యల గురించి పత్రికలు వార్త వేయడంలో పెద్దగా ఉత్సాహం చూపించలేదు."

"అంత మందా?" అదిరిపడ్డాను.

‘‘అవును. వారంతా నేరస్థులే. ఆ ఐదు మంది హంతుకులే. మన చట్టాల వల్ల వాళ్ళు మరణ దండనని తప్పించుకోగలిగారు. నా నించి కాదు.

’’ నాకు మళ్ళీ ఊపిరి ఆడలేదు. మాట్లాడాలని ప్రయత్నించినా, నా నోట్లోంచి చాలా సేపటికి కాని మాటలు రాలేదు.

‘‘నీకు మరణ దండన విధించే హక్కు ఉందనుకుంటున్నావా సేమ్?" అడిగాను. ఆ చీకట్లో సేమ్ జోడియాక్ మొహంలో ఎలాంటి భావాలు చోటు చేసుకున్నాయో నాకు గోచరించలేదు. అతని మాటలు మాత్రం నా చెవులకి మామూలుగానే వినిపించాయి.

‘‘నా జాబితాలో ఇప్పటికి ఇంకా ఐదుగురు ఉన్నారు."

‘‘ఐదుగురు?’’ అదిరిపడ్డాను.

‘‘ప్రస్తుతానికి." సన్నగా సేమ్ నవ్వు వినిపించింది నాకు.

"వారిలో ముగ్గురు జైలు నించి మంచి ప్రవర్తనతో విడుదలైన వారు. సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను."

అప్పుడు నేను సేమ్ ని తోసాను. నా బలాన్నంతా ఉపయోగించి రైలింగ్ మీద కూర్చున్న అతని ఛాతి మీద నా రెండు చేతులని ఉంచి బలంగా వెనక్కి తోసాను. వెనక్కి పడుతూ అతను పెద్దగా అరిచాడు. కాని, కొద్ది క్షణాల్లోనే అతను మూడు డిగ్రీల సెల్సియస్ పసిఫిక్ మహా సముద్రపు నీళ్ళల్లోకి పడటంతో ఆ అరుపు ఆగిపోయింది.

నేను శాన్ ఫ్రాన్సిస్కోలో ఉండగానే, మర్నాడు అతని శరీరాన్ని జాలర్లు కనుగొన్నారు. ఆ వార్తలో అనుమానితుల గురించి లేదు. సేమ్ కి శత్రువులు ఎవరూ లేరని, సెకండ్ హేండ్ కార్ల వ్యాపారంలోని వారిలా కాక చాలా నిజాయితీ పరుడని పోలీసులు పేర్కొన్నారు. అతను పొరపాటున హోటల్ బాల్కనీ లోంచి పసిఫిక్ మహా సముద్రంలోకి పడ్డాడని పోలీసులు భావిస్తున్నారని ఆ వార్తలో రాసారు.

ఆ తరువాత నేను శాన్ ఫ్రాన్సిస్కో దినపత్రికలకి చందా కట్టి వాటిని నిత్యం చదువుతున్నాను. జైలు నించి విడుదలయిన హంతకులు కాని, హత్యా, బలాత్కారం లాంటి నేరాలు ఎదుర్కొంటున్న ముద్దాయిలు కానీ ఎవరూ చంపబడ్డ వార్తలు ఆ తరువాత దిన పత్రికల్లో రాలేదు.

సేమ్ నాకు కట్టు కథలు చెప్పలేదు.

---

## ది ఎలిబీ - ఇసాక్ అసిమోవ్

ఆ కాక్ టెయిల్ పార్టీకి, దాన్ని ఇచ్చే మిష్టర్ గొంజాలో నాకు ఆహ్వానాన్ని పంపలేదు. అయినా నా మిత్రుడు జియోఫ్రే ఎవలోన్ దానికి వెళ్తూ నన్ను తన వెంట రమ్మన్నాడు.

"అదేమిటి? నా పేర ఆహ్వానం రాకుండా నేనెలా రాగలను?" ఆశ్చర్యంగా అడిగాను.

“గొంజాలో నా మిత్రుడు. నిన్ను పిలవక పోయినా నువ్వు నా వెంట వస్తే ఏమీ అనుకోడు. ఓసారి నేను అతనికి అఫీషియల్ గా సహాయం కూడా చేసాను. అందువల్ల అతనికి లక్ష డాలర్ల దాకా లాభించింది.

"నా మిత్రుడు జియోఫ్రే ఎఫ్.బి.ఐలో ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ కాబట్టి, దొంగిలించబడిన గొంజాలో సొత్తుని సంపాదించి, అప్పగించి ఉంటాడని భావించాను. కాబట్టి నేను అతని వెంట వెళ్ళడానికి ఇక సందేహించలేదు. ఆ పార్టీలో దూరంగా నిలబడ్డ ఓ వ్యక్తి జియోఫ్రేని చూసి మా దగ్గరకి వడివడిగా వచ్చి అతనితో కరచాలనం చేసి, ఎడమ చేత్తో అతని వీపు మీద తడుతూ చెప్పాడు.

"ఎంత కాలమైంది నిన్ను చూసి? నువ్వు ఇక్కడ నాకు తటస్థపడటం ఎంతో సంతోషంగా ఉంది.’’

వారి మాటలు పూర్తయ్యాక అతను నా వంక ఆసక్తిగా చూడటంతో జియోఫ్రే వెంటనే నన్ను అతనికి పరిచయం చేసాడు.

‘‘ఇతను నా మిత్రుడు రూబిన్. నవలా రచయిత. ఇతను కోనిగ్."

కోనిగ్ వెంటనే నాతో కరచాలనం చేస్తూ అడిగాడు.

"మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. మీరు ఏ రకం రచనలు చేస్తారు?"

"క్రైమ్, సస్పెన్స్, గూఢచారి నవలలు." బదులు చెప్పాను.

‘‘అలాగా? ఐతే మీరు మాకు సంబంధించిన మనిషే అన్నమాట."

"మీకు సంబంధించిన మనిషి అంటే?’’ ప్రశ్నించాను.

"నేను చాలా కాలం సిఐఏలో ప్రతి గూఢచర్య శాఖలో పని చేసాను."

"నేనో గూఢచారిని చూడటం ఇదే మొదటిసారి. మీ అనుభవాలు వినాలని నాకు ఆసక్తిగా ఉంది." వెంటనే చెప్పాను.

"చాలా ఉన్నాయి. ఎలాంటి అనుభవం మీరు వినగోరుతున్నారు?" చిరునవ్వుతో అడిగాడు.

"ముందు మనం మన చేతులని కాక్ టెయిల్ గ్లాసులతో అలంకరించాకే మిగతావన్నీ" జియోఫ్రే చిరునవ్వుతో సూచించాడు.

జియోఫ్రే మమ్మల్ని కాక్ టెయిల్ కౌంటర్స్ దగ్గరకి తీసుకువెళ్ళాడు. చేతిలో గ్లాసులతో మేము ఓ టేబుల్ ముందు కూర్చున్నాక ఆ మాజీ గూఢచారితో చెప్పాను.

"మీకు ఎంతో ఆసక్తిగా ఉన్న ఏ అనుభవాన్నయినా నేను వినడానికి ఇష్టపడతాను.

" నా మిత్రుడు జియోఫ్రే వెంటనే చెప్పాడు.

"మిస్టర్ కోనిగ్, మీరు ఏదైనా కేసు చివరి దాకా చెప్పి, దాన్ని మీరు ఎలా పరిష్కరించారో మాత్రం చెప్పకండి. ఆ పరిష్కారాన్ని మేమిద్దరం ఆలోచించి చెప్పే ప్రయత్నం చేస్తాం. ఇది సరదాగా ఉంటుంది."

"అంత ఆశావాదం వద్దు." నవ్వుతూ చెప్పాడు కోనిగ్.

మూడు గ్లాసులు కలుసుకుని శబ్దం చేసాయి. కొద్ది క్షణాలు అతను ఆలోచనతో మౌనంగా ఉన్నాక కోనిగ్ చెప్పేది నేను శ్రద్ధగా వినసాగాను.

"ఏ గూఢచారికైనా ప్రత్యేక శిక్షణ ఇస్తారు కాబట్టి ఫలానా వారు గూఢచారి అని కనుకోవడం కష్టం. గూఢచారులు నగరంలోని ప్రజల్లో కలిసిపోయి సామాన్యుల్లా కనిపిస్తారు. స్టీఫెన్ ఈ విద్యలో నిపుణుడు. రక్షణ శాఖలోని కొన్ని రహస్యపత్రాలు మాయమైన కేసు ఓ సారి నాకు అప్పగించబడింది. కేసు మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తే, వాటిని దొంగిలించే అవకాశం కేవలం

ముగ్గురికే ఉందని నాకు తెలిసింది. మళ్ళీ ఆ ముగ్గురిలో స్టీఫెన్ కు అందుకు ఎక్కువ అవకాశం ఉందని కూడా గమనించాను. స్టీఫెన్ బ్రహ్మచారి. దేశభక్తి గలవాడు. కమ్యూనిస్ట్ రష్యాని బాహాటంగా విమర్శిస్తాడు. జూలై నాలుగున (అమెరికా స్వతంత్ర దినం) తన ఇంటి బయట స్టార్స్ అండ్ సైప్స్ (అమెరికన్ జెండా)ని ఎగరేస్తాడు. కాని అతను పని చేసే రక్షణ శాఖలోని కొన్ని ఫైల్స్ కాపీ చేయబడి, అవి రష్యన్స్ కి అందాయని సిఐఏకి రూఢీగా తెలియడంతో ఆ కేసుని నాకు అప్పగించారు."

అతను ఓ గుక్క మార్టినీ తాగి మళ్ళీ చెప్పసాగాడు.

“ఆ ఫైల్స్ లో ఉన్న సమాచారం బాలిస్టిక్ మిస్సయిల్స్ గురించి. అది కాపీ చేయబడ్డ రోజుకి మూడు రోజులు అటు, మూడు రోజులు ఇటు స్టీఫెన్ సెలవులో ఉన్నాడు. ఐతే మిగిలిన ఇద్దరూ ఆ పని చేయలేదని నా పరిశోధనలో తేలింది. ఆ సమయంలో దూరంగా మరో దేశంలో ఉన్న స్టీఫెన్ ఆ పనిని ఎలా చేయగలిగాడు? అతని ఐడిని ఉపయోగించి, ఆ రాత్రి ఎవరో ఆ ఫైల్స్ ఉన్న గది ఎలక్ట్రానిక్ తలుపుని తెరుచుకుని లోపలకి వెళ్ళడంతో స్టీఫెన్ అనుమానితుల జాబితాలో చేరాడు. కాని ఎలిబీని చూస్తే అతను వేల మైళ్ళ దూరంలో మరో చోట ఉన్నాడు. ఇదెలా సాధ్యం? ఒకే మనిషి ఒకే సమయంలో రెండు చోట్ల ఎలా ఉండగలడు? ఈ సమస్యని పరిష్కరిస్తే కేసు విడిపోతుంది.”

జియోఫ్రే తన చేతిని ఎత్తడంతో అతను జియోఫ్రే వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"స్టీఫెన్ కి కవల సోదరుడు ఉన్నాడా?" జియోఫ్రే ప్రశ్నించాడు.

"నీలాసే సేను కూడా ఆలోచించాను. అతని బర్త్ సర్టిఫికెట్ ప్రకారం అతనికి కవల సోదరుడు లేడు."

"స్టీఫెన్ కి ఎలిబీ ఏమిటి?" సేను ప్రశ్నించాను.

‘‘అతను క్రూయిజ్లో బెర్ముడా వెళ్ళి రెండు రోజులు ఉండి వచ్చాడు.’’

‘‘అతనా ఓడలో నిజంగా ప్రయాణించాడా? బెర్ముడాలో ఆ రెండు రోజులు నిజంగా ఉన్నాడా? లేక మధ్యలో వెనక్కి అమెరికన్ మిలటరీ స్థావరానికి తిరిగి వచ్చాడా అన్న విషయాలని మీరు పరిశీలించారా?" నేను మళ్ళీ ప్రశ్నించాను.

"మీకు వచ్చిన ఆలోచనే నాకూ వచ్చింది. స్టీఫెన్ పథకం మీకు చెప్పేస్తున్నాను. అది ఎలా విప్పానన్నది మీరు పరిష్కరించాల్సిన సమస్య స్టీఫెన్ అసలు ఆ ఓడలో లేడు. తనలా కనిపించే, అమెరికన్ ఇంగ్లీష్ చక్కగా మాట్లాడగలిగే ఓ రష్యన్ గూఢచారి స్టీఫెన్ లా నటిస్తూ ఆ ఓడలో ప్రయాణించాడు. స్టీఫెన్ తన ఇంట్లోంచి కదలకుండా దాక్కున్నాడు. ఓడలో ప్రయాణించిన నకిలీ స్టీఫెన్ కి స్టీఫెన్ టూ అనే పేరు పెడదాం. అతని జుట్టు స్టీఫెన్ హెయిర్ స్టయిలే. మీసం కూడా! ట్రావెల్ డాక్యుమెంట్స్ లో స్టీఫెన్ సంతకాన్ని చక్కగా ఫోర్జరీ చేయగలిగాడు. స్టీఫెన్ హావభావాలనే అతను ఓడలో ప్రదర్శించాడని నా పరిశోధనలో తెలుసుకున్నాను. స్టీఫెన్ టూకి ఈ విషయంలో గట్టి శిక్షణ ఇచ్చి ఉంటారు. స్టీఫెన్ టూ ప్రతి దినం స్టీఫెన్ కి ఆ రోజు ఓడలో జరిగిందంతా పూస గుచ్చినట్లుగా ఉత్తరాలు రాసేవాడు. స్టీఫెన్ టూ నించి వాటిని సేకరించి, కెజిబి (రష్యన్ గూఢచారి సంస్థ) స్టీఫెన్ కి అందించేది. అవి అనేకసార్లు చదివి, బాగా జ్ఞాపకం ఉంచుకుని స్టీఫెన్ తర్వాత వాటిని కాల్చేసాడు. అందువల్ల స్టీఫెన్ ని ఎవరైనా ప్రశ్నించే సందర్భం వస్తే, ఓడలో, బెర్ముడాలో జరిగిన దేని మీదైనా అతను స్వయంగా చూసినట్లుగా చెప్పగలిగే సమర్థతని పొందాడు. ఆ సమయంలో స్టీఫెన్ ఒన్ మారువేషంలో ఆఫీస్ కి వెళ్ళి ఫైల్స్ ని కాపీ చేసాడు."

నేను చిన్నగా ఈల వేసి చెప్పాను.

‘‘పకడ్బందీ పథకం అన్నమాట."

"మీరు ఓడలో జరిగింది, బెర్ముడాలో జరిగింది తెలుసుకోవడానికి అతన్ని వందల కొద్దీ ప్రశ్నలు అడిగి ఉండాలి. ఓడలోని అతని గది ఎలా ఉంది? ఎలక్ట్రిక్ స్విచ్లు ఎట్లున్నాయ్? టెలిఫోన్ రంగు, ఓడ లోని మెనూ, జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర ప్రయాణీకులు, బెర్ముడాలో చూసిన ప్రదేశాల గురించి... ఇలా ఎన్నో విషయాల మీద ప్రశ్నిస్తే, అతను తప్పు చెప్పడంతో చిక్కి ఉండచ్చు." నా మిత్రుడు జియోఫ్రే చెప్పాడు.

కోనిగ్ చిన్నగా నవ్వి చెప్పసాగాడు.

"స్టీఫెన్ టూ గూఢచారి కాబట్టి సిఐఏ ప్రశ్నించే ప్రతి చిన్న విషయాన్ని ఊహించి స్టీఫెన్ కి రాసిన ఉత్తరాల్లో రాసాడు. వాటిని క్షుణ్ణంగా చదివి గుర్తుంచుకున్న స్టీఫెన్ మాకు అన్నీ సంతృప్తికరమైన జవాబులే ఇచ్చాడు. ఓడలో అతను ఎవరితో అధికంగా స్నేహంగా ఉన్నాడని అడిగితే, ది ఐలండ్ డచెస్" అనే ఆ ఓడలో ప్రయాణించిన ఓ యువతి పేరు చెప్పాడు. మేము ఆమె చిరునామాని క్రూయిజ్ కంపెనీ నించి సేకరించాం. ఆమె పేరు ఆర్టెమిస్. ఆమెని కలిసి స్టీఫెన్ గురించి ప్రశ్నించాం. ఆమె కూడా స్టీఫెన్ టూలా ఒంటరిగా ప్రయాణించింది. ఇద్దరికీ డ్యూటీ ఫ్రీ షాపులో పరిచయమైంది. స్టీఫెన్ టూతో ఆమె మాట్లాడిన సంభాషణలన్నీ తరచి తరచి ప్రశ్నించి టేప్ చేసాను. వాటిలోంచి కొన్ని ప్రశ్నలని తయారు చేసాను. ఓ రోజు స్టీఫెన్ని ఆ ప్రశ్నలన్నిటినీ అడిగాను. అతను అన్నిటికీ తృప్తికరమైన సమాధానాలే ఇచ్చాడు."

"ఓడ మీద ఏదైనా హెలికాప్టర్ దిగి ఓ ప్రయాణీకుడ్ని ఎక్కించుకుని వెళ్ళిందేమో విచారించారా? స్టీఫెన్ టూ మీ ఊహ అయి ఉండచ్చు. హెలికాప్టర్లో వెళ్ళి స్టీఫెన్ పని పూర్తి చేసుకున్నాక, తిరిగి ఓడలోకి చేరుకుని ఉండచ్చు." ప్రశ్నించాను.

అతను చిన్నగా నవ్వుతూ తల అడ్డంగా ఊపాడు.

"హెలికాప్టర్ కాదు. పడవలో కూడా ఆ ఓడలోంచి ఎవరూ బయటకి వెళ్ళలేదని రూఢీ చేసుకున్నాను. లైఫ్ బోట్ కాని, లైఫ్ జాకెట్ కాని ఓడలోవి మిస్ కాలేదు. బయటి పడవలు

కూడా ఓడ దగ్గరకి రాలేదు. తను ఆర్టిమిస్తో డేన్స్ చేసానని స్టీఫెన్ చెప్పిన రాత్రి నిజంగా ఓడలో బాల్ రూం డేన్స్ జరిగిందా అని విచారించాను. అది జరిగిందని తెలిసింది."

"నా ఉద్దేశ్యం ఆర్టిమిస్ కూడా రష్యన్ గూఢచారే అయి ఉండాలి. స్టీఫెన్ ఎలిబీని బలపరచడానికి వారు ఆడిన గూడుపుఠాణీలో ఆమె ఓ భాగం అయి ఉండాలి." జియోఫ్రే సూచించాడు.

“ఆమె అమెరికన్ పౌరురాలు. నటి కూడా కాదు. రష్యన్ గూఢచారి కాదు. స్టీఫెన్ టూ కావాలని ఎలిబీ కోసం ఆమెతో పరిచయం చేసుకున్నాడు. ఆమె ఓ దిన పత్రికలో ఉద్యోగి."

మేమిద్దరం కొద్దిసేపు ఆ సమస్య గురించి ఆలోచించాం.

"బెర్ముడాలోని స్పిటల్ పాండ్ అనే పక్షులు వలస వచ్చే ప్రదేశానికి ఆర్టిమిస్తో స్టీఫెన్ టూ అద్దె టేక్సీలో వెళ్ళాడు. వారిద్దరూ ఆ సమయంలో ఏం మాట్లాడుకున్నారు మొదలైనవి ప్రశ్నించాను. ఓడ రేవులో ఆ టేక్సీని అద్దెకి తీసుకుని స్టీఫెన్ టూనే నడిపాడు. స్పిటల్ పాండ్ని చూసాక తిరిగి వస్తూ ఓ రెస్టారెంట్లో భోజనం చేసి తిరిగి ఓడ రేవులో ఆ టేక్సీని దాన్ని అద్దెకి ఇచ్చిన కంపెనీకి అప్పగించాడు. ఆర్టిమిస్ని మొదటిసారి అతను ఆ ట్రిప్లోనే ముద్దు పెట్టుకున్నాడని ఆమె చెప్పింది. స్టీఫెన్ని నేను ఈ ప్రశ్న అడిగితే, అతను కూడా ఆ టేక్సీ లోనే అది జరిగిందని చెప్పాడు. నేను నా ఎడం చేత్తో స్టీరింగ్ వీల్ని పట్టుకుని టేక్సీ నడుపుతూ, కుడి చేత్తో ఆమె తలని నా వేపు అకస్మాత్తుగా తిప్పి ఆమెని చుంబించాను. ఆమె అందుకు అభ్యంతరం చెప్పలేదు. దాంతో కారుని రోడ్డుకి కుడి పక్క కొద్దిసేపు ఆపి ఆమెని ముద్దు పెట్టుకున్నాను." అని చెప్పాడు. ఆర్టిమిస్ కూడా ఇలాగే జరిగిందని చెప్పింది కాని, ఒక్క విషయంలో మాత్రం వీరిద్దరి కథనాల్లో నాకు చిన్న తేడా కన్పించింది. దాంతో స్టీఫెన్ రహస్యం బట్టబయలైంది." కొనిగ్ నవ్వాడు.

నేను, జియోఫ్రే ఆలోచనగా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నాం. ఏమిటా తేడా? వెంటనే జియోఫ్రే ఉత్సాహంగా చెప్పాడు.

"నాకు అర్థమైంది. మొదటిసారి స్టీఫెన్ టూ బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడని ఆర్టిమిస్ చెప్పి ఉంటుంది. కాని మనవాడు పెదవుల మీద అని ఉంటాడు."

కోనిగ్ తల అడ్డంగా ఊపాడు.

"కారు ఆపేందుకు వీల్లేని రోడ్డయి ఉండాలి అది. ఘాట్ రోడ్ అయితే కారు నిలిపేందుకు వీలుండదు." నేను చెప్పాను.

మళ్ళీ అతను తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"మీరు కొంత దగ్గరగా వచ్చారు తప్ప పూర్తిగా కాదు."

"అసలా ఓడ రేవులో ఆ రోజు టేక్సీని అతను అద్దెకి తీసుకుని ఉండడు. లేదా అసలు అలాంటి కంపెనీనే లేదు." చెప్పాను.

"ఉంది. టేక్సీ లాగ్ బుక్లో అతని సంతకం కూడా ఉంది. అఫ్ కోర్స్. అది ఫోర్జరీ అనుకోండి."

"మేమిద్దరం ఓడిపోయాం. ఎలా పరిష్కరించారో మీరే చెప్పండి." జియోఫ్రే కాసేపాగి నా వంక అనుమతి కోసం చూస్తూ కోనిగ్ తో చెప్పాడు.

నేను కూడా అంగీకారంగా తల ఊపాను.

"నేను ఎన్నడూ బెర్ముడాకి వెళ్ళలేదు. అందుకని కొలంబియా ఎన్ సైక్లోపిడియాలో బెర్ముడా గురించి చదివాను. అది బ్రిటీష్ కోలనీ. బ్రిటీష్ రోడ్ సిస్టమ్ నే బెర్ముడా కూడా అనుసరిస్తోంది. గ్రేట్ బ్రిటన్లోలా బెర్ముడాలో కూడా రోడ్డుకి ఎడమచేతి వైపు వెళ్తారు. అంటే కీప్ లెఫ్ట్. స్టీఫెన్ డ్రైవ్ చేస్తూంటే స్టీరింగ్ వీల్ బ్రిటన్లోలాగా కారుకి కుడి వైపు ఉంటుంది. అప్పుడు పక్కన కూర్చున్న ఆర్టిమిస్ తలని తన వైపు తిప్పుకోడానికి ఎడమ చేతిని, స్టీరింగ్ వీల్ పట్టుకోడానికి కుడి చేతిని అతను వాడాలి. కాని స్టీఫెన్ తాను ఉపయోగించిన చేతుల గురించి చెప్పింది దీనికి విరుద్ధంగా

ఉంది. అమెరికాలోని కీప్ రైట్ పద్ధతిలో ఎడం చేత్తో స్టీరింగ్ వీల్ పట్టుకుని, కుడి చేత్తో ఆమె తలని తిప్పుకున్నానని చెప్పడంతో దొరికి పోయాడు. నిజంగా అతనక్కడ డ్రైవ్ చేసి ఉంటే కుడి చేత్తో స్టీరింగ్ వీల్ని డ్రైవ్ చేసి ఉండేవాడు."

నేను చిన్నగా చప్పట్లు కొడుతూ చెప్పాను.

"మీరు స్టీఫెన్ ఎలిబీలోని తప్పుని కనిపెట్టిన విధానాన్ని మెచ్చుకోవాలి. నాకు ఓ కథకి మంచి థీమ్ ని ఇచ్చారు. ఇంతకీ స్టీఫెన్ టూని మీరు అరెస్ట్ చేసారా?" ప్రశ్నించాను.

"లేదు. అతను దొరకలేదు. మేం కూడా అతని కోసం గట్టి ప్రయత్నం చేయలేదు. అతను తిరిగి రష్యాకి వెళ్ళిపోయి ఉండచ్చని అనుకున్నాం. మీ ఇద్దరూ ఒకటి విస్మరించారు. ఆర్టిమిస్కి స్టీఫెన్ ని చూపించి, అతనేనా ఓడలో ప్రయాణించింది అని అడిగితే సమస్య తేలిపోయేది. కేసు సాల్వ్ అయ్యాక చివరగా మరోసారి కన్ఫాం చేసుకోడానికి ఆ పని చేసాను. మన గ్లాసులు ఖాళీ అయ్యాయి. వెళ్ళి ఇంకో రౌండ్ తెచ్చుకుందాం." కోనిగ్ నవ్వుతూ చెప్పాడు.

ముగ్గురం ఖాళీ గ్లాసులతో లేచాం.

---

## తియ్యటి చావు - బార్బరా డి ఎమాటో

మొత్తానికి మిస్ గ్రెన్ ఫీల్డ్ కి ఓ అవకాశం దొరికింది. తన శత్రువు విషయంలో దాన్ని ఆమె చక్కగా సద్వినియోగ పరచదల్చుకుంది. తన పథకంలో భాగంగా ఆ రాత్రి ఐవర్ సర్ట్ క్లిఫ్ ని మన్ హాటన్ లోని జస్ట్ డిజర్ట్స్ అనే రెస్టారెంట్ కి భోజనానికి ఆహ్వానించింది. తిండిపోతైన ఐవర్ ఆమె ఊహించినట్లుగానే దాన్ని తిరస్కరించలేదు.

"చాక్లెట్ శాకాహారం అని నాకు తెలుసు. అందువల్ల మొహమాటపడకుండా కావలసినంత తింటానని హామీ ఇస్తున్నాను." నవ్వుతూ చెప్పాడు ఐవర్.

"చాక్లెట్ శాకాహారమే. అది జంతువు నించి రాదు. పెద్ద పొదకి కాసే కాయలనించి దాన్ని తీస్తారు. టొమేటోలు, కేబేజీలా ఇది కూడా శాకాహారమే." మిస్ గ్రెన్ ఫీల్డ్ కి మరోసారి హామీ ఇచ్చింది.

"ఇదే నా జీవితంలో ఆఖరి భోజనం అనుకుని మీ సూచన ప్రకారం ఈ రాత్రి చాక్లెట్తో కూడినవే తింటాను."

వారు తెల్లటి బట్ట పరిచిన గుండ్రటి టేబుల్ ముందు, చాక్లెట్తో తయారు చేసిన ఐటమ్స్ విషయంలో ప్రసిద్ధి చెందిన ఆ రెస్టారెంట్లో అరగంట నించి కూర్చుని ఉన్నారు.

"మీ తాజా నవలని నేను న్యూయార్క్ టైమ్స్ లో సమీక్షించాను. అది నచ్చి మీరు నన్ను ఈ డిన్నర్కి పిలిచినందుకు మరోసారి కృతజ్ఞుడ్ని. అంతకు మునుపు మీరు రాసిన నవలని కూడా నేనే సమీక్షించాను."

"అవును. చక్కగా సమీక్షించినందుకు నేను కూడా మీకు కృతజ్ఞురాలిని."

ఐవర్ తన జేబులోంచి ఓ చిన్న పెట్టెని తీసి తెరచి, అందులోంచి కేప్సల్ తీసి నోట్లో వేసుకుని, దాన్ని చాక్లెట్ కాఫీతో మింగి చెప్పాడు.

"నేను కొంత కఠినంగా సమీక్షించాను కదా?"

"కొంత కఠినంగానా? నా కనుగుడ్డుని ఇనప బ్రష్ తో తోమడం కొంత కఠినం అవుతుందా? మనసులో అనుకుంది రచయిత్రి గ్రెన్ ఫీల్డ్.

"మిష్టర్ ఐవర్ సర్ట్ క్లిఫ్! మీ సమీక్షలో నా తాజా నవల స్నఫ్డ్ గురించి ఇలా రాసారు.

"పాత్రల చిత్రీకరణ చాలా పేలవంగా ఉంది. కంప్యూటర్ పరికరాలు గల ఏర్ కండిషన్డ్ గదిలోని నిప్పుని ఆర్పే యంత్రంలోని గేస్ తో హంతకురాలు హతుడ్ని ఊపిరాడకుండా చేసి చంపిన

సంగతి పాఠకుడు ముందే గ్రహిస్తాడు. నవల చివరలో మలుపుగా చెప్పే ఈ విషయాన్ని పాఠకులకి సమీక్షకుడు ముందే చెప్పడం గర్హనీయం అని మీరు అనుకోలేదా? హంతుడెవరో మీరు మీ సమీక్షలో వెల్లడి చేసారు. అంత దాకా బాగా అమ్ముడైన నా నవల అమ్మకాలు, మీ సమీక్షానంతరం పడిపోవడానికి కారణం మీరు అది వెల్లడి చేయడం అని పబ్లిషర్ నాకు ఉత్తరం రాసారు.'' తన కోపాన్ని బహిర్గతం చేయకుండా ఆ రచయిత్రి చెప్పింది.

చాక్లెట్ కేక్స్ గల ప్లేట్లని వెయిటర్ తెచ్చి ఐవర్ ముందుంచాడు. ఖాళీ ప్లేట్లని తీసుకెళ్ళి పోయాడు.

''అందుకే రచయితలంతా నేను వారి పుస్తకాలకి సమీక్షకుడ్ని కాకూడదని దేవుడ్ని ప్రార్థించడానికి చర్చ్ కి వెళూంటారు. నా వలన సాహితీ రంగంలో దైవభక్తి పెరుగుతోంది." తనేదో జోక్ చెప్పినట్లుగా పగలబడి నవ్వాడు.

మర్యాదకి గ్రెన్ ఫీల్డ్ కూడా బయటకి నవ్వినా లోపల వారందరి తరఫునా ఈ రాత్రి నేను ప్రతీకారం తీర్చుకుంటున్నాను" అనుకుంది.

అతని నవ్వులోంచి అకస్మాత్తుగా రొప్పు మొదలైంది. అతను ఓ కేక్ని పూర్తిగా తింటూ, అది తగ్గుతుందని ఎదురు చూసాడు. కాని తగ్గక పోగా ఎక్కువ అవడంతో జేబులోంచి ఇందాకటి పెట్టెని తీసి మరో కేప్సూల్ని మింగాడు.

"మీకు జలుబు చేసిందా?" తెలియనట్లుగా అడిగింది గ్రెన్ ఫీల్డ్

"ఆస్తమా." జవాబు చెప్పాడు.

"సారీ! నా తమ్ముడికి కూడా ఆస్తమా. కాని పెద్దయ్యాక అది మాయమైంది."

"అదృష్టవంతుడు, నాకూ చిన్నప్పుడే వచ్చినా తగ్గలేదు."

"అది నీ మీద చేసిన రీసెర్చ్ లో తెలుసుకోబట్టేగా నిన్నిక్కడికి భోజనానికి పిలిచింది." మనసులో కసిగా అనుకుంది గ్రెన్ ఫీల్డ్ ‘‘

థియోఫిలైన్ అనే మందు వాడేవాడు." చెప్పింది.

‘‘అవును. నా డాక్టర్ కూడా నాకు సరిగ్గా అదే మందు రాసిచ్చాడు. దాన్ని నేను కొన్ని వారాలుగా తీసుకుంటున్నాను.’’

నీ దురదృష్టం కొద్దీ... మళ్ళీ మనసులో కసిగా అనుకుంది గ్రెన్ ఫీల్డ్ రెండో కేక్ని కూడా మాటల్లో ముగించి అతను వెయిటర్ వంక చూస్తూ చిటికె వేసాడు.

"మీ కేక్స్ చాలా బావున్నాయి. ఈసారి డార్క్ చాక్లెట్ కేక్ తీసుకురా. ఇందాక ఇచ్చిన చాక్లెట్ బ్రెడ్, చాక్లెట్ మాస్ కూడా మరోటి తీసుకురా.’’ కోరాడు.

వెయిటర్ వెళ్ళాక గ్రెన్ ఫీల్డ్ అతని వంక చూస్తూ చెప్పింది.

"నా క్రితం నవల సమీక్షలో మీరు రచయిత్రికి వ్యాకరణంలోని గతం, వర్తమానాల క్రియలు పెద్దగా తెలిసినట్లు లేవు. అని రాస్తూ కొన్ని డైలాగ్స్ ఉదాహరణగా ఇచ్చారు. కాని అవి మాట్లాడింది చదువు రాని నల్ల జాతి తల్లిదండ్రుల ఆరేళ్ళ కొడుకు అని కూడా మీరు రాసి ఉండాల్సింది. ఆ సామాజిక నేపథ్యం గల వారు అలాగే మాట్లాడతారు. సహజత్వం కోసం అలా రాసా తప్ప నాకు గ్రామర్ రాక కాదు."

‘‘చెప్పాగా. మీరంతా నా వల్ల తరచూ చర్చికి వేల్తున్నాలని." మళ్ళీ పగలబడి నవ్వాడు ఐవర్.

గ్రెన్ ఫీల్డ్ అప్పటికే మనసులో అతను తినే ఆహార పదార్థాల్లోని చాక్లెట్ కంటెంట్ని మనసులో లెక్కగడుతోంది. కొద్ది రోజుల క్రితమే ఐవర్ కి ఆస్తమా ఉందని, థియోఫిలైన్ టేబ్లెట్లని వాడుతున్నాడని తెలియగానే ఫిజీషియన్స్ డెస్క్ రిఫరెన్స్ అనే రెండు వేల ఎనిమిది వందల పేజీలు గల పుస్తకాన్ని చదివింది. అందులో అమెరికాలోని అన్ని మందుల కంపెనీలు

తయారు చేసే ఆ మందు బ్రాండ్ల పేర్లు, వాటి ఉపయోగాలు, రోజుకి ఎంత డోసేజ్ మించకూడదు, ఎంతకు మించితే అది ప్రమాదంగా పరిణమిస్తుంది, ఆందోళన, రక్త ప్రసరణ ఆగిపోవడం, ఫిట్స్ రావడం, స్పృహ తప్పి కోమాలోకి వెళ్ళడం లాంటి వాటి సైడ్ ఎఫెక్ట్స్ లక్షణాలని చదివింది. ఒకవేళ వారు కోమాలోకి వెత్తే, ఇక వెనక్కి రావడం కష్టం. చావు తప్పదు. ఆ మందు పరిమితిలో తీసుకుంటే శ్వాసనాళాలని వెడల్పు చేసి చక్కగా గాలి పీల్చుకునే అవకాశాన్ని కలిగించి, ఆస్తమా నించి రక్షిస్తుంది. థియోఫిలైన్ని, జ్ఞాంటైన్స్ తో కలిపి వాడకూడదని కూడా చదివింది. జ్ఞాంటైన్స్ పేజీ చూస్తే, కెఫైన్, థియోబ్రోమైన్లని అలా అంటారని రాసి ఉంది. కెఫైన్ కాఫీలో ఉంటుందని ఆమెకి తెలుసు. థియోబ్రోమైన్ చాక్లెట్లో ఉంటుందని అనేక పేజీలు తిప్పితే కాని తెలియలేదు.

తర్వాత గ్రెన్ ఫీల్డ్ మెర్క్ మేన్యూవల్ అనే రెండు వేల ఏడు వందల పేజీలు గల మరో వైద్య గ్రంథాన్ని కూడా చదివింది. దానికి 'మందుల బైబిల్ అని పేరు. అందులో థియోఫిలైన్ అధికమై స్పృహ తప్పితే మరణానికి అరవై శాతం అవకాశం ఉందని తెలిసింది.

ఓ కప్పు కాఫీతో డెబ్బై నించి, నూట ఏభై మిల్లీ గ్రాముల కెఫైన్ ఉంటుందని, జస్ట్ డిజర్ట్స్ లాంటి రెస్టారెంట్స్లో ఇచ్చే ప్రత్యేక ఫిల్టర్ కాఫీల్లో రెండు వందల మిల్లీ గ్రాముల కెఫైన్ ఉంటుందని చదివింది. శరీర బరువులో ప్రతి కిలోకి నూట ముప్పై ఏడు మిల్లీగ్రాముల చొప్పున, శరీరం ఎంత బరువుంటే అన్ని మిల్లీ గ్రాముల కెఫైన్ తీసుకుంటే మనిషి మరణిస్తాడని కూడా చదివింది. ఇది ఎలుకల మీద పరిశోధన చేసి లెక్క కట్టారు. రెండు వందల ఇరవై పౌన్ల బరువుగల ఐవర్ పదమూడు గ్రాముల ఏడు మిల్లీ గ్రాముల కెఫైన్ తీసుకుంటే ఇంతే సంగతులు అని, అతని బరువుని కిలో గ్రాముల్లో లెక్కగట్టి తెలుసుకుంది. దీనికి థియోబ్రోమైన్ కూడా కలిస్తే ప్రమాదం నాలుగురెట్లు పెరుగుతుంది

"మరో కప్పు టర్కిష్ కాఫీ..." ఐవర్ వెయిటర్కి చెప్పాడు.

"రెండు లార్జ్ కాఫీ ఒకే గ్లాసులో తీసుకురండి." గ్రెన్ ఫీల్డ్ వెయిటర్కి చెప్పింది.

‘‘టర్కిష్ కాఫీ అంటే చాక్లెట్ కాఫీనే. టర్కీలో చాక్లెట్ కలపకుండా కాఫీ తాగరు.'' ఆమెకి చెప్పాడు.

ఆమె ఎంతో జాగ్రత్త తీసుకుంది. ఈ రోజుల్లో ఇంటర్నెట్లో ఏ సైట్లోకి వెళ్ళి ఏ వెబ్ సైట్ చూసామో, పోలీసులు అవసరం వస్తే కనుక్కోగలరు. అందుకే ఖరీదైన ఆ వైద్య గ్రంథాలని నగదు ఇచ్చి కొన్నది కాని, లైబ్రరీ నించి తీసుకోలేదు. క్రెడిట్ కార్డ్ ని కూడా ఉపయోగించలేదు. తర్వాత వాటిని కాల్చి బూడిదని పార్క్ లో ఓ చెట్టు మొదట్లో పోసేసింది.

"ఫ్లోర్లెస్ చాక్లెట్ కేక్," కాఫీ తెచ్చిన వెయిటర్తో చెప్పాడు ఐవర్.

‘‘విత్ చాక్లెట్ టాపింగ్ మేక్ ఇట్ డబుల్.'' గ్రెన్ ఫీల్డ్ వెయిటర్కి సూచించింది.

"ఎక్సెలెంట్" మెచ్చుకోలుగా చెప్పాడు ఐవర్.

కుక్కలు చాక్లెట్ తింటే మరణిస్తాయి. కారణం అందులోని థియోబ్రోమైన్ మనుషుల్లో ఆ రసాయనిక పదార్థం గుండె కండరాలని రిలాక్స్ చేస్తుంది. ఎక్కువైతే చెమటలు పట్టడం, స్పృహ తప్పడం, హృదయ స్పందనలో తేడా రావడం, రక్త ప్రసరణ పడిపోవడం. ఆమెకి తను చదివిన లక్షణాలు గుర్తుకు వచ్చాయి. ఐవర్ జేబులోంచి రుమాలు తీసి, చేతులకి, నుదుటికి పట్టిన చెమటని తుడుచుకోసాగాడు. అతనికి ఇరవై నిమిషాల క్రితమే చెమట పట్టాలని గ్రెన్ ఫీల్డ్ లెక్క కట్టింది. ఆలస్యం అవడంతో బరువు విషయంలో తను పొరపడి ఉండవచ్చు అనుకుంది. అతను బ్రెడ్ టోస్ట్ మీద చాక్లెట్ మాస్ ని రాసుకుని తింటూ ఆమెని పట్టించుకోవడం మానేసాడు. మధ్యలో ఓసారి ఆమె వంక చూసి నవ్వాడు.

‘‘నీ ఖర్చుతో తింటున్నాను కాబట్టి నేనంత కఠినంగా రాయకుండా ఉండాల్సిందని అనిపిస్తోంది. ఆల్మండ్ చాక్లెట్ తింటానిప్పుడు.''

‘‘మీరు నిర్మోహమాటంగా తినండి. ఎందుకంటే మనిద్దరం కలిసి తినేది ఇదే ఆఖరిసారి కావచ్చు. నా స్థానంలోని మరొకరైతే, మిమ్మల్ని భోజనానికే పిలిచే వారు కాదు."

‘‘పిలిచినా నేను వెళ్ళేవాడ్ని కాదు. నాకు విషమిచ్చి చంపినా చంపచ్చు అనే భయం నాకుంది. మీ డిటెక్టివ్ రచయితలు దేనికైనా తెగించగలరు." సీరియస్ గా చెప్పాడు ఐవర్.

అతని చేతులు స్వల్పంగా వణకడం గమనించాక గ్రెన్ ఫీల్డ్ మెదడులోని కేలిక్యులేటర్ అప్పటికే అతను ఆరు వందల మిల్లీ గ్రాముల కెఫైన్ తీసుకుని ఉంటాడని, మరో రెండు వందల మిల్లీ గ్రాములు అతని ముందు టేబుల్ మీద ఉందని లెక్క కట్టింది. అతను తీసుకున్న కేప్సూల్స్ ఒక్కో దాంట్లో నాలుగు వందల మిల్లీ గ్రాముల థియోఫిలైన్ ఉంటుంది. అతనంత దాకా తిన్న 'స్కోకో లేడన్ పుడ్డింగ్' అనే జర్మన్ పుడ్డింగ్, రిగోజాన్సి కి అనే వియన్నీస్ కేక్, షాకో లాడ్కో మిండాలిన్సీ టోర్ట్ అనే పొటాటో, రమ్, దాల్చిన చెక్కలతో చేసిన రష్యన్ కేక్, అమెరికాలో సాధారణ ఉంగాడన్ డార్క్ చాక్లెట్ రోస్ట్ అన్నీ కలిసి ప్రమాదమైన థియోఫిలైన్ అతని రక్తంలో ఈ పాటికి కలిసుండాలి. ఇంకా తినడానికి వచ్చేవి చాలా దారిలో ఉన్నాయి.

"కొత్తగా ఏం రాస్తున్నారు?" అతని మాటలు ముద్దగా వచ్చాయి. ఆమె చెప్పేది వినిపించుకోకుండా అటు ఇటు చూడసాగాడు. అతని కనుగుడ్లు అతని ఆధీనంలో లేనట్లుగా, వేగంగా కదలసాగాయి. చేతుల్లోని వణుకు ఎక్కువ అయింది.

"కాఫీ తాగండి. తేరుకుంటారు." గ్రెన్ ఫీల్డ్ సూచించింది.

అతను మిగిలిన కాఫీ మొత్తం తాగి, తల విదిలించి చెప్పాడు.

"ఎగ్జర్సిస్ట్ తరహా నవలలని నేను చాలా సార్లు విమర్శించాను. చేతబడుల మీద మీకు నమ్మకం ఉందా?"

‘‘అలా అడిగారేమిటి?"

‘‘నన్నేదో ఆవహించిందనే భావన కలుగుతోంది.’’

అతనిలోని ఆందోళన అధికమైంది. గొంతు కీచుగా మారింది. అతను తన ముందున్న చాక్లెట్ కేక్ ప్లేట్ ని పక్కకి తోసేసాడు.

"దాని ఖరీదు నాలుగు డాలర్లు. వదలకండి." ప్రోత్సహించిందా రచయిత్రి.

అతను అనాలోచితంగా ఆమె చెప్పింది చేసాడు.

"ఆశ్చర్యం! నాకు ఊపిరి అందని భావన కలుగుతోంది."

‘‘ఆల్మండ్ చాక్లెట్ తినండి. సత్తువ వస్తుంది."

అతను జేబులోంచి కేప్సూల్ తీసుకుని మింగి టర్కిష్ కాఫీ తాగి చెప్పాడు.

‘‘ఏం లేదు. ఆస్తమా ఎటాక్. అంతే."

"మీరు ఇష్టంగా తినే కోకో చెట్టు బొటానికల్ నేమ్ గ్రీకు భాషలో థియోబ్రామా. అంటే దేవతల ఆహారం' అని అర్ధం." వివరించింది.

‘‘అలాగా? మంచి నవలని జడ్జి చేసే నేను దేవుడులాంటి వాడినే." గర్వంగా చెప్పాడు.

అతని వంటి మీంచి చెమట ధారాపాతంగా కారుతోంది. మళ్ళీ కేప్సూల్ పెట్టె బయటకి తీసి, ఒకటి వేసుకోబోయి ఆగి చెప్పాడు.

"డాక్టర్ రోజుకి రెండు మించవద్దన్నాడు. ఇవాళ నాలుగయ్యాయి."

‘‘ఫర్వాలేదు. ఇంకొకటి వేసుకోండి."

‘‘ఇది ఐదోది అవుతుంది." బలహీనంగా నూతిలోంచి చెప్పినట్లు చెప్పాడు.

"ఆస్తమాకెగ ఆ మందు. ఫర్వాలేదు. పక్కన నేనున్నాగా? వేసుకోండి."

ఆది వేసుకోగానే అతని చేతులు టేబుల్ క్లాత్ అంచులని పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలం అవుతున్నాయి.

"మిస్టర్ ఐవర్! మీరు కట్టుకున్న టై మీ చొక్కాకి మేచ్ కాక అసహ్యంగా ఉంది. మీరు తొడుక్కున్న ఖరీదైన సూట్ మీ ఒంటి మీద దరిద్రంగా కన్పిస్తోంది. మీ బుర్ర సాహిత్య లోకానికి చెందింది కాదు. నేరస్థులకి సంబంధించింది. మీరు చాలా మంది రచయితలకి ఎంతో అపకారం చేసిన సేడిస్ట్."

ఆమె చెప్పింది విన్నా అర్థం కానట్లుగా వెర్రి చూపులు చూడసాగాడు.

"నేనిప్పుడు మాట్లాడింది కొద్దిగా...నిజంగా కొద్దిగా కఠినంగా ఉంది కదూ?" నవ్వుతూ అడిగింది.

అతన్నించి సమాధానం లేదు. ఇందాకటిలా చెమట తుడుచుకోవడం మానేసాడు. రక్తం మొహంలోకి చేరి ఎర్రబడింది. అతను అకస్మాత్తుగా ముందుకి వాలాడు. రెండు చేతులతో టేబుల్ క్లాత్ ని పట్టుకుని, క్రమక్రమంగా వెనక్కివాలే ప్రయత్నం చేస్తూ, కుర్చీలోంచి పక్కకి వాలి నెమ్మదిగా కింద పడ్డాడు. అతనితో పాటు తెల్లటి టేబుల్ క్లాత్, దాని మీది వెండి ఫోర్క్ లు, చెంచాలు, పింగాణీ ప్లేట్లు, కప్పులు చప్పుడు చేస్తూ కిందపడ్డాయి.

"ఓ మై గుడ్నెస్!" ఆమె గట్టిగా కేక పెట్టింది.
వెయిటర్ పరిగెత్తుకు వచ్చాడు. ఐవర్ నోట్లోంచి గురక లాంటి శబ్దం వస్తోంది. మేనేజర్ కూడా వచ్చి చూసి అడిగాడు.
"ఇతనికి మూర్ఛ రోగం ఉందా?"
"నాకు తెలీదు. కాని ఆస్తమా ఉంది. మందు అతని జేబులో ఉందనుకుంటాను".
మేనేజర్ ఐవర్ జేబులు వెదికి, ఓపెట్టె తీసి చూసి చెప్పాడు.

‘‘అవును. ఇది మా అమ్మ వాడేలాంటి ఆస్తమా మందే. ఇది వేస్తే తేరుకోవచ్చు. కాఫీతో వేయండి. వేడికి మాత్ర కరిగి త్వరగా తేరుకోవచ్చు.’’

ఐవర్ చేత కాఫీతో ఆ మాత్రని మింగించి కూర్చోపెట్టాడు మేనేజర్. అతను కళ్ళు తెరవకపోవడంతో రెండు చెంపల మీద కొట్టాడు. మొహం మీద నీటిని కూడా చిలకరించాడు. కాని ఐవర్లో ఎలాంటి స్పందన లేదు. ఆ ఆరో మాత్ర వల్ల అతను కోమాలోకి వెళ్ళాడని గ్రెన్ ఫీల్డ్ అప్పటికే గ్రహించింది. వైద్య పుస్తకాల్లో చెప్పింది నిజమే అయితే ఇక అతను ఆ కోమాలోంచి వెనక్కి తిరిగి రాడు.

మేనేజర్ అంబులెన్స్ కోసం ఫోన్ చేసాడు.

పేరా మెడిక్స్ వచ్చి ఐవర్ నాడిని పరీక్షిస్తూ అడిగారు.

"ఏం జరిగింది?"

"అంతా మామూలుగానే జరిగింది. మంచి ఆకలి మీద ఉన్నట్లుగా చాలా తిన్నాడు. మాట్లాడుతూనే పక్కకి వాలిపోయాడు. అంతకు మించి ఏం జరగలేదు." గ్రెన్ ఫీల్డ్ చెప్పింది.

‘‘పొరపాటున అతను తిన్న దాంట్లో ఏమైనా కలిసిందేమో?" ఓ పేరా మెడిక్ మేనేజర్ వంక చూస్తూ చెప్పాడు.

"నేనలా జరిగిందని అనుకోను. అదే జరిగితే అతనికైనట్లుగా నాకూ అవ్వాలిగా?" చెప్పింది గ్రెన్ ఫీల్డ్.
చూడడానికి వచ్చిన ఒకరిద్దరు కస్టమర్స్ కూడా అదే చెప్పారు.
ఐవర్ ని అంబులెన్స్ లోకి ఎక్కించాక ఆదుర్దా, భయం నటిస్తూ అడిగింది గ్రెన్ ఫీల్డ్
"మరేం ఫర్వాలేదుగా?"
‘‘మన కళ్ళ ముందే పోయాడు." జవాబు చెప్పాడతను.

నేర పరిశోధన రచయితల విషయంలో విమర్శకులు జాగ్రత్తగా ఉండాలనే పాఠం ఈపాటికి అతని ఆత్మ నేర్చుకుని ఉండాలి. ఇంటికి వెళ్తూ అనుకుంది గ్రెన్ ఫీల్డ్.

---

## గది నంబర్ పదకొండు - డోనాల్డ్ హానిగ్

అరుపులు వినపడటంతో అతనికి మెలకువ వచ్చింది. పూర్తిగా నిద్రమత్తు వదిలాక ఆ అరుపులు పక్క గదిలోంచే వస్తున్నాయని గ్రహించాడు. మంచం దిగి పక్క గదికి, తన గదికి మధ్య ఉన్న గోడ దగ్గరకి వెళ్ళి, గోడకి కుడి చెవిని ఆనించి శ్రద్ధగా విన్నాడు.

“నీ గురించి అందరితో చెప్పేస్తాను.” ఆడ కంఠం.

“ఎలా చెప్తావో చూస్తాగా?" మగ కంఠం.

"నేను బయటకి వెళ్తున్నాను." ఆడ కంఠం.

“ఎలా వెళ్తావో చూస్తాగా?" మగ కంఠం.

బాధగా అరిచింది ఆ ఆడ కంఠం. తర్వాత ఎవరో నేల మీద పడ్డట్లుగా దబ్బుమన్న శబ్దం.

పోట్లాడుకుంటున్నారు. ఆ యువతి అరవడానికి వీల్లేకుండా ఎవరో ఆమె నోటిని చేత్తో నొక్కిపట్టినట్లుగా మూలుగులు. కొడుతున్న చప్పుడు.

దాదాపు నిముషం తర్వాత ఆ శబ్దాలు అకస్మాత్తుగా ఆగిపోయాయి. కొన్ని క్షణాల సేపు చెవిని అతను గోడకి ఆనించే ఉంచాడు. అంతా నిశ్శబ్దం చంపేసాడా? తనకి ఎందుకు ఆ విషయాలు? హాయిగా పడుకుని మర్నాడు ఉదయం ఎలాగూ హోటల్ గది ఖాళీ చేసి వెళ్ళిపోతున్నాడు.కాని చంపేసాడేమో? లేకపోతే ఆ యువతి ఎందుకు మాట్లాడదు.

ఐదు నిముషాలు ఆలోచించి మళ్ళీ గోడకి చెవిని ఆనించి విన్నాడు. అవతల అంతా నిశ్శబ్దం. చెప్పులు తొడుక్కుని రెండో అంతస్థులోని తన గదిలోంచి లిఫ్ట్ లో కిందకి వచ్చాడు.

"ఏం కావాలి మిస్టర్ వారెన్?" అర్ధరాత్రి కిందకి వచ్చిన వారెన్ ని హోటల్ క్లర్క్ అడిగాడు.

"నా పక్క గదిలో ఏదో గొడవ జరిగింది. మగ, ఆడ కంఠాలు గట్టిగా వినపడ్డాయి. మగతను ఆమెని కొట్టాడు. తర్వాత అంతా నిశ్శబ్దం. ఆమెకి ఏమైనా అయిందేమోనని నాకు అనుమానంగా ఉంది.''

''ఏ గది?''

"నా గదికి కుడి వైపుది. పదకొండో నంబరు గది."

"దాంట్లో ఆడవాళ్ళు ఎవరూ లేరే? మేల్కోమ్ అనే ఒకే అతను అందులో దిగాడు."

"కాని నేను స్పష్టంగా ఓ ఆడ కంఠాన్ని విన్నాను."

క్లర్క్ అయిష్టంగానే రిసీవర్ అందుకుని ఓ నంబర్ తిప్పాడు. చాలాసేపు మోగాక అవతలి వైపు రిసీవర్ అందుకున్నాడు మేల్కోమ్.

"రిసెప్షన్ నించి. ఇంత రాత్రి మీ నిద్రకి భంగం కలిగిస్తున్నందుకు ఏం అనుకోవద్దు. మీ గదిలోంచి శబ్దాలు వచ్చాయని మీ పక్క గదిలోని మిష్టర్ వారెన్ ఇప్పుడే వచ్చి చెప్పారు."

మేల్కోమ్ ఏం చెప్పాడో వినలేదు కాని వారెన్ కి క్లర్క్ ముఖకవళికలని బట్టి అర్ధమైంది.

''అలాగా? సారీ. గుడ్ నైట్."

రిసీవర్ క్రేడిల్ మీద పెట్టి క్లర్క్ వారెన్ తో చెప్పాడు.

"రాత్రి పది నించి మేల్కోమ్ నిద్రలో ఉన్నాడట. తన గదిలో ఆడవారు ఎవరూ లేరని చెప్పాడు. మీకు కలేదైనా వచ్చి ఉండచ్చు."

క్లర్క్ తన మాటలు నమ్మడం లేదని వారెన్ కి అర్థమైంది. మాట్లాడకుండా తన గదికి చేరుకున్నాడు. తన చెవులని తను నమ్మగలడు. కల కాదు. అతనికి చాలా సేపు నిద్ర పట్టలేదు.

పది నిముషాల తర్వాత తలుపు మీద ఎవరో ముని వేళ్ళతో కొట్టిన చప్పుడు విని వారెన్ లేచి కూర్చుని గట్టిగా అడిగాడు.

‘‘ఎవరు?

" ఇంకోసారి తలుపు మీద కొట్టిన శబ్దం వినిపించింది.

‘‘మిష్టర్ వారెన్. మీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి." ఓ మగ కంఠం వినిపించింది.

వారెన్ వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా నైట్ డ్రెస్ లో, పొడుగ్గా, సన్నగా ఉన్న ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని ముఖం ఆందోళనగా ఉంది. చేతిలో ఓ టార్చ్ లైట్ ఉంది.

"లోపలకి రావచ్చా?" అడిగాడు.

‘‘ఎందుకు?’

‘‘మీ పక్క గదిలోంచి ఏమైనా శబ్దాలు విన్నారా?" అతను ప్రశ్నించాడు.

‘‘విన్నాను. రండి."

లోపలకి వచ్చి తలుపు మూసి ఆ యువకుడు చెప్పాడు.

"నా పేరు జాన్ బ్రూక్. నేను పన్నెండో నంబర్ గదిలో బస చేస్తున్నాను. ఇందాక పదకొండో నంబర్ గదిలోంచి ఆడా, మగ పోట్లాడుకున్న శబ్దాలు నేను విన్నాను. కింద రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్ళి చెప్తే ఆ గదిలో ఒక్క మగాడే ఉన్నాడని, నాకు కల వచ్చి ఉండాలని, లేదా మీరు ఫిర్యాదు చేయమని చెప్పి నన్ను పంపి ఉంటారని అన్నాడు."

‘‘అవును. ఆ శబ్దాలు నేనూ విన్నాను." వారెన్ చెప్పాడు.

"అది తెలుసుకుందామనే వచ్చాను. ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?" జాన్ బ్రూక్ అడిగాడు.

"కింద రిసెప్షన్ క్లర్క్ మనం చెప్పేది నమ్మడం లేదు. ఓ ఆడపిల్లకి ఏదో అన్యాయం జరిగిందని నాకు అనిపిస్తోంది." వారెన్ చెప్పాడు.

"పోలీసులకి ఫోన్ చేయచ్చు. కాని వారు వచ్చి ఆ గది వెదికి, మనం చెప్పింది నిజం కాదని ఋజువైతే ఆ గదిలోని వ్యక్తి మన మీద పరువు నష్టం దావా వేసి మనల్ని కోర్టుకి ఈడ్చచ్చు." జాన్ బ్రూక్ ఆలోచనగా చెప్పాడు.

‘‘నిజమే. నేనా సంగతి ఆలోచించలేదు." చెప్పాడు వారెన్.

‘‘తలుపుకి ఉండే తాళం చెవి రంధ్రంలోంచి చూసాను. లోపలంతా చీకటిగా ఉండటంతో ఏం కనపడలేదు." జాన్ బ్రూక్ చెప్పాడు.

‘‘బెడ్ లేంప్ కూడా వెలగడం లేదా?’’

‘‘లేదు’’

‘‘ఆశ్చర్యం. బెడ్ లేంప్ కూడా వెలగడం లేదంటే, ఆ గదిలో తప్పకుండా ఏదో జరిగి ఉండాలి."

‘‘ఒక్కసారి ఆ గదిలో ఏం జరిగిందో చూస్తే తర్వాత మన పని తేలిక అవుతుంది."

“ఎలా? లోపల అంతా చీకటి అన్నారు?"

"ఓ దారి ఉంది. సన్ షేడ్ బిల్డింగ్ బయట గదిలోకి వాన పడకుండా సన్ షేడ్ కట్టి ఉంది. మీ గది కిటికీలోంచి దాని మీదకి దిగి నెమ్మదిగా అతని గది కిటికీ దగ్గరకి పాక్కుంటూ వెళ్ళి టార్చ్ వెలుగులో చూస్తే లోపల ఏం జరిగిందో కనపడుతుంది." చెప్పాడు బ్రూక్.

“ఆ సన్ షేడ్ ఎంత వెడల్పు ఉంటుంది?" వారెన్ ఉత్సాహంగా అడిగాడు.

ఇంకా అతని మనసులో ఆ యువతి అరిచిన అరుపులు వినపడుతున్నాయి.

"మూడు అడుగులు. కొద్దిగా ప్రమాదకరం. ఐనా ప్రయత్నించ వచ్చు.

" వారెన్ కిటికీ దగ్గరకి వెళ్ళి తలుపు తెరచి బయటకి చూసాడు. సన్ షేడ్ వెడల్పుగా కనిపించింది. పక్క గదిలోని కిటికీ వంక చూసాడు. ఎనిమిది అడుగుల దూరంలో ఉందా కిటికీ. కిందకి చూసాడు. చీకటిగా ఉండి ఏం కనపడలేదు.

“ప్రమాదమేమో? రేపు ఉదయం దాకా ఆగుదాం." బ్రూక్ కంఠంలో భయం ధ్వనించింది.

"నాకా ధైర్యం ఉంది. నిజంగా ఆ యువతికి ఏమైనా జరిగి ఆ సంగతి నేను కనుక్కున్నానని తెలిస్తే నా ధైర్యానికి మా ఆఫీస్ మేనేజర్ అవార్డ్ ని ఇప్పిస్తాడు." వారెన్ చెప్పాడు.

బ్రూక్ మొహంలో ఇంకా భయం పోలేదు.

"కింద చీకటిగా ఉంది కాబట్టి ఏం కనపడదు. కాబట్టి కళ్ళు తిరగవ్. గోడకి చెవిని ఆనించి వినండి. ఏదైనా శబ్దం వినిపిస్తే నాకు చెప్పండి." వారెన్ కోరాడు.

బ్రూక్ తను తెచ్చిన టార్చ్ ని అతనికి ఇచ్చాడు. కిటికీలోంచి వారెన్ సన్ షేడ్ మీదకి దిగాడు. గోడకి ఆనుకుని నెమ్మదిగా అంగుళం, అంగుళం పక్కగది కిటికీ వైపు జరగసాగాడు. వారెన్ జీవితంలో ఇంతదాకా ఇలాంటి సాహసం చేయలేదు. అందుకే మనసులో ఆందోళన బదులు

ఆనందం, తృప్తి కలిగాయి. చేతిలో టార్చ్ తో పక్క గది వైపు జరగసాగాడు. ఆ కిటికీ దగ్గరకి చేరుకున్నాక టార్చ్ ని వెలిగించి వేళ్ళ సందుల్లోంచి కాంతిని పదకొండో నంబరు గదిలోకి ప్రసరింప చేసాడు. మంచం మీద ఓ యువతి శరీరం అడ్డదిడ్డంగా పడి ఉంది. ఆమె పడుకున్న తీరుని బట్టి ఆమె మరణించిందని వారెన్ ఇట్టే గ్రహించాడు.

“మిష్టర్ బ్రూక్ లోపలకి ఎలా వచ్చారు?” వారెన్ ఆ గదిలో టార్చి వెలుగులో నిలబడ్డ బ్రూక్ ని చూసి ఆశ్చర్యంగా అడిగాడు.

“నా పేరు బ్రూక్ కాదు. మేల్కోమ్." నవ్వాడు ఆ యువకుడు.

మేల్కోమ్ రెండు చేతులూ వారెన్ వైపు వెళ్ళాయి. అతన్ని బలంగా తోసాడు.

వారెన్ పెద్దగా అరుస్తూ కింద చీకట్లోకి జారిపోయాడు.

"మేల్కోమ్ గదిలోంచి మాటలు వినపడ్డాయని వారెన్ నాకు ఫిర్యాదు చేసాడు.” హోటల్ రిసెపనిస్ట్ డిటెక్టివ్ కి చెప్పాడు.

"నిజానికి ఆ శబ్దాలు వారెన్ గదిలోంచి నాకు వినపడ్డాయి. అప్పట్లో ఆ సంగతి ఫిర్యాదు చేయాలని నాకు తట్టలేదు." మేల్కోమ్ చెప్పాడు.

"ఆ అమ్మాయిని ఎవరూ చూడకుండా తన గదిలోకి తీసుకుని వచ్చి ఉంటాడు. ఆమె వేశ్య. అనుభవించాక ఎందుకో గొడవ వచ్చి చావబాదాడు. ఆ దెబ్బలకి ఆమె మరణించింది. తర్వాత తను చేసిన పనిని తెలుసుకుని, చట్టానికి పట్టుపడకూడదని కిటికీలోంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు." డిటెక్టివ్ చెప్పాడు.

"తన గదిలో తను హత్య చేసిన యువతి శవాన్ని ఉంచి నా గదిలోంచి శబ్దాలు వినపడ్డాయని ఎందుకు ఫిర్యాదు చేసినట్లు?" అడిగాడు మేల్కోమ్.

"మీరు అమాయకులు. తెల్లారేలోగా ఆ హంతకుడు ఆ యువతి శవాన్ని మీ గదిలోకి ఎలాగో చేర్చి జారుకునేవాడు. అప్పుడు మీరు అపరాధి అయ్యేవారు. కాని ఎందుకో మనసు మార్చుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు." చెప్పాడు డిటెక్టివ్ మీసం దువ్వుకుంటూ.

మేల్కోమ్ కూడా మీసం దువ్వకున్నాడు.

---

## డెబ్బై నాలుగో వజ్రం - ఎడ్గర్ వాలెస్

"గ్రాండ్ ఎంపైర్ హోటల్లో భారతదేశం నించి వచ్చిన ఓ మహారాజా బస చేస్తున్నాడు. అతను తనకి, తన పరివారానికి కలిపి పది గదులు అద్దెకి తీసుకున్నాడు. వింటున్నావా?" న్యూయార్క్ లోని ఓ బార్లో కూర్చుని ఉన్న బెన్నీ లేంబ్ తన మిత్రుడు జిమ్ తో చెప్పసాగాడు.

జిమ్ తల ఊపాడు.

"తన వెంట డెబ్బై మూడు విలువైన వజ్రాలని తీసుకు వచ్చాడా మహారాజు. ఎలాగైనా వాటిలో కొన్నయినా కొట్టేయగలిగితే మనం చాలా కాలం సుఖంగా గడపచ్చు."

‘‘ఆయన అంత ఖరీదయిన వజ్రాలు తన వెంట ఎందుకు తెచ్చినట్లు?" అడిగాడు జిమ్.

"డెబ్బై నాలుగు వజ్రాలు కలిపి ఓ హారం చేయించే ఉద్దేశంతో తెచ్చాడని తెలిసింది. ఆ డెబ్బై నాలుగో వజ్రం కొని తిరిగి స్వదేశం వెళ్ళిపోతాడు." బెన్నీ లేంబ్ చెప్పాడు.

‘‘అంటే ఓ వజ్రం కొనడానికి వచ్చాడన్నమాట."

‘‘అవును. ఎలాగైనా వాటిని కొట్టేయడానికి నేనో ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను."

‘‘మంచిది. కాని ఆ మిక్సర్ గాడు మళ్ళీ లండన్ వచ్చాడని విన్నాను. మనం జాగ్రత్తగా ఉండాలి." జిమ్ చెప్పాడు.

"నేనూ విన్నాను. కాని ఆ దొంగ పీనుగ కన్ను కూడా మహారాజా వారి వజ్రాల మీద పడుతుందంటావా?" అనుమానంగా అడిగాడు బెన్ని.

జిమ్ బదులుగా అవునన్నట్లుగా తల ఊపి అడిగాడు.

‘‘నన్నడిగితే ఈ పాటికే వాడు ఆ ఆలోచన మొదలు పెట్టి ఉంటాడు. సరే. ఇంతకీ నీ పథకం ఏమిటి?’

‘‘ఆయన వజ్రాలు కొనడానికి వచ్చాడు కాబట్టి వజ్రాల వ్యాపారిలా వెళ్ళి కలుస్తాను. ఆయన దగ్గర ఉన్న వజ్రాలని పరిశీలిస్తాను. తర్వాత అలాంటి పరిమాణంలోని నకిలీ వజ్రాలు కొన్ని సంపాదించి రెండోసారి వెళ్ళినప్పుడు జాగ్రత్తగా సాధ్యమైనన్ని మార్చేస్తాను."

‘‘నీకు వజ్రాల గురించి అట్టే తెలియదు కదా? వాటి గురించి ఆయనతో ఏం మాట్లాడగలవు?’’ అడిగాడు జిమ్.

బెన్ని లేంబ్ తన మిత్రుడి వంక ఆలోచనగా చూసాడు.

‘‘నువ్వు అసలు వజ్రాల వర్తకుడివి కావనే అనుమానమే మహారాజాకి కలగకూడదు. నీతో కొన్ని నిజమైన చిన్న వజ్రాలు కూడా తీసుకువెళ్ళు. వాటిని అక్కడే వదిలి మర్నాడు వెళ్ళి 'అవి నచ్చాయా?" అని అడుగు. నువ్వు నమ్మకంగా ఆ వజ్రాలు వదిలి వెళ్ళినందుకు తన దగ్గర ఉన్న ఆ డెబ్బై మూడు వజ్రాలు సందేహించకుండా చూపిస్తాడు." చెప్పాడ జిమ్.

‘‘ఇది మంచి సలహా." ఒప్పుకున్నాడు బెన్ని లేంబ్.

బార్ మూసేసేదాకా అక్కడే కూర్చుని మహారాజాని ఎలా మోసం చేయాలా అని ఆ తోడు దొంగలు ఇద్దరూ ఆలోచిస్తుండిపోయారు.

మహారాజా గదికి తను ప్రత్యేకంగా చేయించిన ఖరీదైన విజిటింగ్ కార్డ్ ని పంపాడు బెన్ని లేంబ్.

కొద్ది నిముషాల తర్వాత అతనికి మహారాజా దర్శనం లభించింది. తనతో తెచ్చిన సంచిలోంచి చాపలా చుట్టిన ఓ వెల్వెట్ బట్టని తీసి బెన్నీ లేంట్ దాన్ని విప్ప తీసాడు. అందులో వజ్రాలు ఉన్నాయి.

మహారాజా వాటిని ఒకసారి చూసి తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

"ఇంత చిన్నవా? నెక్లెస్ కోసం కనీసం బాతు గుడ్డంత పరిమాణం కలవి కావాలి."

వెంటనే మహారాజా గట్టిగా చప్పట్లు చరిచాడు. పక్క గదిలోంచి సేవకుడు రాగానే, బెన్నీ లేంట్ కి అర్థం కాని భాషలో మహారాజా ఏదో చెప్పాడు.

వాడు టేబుల్కి ఉండే సొరుగులోంచి కొన్ని వజ్రాలు తీసి బెన్నీ లేంట్ కి చూపించాడు. అవన్నీ తళతళ మెరిసే పెద్ద వజ్రాలు.

వాటి వంక మెచ్చుకోలుగా చూస్తూ ఓ అడుగు ముందుకు వేసాడు బెన్నీ లేంట్. ఆ సేవకుడు వజ్రాలు ఉన్న పెట్టెని వెంటనే మూసేసి దాన్ని యధాస్థానంలో ఉంచాడు.

"మీ దేశంలో వాటి ఖరీదు ఎంత ఉండొచ్చు?" అడిగాడు మహారాజా.

"ఒక్కొక్కటి ఏభై వేల డాలర్లకి తక్కువ ఉండదు."

"అలాంటి వజ్రం ఒక్కటి తీసుకురాగలవా?" అడిగాడు మహారాజా.

'ఓ' అన్నట్లుగా తల ఊపాడు బెన్నీ లేంట్.

“ఎన్ని రోజుల్లో తేగలవు?”

“రేపు తెస్తాను."

‘‘సరే. ఐతే రేపు మీ కోసం ఎదురు చూస్తాను."

బెన్ని లేంబ్ బయటికి నడిచాడు.

ఆ సాయంత్రం బెన్ని లేంబ్ మళ్ళీ తన మిత్రుడు జిమ్ ని బార్లో కలిసి జరిగింది చెప్పాడు. ఇద్దరికీ బీర్ ఆర్డర్ చేసారు. అయిదారు నిమిషాల తరువాత బేరర్ బీర్ బాటిల్స్ టేబుల్ మీద ఉంచుతూ అక్కడే ఉన్న ఓ కవరు చూసి అడిగాడు.

‘‘ఇది మీదేనా?’’

ఆ కవరు మీద రాసి ఉన్న తన పేరు చూడగానే చప్పున దాన్ని అందుకుని బెన్ని లేంబ్ అడిగాడు.

"ఇక్కడ దీన్ని ఎవరు పెట్టారు?"

జిమ్ కి కాని, బేరర్ కి కాని ఆ సంగతి తెలియదు. బేరర్ వెళ్ళగానే ఆ కవర్ చింపి అందులోంచి ఓ కాగితం తీసి చదివాడు బెన్ని లేంబ్.

నువ్వు మహారాజా వజ్రాలు దొంగతనం చేసే ఉద్దేశంలో ఉన్నావు కదూ? నాక్కూడా అదే కోరిక కలిగింది. మనిద్దరం కలిసి ఆ పని చేస్తే చెరి సగం పంచుకోవచ్చు. సరేనంటే రాత్రి పది గంటలకి నన్ను సెయింట్ జాన్స్ ఎవెన్యూ దగ్గర కలు. ఒంటరిగా రా. -మిక్సర్

వెంటనే ఆ ఉత్తరాన్ని జిమ్ కి ఇచ్చాడు. అతనూ దాన్ని చదివాక చెప్పాడు జిమ్.

"మిక్సర్ కన్ను కూడా వాటి మీద పడటమే కాక, నువ్వు ప్రయత్నం ప్రారంభించినట్లుగా కూడా అప్పుడే తెలుసుకున్నాడు. వెళతావా ఏమిటి? మిక్సర్ చాలా మోసగాడు సుమా!"

రాత్రి పది గంటలకి బెన్ని లేంట్ మిక్సర్ రాసిన ఉత్తరంలోని చోటికి ఒంటరిగా చేరుకున్నాడు. పొడుగాటి కోటు తొడుక్కుని, టోపీ పెట్టుకున్న ఓ యువకుడు బెన్ని లేంట్ దగ్గరకి వచ్చి వీధి దీపం వెలుగు మీద పడకుండా నీడలో నిల్చున్నాడు.

"మిక్సర్?" పలకరించాడు బెన్ని లేంట్.

“అవును. నడుద్దాం పద.”

“వజ్రాల దొంగతనంలో నాకు సహాయపడగలవా?" మిక్సర్ నిర్మానుష్యంగా ఉన్న ఆ రోడ్డు మీద నడుస్తూ అడిగాడు.

"నేను అసలు దొంగని అయితే కదా? నా మీద నీకు ఉన్న తప్పు అభిప్రాయం సరిదిద్దాలనే ఉద్దేశంతో మాత్రమే వచ్చాను. నువ్వు నా విషయంలో పొరబాటు పడ్డావు." బెన్ని లేంట్ చెప్పాడు.

"అబద్దాలు అడకు." విసుగ్గా చెప్పాడు మిక్సర్.

“దొంగలు సంపాదించిన వాటిని వారి నించి దోచుకోవడం నీ అలవాటు అని విన్నాను. సంవత్సరం క్రితం లండన్లోని చాలామంది దొంగలని దోచుకుని నువ్వు మాయమయ్యావని, మళ్ళీ ఇప్పుడు ప్రత్యక్షం అయ్యావని తెలుసు నాకు." బెన్ని చెప్పాడు.

"అయితే గుడ్ బై." చెప్పాడు మిక్సర్.

"ఒకవేళ నేను కష్టపడి ఆ వజ్రాలు దొంగతనం చేసే పక్షంలో వాటిని నువ్వు నా నించి గద్దలా తన్నుకుపోకుండా ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు." హెచ్చరింపుగా చెప్పాడు బెన్ని లేంట్.

మిక్సర్ ఆగి వెనక్కి తిరగబోయాడు. అదే సమయంలో బెన్ని లేంబ్ అతని మొహం స్పష్టంగా చూద్దామని అందుకు అడ్డంగా ఉన్న టోపీని లాగబోయాడు. మరుక్షణంలో మిక్సర్ మెరుపులా బేన్ని లేంబ్ తల మీద పిడికిలి బిగించి ఓ దెబ్బ వేసాడు. ఆ దెబ్బకి కింద పడ్డాడు బెన్ని లేంబ్.

‘‘లే! లేచి నువ్వు చేసిన సాహసానికి క్షమాపణ చెప్పు." కఠినంగా చెప్పాడు మిక్సర్.

బెన్ని లేంబ్ వెంటనే లేవలేకపోయాడు. చేత్తో తల తడుముకుంటూ గట్టిగా మూలిగాడు. మిక్సర్ నిశ్శబ్దంగా నవ్వి వెళ్ళిపోయాడు.

బెన్ని లేంబ్ అతన్ని అనుసరించే ప్రయత్నం చేయలేదు. తన మిత్రుడు జిమ్ కి తనకు జరిగిన అవమానం గురించి చెప్పలేదు.

బెన్ని లేంబ్ మర్నాడు ఉదయం తనకు తెలిసిన ఓ వ్యాపారి దగ్గరకి వెళ్ళాడు. ఆ వ్యాపారి దొంగల నించి వాళ్ళు దొంగతనం చేసిన వజ్రాలు కొంటూంటాడు. ఆ విధంగా అతను బెన్ని లేంబ్ కి పరిచయం. బెన్ని లేంబ్ భారతదేశం నించి వచ్చిన ఆ మహారాజా గురించి, అతని ఐశ్వర్యం గురించి ఆ వ్యాపారికి చెప్పి, తన కార్యక్రమం గురించి వివరించాడు.

‘‘ఓ ఖరీదైన వజ్రం అరువుగా ఇస్తే అది మహారాజాకి చూపించి, ఆయన దాన్ని కొనే పక్షంలో అసలుది మాయం చేసి నకిలీది అమ్ముతాను. మళ్ళీ నీ వజ్రం నీకు తిరిగి ఇచ్చేస్తాను."

"నా దగ్గర ఉన్న ఓ వజ్రం ఖరీదు నలభై వేల డాలర్లు. నేను నీకు, నీ మిత్రులకి ముప్పై వేల డాలర్ల దాకా ఇవ్వాల్సి ఉంది. మరో ఐదు వేల డాలర్లు ఇస్తే ఆ వజ్రం అరువుగా ఇస్తాను. నాకూ హామీ ఉండాలిగా." చెప్పాడు ఆ వ్యాపారి.

మారు మాట్లాడకుండా ఐదు వేల డాలర్లు ఇచ్చి ఆ వజ్రం తీసుకుని వెళ్ళి మహారాజాని కలుసుకున్నాడు బెన్నీ లేంట్. ఆ వజ్రాన్ని ఆయన పరిశీలించడానికి ఇచ్చాడు. సరిగ్గా అలాగే ఉండే ఓ నకిలి వజ్రం బెన్నీ లేంట్ జేబులో సిద్ధంగా ఉంది.

చిన్న భూతద్దంతో దాన్ని పరిశీలించి తృప్తిగా తల ఊపాడు మహారాజా.

"ఎంత?" దర్పంగా చూస్తూ అడిగాడు ఆయన.

"నలభై వేల డాలర్లు."

"ఇంత చిన్న వజ్రానికి అంత ధరా? ఇరవై వేల డాలర్లు ఇస్తాను."

‘‘గిట్టదు. ఓ డాలర్ కూడా తగ్గించను."

ఆ వజ్రం వెనక్కి ఇచ్చేసి మహారాజా తన సేవకుడితో ఏదో చెప్పాడు. వాడు టేబుల్ సొరుగులోంచి వజ్రాలు ఉంచే ఓ తోలు సంచిని తీసుకువచ్చాడు. ఒక్కొక్కటి చూపిస్తూ మహారాజా చెప్పసాగాడు.

‘‘ఇది అన్నిటి కన్నా పెద్దది. ఇది కూడా...ఇది ఇప్పుడు సరిగ్గా నువ్వు తెచ్చిన వజ్రమంత ఉంది.’’

బెన్నీ దాన్ని అందుకున్నాడు. పరీక్షిస్తున్నట్లుగా నటిస్తూ, చేతి రుమాల్లో దాచిన నకిలి వజ్రాన్ని ఎడమచేత్తో బయటికి తీసి క్షణాల్లో గారడి చేసినట్లుగా మహారాజా చూడకుండా వాటిని చాకచక్యంగా మార్చేసాడు. మహారాజా వజ్రం జేబు రుమాలు మడతలోకి వెళ్ళిపోయింది.

"అయితే నేను తెచ్చిన వజ్రం నలభై వేల డాలర్లకి కొనరా?" అడిగాడు ఆ నకిలీ వజ్రం తిరిగి ఇచ్చేస్తూ.

"మీకు వజ్రాల వ్యాపారంలో బొత్తిగా అనుభవం ఉన్నట్లు లేదు. లేదా వాటి గురించి తెలియదేమో? ఆ వజ్రానికి నలబై వేల డాలర్లా?" అశ్చర్యంగా అడిగాడు మహారాజా.

"అసలు దాని ధర ఎంతుంటుంది అంటారు?" తెలుసుకోవాలని అడిగాడు బెన్నీ "మీరు చెప్పిందాంట్లో సగం.

మీరు జాగ్రత్తగా భూతద్దం కింది దీన్ని పెట్టి చూస్తే అప్పుడు మీకు అందులోని లోపం కనిపిస్తుంది. స్వచ్ఛమైన తెలుపుదనం లేదు. కొంత లేత పసుపు పచ్చగా ఉంది. ఇలాంటి వాటిని ఆఫ్ వైట్ అంటారు. లేదా సెకండ్స్ అని కూడా అంటారు. భారత దేశంలోని ఏ మహారాజు కూడా సెకండ్స్ వజ్రాలని ధరించరు. అది గొప్ప అపశకునం." కోప్పడుతున్నట్లుగా చెప్పాడు ఆయన.

"మళ్ళీ రేపు ఇంకో వజ్రంతో మీ దర్శనం చేసుకుంటాను."

బెన్నీ లేంట్ మహారాజా దగ్గర సెలవు తీసుకుని ఉత్సాహంగా కారులో వజ్రాల వ్యాపారి దగ్గరకి చేరుకున్నాడు. దారిలో ఎక్కడైనా మిక్సర్ కనబడతాడేమోనని ఎదురు చూసాడు కాని అలా జరగలేదు.

ఆ రెండు వజ్రాలు అందించి సంతోషంగా చెప్పాడు బెన్నీ లెంట్.

"మహారాజా చూపించిన వజ్రాల్లో ఒకటి సంగ్రహించి నకిలీది దాని స్థానంలో ఉంచాను. ఎర్ర కాగితంలో చుట్టింది నీది. ఇది నేను మహారాజా నించి కొట్టేసింది. నా తరఫున దీన్ని నువ్వే అమ్మి పెట్టాలి."

"కంగ్రాచ్యులేషన్స్."

వ్యాపారి ఎర్ర కాగితంలో చుట్టిన తన వజ్రాన్ని తీసి పరిశీలించి చూసాడు. తక్షణం అతని మొహంలో రంగులు మారాయి.

‘‘అరె! ఇదేమిటి?’’ కంగారుగా చెప్పాడు.

‘‘ఏమిటి???

‘‘ఇది నా వజ్రం కాదు.’’ పాలిపోయిన మొహంతో చెప్పాడు అతను.

‘‘నీది కాదా?" భయంగా అడిగాడు బెన్ని లేంబ్.

"కాదు. ఈ రెండోది కూడా ఐదు డాలర్లకి దొరికే నకిలీ వజ్రం. వెళ్ళు. వెంటనే వెళ్ళి నా వజ్రం తీసుకురా." ఆ వ్యాపారి కోపంగా అరిచాడు.

బెన్ని లేంబ్ బయటికి దూకి టేక్సీలో గ్రాండ్ ఎంపైర్ హోటల్ కి చేరుకున్నాడు. అయినా ఉపయోగం లేకపోయింది. మహారాజా అప్పటికే హోటల్ గది ఖాళీ చేసేసాడు!

"ఆయన హోటల్ బిల్ కూడా చెల్లించకుండా హడావిడిగా వెళ్ళిపోయాడు. మీ పేరు బెన్ని లేంబా?" అడిగాడు హోటల్ మేనేజర్.

‘‘అవును?'

"అయితే మహారాజా మీకు ఈ ఉత్తరం ఇమ్మని చెప్పి వెళ్ళారు.’’

బెన్ని లేంబ్ గబగబా అతను అందించిన కవర్ చింపి ఉత్తరం తీసి చదివాడు.

'ఆ వజ్రం సంపాదించాను. నీకు, నీ ఫ్రెండ్ ఆ వజ్రాల వ్యాపారికి నా కృతజ్ఞతలు -మిక్సర్.'

బెన్ని లేంబ్ ఆ చేతి రాతని గుర్తుపట్టాడు. అంటే తను చిత్తుగా మోసపోయాడు!

సరిగ్గా అదే సమయంలో మిక్సర్ మిత్రుడు పాల్ తన చర్మానికి రాసుకున్న నల్లటి రంగుని వదిలించుకోడానికి వెన్నని వంటికి రాసుకోసాగాడు. మిక్సర్ చెప్పాడు.

‘‘పాల్ ! హోటల్ కి అద్దె కట్టడం మర్చిపోయాను."

"అలాంటి హోటళ్ళలో బస చేయాలి కాని బిల్ చెల్లించకూడదు. రోజుకి తొమ్మిది వందల డాలర్లు అంటే దోపిడీనే." నవ్వుతూ చెప్పాడు పాల్.

---

"నా భర్తని హత్య చేసానని ఒప్పుకోవడానికి వచ్చాను."

న్యూయార్క్ పోలీస్ స్టేషన్లోని డెస్క్ సార్జెంట్ ఆ మాటలు చెప్పిన ఆ వృద్ధురాలి వంక కోపంగా చూసాడు. తరచూ పిచ్చివాళ్ళు వచ్చి తాము చేయని వివిధ నేరాలని తమ మీదకి వేసుకోవడం అతనికి కొత్త కాదు. వారి వల్ల కాలం వృధా అవుతూంటుంది.

"మంచిది. నీ పేరు?" అడిగాడు సార్జెంట్ స్టెబిన్స్.

"పార్కర్. మ్యూరియల్ పార్కర్."

ఆమె మాటలు పల్లెటూరి యాసతో కూడి ఉండటం అతను గుర్తించాడు.

"మీ డాక్టర్ పేరు?" అడిగాడు.

ఇలాంటివారు ఏ పిచ్చాసుపత్రి నించి తప్పించుకున్నారో తెలుసుకోవడం అతని కర్తవ్యంలో ఓ భాగం.

"దానికీ, నేను చెప్పిందానికి గల సంబంధం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. నేనో పెద్ద నేరాన్ని చేసానని ఒప్పుకోవడానికి వచ్చాను. అందరు నేరస్థుల్లానే మీరు నన్ను చూడాలి. వెంటనే వెళ్ళి డిసిఐ జెసప్ ని పిలుచుకురండి. నాకు ఎక్కువ సమయం లేదు.'' కోరింది.

డెస్క్ సార్జెంట్ నీరసంగా ఇంటర్కమ్ రిసీవర్ని అందుకుని గొణిగాడు.

"మిమ్మల్ని విసిగిస్తున్నందుకు సారీ. ఓ వృద్ధురాలు తన భర్తని హత్య చేసానని చెప్తోంది. మెంటల్ కేస్ అని నా అనుమానం...అలాగే చెప్తాను

"అతను రిసీవర్ పెట్టేసి ఆవిడ వంక తిరిగి చెప్పాడు.

‘‘ఆయన వస్తున్నారు."

"నాకు వినబడే చెవులున్నాయి. మీరు నా గురించి అవమానకరంగా చెప్పారు."

డెస్క్ సార్జెంట్ ఆమెని వివరాలు అడిగి తన నోట్ బుక్లో రాసుకున్నాడు.

ఐదు నిమిషాల తర్వాత ఏభై పైబడ్డ, బట్టతలతో ఉన్న డిసిఐ జెసప్ వారి దగ్గరకి వచ్చి ఆవిడని అడిగాడు.

"మిసెస్ పార్కర్? ఇప్పుడు చెప్పండి."

ఆవిడ ఆనందంగా కరచాలనం కోసం తన కుడి చేతిని చాపి, అతని మొహంలోని ప్రతి ముడతని పరిశీలనగా చూస్తూ చెప్పింది.

"మీరు ఆరోగ్యంగా ఉన్నట్లు లేరు? దినపత్రికలో వచ్చిన మీ ఫొటోలోలా మీరు లేరు.''

"ఇంతకీ మీరు వచ్చిన పని?'' జెసప్ అడిగాడు.

"నేను ఓహత్యానేరాన్ని ఒప్పుకోవడానికి వచ్చాను." ఆవిడ కొద్దిగా గర్వంగా చెప్పింది.

''అయితే నాతో రండి .'' పక్కనే ఉన్న అనుమానితులని ప్రశ్నించే చిన్న గదిలోకి ఆవిడతో వెళ్తూ, సార్జెంట్ వంక చూసి నవ్వుతూ కన్ను గీటాడు.

ఆ గది నిండా సిగరెట్లు, డిస్ఇన్ఫెక్టెంట్ వాసన వేస్తోంది. మ్యూరియల్ ఓ కుర్చీలో కూర్చుని ఉత్సాహంగా చెప్పింది.

"ఈ గది అచ్చం 'ఇన్ స్పెక్టర్ బిల్ టి.వి. సీరియల్లోలానే ఉంది."

ఆవిడ ఎదురుగా కూర్చుని, సార్జెంట్ స్టెబిన్స్ రాసిన నోట్ బుక్లోని వాక్యాలని చదివి ఆవిడ వంక చూస్తూ చెప్పాడు.

"మీ ఇంటికి ఫోన్ చేసి సార్జెంట్ మీ భర్తతో ఇప్పుడే మాట్లాడాడు. మిస్టర్ పార్కర్ జీవించే ఉన్నారు. దీనికి మీరేమంటారు?"

ఆవిడ గట్టిగా చెప్పింది.

"మీ సార్జెంట్ కి మర్యాద తెలీదు. నేను నా భర్త ఆల్బర్ట్ పార్మర్ కి ఆ నిజం చెప్పలేదు. చెస్తే ఆయన గుండెపోటుతో మరణించవచ్చని నా భయం."

సార్జెంట్ స్టెబిన్స్ అభిప్రాయపడ్డట్లుగా ఆవిడ పిచ్చిదనే తనూ అభిప్రాయపడ్డాడు జెసప్.

"మరి మీరు మీ భర్తని చంపారన్నారు?"

"ఆల్బర్ట్ ని చంపానని నేనెప్పుడూ చెప్పలేదు."

"కానీ మీరు సార్జెంట్ కి."

"..నా భర్తని చంపానని చెప్పాను. అవును."

"కానీ ఆయన బ్రతికే ఉన్నారు కదా మిసెస్ పార్కర్?"

వెంటనే ఆమె పెద్దగా నవ్వింది.

"నేను ఆల్బర్ట్ ని చంపానని మీరు భావిస్తున్నారా? మీ సార్జెంట్ ఎంత పిచ్చివాడు?"

జెసప్ తన కోపాన్ని అణచుకుని చెప్పాడు.

"ఇంతకీ మీరు చెప్పదల్చుకున్నది ఏమిటి?"

"నేను నా మొదటి భర్త క్లైవ్ అప్టన్ని హత్య చేసాను."

•

జెసప్ తనకా రోజు దురదృష్టకరమైన రోజు అని, ఈవిడని వదిలించుకోవడం కష్టం అని కూడా అనుకున్నాడు.

క్లైవ్ అప్టన్ని ఎందుకు చంపారు?" ప్రశ్నించాడు.

"బద్ధకస్తుడు, అసమర్థుడు, దేనికీ పనికి రానివాడు, స్త్రీ లోలుడు. ఇంకా...''

‘‘ఆయన్ని ఎప్పుడు చంపారు?" ఆవిడ మాటలకి అడ్డుపడుతూ అడిగాడు.

"ఇరవై ఒకటి అక్టోబర్ నైన్టీన్ ఫార్టీ ఒన్ అర్థరాత్రి."

తను సిగరెట్లు మానకుండా ఉండాల్సింది అని జెసప్ కి అన్పించింది. అతను సిగరెట్ తాగాలనుకునేది ఇలాంటి సందర్భాల్లోనే.

"కానీ ఇది నైన్టీన్ నైన్టీ నైన్ మిసెస్ పార్కర్."

"కానీ నేనా నిజం చెప్పాల్సిన సమయం ఇవాళే వచ్చింది, డిటెక్టివ్ చీఫ్ ఇన్ స్పెక్టర్ జెసప్." ఆవిడ స్థిరంగా చెప్పింది.

"నేనే మీరైతే దాన్ని అలాగే వదిలేసేవాడిని. ఇంతదాకా మీరా నేరం నించి తప్పించుకుంటే ఇక ముందు కూడా...''

"...ఇన్ స్పెక్టర్ జెసప్. నేనా నేరం నించి తప్పించుకోవాలని అనుకోవడం లేదు. కాకపోతే మిమ్మల్ని కనుక్కోవడానికి నాకు ఇంతకాలం పట్టింది."

‘‘నన్ను కనుక్కోడానికా?"

‘‘అవును ఇన్ స్పెక్టర్ జెసప్."

అతను తన కుర్చీలో వెనక్కివాలి మొదటిసారిగా జాగ్రత్తగా ఆమె వంక పరిశీలనగా చూసాడు. ఖరీదైన చక్కటి దుస్తులు ధరించిన ఆమె మొహంలో నిజాయితీ కనిపిస్తోంది. అయితే ఆవిడ పిచ్చిది కాదనే నమ్మకం అతనికి కలగలేదు. అతనిలో రేకెత్తిన కొద్దిపాటి ఆసక్తితో అడిగాడు.

''నన్నెందుకు కనుక్కోవాలని అనుకున్నారు?"

ఆవిడ ఆ ప్రశ్నని తుడిచి పారేసినట్లుగా చేత్తో సౌంజ్ఞ చేసి ఇలా చెప్పింది.

"చిన్నతనం నించి క్లైవ్, నేను ప్రేమికులం. కలిసి పెరిగాం, రెండో ప్రపంచ యుద్ధ కాలంలో, హత్య జరిగిన ఆ రాత్రికి మాకు పెళ్ళయి సుమారు ఆరేళ్ళు అయింది. ఆ రాత్రి జర్మన్ విమానాలు లండన్ మీద బాంబింగ్ కి వచ్చాయి."

జెసప్ కి చరిత్ర అంటే ఇష్టం లేదు. కానీ ఈవిడ పిచ్చి తనకి ఎలా కనెక్ట్ అవుతుందో తెలుసుకోవాలని కొద్దిగా ఆసక్తిగా, కొద్దిగా విసుగ్గా వినసాగాడు.

క్లైవ్ కుడి చెవి వినపడదు కాబట్టి సైన్యంలో చేరలేక పోయాడు. నా అనుమానం అతను దేశం కోసం ప్రాణాలని పోగొట్టుకునే రకం కాదు. పిరికివాడు. అతను ఎయిర్ రెయిడ్ పెట్రోల్ వార్డెన్ గా రాత్రుళ్ళు వీధుల్లో తిరుగుతూ, ఇళ్ళలోంచి దీపాల కాంతి బయటకి రాకుండా చూసే పనిని చేసేవాడు. ఇంట్లోంచి బయటకి వచ్చే లైట్ కాంతి జర్మన్ విమానాలకి లండన్ ఎక్కడుందో తెలియచేస్తుంది. అందువల్ల అతను రాత్రుళ్ళు బయటే గడిపేవాడు."

అకస్మాత్తుగా ఆవిడ కుడి కంటిలోంచి నీరు కారసాగింది.

''క్రమంగా వదంతులు మొదలయ్యాయి. నేను రేషన్ కోసం క్యూలో నిలబడితే, మెల్లిగా మాట్లాడినా వారి మాటలు నా చెవిన పడసాగాయి. యుద్ధంలో తమ భర్తలని పోగొట్టుకున్న విధవలు తమ పడక గదుల్లో తమకి నా భర్త క్లైవ్ ఇచ్చే సుఖం గురించి నవ్వుతూ మాట్లాడుకునేవారు. నావి పాము చెవులు కాబట్టి అవన్నీ నాకు వినబడేవి."

"ఐ యాం సారీ." జెసప్ చెప్పాడు.

"అది రోజు రోజుకీ ఎక్కువై, నేను ఇల్లు వదిలి బయటకి వెళ్ళినప్పుడల్లా అవమానాలని భరించాల్సి వచ్చేది. ఓ విధవరాలు గర్భవతైంది. అది క్లైవ్ పనే అని నా నమ్మకం. ఓ రాత్రి నేను అతన్ని రహస్యంగా చీకటి వీధుల్లో అనుసరించాను. నిజానిజాలు తెలుసుకోవాలని ఆ పని చేసాను. అతను యుద్ధంలో పోరాడడానికి జర్మనీ వెళ్ళిన ఓ సైనికుడి భార్య ఇంట్లోకి వెళ్ళాడు. గంటదాకా బయటకి రాలేదు. నేను వీధిలోనే నిలబడి ఏడుస్తూనే ఉన్నాను. అప్పుడు శతృ విమానాలు వస్తున్న హెచ్చరికగా సైరన్లు మోగాయి. పై నించి జర్మన్ విమానాలు బాంబులు వేయసాగాయి."

జెసప్ ఆమె చెప్పేది వినడంలో అనుకోకుండా లీనమయ్యాడు.

"నా చుట్టుపక్కల కొన్ని ఇళ్ళు నేలకూలాయి."

జెసప్ కి చిన్నప్పుడు తన తల్లి ఏడుస్తూ చెప్పిన ఇలాంటి సంఘటనలు గుర్తుకు వచ్చాయి. వందలకొద్దీ విదేశీ విమానాల శబ్దం విని వణికిపోవడం అతని అనుభవంలో లేదు. వాటిని తన తల్లి అనుభవాలనించే విన్నాడు.

క్లైవ్ బయటకి వచ్చి నన్ను చూసి షాకయ్యాడు. ఆ వీధిలోని రెండు ఇళ్ళు బాంబుల వల్ల నేల కూలాయి. నేను నా పక్కన పడ్డ ఓ ఇటుకని తీసుకుని అతని మొహం మీద బాదాను. అతను స్పృహ తప్పి కిందపడ్డాడు. మళ్ళీ మళ్ళీ బాదాను. నేనతని శరీరాన్ని మండే ఆ ఇంట్లోకి లాగి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాను."

"మిసెస్ పార్కర్. జరిగిందేదో జరిగిపోయింది. అది చాలా కాలం క్రితం జరిగింది. మీరు అప్సెట్ అయ్యారు. అందువల్ల..."

"...కాని ఇన్ స్పెక్టర్. నేను నా భర్తని హత్యచేసానని చెప్తున్నాను." గట్టిగా చెప్పిందామె.

"మీ భర్త శవానికి పోస్ట్ మార్టం జరిగిందా?"

ఆవిడ తల అడ్డంగా ఊపింది.

"ఆ బాంబింగ్లో అతను మరణించాడని అధికారులు భావించారు. ఆ ఇంట్లోని నలుగురూ మరణించారు. అతను వారికి సహాయం చేయడానికి వెళ్ళి గోడ కూలి మరణించాడని అంతా భావించారు. అందుకని అతన్ని హీరోగా కీర్తించారు."

"అది నిజంగానే జరిగి ఉంటుంది. మీరు అతని మరణాన్ని చూసి ఇద్దై ఉంటారు..."

''పిచ్చి అనకుండా' ఇద్దై అన్న పదాన్ని ఉపయోగించాడు జెసప్.

"తమాషా ఏమిటంటే, మిస్టర్ జెసప్ ఇంట్లో దొరికిన అతని శవం తల మీద టిన్ హేట్ లేదు. దాని కోసం వెదికిన అధికారులకి అది ఎక్కడా కనబడలేదు."

వెంటనే జెసప్ వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

''టిన్ హేట్? గుడ్ గాడ్.అయితే?''

మిసెస్ పార్కర్ తన హేండ్ బేగ్ లోంచి ఓ స్థానిక దినపత్రికలోంచి కట్ చేసిన కాగితాన్ని తీసి అతని చేతిలో ఉంచి చెప్పింది.

''ఇది మీ ఆఫీస్ లో మీకు తీసిన ఫొటోనేనా?''

ఆ నలుపు తెలుపు చిత్రంలోని తన మొహాన్ని జెసప్ గుర్తించాడు.

"నైబర్ హుడ్ వాచ్' ప్రోగ్రాం గురించి తను మాట్లాడినప్పుడు పత్రికా విలేకరులు తీసి ప్రచురించిన ఫొటో అది. తనదే అన్నట్లుగా తల ఊపాడు.

మ్యూరియల్ అతని చొక్కా మడతని పట్టుకుంది. అతను వెనక్కి జరగలేదు.

"అది నువ్వే అని నాకు ఈ ఫొటో చూడగానే అర్థమైంది. మీ అమ్మ నీకెప్పుడైనా ఆ నిజాన్ని చెప్పిందా?" మృదువుగా అడిగింది.

అతను తల అడ్డంగా ఊపాడు. 'ఇన్నేళ్ళ తర్వాత తన తండ్రి ఎవరో తనకి తెలిసే సమయం వచ్చిందా అని అనుకున్నాడు. ఆవిడ తను చెప్పేది కొనసాగించింది.

క్లైవ్ మరణించాక ఆ విధవ గర్భవతికి ఓ కొడుకు పుట్టాడు. ఆమె మళ్ళీ వివాహం చేసుకోలేదు. ఆ కొడుకు పేరు నీల్ జెసప్ అని నాకు గుర్తుంది. పెరిగి పెద్దయ్యాక అతను అమెరికాకి వలస వెళ్ళి పోలీస్ శాఖలో చేరాడని చెప్పుకోగా విన్నాను."

జెసప్ నమ్మలేనట్లుగా ఆవిడ కళ్ళల్లోకి చూసాడు. అతను భావావేశంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

“ఈ ఆర్టికల్లో నీ ఫొటోలోని నీ నవ్వుని చూడగానే అంతా గుర్తొచ్చింది. సరిగ్గా క్లైవ్ నవ్వు కూడా ఇలాగే ఉండేది."

జెసప్ లేచి నిలబడి వంగి ఆవిడని అడిగాడు.

"మీ భర్త క్లైవ్ అప్టన్ నా తండ్రా?"

"అంతే కాదు. నేనాయన్ని హత్య చేసాను. ఐ యాం సారీ. నీ తండ్రి చెడ్డ భర్త కావచ్చు. కాని ఓ చక్కటి కొడుక్కి కారణం అయ్యాడు. నీకా విషయం తెలియ చేయాలని వచ్చాను.”

"నాకు ఇప్పుడు ఇదంతా మీరు ఎందుకు చెప్పారు?"

‘‘ఇక నువ్వు నీ తండ్రి ఎవరా అని ఆలోచించాల్సిన పని ఉండదని. ఈ ఫోటోలో నీ వెనుక గోడకి ఉన్న టిన్ హేట్ ని చూసాక అది క్లైవ్ నీ తల్లి ఇంట్లో ఆ రాత్రి మరిచి పోయాడు అని నాకు తెలిసింది." ఆవిడ చిన్నగా నవ్వింది.

ఆ గది తలుపు తెరుచుకుంది. స్టెబిల్స్ లోపలకి వచ్చి డిటెక్టివ్ చీఫ్ ఇన్ స్పెక్టర్ చెవిలో రహస్యంగా చెప్పాడు.

‘‘ఈవిడ గురించి రికార్డుల్లో ఎక్కడా చెడ్డగా లేదు."

‘‘థాంక్ యూ సార్జెంట్." జెసప్ మ్యూరియల్ వైపు తిరిగి చెప్పాడు.

"థాంక్ యూ మిసెస్ పార్కర్. ఇక మీరు వెళ్ళచ్చు."

ఆవిడ లేచి నిలబడి చెప్పింది.

"గాడ్ బ్లెస్ యూ."

జెసప్ ఆలోచనగా సార్జెంట్ వంక చూసి చెప్పాడు.

"సార్జెంట్, మిసెస్ పార్కర్ని నా గదిలోకి తీసుకెళ్ళి, నా కుర్చీ వెనకాల గోడకి వేళ్ళాడే ఆ పాత టిన్ హేట్ ని తీసి ఆవిడకి ఇవ్వు ఎందుకంటే, అది నాకు చెందింది కాదు. నిజానికి అది ఈవిడకి చెందింది. అది నా తల్లి నించి నాకు సంక్రమించింది."

"అది రెండో ప్రపంచ యుద్ధంలో ఓ బాంబింగ్ రాత్రి నేను హత్య చేసిన నా భర్త టిన్ హేట్. నిజానికి దాన్ని అతను ఆ సమయంలో పెట్టుకుని ఉంటే నా ఇటక రాయి దెబ్బల నించి తప్పించుకునేవాడు." మిసెస్ పార్కర్ వింతగా చూస్తున్న సార్జెంట్తో నవ్వుతూ చెప్పింది.

మ్యూరియల్, జెసప్ చాపిన చేతిని అందుకుని కరచాలనం చేసి సార్జెంట్ స్టెబిన్స్ తో ఆ గదిలోంచి బయటకి నడిచింది.

మిసెస్ మ్యూరియల్ కి పిచ్చో లేదా ఆవిడ పిచ్చి జెసప్ కి అంటుకుందో సార్జెంట్కి అర్ధం కాలేదు.

---